సంస్కృత ప్రహసన సాహిత్యం

డా॥ సూరం శ్రీనివాసులు

సంస్కృత ప్రహసన సాహిత్యం

రచయిత

డా॥ సూరం శ్రీనివాసులు

సంస్కృత ప్రహసన సాహిత్యం

డా॥ సూరం శ్రీనివాసులు

1986 ప్రథమ ముద్రణ

2024 ద్వితీయముద్రణ: ఈ-ముద్రణ / పి.డి.ఎఫ్.

ప్రతులకు

డా॥ సూరం శ్రీనివాసులు

ఫో: 9440242348

e-mail: srinivasulu.suram@gmail.com

డిజైన్:

విట్టుబాబు, హైదరాబాద్

సప్రశ్రయంగా

అంకితం

"సత్యం, ధర్మం, ప్రేమ, శాంతి, అహింస జీవనమార్గాలుగా

పంచప్రాణాలుగా జగత్కల్యాణ కాంక్షతో

విశిష్ట వ్యక్తిత్వంతో విద్యాభివృద్ధికి, వివేకసిద్ధికి

జీవితాన్ని అర్పిస్తూ వెలుగు నింపుతున్న

విద్వాన్ శ్రీ గోగినేని కనకయ్య

శ్రీమతి వెంకాయమ్మ దంపతులకు"

– రచయిత

కృతి స్వీకర్త పరిచయం

1917 జనవరి 4న తాడికొండ గ్రామంలో జన్మించిన శ్రీ గోగినేని కనకయ్యగారు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి "విద్వాన్" పట్టా పొందారు.

తాడికొండలోని వెల్లంకి వేంకటప్పయ్య ఉన్నత పాఠశాల, శ్రీ మల్లెల వేంకటసుబ్బయ్య ప్రాథమిక పాఠశాల, శ్రీమతి గోగినేని వెంకాయమ్మ బాలికోన్నత పాఠశాల, శ్రీ సత్యసాయి విద్యాలయం, సంస్కృతాంధ్ర కళాశాల, భగవాన్ సత్య సాయిబాబా కళాశాలలను వీరు స్థాపించడం వీరి విద్యాభిమానానికి నిదర్శనాలౌతాయి.

పై విద్యాసంస్థల కన్నింటికి వీరే కరస్పాండెంట్ బాధ్యత వహించి నిర్వహించడం, తాడికొండలోని జిల్లా స్కౌట్సు & గైడ్సుకు ఉపాధ్యక్షులుగా విశ్వశాంతి బాలానంద కేంద్రం కార్యదర్శిగా, గుంటూరులోని J. K. C. కాలేజ్ కోశాధికారిగా, సిద్ధార్థ ఎడ్యుకేషన్ ఎకాడమి - విజయవాడ సభ్యులుగా ఉండడం, గుంటూరులోని R. V. R. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ కాలేజీల స్థాపనలో గురుతర బాధ్యత స్వీకరించడం - ఇవన్నీ వీరి కార్యనిర్వహణ సామర్థ్యానికి మచ్చు తునకలు.

ఇంతేగాక తాడికొండ గ్రామపంచాయితీ ప్రెసిడెంట్, పంచాయితీ సమితి ప్రెసిడెంట్, గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సెక్రటరీ & కరస్పాండెంట్, శారదా నికేతనం మేనేజింగ్ ట్రస్టీ మొదలైన పదవులు ఇతః పూర్వమే నిర్వహించి ఉన్నారు.

అనేక ప్రజాహిత సంస్థల స్థాపన, అనేక సంస్థలకు విరాళాలు అవిరళంగా ఇవ్వడం వీరి వదాన్యతలో ఒక భాగం మాత్రమే.



విద్వాన్ శ్రీ గోగినేని కనకయ్య, శ్రీమతి వెంకాయమ్మ దంపతులు

విషయసూచిక

పుట

కృతి స్వీకర్త పరిచయం *4*

ఒకమాట *9*

సంస్కృత ప్రహసన సాహిత్యం
- మహీధర రామమోహనరావు *11*

సంస్కృత ప్రహసన సాహిత్యం
- డా॥ వి.వి.యల్. నరసింహారావు *13*

1. ప్రహసన నిర్వచనం 15
2. ప్రహసన భేదాలు 29
3. దశరూపకాల్లో ప్రహసన స్థానం 37
4. అంతఃప్రహసనాలు 51
5. ప్రహసనాలు 61
6. విపరీత ప్రవృత్తి ప్రహసనాలు 109
7. కౌటుంబిక ప్రహసనాలు 123
8. విపరీతవిధాన ప్రహసనాలు 139
9. సెటైర్ 161
10. వ్యంగ్యానుకరణం 175

11. శబ్దాశ్రిత హాస్యాలు 193

12. ఉక్తిమూల హాస్యాలు 205

13. భావాశ్రిత హాస్యాలు 223

14. ఆభాస హాస్యాలు 233

15. ఉపసంహారం 251

16. అనుబంధములు

1. ప్రహసనాల పట్టిక 261

2. ఉపయుక్త గ్రంథసూచిక 273

3. మత్తవిలాస ప్రహసనము అనువాదము
అనువక్త: డా॥ సూరం శ్రీనివాసులు 275

4. గ్రంథకర్త పరిచయం 296

ఒకమాట

సంస్కృత రూపకాలను పదిరకాలుగా విశ్లేషించారు. నాటకం, ప్రకరణం, భాణం, ప్రహసనం, డిమం, వ్యాయోగం, సమవాకారం, వీథి, అంకం, ఈహామృగం - అవి. వీటిలో భాణప్రహసనాలు సమకాలిక సమాజానికి అద్దం పట్టే రచనలు. అందుకే వీటిలో అంగిరసాలు కూడా సంఘానికి చాలా సన్నిహితమైనవే. భాణంలో శృంగారం - అదీ విశేషించి ఆభాసరూపంగా కనిపిస్తే, ప్రహసనాలలో హాస్యం ప్రధాన రసం. ప్రహసనాలలో ఉద్దిష్టమైన విమర్శ, అధిక్షేపణ, ప్రక్షాళన - అన్నీ హాస్య ద్వారం గుండానే ప్రవేశ పెట్టబడ్డాయి. అందుకే ప్రస్తుత నిబంధంలో హాస్యరసాన్ని కేంద్రబిందువుగా తీసికొని ప్రహసనాలను పరిశీలించటం జరుగుతుంది.

The size of a man's understanding may be justly measured by his mirth అని ప్రఖ్యాత విమర్శకుడు Dr. Johnson అభిప్రాయపడ్డాడు. కాబట్టి ఉల్లాసం, ఆనందం, ఉక్తిచమత్కృతి మొదలైన విషయాలే వ్యక్తి మానసిక స్థాయిని తెలియజేస్తాయి. అయితే అనాదిగా హాస్యరసంపై, హాస్యరసనిర్మాతలపై సమాజానికి చిన్నచూపు. ఇది ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమైన విషయం కాదు. మాథ్యూ ఆర్నాల్డు వంటి విమర్శకులు ఛాసర్, పోప్ వంటి వారిని కూడా ఉత్తమోత్తమ రచయితల క్రింద పరిగణించలేదు. దానికి కారణం వారిలో 'సీరియస్‌నెస్' తక్కువ స్థాయిలో వుండటం, 'విట్టీనెస్' కలసి వుండటమే. దేశభాషలలో కూడా ఎక్కడా హాస్యరచయితలను కానీ, రచనలను కానీ అందరితో పాటు విశిష్టంగా మన్నించి నట్లు కన్పించదు. హాస్యరచయిత అంటూ ప్రత్యేక దృష్టితో తప్ప బహుమతులను పొందే సాహిత్యం కానీ, సినిమాలు కానీ సామాన్యంగా హాస్యరస ప్రధానాలు కావు. ఈ శతాబ్దంలో దాదాపు 20 ప్రహసనాలు రచించిన జీవ న్యాయతీర్థ కూడా ప్రహసన రచనలో ఏదో కొంత చిన్నతనముందని తన ఆవేదనను వ్యక్తం చేయకపోలేదు, తన దరిద్రదుర్దైవప్రహసన పీఠికలో.

హాస్యం యొక్క సామాన్య పరిస్థితి ఇలా వుండగా సంస్కృత సాహిత్యంలో హాస్యరసం మరీ అధ్వాన్నంగా వున్నదన్న అభిప్రాయం చాలామందిలో వుండటం నిత్యజీవితంలో కనిపిస్తుంది. దానిలోని సత్యాసత్యాలను పరిశీలించేందుకు సాగించిన అన్వేషణమే ఈ నిబంధం. ఇందులో సంస్కృత ప్రహసనాలలో కనిపించే

వివిధాలైన హాస్యరీతులను నా శక్తి కొద్ది పరామర్శించి, ప్రకటించటం జరిగింది. ఇంకా నాకు అందుబాటులో లేని ప్రహసనాలలో, ఇప్పటికీ నామమాత్రంగా కనిపిస్తున్న ప్రహసనాలలో ఇంకా ఎంతో వైవిధ్యం గల హాస్యం కనిపించవచ్చు. అవన్నీ లభ్యమైనపుడుకానీ సమగ్రస్వరూపాన్ని సందర్శించలేము.

సంస్కృత లాక్షణికులు ప్రహసనాలను రెండు లేక మూడు విధాలుగా విభజించి, చూపారు. అయితే ప్రయోగదశలో ప్రహసనాలను పరిశీలించినపుడు ఆ విభాగం కార్యకారి కాదనిపించింది. ఇతివృత్తస్వీకారంలో క్రమంగా రచయితలలో వచ్చిన మార్పు ఆ విభాగాన్ని నిరుపయోగం చేసింది. అయితే ఆ లక్షణాన్నే అనుసరించక తప్పదంటే వీటిలో చాలా భాగం ప్రహసనాలు కావని అనవలసివస్తుందేమో! పాశ్చాత్యుల కామెడీ భేదాలలో హాస్యరసప్రధానాలైనవి చాలా వున్నాయి. వాటిలోని చాలా భేదాలకు లక్ష్యప్రాయంగా సంస్కృత ప్రహసనాలు కనిపిస్తున్నాయి. కాబట్టి ప్రహసనాలను విశ్లేషించి, పరిశీలించటంలో ఆ విభాగాన్ని ఎన్నుకోవటం జరిగింది.

ఈ గ్రంథరచనలో శ్రీ ప్రభల సుబ్రహ్మణ్యం (లెక్చరర్, గౌతమీ విద్యా పీఠమ్, రాజమండ్రి), చిరంజీవులు Ch. P. సత్యనారాయణ, T. సంజీవరావులు - రాజమండ్రి, తిరుపతి, మద్రాసులలోని ముద్రితాముద్రిత ప్రహసనాలను సేకరించటంలో సహకరించారు. వారికి హార్దిక కృతజ్ఞతలు.

గ్రంథరచనా సమయంలో ఆత్మీయులు డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి గారి సహకారం నిరుపమానం. వారికి సాధువాదాలు. శుద్ధప్రతిని తయారు చేయటంలో ఎంతో సహనంతో సహకరించిన చిరంజీవిని రాళ్ళభండి శారదాదేవి, M.A. కి శుభాశీస్సులు.

గ్రంథముద్రణానికై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారశాఖ రూ. 3500/- ఇచ్చి, ఆర్థికంగా, హార్దికంగా సహకరించినందుకు మనఃపూర్వక కృతజ్ఞతలు. గ్రంథమద్రణ విషయంలో తగు శ్రద్దను తీసికొని ముద్రించి పెట్టిన శ్రీ రాఘవేంద్ర రావు, రామచంద్రా ప్రింటర్స్, గుంటూరు గారికి, వారి సిబ్బందికి ధన్యవాదాలు.

ఇంకా ప్రత్యేకంగానో, పరోక్షంగానో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు అర్పిస్తూ

- రచయిత

సంస్కృత ప్రహసన సాహిత్యం

మహీధర రామమోహనరావు

సంస్కృత సాహిత్యం చదువుకున్న వారికి నాటకాల అభిరుచేగాని ప్రహసనాల పరిచయం కూడా చాల తక్కువగా వుంటుంది. మహా అయితే లంబోదర ప్రహసనం, లటకమేలక ప్రహసనం, భగవదజ్జుకం వంటివి ఓ అరడజనుకు మించి పేర్లు కూడా తెలిసి వుండడం అరుదు. "శృంగారాబ్ధి భవేద్ధాస్యః, శంగారానుకృతిర్యాతు సః హాస్యస్తు ప్రకీర్తితః" అంటూ భరతుని నిర్వచనం; కనక హాస్య ప్రధానమైన ప్రహసనం మొదటినుంచీ వికృత శృంగార ప్రధానంగా వుంటూ వచ్చింది. బూతుల్ని ధారాళంగా వుపయోగించే పండిత గురువులు కూడా ప్రహసనాలలోని వికృత శృంగారాన్ని ఆదరించారు. సంస్కృత నాటకాలలో శృంగార స్పర్శలేని హాస్యాన్ని చూస్తాం. కాళిదాసుని శాకుంతలం ఆరో అంకపు విష్కంభంలో ద్వారపాలకులు, పల్లెకారు సంభాషణ; మృచ్ఛకటికంలో శకారుని అసంబద్ధ ప్రలాపాలేగాక, శర్విలకుడు కన్నం తవ్వుతూ కొలతలకు జందేన్ని వుపయోగించడం వంటివి చాలానే చెప్పవచ్చు. కాని, ప్రహసనం అనేసరికి బూతుకు పర్యాయపదమై కూర్చుంది. అందుచేత నాటక లక్షణాలలో భాగంగా ప్రహసనం గురించి కూడా స్థూలంగా తెలుసుకోవడం తప్ప, సంస్కృతం బాగా నేర్చినవారు కూడా వాటిని గురించి పట్టించుకోరు. ఆ పూర్వరంగంలో శ్రీ సూరం శ్రీనివాసులుగారి "సంస్కృత ప్రహసన సాహిత్యం" రచన ఎంతో విజ్ఞానదాయకంగా వుంది.

ప్రహసన నిర్వచనం, ప్రహసన భేదాలు, దశరూపకాల్లో ప్రహసనం స్థానం పేరున మూడు ప్రకరణాలలో సిద్ధాంత నిర్వచనం చేసి, విషయ వస్తురీత్యా ప్రహసనాలను 11 విభాగాలు చేసి నివేదన జరిపేరు.

ప్రాచీన ఆలంకారికులు ప్రహసనాలను స్వరూప భేదాల్ని పట్టి శుద్ధ, సంకీర్ణ, మిశ్రములనుగా విభజించినా, అందులో అధమహాస్యం, జుగుప్సాకర హాస్యం అధికంగా వుండడాన్ని చూపుతూ, ఆధునిక రచయితలు పాశ్చాత్య భాషల పరిచయం ద్వారా వస్తువైవిధ్యాన్ని గుర్తించేరనీ, హాస్యాన్ని, జుగుప్సనీ వేరుచేసి

చూడడం కోసం, చూపించడం కోసం గట్టి కృషి చేశారని జీవన్యాయతీర్థుడు, మొదలైనవారి ప్రహసనాలను వివరించారు.

అంతఃప్రహసనాలు, ప్రహసనాలు, విపరీత ప్రవృత్తి ప్రహసనాలు, కౌటుంబిక ప్రహసనాలు, విపరీత విధాన ప్రహసనాలు, సెటైర్, వ్యంగ్యానుకరణం, శబ్దాశ్రిత హాస్యాలు, ఉక్తిమూల హాస్యాలు, భావాశ్రిత హాస్యాలు, ఆభాస హాస్యాలుగా వస్తు విభజనరీత్యా సంస్కృత ప్రహసనాలను పదకొండు విభాగాలు చేశారు.

ఎన్నికలు, ఘొరావోలు, స్త్రీ-పురుషాధిక్య తారతమ్యాలు, విజ్ఞాన శాస్త్ర విజయాలను విధ్వంసకారకంగా వినియోగించడం వంటి అత్యాధునిక సమస్యలు కూడా ఏవిధంగా ప్రహసనాలకు ఎక్కినాయో సెటైర్ ప్రకరణంలో వివరించారు.

అత్త-కోడళ్ళ కలహాలు, భార్య భర్త సంఘర్షణలు, వరాన్వేషణ సమస్యలు మొదలయిన విషయాలమీద వచ్చిన ప్రహసనాలను కౌటుంబిక ప్రహసనాలనుగా నివేదించారు. “కాలగతిలో ఏర్పడిన కొన్ని మార్పులు ప్రహసనాల్లో కూడా చాలా మార్పులు తెచ్చాయి. ఒకనాటి వ్యవస్థ వ్యక్తిని కేంద్రీకరించుకొని వుంటే, నేటి వ్యవస్థ శక్తినీ, సంఘాన్నీ కేంద్రీకరించుకొని వుంది. నాటి చక్రవర్తులు వంశపరంపరగా వచ్చినవారయితే, నేటి పాలకులు ప్రజానిర్ణీతులు. కాబట్టి ప్రహసన రచయితలు కూడా తొలి దశలో వ్యక్తిగతమైన పురుషార్థ సందర్శనానికి ప్రయత్నించి, క్రమంగా సామాజిక దృష్టితో వాటిని పరిశీలించారు. అందుకే ప్రహసనాల్లో ప్రజా సమస్యలన్నీ చోటు చేసుకున్నాయి. ఈ రీతిగా వ్యక్తి పరిధిలో ప్రారంభమయిన ప్రహసనం తన పరిధిని విస్తృతపరచుకొని సామాజిక ధర్మ సాధనకు ప్రయత్నిస్తోంది.” అని రచయిత తన సంస్కృత ప్రహసన సాహిత్య పరిశీలనను ముగిస్తున్నారు.

సంస్కృత సాహిత్యంలో మరుగున పడి వున్న ఒక విభాగాన్ని పరిచయం చేస్తున్న ఒక మంచి రచన. రచయిత శ్రీ సూరం శ్రీనివాసులు అభినందనీయులు.

(ఆంధ్రజ్యోతి (దిన), 12-5-1986).

సంస్కృత ప్రహసన సాహిత్యం

డా॥ వి.వి.యల్. నరసింహారావు

ఇంగ్లీషు సాహిత్యంతో పోల్చి, భారతీయ సాహిత్యంలో హాస్యరచనలు పుష్కలంగా లేవని పెదవి విరిచేవారు నేటికీ ఉన్నారు. భారతీయ సాహిత్యానికి పురుషార్థ దృష్టి పరమార్థం కావటంవల్ల కేవలం వినోదాత్మక హాస్య రచనలు విస్తారంగా వెలువడటానికి వీలులేకపోయింది.

అయినా రసక్రమంలో అగ్రపీఠం అలంకరించిన శృంగారం ప్రక్కన హాస్యాని క్కూడా మన ఆలంకారికులు పీట వేసే ఉంచారు. సంస్కృత సాహిత్యంలోని దశరూపకాల్లో ప్రహసనం పుట్టింది హాస్యం కోసమే. ప్రహసన శబ్దంలోనే ఆ అర్థం ఇమిడి ఉంది. పాత్ర ప్రయోగ పద్ధతిలో ప్రహసనానికి కొంత దగ్గరగా వచ్చేవి భాణం, వీథి అనే రూపకాలు.

ద్వంద్వభావ సమ్మిశ్రితమైన జీవితంలో ఆనంద విషాదాలు అనివార్యం. ఆనందానికి బాహ్యాభివ్యక్తి హాసం. జీవితంలోలాగే సాహిత్యంలోనూ హాస్య హేతువైన హాసం అపరిహార్యం. అందువల్లనే ప్రహసనప్రక్రియ సాహిత్యంలో పరిశీలనార్హమైంది.

శ్రీ సూరం శ్రీనివాసులు దాదాపు 150 ముద్రితా ముద్రిత సంస్కృత ప్రహసనాలను దృష్టిలో ఉంచుకుని ఈ సమీక్ష సాగించారు. రచయిత సంస్కృతాంధ్రాల్లో వ్యుత్పన్నుడు కావటం వల్ల ఉపేక్షకు తావులేని సమీక్ష రూపొందింది.

తొలి ఎనిమిది ప్రకరణాల్లో ప్రహసన నిర్వచనం, వాటిలోని భేదాలు, కౌటుంబిక వస్తువుతో గూడిన ప్రహసనాలు మొదలైనవి వివరించబడినాయి. తరువాతి ఆరు ప్రకరణాల్లో సెటైరిక్ వ్యంగ్యం, శబ్ద - ఉక్తి - భావాశ్రిత హాస్యాలు, అభాసహాస్యం మొదలైనవి వివరించబడినాయి. తుది రెండు ప్రకరణాలు ఉపసంహార అనుబంధాలు.

ప్రాచీన సంస్కృత ప్రహసనాల్లో మత్తవిలాస ప్రహసనం, భగవదజ్జుకం, లటకమేళకం వంటివి స్వధర్మాచరణం, కేవల కామప్రవృత్తి నిరాసం, ధర్మ సంస్థాపన మొదలైన పురుషార్థ ప్రతిపాదక లక్షణాలతో వెలువడ్డ ప్రహసనాలే.

సంఘంలోని అవినీతిని ప్రక్షాళన చేసేందుకు ప్రహసనం ప్రబల సాధనంగా ఉపయోగపడటం గుర్తించవలసిన అంశం. సంస్కృత ప్రహసనం ఇందుకు అపవాదం కాదు. అయితే సంస్కృత సాహిత్యంలో అనేక ప్రహసనాలు ఇంకా అలబ్ధంగానే ఉన్నాయి. సాహిత్య దర్పణం, రసావర్ణవసుధాకరం, భావప్రకాశం మొదలైన ఆలంకారిక గ్రంథాల్లో పేర్కొనబడ్డ కందర్పకేళీ ప్రహసనం, ఆనందకోశ ప్రహసనం, కవికేళీ (శశికళా) ప్రహసనం, ముండిత ప్రహసనం, సాగర కౌముదీ ప్రహసనం, సైరంధ్రికా ప్రహసనం వంటివి లభించి, ముద్రితమై అందరికీ అందుబాటులోకి వస్తే ప్రహసన సాహిత్య చరిత్రే కొత్త వెలుగులు విరజిమ్మగలదు.

లభించినంతవరకు గ్రంథజాలాన్ని చక్కగా ఉపయోగించుకుని గ్రంథకర్త నిర్దిష్టము, నిర్దుష్టము అయిన సమీక్ష వెలయించటం జరిగింది. సమగ్రత లభించిన సామగ్రి మీద ఆధారపడి ఉంటుంది. సమీక్షా మార్గం అభినందనీయం.

(ఆంధ్రప్రభ, ఆదివారం 29-6-1986)

ప్రహసన నిర్వచనం

"సంస్కృత సాహిత్యం అంతఃపురాల్లోనూ, రాజాస్థానాల్లోనూ వికసించింది. జనసామాన్యానికి దూరమయింది" అనే అపవాదు ఒకటుంది. అది కేవలం అపోహ మాత్రమే అని ప్రహసన సాహిత్యం ఋజువు చేస్తుంది. సంస్కృతంలో ప్రహసన సాహిత్యం కావలసినంత ఉంది. ప్రహసనాలు నాటకాలంత సమగ్రసుందరాలుగా వికసించకపోయినా, సమాజానికి దర్పణం పట్టే విషయంలో సముచిత మయిన పాత్రనే నిర్వహించాయని చెప్పాలి. ఆధునికప్రహసనాలు ఇంకా నిర్వహిస్తున్నాయనీ చెప్పాలి.

ప్రాచీన ప్రహసనాలు, ఆధునిక ప్రహసనాలు నిర్వహించిన పాత్రను పరిశీలించే ముందు ప్రహసనం అంటే ఏమిటో, ప్రాచీనాలంకారికులు ఏ ఏ నిర్వచనా లిచ్చారో పరిశీలించడం ఎంతైనా అవసరం -

'ప్ర' పూర్వక మయిన 'హస్' ధాతువుమీద ఆధారార్థంలో కానీ, కరణార్థంలో కానీ 'ల్యుట్' ప్రత్యయాన్ని చేర్చితే ప్రహసనరూపం సిద్ధిస్తుంది.[1] అనగా 'ప్రహసతి తత్ర' అనే వ్యుత్పత్తిని గాని 'ప్రహసతి అనేన' అనే వ్యుత్పత్తిని గాని చెప్పుకొనవలసి వస్తుంది.

ప్రాచీనాలంకారికులలో దాదాపు అందరూ ప్రహసనలక్షణాన్నీ, ప్రహసన విభాగాలనూ కలిపే నిర్వచించారు. అర్వాచీను లయిన విశ్వనాథ, సింగభూపాలాదులు మాత్రం ముందు లక్షణాన్ని చెప్పి, ఆ తర్వాత అవాంతరభేద లక్షణాలను చెప్పారు. విశ్వనాథుడు ప్రహసనాన్ని ఇలా నిర్వచించాడు.

భాణవ త్సంధి సంధ్యంగ లాస్యాంగాంకై ర్వినిర్మితమ్
భవే త్ప్రహసనం వృత్తం నింద్యానాం కవికల్పితమ్
అత్ర నారభటీ నాపి విష్కంభక ప్రవేశకౌ
అంగీ హాస్యరస స్తత్ర వీథ్యంగానాం స్థితిర్న వా[2]

---

1. ప్ర-హాసే - భావే ల్యుట్ - ప్రహాసః - ప్రహసత్యనేన వా ప్రహస్ - ఆధారే కరణే వా ల్యుట్ - శబ్దకల్పద్రుమః Vol III పు 303.
2. సాహిత్యదర్పణము

రసార్ణవ సుధాకరకర్త కూడా ఇదే రీతిలో చెప్తాడు.

వస్తు సంధ్యంగ లాస్యాంగ వృత్తయో యత్ర భాణవత్
రసో హాస్యః ప్రధానః స్యా దేత త్ప్రహసనం స్మృతమ్
విశేషేణ దశాంగాని కల్పయే దత్ర తాని తు[1]

వస్తు సంధ్యంగ లాస్యాంగ విషయంలో భాణాన్ని[2] పోలిఉండి, హాస్యరస ప్రధాన మయిన రూపకం ప్రహసనం. ప్రహసనాంగాలకు కూడా దీనిలో స్థాన ముంది. ఈ ప్రహసనాంగాలను చెప్పిన ఘనత ఒక్క సింగభూపాలునిదే. స్థూల దృష్టితోకాక సూక్ష్మదృష్టితో ప్రహసన నిర్వచనంలోని అంగాలను విడివిడిగా పరిశీలించుదాం. రూపకా లన్నిటికీ సామాన్యమయిన నాందీ, ప్రస్తావనా, భరత వాక్యాలను వదలివేసి, విశేషాంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుందాం.

ప్రహసనంలోని ఇతివృత్తం ఉత్పాద్యం. అనగా కవి కల్పితం. ఈ కవి కల్పిత కథకు సాహిత్యదర్పణకారుడు మరోవిశేషాన్ని చెప్పాడు. "నిన్ద్యానాం కవి కల్పితమ్" అని. అంటే నిందింపదగిన వ్యక్తుల కథలను మాత్రమే ప్రహసనాల్లో కల్పించాలి. అయితే ఈ నింద్యత ఏరీతిగా అని ప్రత్యేకంగా ఆలోచించవలసిన అవసరముంది. స్వధర్మపరిచ్యుతి సహజంగా నింద్యతకు కారణ మవుతుంది. ఆ ధర్మం కూడా కులధర్మం, వృత్తిధర్మం, మనోధర్మం, నైతికధర్మం అని నాల్గు విధాలుగా ఉండే అవకాశ ముంది. ప్రాచీన ప్రహసనాల్లో కులధర్మ పరిచ్యుతి కాక వృత్తిధర్మ పరిచ్యుతి ఎక్కువగా కన్పిస్తుంది. మనోధర్మ పరిచ్యుతి అంతగా లేదు. ఆధునిక ప్రహసనాల్లో ఈ మనోధర్మ పరిచ్యుతికి సయితం తగినంత ప్రాధాన్యం కనిపిస్తుంది.

---

1. రసార్ణవసుధాకరము 3-269
2. స్వస్య వాన్యస్య వా వృత్తం విటేన నిపుణోక్తినా
   శౌర్య సౌభాగ్య సంస్తుత్య వీర శృంగార సూచకమ్
   బుద్ధి కల్పిత మేకాంకం ముఖ నిర్వహణాన్వితమ్
   వర్ణ్యతే భారతీ వృత్త్యా యత్ర తం భాణ మీరతే

   రసార్ణవ సుధాకరము 3-232/34

మరోమాట - ఇతివృత్తంలో నింద్యత ఉన్నంత మాత్రాన అది హాస్య స్యంది కావలసిన అవసరం లేదు. ఒకదొంగ సంఘద్రోహిగా నింద్యుడే. కానీ అతని చరిత్ర హాస్యాన్నే కలిగించుతుందని చెప్పలేము. అయితే అదే చోరుడు దొంగతనం చేయడంలో అవకతవకలను ప్రదర్శించితే అది పరిహాసాస్పదమే అవుతుంది. కానీ ఆ పరిహాసదశలో అతడు నింద్యుడు కాడు. అక్కడ మన నవ్వుకు కారణం అతడి చేతకానితనమే కాని దొంగతనం కాదు. కాబట్టి నింద్య మంటే సామాన్యరీతిలో దూషింప దగ్గది అన్న అర్థం చాలక పోవచ్చు. ఇంకా వివరించుకొనవలసిన అవసరముంది. సమాజానికి ద్రోహం చేసేవాడూ, తనకు తాను ద్రోహం చేసుకొనే వాడూ ఇద్దరూ నింద్యులే. కానీ ఈ ఇద్దరిలో మొదటివాడి చరిత్ర హాస్యాన్ని కలిగించదు. తనకు తాను ద్రోహం చేసుకునే వాడి చరిత్ర కూడా అంతే. అయితే నియతంగా కాకపోయినా అక్కడక్కడ ఆత్మద్రోహ చరిత్ర హాస్యాస్పద మయ్యే అవకాశ ముంది. కాబట్టి నింద్యత అంటే నష్టం లేని రీతిగా ఏర్పడిన నింద్యత అనవచ్చు. అనగా ప్రత్యక్షంగా ఏ నష్టమూ కనిపించని రీతిలో ఎవని చరిత్ర స్వధర్మ పరిచ్యుతికి లేదా అల్పతకు ఆలవాల మవుతుందో అది హాస్యాస్పద మయ్యే అవకాశ ముంది. అందుకే ప్రాచీన ప్రహసనాలలోని పాత్రలను, వాటి చరిత్రలను చూచినపుడు మనం నవ్వుతున్నాము. ఆ పాత్ర లన్నీ తమ కున్న విలువను చేతులారా పోగొట్టుకొనే వ్యక్తిత్వం గలవారివే కాబట్టి వారు నింద్యులు. అందువల్లనే హాస్యాస్పదులు.

అభినవగుప్తుడు అభినవభారతిలో “ప్రహసనంలో ఇతివృత్త వైచిత్ర్య ముండదు”[1] అనే అభిప్రాయాన్ని ప్రకటించాడు. అయితే పై రెండు అభిప్రాయాలకూ కూడా ఆధునిక ప్రహసనాల్లో అనుకూలతతో పాటు అననుకూలత కూడ కనిపిస్తుంది. ఆధునికప్రహసనాల్లోని నింద్యులు ప్రాచీనప్రహసనాల్లోని నింద్యుల వంటి వారు కారు. ప్రాచీనులు కేవలం కులధర్మభ్రష్టులు. ఆధునికులు అనేకరీతుల భ్రష్టులు. ఒకచో భ్రష్టులు కాకపోయినా నవ్వించగలవారు.

హాస్యానికి నింద్యుల చరిత్రయే ఇతివృత్తంగా ఉండాలన్న ప్రాచీనుల అభిప్రాయం అంతగా హర్షణీయం కాకపోవచ్చు. నింద్యత ఒకటే హాస్య హేతువు

1. అభినవభారతి Vol. II పు 45.

కాదు. ప్రశంసార్హ మయిన నడవడి సయితం అనేకవిధాలుగా నవ్వించే అవకాశ ముంది. ఛలోక్తులు సహజంగా ఆ కోవకు చెందినవే గదా! అయితే మొత్తం ప్రహసనంలో వుండవలసినది కథ కాబట్టి ఛలోక్తికి అంత ప్రాధాన్యం లేదనవచ్చు. కానీ అది సరిగాదు. ఒక మతిమరుపు మనిషిని - ఉన్నతోద్యోగిని, తీసికొని ఎంత హాస్యాన్నయినా సృష్టించవచ్చు. అతని చరిత్ర నింద్యం కావలసిన అవసరం లేదు. కాబట్టి నిందింప దగినవారే ప్రహసనంలో ఉండా లనటం ప్రాచీనులు ఏర్పరచిన ఒక త్రోవ మాత్రమే. అర్వాచీనులు రసదృష్టితో ఆలోచించి, అనింద్యుల ఇతివృత్తాలను సయితం స్వీకరించి, రమణీయ ప్రహసన రచన సాగించడం అందరూ ఎరిగినదే.

అంతే గాక ఆధునిక ప్రహసనంలో వస్తువైవిధ్యం, సమాజానుగుణత్వం, మానవధర్మ పరిచ్యుతి నిరూపణం మొదలయిన విశేషాలు కూడా హాస్యనిర్మాణంలో భాగస్వామ్యాన్ని వహిస్తున్నాయి.

ఇతివృత్తాన్ని సమగ్రసుందరంగా నిర్వహించేందుకు ఏర్పరచుకొన్నవి పంచ సంధులు. ప్రహసనాలలో ముఖ, నిర్వహణ[1] సంధులను మాత్రమే లాక్షణికులు అంగీకరించారు. ప్రహసన మేకాంక మవటంవల్ల వస్తు విస్తృతికి అవకాశం తక్కువ. అందువల్లనే ఆద్యంతాలకు ప్రాధాన్యాన్ని సూచిస్తూ ముఖ, నిర్వహణ సంధులను అంగీకరించారు. ఇది కూడా ఓ రీతిగా హాస్యహేతువే. ఏ పనికైనా ప్రారంభంనుండి ముగింపు వరకూ కొంత క్రమమూ, కొన్ని సోపానాలూ ఉంటాయి. అలా కాక ఆరంభించిన వెంటనే ముగించటం, మధ్యలో ముగించటం, తగిన స్థాయికి చేరక ముందే ముగించటం - ఇవన్నీ హాస్యహేతువులే అవుతాయి. లేకుంటే హడావుడిని సూచిస్తాయి.

ఇక సంధ్యంతరాలని కొన్ని ఉన్నాయి. భరతుడు వీటిని నామమాత్రంగా నిర్దేశించాడు. సింగభూపాలుడు మాత్రం సోదాహరణంగా వివరించాడు. ఆ సంధ్యంతరాలు ఇవి -

---

1. ముఖం బీజసముత్పత్తి ర్నానార్థరససంభవా -
బీజవన్తో ముఖాద్యర్థా విప్రకీర్ణా యథాయథమ్
ఐకార్థ్య ముపనీయన్తే యత్ర నిర్వహణం హి తత్ - దశరూపకమ్.

సామదానే భేదదణ్డే ప్రత్యుత్పన్నమతి ర్వధః
గోత్రస్ఖలిత మోజశ్చ ధీః క్రోధః సాహసం భయమ్ ॥

మాయా చ సంవృతి ర్భ్రాంతిః దూత్యం హేత్వవధారణమ్ ।
స్వప్నలేఖౌ మద శ్చిత్ర మిత్యేతాన్యేకవింశతిః ॥ [1]

ఈ 21 సంధ్యంతరాలలో చాపలాన్ని హాస్యోపయోగిగా అభినవగుప్తుడు వివరించాడు.[2] ఇది అనుభవసిద్ధ మైన విషయమే. జ్ఞానకర్మేంద్రియాలలో దేనికి సంబంధించిన చాపలమైనా హాస్యాన్ని కల్గిస్తుంది.

సంస్కృతాలంకారికులు ప్రహసనపాత్రల విషయలో చాలా శ్రద్ధ తీసికొన్నారు. అంటే లక్షణంలో కథాస్వరూపాన్ని వివరించడం కన్న, పాత్ర స్వరూపాన్ని నిర్దేశించటం మీదనే దృష్టిని ఎక్కువగా కేంద్రీకరించారు. దానివలన ప్రహసన సాహిత్యానికి లాభం కన్న నష్టమే ఎక్కువ కలిగింది. కథా పద్ధతిని వివరించి ఉంటే, అటువంటి కథను నిర్మించటానికై ఏ పాత్రలు అవసరమో స్వతంత్రంగా ఆలోచించి, అటువంటి పాత్రల కల్పన చేసిఉండేవారు. లాక్షణికులు పాత్రలనే నిర్దేశించిన కారణంగా ప్రహసనకర్తలకు శ్రమ తగ్గింది. వారు అనాయాసంగా అటువంటి పాత్రలనే కల్పించి రచనలను కొనసాగించారు. కాగా ప్రాచీనుల ప్రహసనాల్లోనూ, ప్రాచీనభావాలలో నుండి బయట పడలేని నవీనుల ప్రహసనాల లోనూ కూడా అటువంటి పాత్రలే కనిపిస్తాయి. ధర్మభ్రష్టులైన శ్రోత్రియ, సన్యాస, మహర్షి, శాక్యాదులు; చేట, చేటీ, విట, విదూషకాదులు; షండ, కాముకాదులు ప్రహసనాలలోని పాత్రలు. వేశ్యలకు, ధూర్తవిటులకు ఇక్కడ ప్రాధాన్య మెక్కువ. లోకంలో పెద్దవాళ్ళుగా చెలామణి అవుతూ వేశ్యాప్రాంగణాల్లో తలవంచే మనీషులే ఇక్కడ ప్రధానపాత్రలు. ధర్మభ్రష్టుల పరిచ్యుతిని వివరించి చూపించటం ద్వారా ధర్మసంరక్షణ చేయటం ఇక్కడ కర్తవ్యం. బహుశః ఆనాటి సమాజంలో వేశ్యా వాటికలే ప్రధానంగా సమస్యాకేంద్రాలుగా ఉండేవేమో! అందుకే ప్రాచీన భాణాలలో సైతం వేశ్యావాటికలు ప్రముఖంగా కన్పిస్తుంటాయి. వాటి నుండి ప్రజలను రక్షించటం

1. రసార్ణవసుధాకరము 3/81,82
2. అభినవభారతి Vol III P63

రచయితల ధ్యేయం. ఈ వేశ్యాస్థితి నిన్న మొన్నటివరకు ఆ ప్రాచీన రూపంతోనే మనసంఘంలో తిష్ఠవేసుకొని వుండేది. ఇప్పుడు లేదనికాదు గాని, రూపాన్ని మార్చుకోవటం జరిగింది. కాబట్టి నాటికీ, నేటికి సమస్యా కేంద్రాలైన వేశ్యావాటికలే సంస్కృతప్రహసనాలలో అధిక్షేపణకు గురిఅయ్యాయి. వారి ధర్మ పరిచ్యుతిని కళ్ళకు కట్టించి, తద్ద్వారా ధర్మరక్షణకోసం ఆ పాత్రలు ప్రహసనాలలో వెలిశాయి.

భరతుడు ప్రహసనంలో అంకసంఖ్యను గూర్చి ఏమీ మాటాడలేదు. అయితే భరతుని తర్వాత ఆలంకారికులు ప్రహసన మేకాంక పరిమితమని నిర్వచించారు. "అంకో ప్యేకో భవే ద్యస్య తత్తు ప్రహసనం భవేత్" అని మొదట పలికినవాడు శారదాతనయుడు (భావప్రకాశనం).

అభినవగుప్తుడు భరతుని వ్యాఖ్యానిస్తూ ప్రహసనంలో అంకసంఖ్య నిర్దేశింప బడకపోయినా శుద్ధప్రహసన మేకాంకమనీ, సంకీర్ణ ప్రహసన మనేకాంకమనీ కొందరి అభిప్రాయంగా ప్రకటించి, ఏకాంకికల మధ్య పఠించుటవలన ప్రహసనం సైత మేకాంక మనే భావింపవలసి ఉన్నదన్నాడు. సంకీర్ణప్రహసన మనేకాంక మన్న అభిప్రాయాన్ని ప్రకటించిన దెవరో తెలియదు.

కాని ప్రయోగదశలో ప్రహసనంలో ఒకటి నుండి ఏడు వరకూ అంకాలు కన్పిస్తున్నాయి. ప్రాచీన ప్రహసనాలలోనే హాస్యచూడామణి, లటకమేలకమ్ వంటి ప్రహసనాలు రెండేసి అంకాలతో గోచరిస్తున్నాయి. బహుశః వీటిని చూచే సంకీర్ణ ప్రహసన మనేకాంక మన్న అభిప్రాయ మేర్పడిందేమో! ఆధునిక ప్రహసనాలలో ఈ అంకనియమం యథేచ్ఛంగా అనుసరించబడినది. లీలావిలాస ప్రహసనంలో ఏడంకాలు కన్పిస్తున్నాయి. అయితే ఈ అంకనియమంవలన ప్రహసనంలో ప్రధాన మైన హాస్యరసపోషణవిషయంలో ఏర్పడే ప్రత్యేకపరిణామా లేవీ లేవు. కాబట్టి ఇది పెద్దగా పట్టించుకోవలసిన విషయం కాకపోవచ్చు.

వీథ్యంగాలతో[1] కూడిన ప్రహసనం మిశ్రిత మని భరతుడు, ధనంజయుడు, శారదాతనయుడు, విద్యానాథుడు మొదలగువారు ప్రకటించారు కదా! అయితే

---

1. ఉద్ఘాత్య కావలగితే ప్రపంచ త్రిగతే ఛలమ్,
వాక్కేల్యధిబలే గండ మవస్యందిత నాలికే |
అసత్ప్రలాప వ్యాహార మృదవాని త్రయోదశ||

ఈ వీథ్యంగాలలో అన్నీ రసదృష్టితో ప్రహసనానికి ఉపకరించవు. ఉద్ఘాత్యకా-వలగితాలు నియతంగా హాస్యసాధకాలు కాలేవు. పాత్ర ప్రకరణాది వైశిష్ట్యాన్ని ఆశ్రయించినపుడు అవి హాస్యహేతువు లవుతాయి. ప్రపంచం, త్రిగతం, నాలిక, అసత్ప్రలాపం, వ్యాహారం ఈ ఐదు నిత్యం హాస్యజనకాలే. లేని గొప్పతనాన్ని ఆపాదించుకొని, ఒకరి నొకరు ప్రశంసించుకోవటం ప్రపంచం.[1] శబ్దసామ్యాన్ని బట్టి అనేకార్థాలను ఉపయోగించటం త్రిగతం.[2] దీన్ని హాస్యపోషణకై పూర్వరంగంలో తప్పక స్వీకరించాలని భరతు డన్నాడు. నాలిక[3] ప్రహేళికాప్రాయమై చమత్కారాన్ని కల్గించేదే. అసంబద్ధకథలతో గూడిన సంభాషణ అసత్ప్రలాపం.[4] ఈ అసంబద్ధత హాస్యరసపోషణకు అత్యంతం సన్నిహితమై సహకరిస్తుంది. వ్యాహారం[5] సైతం హాస్యలోభాన్ని జనింపజేసే ప్రక్రియయే.

సింగభూపాలుడు రసార్ణవసుధాకరంలో వీథ్యంగాలతో బాటు లాస్యాంగాలకు[6] సైతం ప్రహసనంలో స్థానం కల్పించాడు. ఈ లాస్యాంగాలు భాణంలో వలె ప్రహసనంలో సైతం కన్పించవచ్చును గానీ, హాస్యరసపోషణకు ఇవి సాక్షాత్తుగా సహకరింపగలవి గావు. ఒకచో ప్రచ్ఛేదకం,[7] ఉక్తిప్రత్యుక్తం[8] మాత్రం హాస్యాన్ని

---

1. అసద్భూతం మిథః స్తోత్రం ప్రపంచో హాస్యకృ న్మతః | ద. రూ. 3/15
2. శ్రుతి సామ్యా దనేకార్థయోజనం త్రిగతం త్విహ |
   నటాదిత్రితయాలాపః పూర్వరంగే తదిష్యతే|| ద. రూ. 3/16

3 సోపహాసా నిగూఢార్థా నాలికైవ ప్రహేళికా||ద. రూ. 3/19

4 అసంబద్ధకథాప్రాయోఽసత్ప్రలాపో యథోత్తరః ద. రూ. 3-20

5 అన్యార్థ మేవ వ్యాహారో హాస్యలోభకరం వచః || ద. రూ. 3-20

6 గేయపదం స్థితపాఠ్య మాసీనం పుష్పగండికా
ప్రచ్ఛేదక స్త్రిమూఢం చ సైంధవాఖ్యం ద్విమూఢకమ్
ఉత్తమోత్తమకం చాన్య దుక్తిప్రత్యుక్త మేవ చ || 3/236,237-రసార్ణవ సుధాకరం

7 అన్యాసంగమ శంకిన్యా నాయక స్యాతిరోషయా
ప్రచ్ఛేదక ప్రకటనం లాస్యం ప్రచ్ఛేదకం విదుః|| 3/242

8 కోప ప్రసాదజనితం సాధిక్షేపపదాశ్రయమ్
వాక్యం తదుక్తిప్రత్యుక్తం యూనోః ప్రశ్నోత్తరాత్మకమ్|| 3/247

కల్గించే కర్తవ్యాన్ని కొంత వరకు నిర్వహింపగలిగి ఉంటాయి. ఇవి స్మితమాత్ర పరిమితాలై ఉదాత్తప్రహసనాల్లో తమ స్థానం కోసం పోటీ పడితే పడవచ్చు కానీ హాస్యరస పరిపోషణ సమగ్రం కావటంలో మాత్రం వీటి పాత్ర అత్యల్పమే.

ఈ లాస్యాంగాలు కాక ప్రహసనాంగాలను[1] సైతం సింగభూపాలుడు వివరించాడు. అవలగితం, అవస్కందం, వ్యవహారం, విప్రలంభం, ఉపపత్తి, భయం, అనృతం, విభ్రాన్తి, గద్గదవాక్కు, ప్రలాపం - ఇవి ప్రహసనాలకు మాత్రమే పరిమితాలు కాకపోయినా ప్రహసనాలలో ఇవన్నీ సహకరించేవే. హాస్య రసస్యందులే. కాబట్టి శిరోధార్యాలు. సింగభూపాలుడు ఈ పదింటిని నిర్వచించి, 'ప్రహసనం'నుండి ఉదాహరణల నిచ్చి వున్నాడు. అయితే ప్రస్తుత మా 'ప్రహసన' మలభ్యం.

ప్రహసనం పరిహాసప్రాయం, విశేషహాసోపహాసరచిత మయి ఉండాలని భరతుని వక్కణ. అర్వాచీనాలంకారికు లందరూ ఈ అంశాన్ని యథాతథంగానే అనుసరించారు. షడ్విధమైన హాస్యరసమే ప్రహసనంలో ప్రధానంగా పోషింప బడాలని లాక్షణికు లందరూ ఉద్ఘాటించారు.

షడ్విధమైన హాస్యాన్ని పోషించాలని లాక్షణికులు చెప్తున్నా ప్రయోగదశలో మాత్రం ప్రాచీన ప్రహసనాలలో అధమహాస్య మధికంగా, మధ్యమహాస్యం మధ్యమంగా కనిపిస్తుంది. ఉత్తమహాస్యస్థితి చాలా తక్కువ. ఉత్తమహాస్యం కావా లంటే సంస్కృతనాటకాలనే ఆశ్రయించక తప్పదు. కాని అర్వాచీనప్రహసనాలలో కూడా అక్కడక్కడ ఉత్తమహాస్యం సాక్షాత్కరిస్తోంది. కొన్ని ప్రాచీన ప్రహసనాలలో హాస్య మన్న పేరుతో జుగుప్సాత్మకాలైన సన్నివేశాలు కూడా చోటుచేసుకున్నాయి. కాళిదాసప్రహసనం వంటి విట్టివే. అజ్ఞాత కర్తృకాలై ఇటువంటివి బాగా వ్యాప్తిలోకి వచ్చాయి. ఆ జుగుప్సాతత్త్వమే వాటి వ్యాప్తికి కారణమేమో! హాస్యరసతత్త్వాన్నీ, దానిలోని ఆహ్లాదకత్వాన్ని, జీవితంలో దానికున్న ప్రాధాన్యాన్నీ సరిగా గుర్తించక ఆ కవులు అటువంటి రచనలు చేశారేమో అనిపిస్తుంది. ఒకచో అవి

1 అవలగిత మవస్కందో వ్యవహారో విప్రలంభ ముపపత్తిః |
భయ మనృతం విభ్రాన్తి ర్గద్గదవాక్ చ ప్రలాపశ్చ ||
రసార్ణవసుధాకరం - 8/270

పరాధిక్షేపణాత్మకాలై పరులను అప్రతిష్ఠపాలు చేసేందుకు ఉపయోగపడిన వేమో తెలియదు. వాటి చారిత్రకనైపథ్యం తెలిస్తే కానీ ఏమీ నిర్ణయించలేము.

ఇక్కడ మనమొక విషయాన్ని గుర్తించాలి. మానవులను లొంగదీసిన అనేక మనస్తత్త్వాలలో Copulata ఒకటి. అంటే ఆశ్లీలాసభ్యవిషయాలను మాట్లాడాలని తపన పడటం. అవి అశ్లీలాలనీ, గౌరవస్థానాలలో అటువంటి పదాలు వాడకూడ దనీ తెలిసిన వ్యక్తులు కూడా చాలమంది అటువంటి మాటలు వాడటం మనం నిత్యం చూస్తుంటాము. శ్లేష, వక్రోక్తుల మూలకంగానైనా అటువంటి మాటలు ఉపయోగించటం, అదే గొప్ప చమత్కారంగా భావించడం చాలా మందికి అలవాటు. పొరపాటున అటువంటి మనస్తత్వం రచయితలో ఉంటే అప్పుడది జుగుప్సాత్మక రచనలకు దారితీస్తుంది. కొందరిలో ఈ తత్త్వం నిగూఢంగా ఉంటుంది. వారు పదిమందిలో ఉదాత్తంగా కనిపించినా, ప్రవర్తించినా - ఎక్కడో ఒక చోట ఆ మనస్తత్త్వాన్ని తృప్తిపరచటానికి గట్టిగా ప్రయత్నిస్తారు. అటువంటి తత్త్వాలూ, ఆ ప్రయత్నాలు బహుశః జుగుప్సావహప్రహసన రచనకు కారణమయి ఉండవచ్చు. ప్రాచీన భాణప్రహసనాది రూపక రచయిత లెవ్వరూ తక్కువ వారేమీ కారు. బహుశాస్త్రనిష్ణాతులే. అయినా వారి కలాల నుండి అటువంటి రచనలు వెలువడ-టానికి ఆటువంటి విలక్షణమైన మనఃస్థితే కారణమై వుండవచ్చు.

ఆధునిక ప్రహసనాలలో ఈ జుగుప్సావహవాతావరణం తక్కువ. పాశ్చాత్య భాషల పరిచయంద్వారా వస్తువైవిధ్యాన్ని గుర్తించి, తద్వారా ప్రహసనాల్లో విషయ వైవిధ్యాన్ని ఆధునిక రచయితలు సాధించారు. హాస్యాన్ని, జుగుప్సని వేరు చేసి చూడటం కోసం, చూపించటంకోసం గట్టి కృషిచేశారు.

ఇక అధికారుల విషయానికి వస్తే అభినవగుప్తుని అభిప్రాయం ప్రకారం స్త్రీ, బాల, మూర్ఖాదులే ప్రహసన ప్రేక్షకులు. ప్రహసనాలలోని హాస్యప్రాధాన్యం, ఇతివృత్తవైచిత్ర్యం లేకపోవటం - ఈ రెండూ దీనికి కారణాలని అభినవుని నిర్ణయం. అయితే కాలానుగతిలో వచ్చిన మార్పులను అనుసరించి ఈ అంశాన్ని పరిశీలించాలి. హాస్యసృష్టిలో భావవక్రత, చేష్టావక్రత, ఉచ్చారణవక్రత, ఆహార్యవక్రతలలో ఏదైనా మూలకారణం కావచ్చు. భావవక్రత వాచ్యమయితే ఒకవేళ స్త్రీ, బాల, మూర్ఖాదులే అధికారులు కావచ్చును. కానీ అది వ్యంగ్యమైనపుడు స్త్రీ, బాల,

మూర్ఖాదులు పనికిరారు. మేధావులే ఆవసర మవుతారు. భావవక్రత వాచ్యంగా వున్న ప్రహసనాల విషయంలో కానీ, మిగిలిన మూడు వక్రతలు ప్రధానంగా కనిపించే ప్రహసనాలకు కానీ స్త్రీ, బాల, మూర్ఖాదులే అధికారులైతే కావచ్చు. అంతమాత్రంచేత అదంతా ఉత్తమ హాస్యం కాదు. చక్కని వక్రోక్తుల నవగతం చేసికొని, అనందించటానికి సామాన్యమేధ చాలదు. "ఏషాపి జానాతి ఏతావతీః వక్రోక్తీః" అని బాణుడు కాదంబరిలో ఈ విషయాన్నే సూచిస్తాడు. ఒక్కమాటలో చెప్పాలంటే స్మిత హేతువైన ఉదాత్త హాస్యం - ఉక్తి మూలక హాస్యం – అర్థం కావాలంటే స్త్రీ, బాల, మూర్ఖాదులు చాలరు. ప్రాచీనప్రహసనాలలో అటువంటి ఉక్తి మూలక హాస్యం తక్కువగా ఉన్నందువలన అభినవగుప్తుడు అటువంటి అభిప్రాయాన్ని వ్యక్తీకరించాడేమో! Barrow ఛలోక్తిని ఇలా వివరించాడు -

Wit is proper and commandable when it enlightens the intellect by good sense conveyed in jokular expression -[1]

కాబట్టి వక్రత వాచ్యమైన మధ్యమాధమ హాస్య విషయంలో తప్ప ఉత్తమ హాస్యంలో మేధావుల ఉపస్థితియే అవసరం. అంతేగాక హాస్యస్థాయినిబట్టి అధికారి నిర్ణయం జరగాలి. సర్వప్రహసనాలలోను హాస్య మొకేస్థాయిలో ఉండి తీరాలన్న నియమం లేదుగదా! ఒక ప్రహసనానికి మూర్ఖుడు అధికారి అయితే మరో ప్రహసనం పండితవేద్యం కావచ్చును. మేధావి ఒకప్రహసనాన్ని ప్రశంసించి, మరో ప్రహసనాన్ని నిరసించవచ్చును. కాబట్టి స్త్రీ, బాల, మూర్ఖాదులే ప్రహసనాలకు అధికారులు కావాలన్న నియమం పాక్షికమేమో అనిపిస్తుంది. విమర్శకులు ఆలోచించవలసిన విషయమది. Fuller హాస్యాన్ని కేంద్రంగా చేసి మేధావుల మేధను చమత్కారంగా వర్గీకరించాడు. చూడండి

There are heads sometimes so little that there is no room for wit, sometimes so long that there is no wit for such a room.[2]

భరతుడు నాట్యశాస్త్రంలో 25వ అధ్యాయంలో చాలా అభినయరీతులను వివరించాడు. ఏ దశలో ఎటువంటి అభినయాన్ని ప్రదర్శించాలో స్పష్టం చేశాడు.

---

1 The New Dictionary of thoughts P 705

2 The New Dictionary of thoughts P 707

అయితే హాస్య విషయంలో, హాస్యప్రధానమైన ప్రహసన విషయంలో ఒక చక్కని అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు.

ప్రత్యంగహీనం యత్కావ్యం వికృతం చ ప్రయుజ్యతే।
న లక్షణకృతస్తత్ర కార్య స్త్వభినయో బుధైః ॥ [1]

ప్రహసనం సహజంగా ధర్మపరిచ్యుతుల చరిత్ర గదా! వారి సంస్కార హీనత వర్ణింపబడి హాస్యాస్పదమవుతూ వుంటుంది. లేదా అనౌచిత్యవర్ణనం. కాబట్టి హాస్యప్రధానమైన అటువంటి అభినయానికి లక్షణ మిదమిత్థమని నిర్ణయంలేదు. లక్షణబద్ధంకానిది, నియమబద్ధంకానిది ఏదైనా హాస్యహేతువే కాబట్టి, అభినయం సయిత మే లక్షణానికీ లొంగకపోవటం విశేషంగా హాస్యకారియే అవుతుంది, కానీ దోషం కాదు. అందుకే హాస్యనటుని అభినయానికీ, ఇతర పాత్రల అభినయానికీ చాలా తేడా ఉంటుంది. క్రమానికైతే ఒక పద్ధతికాని అక్రమానికి అనేకగతులు గదా! ఇతర పాత్రల అభినయం సరళరేఖ వంటిది. కాబట్టి దానికి నియమాలు కావాలి. హాస్యకర్తల అభినయం వక్రరేఖ. కాబట్టి ఏ నియమమూ అవసరం లేదు.

భరతుడు హాస్యరసానికి కైశికీ వృత్తిని విధించాడు.[2] కానీ కోహలుడు -

వీరాద్భుత ప్రహసనై రిహ భారతీస్యాత్
సాత్త్వత్యపీహ గదితాద్భుత వీరరౌద్రైః ।
శృంగార హాస్యకరుణైరపి కైశికీ స్యా
దిష్టా భయానకయుతారభటీ చ రౌద్రా॥

అని హాస్యానికి భారతీ వృత్తిని కూడా అంగీకరించాడు. విద్యానాథాదులు కూడా హాస్యవిషయంలో భారతీవృత్తికే ప్రాధాన్యమిచ్చారు. భారతి వాగ్వ్యాపార రూపం. కైశికి చేష్టారూపం, సుకుమారంకూడా. మనోవ్యాపార రూపమైన సాత్త్వతికి ఇందు ప్రవేశం లేదు. హాస్యం ప్రధానంగా వాక్చేష్టారూపం కాబట్టి కైశికీ భారతులకు ప్రహసనంలో ప్రాధాన్యం.

---

1 నాట్యశాస్త్రము 25/113

2 హాస్యశృంగార బహుళా కైశికీ పరికీర్తితా- నాట్యశాస్త్రము 20/73

గీర్వాణ రూపకాలన్నీ చంపూరూపాలే. కేవల పద్య రూపంగాకానీ, కేవలం గద్యరూపంగా కానీ ఏ రూపకమూ కనిపించదు. అంతేగాక పద్యరచన అపరిహరణీయ మన్నట్లుగా వాటి స్థితి చూపబడుతోంది. ఈ పద్ధతి నాటకాదులకు ఉపయోగకారి అయితే కావచ్చును కానీ ప్రహసన విషయంలో ఇది లాభంకన్న నష్టాన్నే ఎక్కువ కల్గిస్తుంది. హాస్యపోషణ ఉక్తి ప్రత్యుక్తుల ననుసరించితే కానీ రమణీయంగా సాగే అవకాశంలేదు. ఉత్తమహాస్య ప్రక్రియలలో ఎక్కువభాగం సంభాషణా చమత్కార రూపమే. అనగా ఉక్తిమూలమే. ఇది వచనంలో రాణించినంతగా పద్యంలో రాణించదు.

ప్రాచీన ప్రహసనకర్తలు రూపకసంప్రదాయాన్నే పాటిస్తూ పద్యగద్యాత్మకం గానే రచనలు చేశారు. ఆధునిక ప్రహసన రచయితలు మాత్రం ఇతర భాషా ప్రభావం వలన పద్యాలను పరిహరించి, కేవలం వచనరూపంగా కూడా ప్రహసన రచనను ప్రారంభించారు. నాందీ, భరతవాక్యాలవంటి సాంప్రదాయిక విషయాలు తప్ప మిగిలిన భాగమంతా వచనరూపంలోనే సాగిపోయిన ప్రహసనాలున్నాయి. అవి రమణీయాలై ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి కూడా! ఇటు రచనాసంవిధానం, అటు ఇతివృత్తస్వీకారం రెండింటిపై ఇతర భాషాసాహిత్యాల ప్రభావంవలన నేటి ప్రహసనరచనలు గద్యమాత్రాలుగా సాగి, ఉత్తమ హాస్యాన్ని అందజేస్తున్నాయి.

ప్రాచీనకాలంలో సంస్కృతంలోనుండి ఇతర భాషలలోకి అనువాదాలే తప్ప ఇతర భాషలనుండి సంస్కృతీకరింపబడినవి కన్పడవు. కాని ఆధునికకాలంలో ఇతరభాషలనుండి సైతం సంస్కృతంలోకి అనువాదాలు వెలువడుతున్నాయి. బెంగాలీ నుండి సంస్కృతంలోకి అనువదింపబడిన ప్రహసనాలు సైతం కొన్ని కన్పిస్తున్నాయి. అంత్యేష్టి సంస్కార ప్రహసనం (రచయిత్రి శ్రీమతి కె. కమల) గురువాక్య ప్రహసనం (డా|| రుద్రదేవత్రిపాఠి)- ఈరెండూ రవీంద్రనాథ్ టాగూర్ ప్రహసనాలకు అనువాదాలే.

భాషావిషయంలో సైతం ఆధునిక ప్రహసనాల్లో పురోగతి కనిపిస్తుంది. అనేక భాషల నభ్యసించటం కష్టసాధ్యమైన ఈ కాలంలో ప్రహసన రచయితలు ప్రాకృతాన్ని పూర్తిగా పరిహరించి, సర్వపాత్రలకు సంస్కృత భాషనే ఉపయోగించటం మొదలు పెట్టారు. అంతేగాక ఇతర భాషాపదాలను సైతం నిర్భయంగా, నిస్సంకోచంగా స్వీకరించి, ప్రహసనాలలో ప్రయోగిస్తున్నారు. ఇదంతా పురోగతికే నిదర్శనం.

ప్రహసన భేదాలు

దశవిధరూపకాల్లో ఏ రూపకంలోనూ, ఏ ఆలంకారికుడూ అంతర్విభాగాలను చూపలేదు, కానీ ఒక్క ప్రహసన విషయంలోనే ఆలంకారికులందరూ అవాంతర భేదాలను ప్రదర్శించారు. అయితే ఆలంకారికు లెవ్వరూ ప్రస్తావించకపోయినా కవుల అభిప్రాయాల ననుసరించి భాణం మాత్రం సామాన్యభాణమని, మిశ్రభాణమని రెండువిధాలయింది. 18వ శతాబ్దికి చెందిన కాశీపతి తన ముకుందానందభాణంలో తన భాణం మిశ్రమని ప్రకటించటం జరిగింది. కానీ మిశ్రభాణ లక్షణాన్ని వివరించలేదు. ఆపై శృంగారరసోదయభాణ కర్త లింగమగుంట రామకవి తన భాణంలో సామాన్యమిశ్రభాణ లక్షణాలను సూచించాడు.

సుకవి ర్భభాణ భాణం
శృంగార రసోదయాఖ్యమన్వర్థమ్
భాషాద్వయ భూషిత మతి
గుణతోషిత మవశేషితోక్తిభి స్సహితమ్. [1]

కాగా భాణవిషయంలో భాషావిశేషాలు అంతర్విభాగాలకు కారణా లయ్యాయి. అయితే సర్వరూపక విషయంలో భాషానుగుణంగా ఈ విభాగాలను చూపటం కుదరదు. కారణమొక్కటే. ఇతర రూపకాలన్నీ లక్షణా న్ననుసరించి బహుపాత్ర ప్రయుక్తా లయి వుండటమే. బహుపాత్ర లున్నప్పుడు స్త్రీ, నీచ పాత్రలకు తప్పనిసరిగా ప్రాకృతం వాడబడుతుంది గదా! భాణ మేకపాత్రప్రయోజ్యం కాబట్టి, అందులోనూ విటుడే నాయకుడు కాబట్టి ప్రాచీన భాణకర్త లందరూ సంస్కృతాన్నే వాడారు. అర్వాచీన భాణాల్లో మాత్రమే ప్రాకృతం కనిపిస్తోంది. కాబట్టి భాణ విషయంలో అటువంటి విభాగం సరిపోయింది. మరే రూపకంలోనూ కుదరదు. భాణ విషయంలో సైతమిది ఆలంకారికోక్తం కాదు.

భరతుడు ప్రహసనాన్ని శుద్ధం, సంకీర్ణం అని విభజించి వాటి లక్షణాలను ప్రత్యేకంగా వివరించాడు.

---

1 వివరాలకు – చూడుడు.. సంస్కృతభాణసాహిత్యము పుట 40-41

భగవ త్తాపస భిక్షు శ్రోత్రియ విప్రాతిహాస సంయుక్తమ్
నీచజన సంప్రయుక్తం పరిహాసాభాషణప్రాయమ్
అవికృత భాషాచారం విశేషహాసోపహాసరచిత పదమ్
నియతగతివస్తు విషయం శుద్ధం జ్ఞేయం ప్రహసనం తు||[1]

భగవ, త్తాపస, భిక్షు, శ్రోత్రియ విప్రాదులతో గూర్చిన హాస్యవాదాలు - నీచజనులతో కూడిక - పరిహాసభాషణ సంయుక్తి - భాషాచారాల యథాతథ ప్రదర్శన - విశిష్టహాసోపహాస కలితకథ. ఒకేనాయకుని చరిత్ర - ఇవన్నీ శుద్ధ ప్రహసనంలోని అంగాలు.

ఇక సంకీర్ణప్రహసనం -

వేశ్యాచేట నపుంసక ధూర్తవిటా బన్ధకీ చ యత్ర స్యుః
అనిభృత వేష పరిచ్ఛద చేష్టాకరణాత్తు సంకీర్ణమ్ ||[2]

వేశ్యలు, చేటులు, నపుంసకులు, ధూర్తులు, విటులు, బన్ధకి మొదలగువారు సంకీర్ణప్రహసనంలో పాత్రలు. వారి చేష్టలు, అలంకారాలు, వేషభాషాదులు సైతం బట్టబయలై వుంటాయి.

భరతుడు వాచా ప్రహసనం రెండు విధాలన్నాడే కానీ మిశ్ర మని మరో భేదాన్ని కూడా ప్రహసనంలో సూచించాడు.

ఉద్ఘాత్యకాదిభి రిదం వీథ్యంగై ర్మిశ్రితం భవేన్మిశ్రమ్[3]

అంటూ ఉద్ఘాత్యకాది వీథ్యంగాలతో కూడిన ప్రహసనం మిశ్రప్రహసన మని ప్రకటించాడు. ఈ మూడు విధాలయిన ప్రహసనాల్లోనూ లోకవ్యవహారసిద్ధ మైన వార్త, దంభం, ధూర్త వివాదా లుండాలని భరతుని అభిభాషణ.[4]

---

1 నాట్యశాస్త్రం 20/101, 108
2 నాట్యశాస్త్రం 20/109
3 నాట్యశాస్త్రం 20/111
4 నాట్యశాస్త్రం 20/110-111

భరతుడు పైరీతిగా ప్రహసనాన్ని విశ్లేషించటంలో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. శుద్ధ ప్రహసనంలో బహిస్తత్త్వం కన్న అంతస్తత్త్వానికే ప్రాధాన్యం. అంటే శుద్ధ ప్రహసనంలో హాస్యప్రాయులైన వాళ్ళంతా బాహ్యాకృతి ననుసరించి పవిత్రులు. యథార్థానికి వాళ్ళ అంతస్తత్త్వం కూడా పవిత్రంగానే వుండాలి. అసలు అంతస్తత్త్వాన్ని అనుసరించే బాహ్యావేషాన్ని సైతం కల్పించటం జరిగి వుంటుంది. అయితే క్రమంగా అంతస్తత్త్వాన్ని విపరిణమింపజేసికొని, బాహ్యతత్త్వానికి ప్రాధాన్యమిచ్చి, దాన్ని మాత్ర మవలంబించటంతో చాలామంది తృప్తిపడసాగారు. అటువంటి వ్యక్తుల అంతఃస్థితి లోని విపరిణామాన్ని గూర్చిన విమర్శ శుద్ధ ప్రహసనం. ఇది Satire కు ప్రాణం. భగవత్తాపస శ్రోత్రియాదులు పరమ పవిత్రమైన జీవితాన్ని గడపవలసిన వారు. వారిని గూర్చిన హాస్యవిషయాలంటే, పవిత్ర జీవితాన్ని అపహాస్యం చేయమని భరతు డంతటివాడు అనలేడు. కాబట్టి ఆ జీవితాన్నపేక్షించి, అందులోని ఔచిత్యాన్ని పరిత్యజించిన వారిని గూర్చిన హాస్యభాషణ ప్రహసనంలో వుండాలని భరతుని భావం. వృత్తి ధర్మాన్ని అనుసరించి పవిత్రంగా వుండవలసినా, వుండలేని వాళ్ళు, వున్నట్లు నటించే వాళ్ళు, పవిత్రతాపవిత్రతల తేడాను గమనించని వాళ్ళు, గమనించినా పాటించని వాళ్ళు - వీళ్ళందరి జీవితం శుద్ధప్రహసనానికి ప్రాణం.

ఇక సంకీర్ణ ప్రహసనస్థితి వేరు. దీనిలోని పాత్ర లన్నింటికి అంతస్తత్త్వ మేదో అదే బాహ్యతత్త్వంగా కూడా వుంటుంది. అంటే అంతస్తత్త్వాన్నీ, దాని ధర్మాన్నీ అనుసరించి వీరు పరిహాసార్హులు. వేశ్య, విటుడు, చేటుడు వగైరా మనుష్యులు వారి సహజవృత్తి ననుసరించియే పరిహాసాస్పదులు కాగా, వారి ప్రవృత్తి సైతం దాని కనుగుణంగానే కనిపిస్తుంది. అయితే ఇందులో ప్రతిపాత్రకూడా వృత్తిప్రవృత్తులు ఏకమై పరిహాసాస్పద మైనా, ఏ పాత్రకు సంబంధించిన వృత్తి ప్రవృత్తులు ఆ పాత్ర కుంటాయి. వేశ్యస్థితి వేరు. నపుంసకతత్త్వం వేరు. విటుడి ప్రవృత్తి వేరు. బన్ధకి పరిస్థితి వేరు. కాబట్టి సంకీర్ణత. సూక్ష్మంగా శుద్ధ, సంకీర్ణ ప్రహసనాలను వింగడించాలంటే వృత్తికి విరుద్ధమైన ప్రవృత్తి గలిగి నిందార్హమైన పాత్రలుంటే శుద్ధ ప్రహసనం, వృత్తియే పరిహాసాస్పదమై, ప్రవృత్తి కూడా దానికి తోడైన పాత్ర లుంటే అది సంకీర్ణ ప్రహసనం.

అయితే భరతుని తర్వాతి కాలంలోని ఆలంకారికులు భరతుని లక్షణాన్నే ఆశ్రయించి, ప్రహసన భేదాలు చూపి, నిర్వచించినా ఇంత స్పష్టతను ప్రదర్శించలేక

పోయారు. అక్కడక్కడ లక్షణ సాంకర్యం దృగ్గోచర మవుతూంటుంది. రూపక లక్షణాల మీదనే దృష్టిని కేంద్రీకరించిన ధనంజయుడు ప్రహసనం మూడు రకా లన్నాడు.[1] ఉద్ఘాత్యకాది వీథ్యంగాలతో కూడిన దాన్ని వికృత ప్రహసన మన్నాడు. మిగిలిన రెండూ శుద్ధ, సంకరాలు. ఇంతకుముందు చెప్పినట్లుగ భరతుడు చేసిన సూచన ననుసరించి వీథ్యంగ సంకీర్ణమైన దానిని మరొక ప్రహసన భేదంగా ధనంజయుడు చెప్పియుండ వచ్చు. కానీ భరతుడు మిశ్రమన్నదాన్ని ఇతడు సంకీర్ణ మన్నాడు. భరతుడు సంకీర్ణ మన్నదాన్ని ఇతడు వికృత మన్నాడు. అంతేగాక శుద్ధ వికృత ప్రహసన లక్షణాలను వివరించటంలో భరతుడు చెప్పిన లక్షణాన్ని యథాతథంగా అనుసరింపకపోగా లక్షణ సాంకర్యానికి అవకాశ మిచ్చాడు. అంతేగాక భరతుని నిర్వచనంలోని సూక్ష్మదృష్టి కనిపించకపోగా కొంత అవ్యవస్థ కూడా కనిపిస్తుంది. “పాఖండి విప్రప్రభృతి చేట చేటీ సమాకులమ్” అని విప్రులను శుద్ధ ప్రహసనంలో చేర్చి, అదేస్థాయిలో వుండవలసిన తాపసులను సంకీర్ణ ప్రహననంలో చేర్చాడు. చేట చేటులకు శుద్ధప్రహసనంలో స్థాన మిచ్చి, కంచుకిని మాత్రం సంకీర్ణప్రహసనంలో నిలిపాడు. ఇది భరతుణ్ణి అనుసరించి చూస్తే అంతగా సమగ్ర మైనది కాదు. బహుశః కాముకత్వ, అకాముకత్వాలకు ఇతని విభాగంలో ప్రాధాన్య మేమో? లేదా స్వరూపత్వ విరూపత్వాలు పైవిభేదాలకు హేతువులై వుండవచ్చును. పాఖండి విప్రాదుల యథాతథ స్థితిలో హాస్యం శుద్ధం. వాళ్ళు కాముకాది రూపాన్ని ధరించినపుడు సంకీర్ణ మనవలసివస్తుంది. భరతుని విభాగంలోని సుస్పష్టత ఇందులో కనిపించదేమో!

అర్వాచీనుడైన హేమచంద్రుడు మాత్రం కావ్యానుశాసనంలో యథాతథంగా భరతుని విభాగాన్ని, లక్షణాలను అనుసరించాడు.

ప్రహసనమపి విజ్ఞేయం ద్వివిధం శుద్ధం తథా సంకీర్ణమ్
వక్ష్యామి తయోర్వ్యక్త్యా పృథక్పృథగ్లక్షణ విశేషాన్
భగవత్తాపస విప్రైరన్యైరపి హాసవాద సంబద్ధమ్।
కాపురుష సంప్రయుక్తం పరిహాసాభాషణప్రాయమ్॥
అవికృత భాషాచారం విశేషభావోపపన్న చరిత మిదమ్।
నియతగతి వస్తు విషయం శుద్ధం జ్ఞేయం ప్రహసనన్తు॥

1 తద్వత్ప్రహసనం త్రేధా శుద్ధవైకృత సంకరైః - దశరూపకమ్ 3/54

వేశ్యాచేట నపుంసక ధూర్త విటా బన్ధకీ చ యత్ర స్యుః|
అనియత వేష పరిచ్ఛద చేష్టిత కరణం చ సంకీర్ణమ్||[1]

భావప్రకాశనకారుడైన శారదాతనయుడు సైతం ప్రహసనాన్ని మూడు విధాలు గానే విభజించాడు. అయితే వీథ్యంగాలతో కూడిన దానిని సంకీర్ణమని, ధనంజయుని లక్షణాన్ని అనుసరిస్తూ విట, కాముక, చేటాది వచో వేషాలను ధరించిన పరివ్రాజక, ముని, షండాదుల చరిత్రను వైకృత మన్నాడు. భరత, ధనంజయు లిద్దరి ప్రభావం శారదాతనయునిపై కనిపిస్తోంది.

అర్వాచీను లందరూ ధనంజయుని లక్షణ విభాగాల ననుసరించిన వాళ్ళే. స్పష్టతాస్పష్టతల విషయంలోనే అక్కడక్కడ కొంత తేడా కనిపిస్తుంది.

సాహిత్యదర్పణకారుడు విశ్వనాథుడూ, రసార్ణవసుధాకరకర్త సింగభూపాలుడూ వీథ్యంగ సమ్మేళనాన్ని ప్రపంచింపలేదు. సాహిత్య దర్పణ కారునిదృష్టి మరల అభినవుని మాటలవైపు పరుగులెత్తింది. శుద్ధప్రహసన మేకాంకమని, సంకీర్ణ ప్రహసనం వేశ్యాదుల సంఖ్యాబలమెక్కువై అనేకాంక మవుతుందని కొందరి అభిప్రాయంగా అభినవుడు చెప్పాడు. దానిని ఆశ్రయించియే విశ్వనాథుడు-

వృత్తం బహునాం ధృష్టానాం సంకీర్ణం కేచిదూచిరే |
తత్పున ర్భవతి ద్వ్యంక మథవై కాంక నిర్మితమ్ ||[2]

అంటూ సంకీర్ణ ప్రహసనానికి అనేకాంకత్వాన్ని కూడా ఉటంకించాడు. విశ్వ-నాథుడు వీథ్యంగాలను పరిత్యజించి కూడా ప్రహసనంలో త్రైవిధ్యాన్ని ప్రదర్శించాడు. అంటే భరతుని శుద్ధ ప్రహసనాన్నే పాత్రసంఖ్యా భేదాన్ని, అంకభేదాన్ని ఆశ్రయించి శుద్ధ సంకీర్ణాలుగా విభజించి, భరతుని సంకీర్ణ ప్రహసనాన్ని మరికొంత మార్చి, వికృత ప్రహసనాన్ని మరికొంత మార్చి వికృత ప్రహసన మన్నాడు. అయితే ధనంజయాదులలో వలె స్వరూపత్వ విరూపత్వాలే ఇక్కడ కూడా శుద్ధ వికృతి హేతువులు.

1 కావ్యానుశాసనమ్ -పు 388 (Nirnaya Sagar p.1934)

2 సాహిత్య దర్పణము 6-268

సింగ భూపాలుడు వీథ్యంగాలను వదలి ప్రహసనాంగాలను వివరించాడు. విభాగంలో శుద్ధ, కీర్ణ, వైకృతాలనే సూచించాడు కానీ, లక్షణ నిర్వచనంలో అంత స్పష్టత లేదు.[1]

ఈ ప్రహసన భేదాలను గతానుగతికంగా లాక్షణికులు ప్రవచించినా రచయితలు అంతగా పట్టించుకున్నట్లు కనిపించదు. కొంచె మించుమించు అన్ని ప్రహసనాలలో సర్వపాత్రల సాంకర్యం కనిపిస్తుంది. అర్వాచీనప్రహసనాలు చాలావరకు ఈ నియమాలకు లొంగవు.

పాశ్చాత్య రూపకాలలో కామెడీ ఒక శాఖ. దాని అవాంతర భేదాలు చాలా వున్నాయి. ఆ యా 'కామెడీ' భేదాల లక్షణాలను సరిపోలిన ప్రహసనాలు అనేకాలు. కాబట్టి ప్రహసన పరామర్శలో ఆ 'కామెడీ' భేదాలను అనుసరించటం జరిగింది. ఆ భేదాలు ఫార్స్ (Farce), కామెడీ ఆఫ్ హ్యూమర్స్ (Comedy of Humours), కామెడీ ఆఫ్ మ్యానర్స్ (Comcdy of manners), సెటైర్ (Satire), డొమెస్టిక్ కామెడీ (Domestic Comedy), పారడీ (Parody) మొదలయినవి.

1 శుద్ధం కీర్ణం వైకృతం చ తచ్చ ప్రహసనం త్రిధా |
శుద్ధం శ్రోత్రియ వాక్యాదేర్వేషభాషాది సంయుతమ్ ||
చేట చేటీ జనవ్యాప్తం కీర్ణం లక్ష్యం నిరూప్యతామ్ |
ఆనందకోశ ప్రముఖం వైకృతం తదుదాహృతిః ||

రసార్ణవసుధాకరము 3-278,279.

దశరూపకాల్లో ప్రహసన స్థానం

కళాతత్త్వమైనా, శాస్త్రసత్యమైనా సమగ్రతను సాధించాలంటే క్రమవికాస మపరిహార్యం. వర్తమానకాలంలో అది సర్వాంగ సుందరంగా కనిపించినా దాని ప్రాథమిక స్వరూపం అదే అని చెప్పగలగటం కష్టం, ఆశాస్త్రీయం కూడా. కాబట్టి హేతువాద దృక్పథంతో సర్వపదార్థాల క్రమవికాసాన్ని పరిశీలించవలసిన అవసర ముంది. సంస్కృత రూపకాల విషయంలో సైత మీ క్రమవికాస చర్చ అవసరం. అప్పుడు కానీ దశరూపకాలలో ప్రహసన స్థానాన్ని, ఆవిర్భావక్రమాన్ని నిర్ణయించలేము.

అలంకార శాస్త్ర సంరక్షకులు, ప్రవర్తకులు అయిన ప్రాచీనాలంకారికు రెవ్వరూ ఇటువంటి హేతుబద్ధ విమర్శపై తమ దృష్టిని కేంద్రీకరించలేదు. పోగా రూపక పరిశీలన చేసిన సర్వాలంకారికులును నాటకలక్షణ నిరూపణతోనే ప్రారంభించారు. తొలి ఆలంకారికుడైన భరతుడు దశరూపకాలను లక్షణ నిర్దేశపూర్వకంగా పేర్కొన్నాడు. కానీ ఉదాహరణముల నివ్వలేదు. అతడు ఉదాహరించిన త్రిపురదాహము, అమృతమంథన సమవాకారం రెండూ నామమాత్రావశిష్టాలు. అంతే గాక అవి దైవకర్తృకంగా నిర్దేశింపబడ్డవి గూడా! కాబట్టి రూపక ప్రాథమికదశ సాక్ష్యాధారాలు లేనిదైనందువల్ల అర్వాచీన విమర్శకులు ఊహామాత్రంగానే క్రమవికాసాన్ని పరిశీలింపవలసి వచ్చింది.

ఆలంకారికులు నాటకమే దశరూపకాలకు మూలమని భావించినట్లుగ కొందరికి అనిపిస్తుంది కానీ అది సత్యదూరం. ఆ అలంకారికులు నాటక లక్షణంతో ప్రారంభించి వివరించటంలో ఔచిత్యానౌచిత్యాలను పరిశీలించాలి -

జ్ఞేయం ప్రకరణం చైవ తథా నాటక మేవ చ |
సర్వవృత్తివినిష్పన్నం నానావస్థాసమాశ్రయమ్ || [1]

సర్వవృత్తి వినిష్పన్నత, నానావస్థా సమాశ్రయత అన్న లక్షణాలు నాటక ప్రకరణాలకు మాత్రమే పరిమితాలు. అయితే ఆ లక్షణాలు క్రమవికాసంలో ఏర్పడ్డవే కానీ తొలిదశకు చెందినవి కావు. అంతేగాదు. నాటకాదులకు చెప్పిన లక్షణాలు నియతాలు కావని, పరస్పర సాంకర్యం తప్పదని, ప్రాధాన్యాన్ని బట్టి వ్యపదేశమని అభినవగుప్తు డనుట ఈ విషయాన్నే స్పష్టం చేస్తోంది.

---

1 నాట్యశాస్త్రము 20-17

నాట్యోత్పత్తి కథను తెలుపుతూ భరతుడు –

మయా సమవకారస్తు యోఽయం సృష్ట స్సురోత్తమ |
శ్రవణే దర్శనే చాస్య ప్రసాదం కర్తు మర్హసి ||
పూర్వరంగే కృతే పూర్వం తత్రాయం ద్విజసత్తమాః |
మయా త్రిపురదాహ శ్చ డిమసంజ్ఞః ప్రయోజితః || [1]

అన్నాడు. దీనినిబట్టి తొలిగా ప్రదర్శింపబడినవి డిమ, సమవాకారా లన్నది స్పష్టం. అయితే అవి భరతుని కాలంలో వున్నవో లేక భరతుడు దైవకర్తృకంగా నామ మాత్రంగా నిర్దేశించాడో తెలియదు. అనంతరాలంకారికులు నాటకప్రకరణాలను ముందు నిర్వచించి, ఆపై మిగిలిన రూపకాలకు విశిష్టలక్షణాలను మాత్రముటంకిస్తూ, సామాన్య లక్షణాలను నాటకానుగుణంగానే గ్రహించమనటం అలవాటు చేసుకున్నారు. నాటక మితర రూపకాల కన్నింటికి ప్రకృతి కావటం, సంపూర్ణ లక్షణలక్షితం కావటం దీనికి కారణం. లక్షణ కర్తలకు ఆ మార్గం తేలికైన మార్గం. రసార్ణవ సుధాకరకర్త ఆ విషయాన్ని స్పష్టంగా వివరించాడు. చూడండి –

సాక్షాదేవోపదేశేన ప్రాప్తధర్మసమన్వయాత్ |
అంగాంగి భావసంపన్న సమస్తరస సంశ్రయాత్ ||
ప్రకృత్యవస్థా సంధ్యాది సంపత్త్యుపనిబన్ధనాత్ |
ఆహుః ప్రకరణాదీనాం నాటకం ప్రకృతిం బుధాః || [2]

ఈ మార్గాన్నే ఆలంకారికు అందరూ అనుసరించారు. కాగా నాటకం ప్రథమ జాతమని ఆలంకారికు లెవ్వరూ అభిప్రాయ పడినట్లు దాఖలాలు లేవు.

ఇక హేతువాద దృక్పథంతో ఆలోచిస్తే స్వరూపాన్నిబట్టి, స్వభావాన్ని బట్టి, అంతర్బహిస్సాక్ష్యాల ననుసరించి రూపకాల పౌర్వాపర్యాలను నిర్ణయించవలసి వుంటుంది. K. H. ధ్రువ గారి అభిప్రాయాన్ని[3] అనుసరించి ఏకాంకికలు ప్రాథమికాలు. ఋషులు నిత్యకర్మలను పూర్తి చేసిన పిమ్మట వినోదార్థం రూపక ప్రదర్శన జరిగెడిదట.

---

1 నాట్యశాస్త్రము 4/7-10

2 రసార్ణవ సుధాకరము 3-128,29

3 గీర్వాణ రూపకము పు 82.

అది సంధ్యాసమయానంతరిక మగుటవల్ల దీర్ఘ రూపకాల కవకాశం తక్కువ. కాల క్రమంగా వృత్తినటులు బయల్దేరిన పిమ్మట నగరాలలో సహృదయుల సమక్షంలో రూపక ప్రదర్శన జరుగుచుండెడిది. అప్పుడు ఏకాంక రూపకాలు, విశేషాంక రూపకాలుగా పరిణమించాయి. ఋగ్వేదంలోని - ఏకపాత్రాభినయాన్ని పోలియున్న - అక్ష సోమాది సూక్తాలు ఈ విషయానికే ఉపబలకాలు. కాబట్టి ధ్రువ గారి అభిప్రాయం ప్రకారం భాణ –ప్రహసన–వీథీ–అంక - వ్యాయోగాలు ప్రాథమికరూపకాలు. ప్రహసనాలలో ఆర్వాచీన కాలంలో అనేకాంకికత కన్పించినా, లక్షణ నిర్దేశంలో అవి ఏకాంకాలే. అయితే ఈ ఏకాంక రూపకాలలో మరల పౌర్వాపర్యాన్ని నిర్ణయించేందుకు ధ్రువ అభిప్రాయ పడలేదు. అంకాలను బట్టి చూస్తే అవన్నీ సమానమైనా, పాత్ర సంఖ్యను, స్వరూపాన్ని బట్టి ఆలోచిస్తే ఏక పాత్ర పరిమితమై, స్వభావాన్ననుసరించి దృశ్యశ్రవ్యాల మధ్యమ రూపంగా కన్పించే భాణం మొదటి దనవలసి వస్తుంది. ఆ భాణం నుండి వీథి, దాని నుండి ప్రహసన ముద్భవించి వుండవచ్చును. ఏకాంకికమై, ఏకద్విపాత్ర ప్రయోజ్యమై భాణం లాగానే పాత్రల సంచారశీలతను అంగీకరించిన వీథి భాణానన్తర రూపం. అనంతరాభివృద్ధి ప్రహసన రూపం. కాగా దశరూపక క్రమంలో మూడవది ప్రహసన మని చెప్పవలసి వస్తోంది.

డా॥ ఘోష్ అభిప్రాయం పైవాదాన్నే సమర్థిస్తుంది. వారి అభిప్రాయంలో ఏకాంకం, ఏక హార్యం అయిన భాణం మొదటిది. ఏకాంకం, ఏకద్విపాత్రహార్యం అయిన వీథి రెండవది. ఏకాంకం, బహుపాత్ర హార్యం అయిన ప్రహసనం మూడవది. వ్యాయోగ, ఉత్సృష్టికాంకాలు ఈ దశలోనివే. అసంబద్ధాలైన మూడు అంకాలు, బహు పాత్రలు గల సమవాకారం నాల్గవ దశ. అసంబద్ధాలు కాని నాలుగు అంకాలు, బహు పాత్రలు పంచమదశ. డిమ, ఈహామృగాలు ఈ దశలోనివి. చివరిదశగా సుసంబద్ధాలై, అయిదు మొదలు పది అంకాల వరకు గల నాటక ప్రకరణాలు రూపు దిద్దుకున్నాయి.

రసానుగుణ దృష్టితో ఆలోచించినా పై క్రమం యుక్తియుక్తమే అనిపిస్తుంది. అవిస్పష్ట, అసంబద్ధ శృంగార స్వరూపంతో సమాజానికి దగ్గరగా వున్న భాణం మొదటిది. అది ఆకాశభాషిత ప్రధానం. రెండవ దశ అయిన వీథిలో ఆకాశభాషితం ద్వారా ఉక్తి ప్రత్యుక్తులు ప్రధానం కాదు, అయితే అవి వుండవచ్చు నని కావ్యానుశాసన కర్త హేమచంద్రుడు అభిప్రాయపడినాడు. నాయిక సామాన్య కానీ, పరకీయ కానీ కావాలని రసార్ణవ సుధాకర కర్త నిర్వచించాడు.

శృంగారానికి సన్నిహితమైనదీ, పై పెచ్చు శృంగారం నుండి ఉద్భవించినదీ హాస్యం. శృంగారాద్ధి భవేద్ధాన్యః - శృంగారానుకృతి ర్యాతు స హాస్యస్తు ప్రకీర్తితః - అని భరతుడు స్పష్టం చేశాడు. యథార్థానికి భాణాల్లో సైతమెక్కువ భాగం శృంగారానుకరణమే కనిపిస్తుంది. అందుకే శృంగార హాస్యాలు దానిలో పెనవేసుకొని వుంటాయి. అదే స్థితి అనేక పాత్రలతో ప్రహసనంలో కనిపిస్తుంది. అయితే ఇందులో శృంగారాని కన్నా హాస్యానికి ప్రాధాన్యం కాబట్టి ఆ శృంగారం సైతం హాస్య పోషకమే అవుతుంది. ఈ రీతిగా రసదృష్టితో ఆలోచించినా శృంగారానుకృతిగా హాస్యం భాణ వీథుల తర్వాత దశ అనవచ్చును. అంతేగాక ప్రాచీన భాణ ప్రహసనాలను పరిశీలిస్తే భాణంలో పురుష పాత్ర ప్రాధాన్యం, దాని చుట్టూ ఇతర పాత్రలు తిరగటం జరిగితే, ప్రహసనాల్లో స్త్రీ పాత్ర ప్రాధాన్యం, దాని చుట్టూ పురుష పాత్రలు తిరగటం కనిపిస్తుంది. అంటే ప్రాథమిక దశలో నిగూఢమైన ఆభాస శృంగారం ప్రధానమైతే, అనంతర దశలో అది బట్టబయలై కనిపించి, సంపూర్ణంగా హాస్య రూపాన్ని ధరించింది. అందువల్ల భాణ వీథుల తర్వాతి దశయే ప్రహసన మనటం యుక్తి యుక్తమే.

మంకడ్ ఈ అభిప్రాయాన్ని అనుసరిస్తూ భాణ ప్రహసనాలను మరికొంత దగ్గరకు తెచ్చాడు. అతని దృక్పథాన్ని అనుసరించి కల్పితేతివృత్తం గల్గి, రచనలో సౌలభ్యాన్ని సంతరించుకున్న భాణం తొలిది. ఆకాశ భాషితాదులలో కూడిన అది సంవాదాలను కూర్చుకొని వీథి అయింది. భాణం నుండి ప్రహసనం, వీథి నుండి అంకం ఉద్భవించాయి. ఆ తర్వాత క్రమంగా వ్యాయోగ, డిమ, ఈహామృగ, సమవాకార, ప్రకరణ, నాటకా లేర్పడ్డాయి. ఈ వాదంలో పై వాదంలో లాగా భాణ ప్రహసనాలకు మధ్య వీథి కనిపించదు. ఈ వాదమే సుసంగత మనిపించే అవకాశ మెక్కువ. భాణ ప్రహసనాల కున్న భేద మత్యల్పం కదా! భాణాన్నే ఈషత్పరివర్తనంతో ప్రహసనంగా చేయవచ్చును. చతుర్భాణిని అనువదించిన బాలాంత్రపు రజనీకాంతరావు తెర వెనుక పాత్రలకు కూడా రంగస్థల ప్రవేశాన్ని అనుమతించినారు. అది ప్రదర్శనలో ప్రహసనాత్మకమే అవుతుంది. కాబట్టి మంకడ్ నిర్ణయాన్ని మనఃపూర్తిగా అంగీకరించవచ్చు.

అయితే డా॥ రాఘవన్ అభిప్రాయం మరో విధంగా వుంది. వీరి దృష్టిలో వీథి తొలిది. "సంఘములోని వివిధవ్యక్తుల ఆచార వ్యవహారములను, మనస్తత్వములను, విశిష్ట సంప్రదాయములను అవహేళన చేయుటకై వీథి ఏకహార్యముగా జనించినది. ఆపై కొంత కాలానికి ద్విహార్యమయి ఏకహార్య మయిన వీథినుండి భాణం, ద్విహార్య

మయిన వీధి నుండి ప్రహసనం జనించాయి. వీథీ భాణ ప్రహసనాదులు క్రమముగా నాటకాంగము లైనవి. వీని క్రమపరిణామమే ప్రకరణమునకు దారి తీసినది. ఆపై వీరతా ప్రధానములయిన సమవాకార, ఈహామృగ, వ్యాయోగ, డిమములు క్రమముగా జనించి, తత్పుచ్ఛభూతముగా ఉత్సృష్టికాంక మేర్పడినది. తత్క్రమపరిణామమే నాటకము." ఇది రాఘవన్ అభిప్రాయం. ఈ అభిప్రాయంలో ప్రాథమిక దశలోనే వీథిని రెండు విధాలుగా చూడవలసి రావటమన్న విషయాన్ని వదలితే, మిగిలినదంతా సమంజసమే అనిపిస్తుంది. యథార్థానికి భాణానికి, వీథికి పాత్రసంఖ్యా స్వభావాల్లో తప్ప మిగిలిన ఏవిషయంలోనూ భేదం కనిపించదు. అయితే భాణాల్లో సర్వత్ర ఏకహార్యత, వీథిలో బహుపాత్రత కనిపిస్తోంది. కాబట్టి భాణానికి తొలి స్థానాన్ని, ప్రహసనానికి తర్వాతి స్థానాన్ని ఇవ్వవలసి వస్తుంది. ఈ క్రమంలో పరిశీలించితే భాణ వీథులను రెండింటిని ప్రాథమిక రూపాలుగానే అంగీకరించి, ఆతర్వాత దశ ప్రహసనానిది అనటం అసమంజసమేమీ కాదు. కాబట్టి దశరూపక క్రమ వికాసంలో ప్రహసనానికి ద్వితీయ స్థానాన్ని కానీ, తృతీయ స్థానాన్ని కానీ ఇవ్వవలసి వస్తుంది.

ప్రహసనం – కొన్ని రూపక భేదాలు

ప్రాచ్య పాశ్చాత్య రూపకోపరూపకాల్లో ప్రహసనానికి దగ్గరగా రాగలవి చాలా వున్నాయి. ఇతివృత్త రసాది దృష్టితో వాటితో ప్రహసనానికుండే సాదృశ్య వైదృశ్యాలను పరిశీలించవలసిన అవసరముంది.

ప్రాచ్య సాహిత్యంలోని ఉపరూపకాల్లో ప్రస్థానం, దుర్మల్లిక, కావ్యం, ప్రేరణం ప్రహసనానికి దగ్గరగా వుంటాయి.

ప్రస్థానం

ప్రస్థానం కైశికీ వృత్తియుతం హీనోపనాయకమ్ |
ఆపాన కేలి లలితం లయ తాలలయానుగమ్ ||
దాసాది నాయకం ద్వ్యంకం విటచేటాది నాయకమ్ |
ముఖ నిర్వహణోపేతం శృంగార తిలకం యథా || [1]

---

1 భావ ప్రకాశనము 9/80,81

ఈ ప్రస్థాన లక్షణంలో యథార్థానికి హాస్యరస ప్రసక్తియే కనిపించదు. అయితే దాని లక్షణాలను బట్టి పరిశీలిస్తే దానిలో హాస్యరసం చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. హీనోపనాయకత్వం, విటచేటాది నాయకత్వం సామాన్యంగా హాస్యానికి దారి తీసేవి. అందుకే ప్రస్థానం ప్రహసనానికి దగ్గరవుతుంది. అంతే కాదు. ఆపానకేళి కూడా ప్రస్థానంలో వుంటోంది. విటలక్షణాన్ని అనుసరించి చూస్తే విటుడు శృంగార నాయకుడుగానే కనిపిస్తాడు. కానీ విట శృంగార మనేక ప్రదేశాల్లో ఆభాసమై హాస్య రూపాన్ని పొందటం, లేదా హాస్య సహకారాన్ని ఎక్కువగా అభిలషించటం భాణాది సాహిత్యాన్ని పరిశీలించినపుడు స్పష్ట మవుతోంది. నాటకాల్లో సైతం విటపాత్ర ఎక్కువ భాగం హాస్య పోషణకే ఉపకారి అవుతోంది. ఆపానకేళి దానికి చేయూత నిస్తుంది. అయితే రచయిత ప్రయత్నపూర్వకంగా రచన సాగిస్తే హాస్యానికి తక్కువ అవకాశ మిచ్చి, ప్రస్థానాన్ని పూర్తి చేసే అవకాశముంది. అంటే భాణ, ప్రహసనాల కున్న సాదృశ్య వైదృశ్యాల వంటివే ప్రస్థాన, ప్రహసనాల కుంటాయి.

కావ్యం

కావ్యంతో ప్రహసనానికి ఇంతకన్న దగ్గర సంబంధం కనిపిస్తుంది. శారదా తనయుడు కావ్యాన్ని రెండు రీతుల్లో నిర్వచించాడు.[1] ఆ రెండు రీతుల్లో మొదటిది హాస్య పరిపోషణ విషయంలో ప్రహసనానికి దగ్గరవుతుంది. ఏకాంకమై, విటచేటాది సమన్వితమై, కులాంగనావేశయుతమై కావ్య ముంటుంది. హాస్యంతో గూడిన

---

1 కావ్యం సహాస్య శృంగారం సర్వవృత్తి సమన్వితమ్ |
సభగ్నతాళ ద్విపదీ ఖండమాత్రా పరిష్కృతమ్ ||
గర్భావమర్శ సంధిభ్యాం హీన మేకాంక మేవ చ |
క్వచిల్లాస్యయుతం వా స్యాత్ విటచేటీ సమన్వితమ్ ||
కులాంగనావేశయుతం లలితోదాత్త నాయకమ్ |
ఏవం ప్రకల్పయే త్కావ్యం తద్గౌడ విజయో యథా ||
విప్రామాత్య వణిక్పుత్ర నాయికా నాయకోజ్జ్వలమ్ |
ముదిత ప్రమదాభాషాచేష్టితైరంతరాంతరా ||
గ్రథితం విట చేటాది వేష భాషాభిరేవ వా |
ఏవంచ కల్పయే త్కావ్యం యథా సుగ్రీవ ఖేలనమ్ ||

భావ ప్రకాశనము 9/82-86

శృంగారం దీనిలో ప్రధానరసం అయితే ప్రహసనంలో హాస్యం ప్రధానమై శృంగార మంగ మవుతుంది. నాయక స్వీకార విషయంలో మాత్రం కావ్య ప్రహసనాలకు చాలా తేడా వుంది. కావ్య నాయకుడు లలితుడు, ఉదాత్తుడును. ప్రహసన నాయకులలో ఈ ఉదాత్తత సాక్షాత్కరింపదు. ఒకవేళ లలితోదాత్త నాయకుడితో ప్రహసన రచన సాగిస్తే, అది కావ్యానికి అత్యంత సన్నిహితంగా వుంటుంది. కాబట్టి కావ్యం ప్రహసనం కాకపోయినా ఉదాత్త ప్రహసన మనేందుకు మాత్ర మభ్యంతరం లేదు. ప్రాచీన ప్రహసనాల్లో ఉదాత్త ప్రహసనాలు మృగ్యమైన కారణంగా ప్రహసన మంటే అనుదాత్త నాయకాస్పదమన్న భావం గూడుకట్టుకొంది. హాస్య పోషణకు నీచపాత్రలే వుండ వలసిన అవసరం లేదు గదా! ఉదాత్త పాత్రల వలన నైనా హాస్యాన్ని రమణీయంగా, సున్నితంగా పోషించవచ్చును. H. H wilson తన Dramas గ్రంథంలో హాస్యరస విషయాన్ని సర్వాత్మనా పరిహరించి, కావ్యాన్ని నిర్వచించటం గమనించాలి-

The Kavya is a love story in one act interspersed with poetical stanzas and musical airs. The Yadavodaya is an example.

(Dramas P. 31)

దుర్మల్లిక

దుర్మల్లిక [1] ప్రస్థాన, కావ్యాలకన్న ప్రహసనంతో సన్నిహిత తర సంబంధం కలది. "The Durmallika is a Comic intrigue in four acts in each of

---

1 అథ దుర్మల్లికా నామ ప్రౌఢా నాగర నాయికా ।
చతురంకా చతుస్సంధిః గర్భసంధి వినా కృతా ॥
విటో విలసతి స్వైరం ప్రథమాంకే త్రినాడికాః ।
విదూషకో ద్వితీయాంకే విలసత్పంచ నాడికాః ॥
పీఠమర్దో విహరతి తృతీయే సప్త నాడికాః ।
విటాది త్రితయ క్రీడా చతుర్థే దశ నాడికాః ॥
చౌర్యరతిం ప్రతి భేదం యూనోరన్యోన్య వర్ణనం క్వాపి ।
యత్ర గ్రామ్య కథాభిః కురుతే కిల దూతికా రహసి ॥
మంత్రయతి చ తద్విషయం నృగ్జాతిత్వేన యాచతే చ వసు ।
లబ్ధ్వాపి లబ్ధు మిచ్ఛతి యా సా దుర్మల్లికా నామ్నా ॥
భావ ప్రకాశనము 9/128-132

which the friends of the hero and himself successively lead business." (Dramas P. 32) ఈ దుర్మల్లికలో ఏ అంకానికా అంకం ప్రత్యేకంగా నాయక నిర్దేశమున్నది. యథార్థానికి దుర్మల్లికను ఒక ప్రహసనమనే అనవచ్చు. అయితే దుర్మల్లికలో నాల్గు అంకాలున్నందువలన అది కొంచెం పెద్ద ప్రహసనంగా వుంటుంది. రూపకాల్లో ఏకాంకిక అయిన ప్రహసనంలో తప్ప మరెక్కడా హాస్యం అంగిలా లేదనే భావాన్ని దుర్మల్లిక తుడిచి పెట్టేస్తుంది. నాటికలు కూడా చతురంకాలే. కాబట్టి దుర్మల్లిక పరిమాణంలో చిన్నదనవలసిన అవసరం కూడా లేదు. దీనిలోని పాత్రలు విదూషకుడు, విటుడు, పీఠమర్దుడు కాబట్టి హాస్యానికేమి కొదవ లేదు. ఒక పీఠమర్దుడు తప్ప మిగిలిన ఇద్దరూ పూర్తిగా హాస్యానికి సహకరించెడి వారే. అయినా పీఠమర్ద ప్రాధాన్య మొక అంకంలోనే. మిగిలిన అంకాల్లో తప్పని సరిగా హాస్య ముండవలసినదే. కాబట్టి కొంచెం పెద్ద సైజు ప్రహసనంగా దుర్మల్లికను వ్యవహరించటం తప్పుకాదేమో! అంతేగాక కథాంశాలైన చౌర్యరతి, గ్రామ్యకథలు, ధనాశ మొదలైన వన్నీ హాస్య స్ఫోరకాలే. ఇది A Comedy of intrigue అని wilson చెప్పనే చెప్పాడు గదా!

రాసకం

రాసకం కూడా హాస్యప్రాయమే. నాయికా నాయకులలో ఇద్దరూ ఉదాత్తు లైనా, నాయకుని తెలివి తక్కువ వాడుగా వర్ణించటం రాసకలక్షణం. ఇది ఏకాంకిక. The Rasaka is a comic entertainment in one act, with five characters. The hero and heroine are of elevated rank, the latter is a suitable merit, the former a fool, the Anekamurta is a specimen (Dramas P. 31)

ప్రాచీన ప్రహసనాల లక్షణంతో పోల్చిచూస్తే ఇది ప్రహసనానికి అంత సన్నిహిత మైనదని అనిపించకపోవచ్చు గానీ, ఆధునిక ప్రహసనాలు ప్రాచీన లక్షణాన్ని చాలా రెట్లు పరిష్కరించవలసిన స్థాయిలో ఉదాత్త మార్గంలో ముందుకు సాగిపోతున్నాయన్న విషయాన్ని విస్మరించకుండా ఆలోచిస్తే, రాసకం కూడా ఒక ఉదాత్త ప్రహసనమే.

ప్రేరణం

హేమచంద్రుడు ప్రేరణం అనే రూపక భేదాన్ని వివరించాడు.

హాస్యప్రాయం ప్రేరణస్తు స్యాత్ప్రహేళికయాన్వితమ్[1] అని ప్రేరణ లక్షణం. ప్రహేళికలంటే పొడుపు కథల వంటివి. అటువంటి ప్రహేళికలతో గూడిన ప్రేరణం హాస్య రూపమయితే కావచ్చు గానీ రసానుభూతిని వెంటనే కలిగించలేదు. ఇక్కడ ప్రత్యేకించి చెప్పుకోవలసిన విషయ మొకటుంది. హాస్యోత్పత్తికి ఆలంబన మయ్యే విషయం ఎంత త్వరగా, ఎంత స్పష్టంగా అర్థమవుతుందో అంత ఎక్కువ ఫలితాన్ని పొందుతుంది. ఛలోక్తులు విన్న వెంటనే కలిగే హాస్యం, ఆనందం దాన్ని వివరించవలసి వస్తే కలుగవు. అంటే హాస్యంలో బుద్ధి చురుకుగా పనిచేయాలి గానీ మేధవల్ల ఉపయోగం తక్కువ. కాబట్టి ప్రేరణలో హాస్యమున్నా, అది ప్రహసనానికి దూరంగానే వుండే అవకాశా లెక్కువ. ప్రేరణ మేధావుల హాస్యానికి సంబంధించిన విషయమైతే ప్రహసనం సామాన్యజనుల కర్థమయ్యే హాస్యానికి ఆలవాలమైన రూపకం. Fuller హాస్య విషయంలో మేధావుల పాత్ర ఎలా స్థిరీకరించాడో చూడండి—

There are heads some times so little, that there is no room for wit, some times long that there is no wit for such room[2]

నాటక పూర్వ రంగానికుండే అంగాల్లో భారతీవృత్తి ఒకటి. ఈ భారతీ వృత్త్యంగాలలో ప్రహసనమొకటి.

భారతీ సంస్కృత ప్రాయో వాగ్వ్యాపారో నటాశ్రయః |
భేదైః ప్రరోచనాయుక్తైః వీథీ ప్రహసనాముఖైః ||[3]

అయితే ఈ ప్రహసనానికి గానీ, వీథికి గానీ ప్రత్యేక లక్షణమంటూ ఏదీ లేదు. దశ రూపకాల్లో ఒకటైన వీథియొక్క అంగాలను ఆముఖంలో స్వీకరించటం ద్వారా వీథి భారతీవృత్తికి అంగమైంది. ప్రహసనానికి వృత్త్యంగత్వమెట్లో విచారించవలసిన అవసరముంది. దశ రూపకాల్లో ఒకటైన ప్రహసనం యొక్క లక్షణాన్ని ఇక్కడ అన్వయించాలంటే కుదరదు. అది హాస్యైకప్రధానంగా అధమ పాత్రలతో సాగిపోయే రచన గదా! నాటకారంభంలోనే ఆ విధమైన హాస్యం వుండటం ఔత్సుక్యాన్ని కల్గించక పోవచ్చు. భరతుడు కూడా ప్రస్తావనాంగాలలో త్రిగతాన్ని ప్రతిపాదించాడు. అయితే అందులో విదూషక హాస్యానికి తావు కల్పించాడు.

---

1 కావ్యానుశాసనమ్ పు 293

2 The new dictionary of thoughts, P. 707

3 దశ రూపకమ్ 3/5

ప్రయోగ విషయానికి వస్తే ఏ నాటకంలోనూ ప్రహసనాన్ని పోలిన సన్నివేశ కల్పన ప్రస్తావనలో దృగ్గోచరం కాదు. మరి ప్రహసనం ఏ రీతిగా భారతీవృత్తికి అంగ మవుతుందో ఆలోచించాలి.

వీథి భారతీవృత్త్యంగ మన్నా, వీథ్యంగాలకే ప్రాధాన్య మిచ్చినట్లు ప్రహసన విషయంలో సైతం ప్రహసనాంగాలకు ప్రాధాన్యమిచ్చి భారతీవృత్తి కన్వయించవచ్చు. వీథ్యంగాల నన్నింటిని విద్యానాథుడు తన ప్రతాపరుద్రీయంలో ఉదాహరణ నాటకం లోని ప్రస్తావనలో నిరూపించాడు. అదే రీతిగా ప్రహసనాంగాలను స్వీకరించి ప్రస్తావనా రచన సాగించవచ్చు. అయితే ప్రస్తావనాంగాలను ప్రత్యేకించి చెప్పిన వ్యక్తి ఒక్క సింగభూపాలుడు మాత్రమే. రసార్ణవ సుధాకరంలో దశ విధాలైన ప్రస్తావనాంగాల నతడు చూపించాడు.

అవలగిత మవస్కందో వ్యవహారో విప్రలంభముపపత్తి శ్చ |
భయమనృతం విభ్రాంతి ర్గద్గదవాక్ చ ప్రలాపశ్చ ||[1]

కాబట్టి ప్రహసనాంగాలలోని ఏ కొన్నో భారతీ వృత్త్యంగ భావాన్ని స్వీకరిస్తాయి. అంతే తప్ప ఆ ప్రహసనానికి, దీనికి సంపూర్ణ సాదృశ్యం లేదు. అయితే ప్రయోగ దశలో ఈ ప్రస్తావనాంగాల నుపయోగించుట సకృత్తుగానే వుంది.

దశ రూపకాల్లో ఏకాంకికలయిన భాణం, వీథి, ప్రహసనం, ఈహామృగం - ఈ నాల్గింటికి చాలా సన్నిహిత సంబంధముంది. సూక్ష్మ భేదాలను బట్టి ఇవి భిన్న భిన్నాలైనా పారమార్థికమైన అంతస్తత్వం వీటిని బాగా దగ్గర చేస్తుంది. ప్రహసనంతో మిగిలిన మూడింటికి కల సాదృశ్య వైదృశ్యాలను పరిశీలిద్దాం.

భాణం

భాణ[2] ప్రహసనాలు రెండూ ఇతివృత్తపాత్రాది వ్యవహారాల్లో కొంచె మించుమించు సమానాలే. రెండింటిలోనూ ఇతివృత్తం కల్పితమే. ధూర్త, విట, వేశ్యా సంకులత్వం

---

1 రసార్ణవ సుధాకరము - 2/271

2 భాణస్తు ధూర్త చరితం స్వానుభూతం పరేణ వా |
యత్రోపర్ణయేదేకో నిపుణః పండితో విటః||
సంబోధనోక్తి ప్రత్యుక్తీ కుర్యాదాకాశ భాషితైః |
సూచయే ద్వీర శృంగారౌ శౌర్య సౌభాగ్య సంస్తవైః ||

రెండింటా సమానమే. వేశ్యా మనస్తత్త్వాలను, విట వేశ్యా సంబంధాన్ని, ధర్మాచార భ్రష్టులను వర్ణించి, అధిక్షేపించటంలో భాణ ప్రహసనాలు రెండూ తుల్యప్రాధాన్యాన్నే వహిస్తాయి. అయితే రస విషయంలో మాత్ర మీ రెండింటికి తేడా వుంది. భాణాలలో వీరశృంగారాలలో ఒకటి ప్రధానమని ఆలంకారిక నిర్ణయం. ప్రయోగ దశలో మాత్రం భాణాలన్నీ శృంగార ప్రధానాలుగానే కనిపిస్తాయి. వీరరస మక్కడక్కడ బిందు మాత్రంగా కనిపిస్తుంది. అది కూడా ఆభాసమైన సన్నివేశాలే ఎక్కువ.

శృంగారం కూడా సూచ్యమే గానీ దృశ్యం గాదు. అయితే ఆత్మాశ్రయభాణాలలో శృంగారం దృశ్యం కూడా కావచ్చు. ఆ శృంగారం కూడా భాణాలలో ఎక్కువ భాగ మాభాస రూపంతోనే సాక్షాత్కస్తుంది. ఆ కారణంగానే హాస్యానికి అది అవలంబన మయ్యే సదుపాయం చాలా వుంది. ఆ హాస్యంలో చమత్కారప్రాధాన్యం సుస్పష్టంగా వుంటుంది. అసంగతాలు, అసందర్భాలు అయిన విషయాలు, అధిక్షేపణలు, చెణుకులు భాణాలలో లెక్కకు మిక్కిలి. వీటికి శ్లేష కూడ సహకరిస్తుంది. ఇవన్నీ హాస్యానికంగాలే కాబట్టి భాణాలలో హాస్యం బాగానే పోషింపబడుతుంది. సూక్ష్మంగా భాణ సాహిత్యం లోని విశృంఖల శృంగారం సున్నితమైన హాస్యంగా పరిణమించినదనటం సత్య దూరం గాదు. ఇక పాత్రల సంఖ్య, ప్రదర్శన రీతుల్లోని భేదాలు భాణ ప్రహసనాలను వేరు చేస్తాయి. లేకుంటే భాణ ప్రహసనాలు రెండూ ఒకటే అనవలసి వస్తుంది. అంటే ఒకే విధమైన ఇతివృత్తాన్ని శృంగారం ప్రధానంగా, హాస్యం తదంగంగా మలిస్తే భాణమవు తుంది. హాస్యం ప్రధానంగా, శృంగారం తదంగ మంటే అది ప్రహసనంగా మారుతోంది.

ఇక వీథి[1] కూడా ప్రహసనానికి సన్నిహితమే. అయితే ప్రహసనాల్లో కనిపించే ఐక్యత్రయం (unity of time, unity of place, unity of action) వీథిలో కనిపించదు. unity of time మాత్రమే వుండేందుకు వీలుంటుంది. ఈ స్వల్పభేదం

భూయసా భారతీ వృత్తి రేకాంకే వస్తు కల్పితమ్|
ముఖ నిర్వహణే సాంగే లాస్యాంగాని దశాపి చ|| దశరూపకం - 3/40-51

1 వీథీ తు కైశికీవృత్తౌ సంధ్యంగాంకైస్తు భాణవత్ |
రసః సూచ్యస్తు శృంగారః స్పృశేదపి రసాన్తరమ్ ||
యుక్తా ప్రస్తావనా ఖ్యాతై రంగై రుద్ఘాత్యకాదిభిః
ఏవం వీథీ విధాతవ్యా ద్వ్యేక పాత్ర ప్రయోజితా || దశరూపకం 3/68-70

తప్ప మిగిలిన విషయాలలో వీథి ప్రహసనానికి సోదర తుల్యమే. భాణ మేక పాత్రమైతే, వీథి ద్విబహు పాత్ర హార్యమై ప్రహసనంతో పోటీకి వస్తుంది. అంటే ప్రహసనంలోని హాస్యహేతువైన ఇతివృత్తాన్నే తీసికొని లేదా హాస్య హేతువులైన అనేక కథాంశాలను స్వీకరించి, ఒకటికి మించిన పాత్రలు సంచరిస్తూ వర్ణించటం వీథి స్వరూపం. అందుకే నానా రసాశ్రయ మవుతుందది. అయితే శృంగార హాస్యాలకే ఎక్కువ ప్రాధాన్యాన్నిస్తూ వీథీ నిర్వహణం సాక్షాత్కరిస్తుంది. అంటే హాస్యానుబద్ధ మయిన శృంగారాన్ని పోషిస్తూ వీథి, శృంగారానుబద్ధమైన హాస్యాన్ని పోషిస్తూ ప్రహసనం వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటాయి. అంతే కాక వీథ్యంగాలలో[1] అనేకం హాస్యానుకూలములే అన్న విషయాన్ని మనమిక్కడ గుర్తించాలి. నాలిక, అసత్ప్రలాపం, ప్రపంచం, ఛలం, త్రిగతం, వ్యవహారం హాస్యస్ఫోరకాలైన వీథ్యంగాలే.

---

1 ఉద్ఘాత్యకావలగితే ప్రపంచ త్రిగతే ఛలమ్ |
వాక్కేల్యధిబలే గండ మవస్యందితనాలికే||
అసత్ప్రలాప వ్యాహార మృదవాని త్రయోదశ ||

దశరూపకమ్ 3/12, 13

అంతః ప్రహసనాలు

సామాన్యంగా లోకంలోని అనేకవిషయాల మాదిరి దశరూపకాలు కూడా పరస్పర సాంకర్యాన్ని కల్గి వుంటాయి. స్వల్ప పరిణామం గల రూపకాలు పరిమాణాధిక్యం గల రూపకాలలో తప్పనిసరిగ జొరబడుతూంటాయి. రూపకాల లోని క్రమవికాసం గూడా ఆ విషయాన్నే సూచిస్తుంది.

అభినవుడు 'దశరూపవికల్పన' పదాన్ని వ్యాఖ్యానిస్తూ దశరూపమంటే దశవిధ రూపకాలని అర్థం కాదని, దశవిధ రూపకాలు కలది అని వివరించాడు. అనగా రూపకాలలో - నాటకాదుల్లో కేవలం ఆ యా రూపకాంశాలే వుంటాయన్న నిశ్చయం కానీ, వుండాలన్న నియమం కానీ లేవు. అధికాంశాన్ని బట్టి ఆ యా రూపకాలకు నామ నిర్దేశం చేయటం జరుగుతుంది. కాబట్టి అధికంగానో, అల్పంగానో రూపక లక్షణాలకు ప్రయోగంలో సాంకర్యం తప్పదు.

వీనిలోనూ విశేషించి ప్రహసనాంశ మనేక రూపకాల్లో కనిపిస్తుంది. Dr. Raghavan అభిప్రాయాన్ని అనుసరించి దశ రూపకాలలో వీథి నుండి భాణం, భాణం నుండి ప్రహసనం రూపు దిద్దుకున్నాయి. నాటకాదుల్లో కలసి వీథి స్వరూపాన్ని కోల్పోయింది. భాణ, ప్రహసనాలు నాటకాల్లో కలిసినా స్వరూపాన్ని మాత్రం పూర్తిగా కోల్పోలేదు.

హాస్యరస పరిపోషణకు అవకాశమున్న అన్ని తావులలోనూ నాటకాలలో ప్రహసనాంశం కనిపిస్తుంది. విశేషించి ఆ రూపకం సమస్యాత్మక మయినపుడు, నాటకం గంభీరంగా సాగుతున్నప్పుడు సామాజికులకు ఉల్లాసాన్ని కల్గించేందుకై మధ్య మధ్య హాస్య సన్నివేశాలను కల్పించవలసి వస్తుంది.[1] సంస్కృత లాక్షణికులు ప్రత్యేకించి ఆ విధానాన్ని హాస్యపోషణ రీతిగా నిర్ణయించక పోయినా నాటకకర్తలు తమ నాటకాల్లో ఆ పద్ధతిని ఆదరించినవారే. అటువంటి హాస్య సన్నివేశాలు అనేక రూపకాల్లో కనిపించినా, విశిష్టంగా గుర్తించ దగినని కొన్ని నాటకాల్లో వున్నాయి.

---

1 Comic scenes were introduced to relieve seriosness of these mediaeval problem plays. The vice, a character pillion to the morality was allowed to enter between the scenes and amuse people with a humorous interlude.

A History of English literature P-95

వాటిని విడిగా తీసి పరిశీలిస్తే ప్రత్యేక ప్రహసనాలే అనిపించే అవకాశముంది. అటువంటి అంతః ప్రహసనాలను కొన్నింటిని చుద్దాం.

మృచ్ఛకటికంలో ద్వితీయాంకంలో కొంతభాగం - సంవాహకుడు రంగస్థలం పైకి వచ్చి, వసంతసేన ఇంటికి చేరేవరకూ ఉన్న భాగం - ఒక చక్కని ప్రహసనం. అట్లే అష్టమాంకం కూడా కొంచెమించు మించు ఒక చిన్న ప్రహసనం, శకారుడు వసంత సేనను హత్య చేసేంతవరకు. ఆ హత్య మినహా మిగిలిన భాగమంతా ప్రహసన ప్రాయమే.

ద్వితీయాంకంలోని సన్నివేశంలో comedy of Humours మరియు Farce కలయిక స్పష్టంగా కనిపిస్తుంది. మానవ మనస్తత్త్వాలలోని మౌలికలోపం వ్యసన పరత్వం. ఆ వ్యసనపరత్వాన్ని, దాని వలన కలిగే లాభనష్టాలను ప్రహసనాత్మకంగా చిత్రించటం ఈ ద్వితీయాంక స్వరూపం. అయితే చిత్రణలో అతిశయోక్తులు, రంగస్థలం మీదనే ఘర్షణలు, కొట్లాటలు, వాటి ఆభాసాలు కూడా చోటు చేసుకోవటంతో కొంత Farce (ఫార్స్) లక్షణాన్ని గూడా సంతరించుకుంది. Comedy of Humours కు ప్రవక్త అయిన Ben Jonson ను గూర్చి Hudson చెప్పినట్లుగ[1] శూద్రకుడికి కూడా సమకాలీన సమాజంలోని వ్యసనపరత్వాన్ని చిత్రించటం, తద్వారా కలిగే లాభనష్టాలను తెలియ జెప్పటమే లక్ష్యం. దాని కా అంకంలో శూద్రకుడు స్వీకరించిన పాత్ర సంవాహకుడు.

సంవాహకుడొక జూదగాడు. ఋగ్వేదంలోని అక్షసూక్తంలోని జూదగాడికి సోదరప్రాయు డితడు. జూదంలో దశ సువర్ణాలు అప్పుపడి పారిపోయి వస్తాడు. అతణ్ణి తరుముతూ మాథురుడూ, ద్యూతకరుడూ ప్రవేశిస్తారు. వాళ్ళ బారి నుండి తప్పించుకోవాలని సంవాహకు డొక ఎత్తు వేస్తాడు. ఒక పాడుబడిన గుడి కనిపిస్తే - దాన్లో దాక్కుంటాడు. అయితే అడుగుజాడలు కనిపించకుండా వుండేందుకై వెనక్కు నడుస్తూ వెళ్ళి, విగ్రహం వెనుక చేరతాడు. ఈ చేష్ట హాస్యస్ఫోరకం.

---

1 The world of comedy is not the world of romance, but the contemporary London life with its manners, types, foibles and affections -

An out line history of English literature P-66

అయితే మాథుర ద్యూతకరు లేమీ తక్కువ వాళ్ళు కారు. అక్కడే కూర్చొని ఆట ప్రారంభిస్తారు.

ఇక్కడ నుండి అసలైన హాస్యవాహిని ప్రవహిస్తుంది. వ్యసనపరుల మనఃస్థితి యొక్క పరాకాష్ఠ కనిపిస్తుంది. సంవాహకుడు తన మిత్రుల ఆట చూస్తూ సంయమనాన్ని కోల్పోతాడు. అక్కడొక ఎపిగ్రామ్[1] మనోహరంగా వుంటుంది.

కత్తాశబ్దో నిర్ణాణకస్య హరతి హృదయం మనుష్యస్య ।
ధక్కా శబ్ద ఇవ నరాధిపస్య ప్రభ్రష్ట రాజ్యస్య ॥[2]

సంవాహకుడు సంయమనాన్ని కోల్పోవటంలో అనేక విధాలైన నటనలను ప్రదర్శిస్తాడు. ఇక్కడ చేష్టామూలక మైన హాస్యం రమణీయంగా వుంటుంది. జూదాన్ని ఆడకూడదనీ, అది పతనావస్థ అనీ, అయినా కోకిలమధురమైన కత్తాశబ్దం హృదయాన్ని అపహరిస్తోందని అక్షసూక్తంలోని జూదగాడి వలెనే వాపోతాడు. ఇద్దరి ఆలోచనలూ చూడండి.

యదాదీధ్యే న దవిషాణ్యేభిః పరాయద్భ్యోఽవహీయే సఖిభ్యః ।
న్యుప్తాశ్చ బభ్రవో వాచ మక్రత ఏమీదేషాం నిష్కృతం జారిణీవ ॥
- అక్షసూక్తం

జానామి న క్రీడిష్యామి సుమేరుశిఖరపతన సన్నిభం ద్యూతమ్ ।
తథాపి ఖలు కోకిల మధురః కత్తాశబ్దో మనో హరతి ॥
- మృచ్ఛకటికమ్ 215

ఆ సందర్భంలోనే మాథుర ద్యూతకరులకు వివాద మేర్పడుతుంది. 'నాది, నాది' అని వారిద్దరూ వాదించుకొనే సందర్భంలో ఇక ఆగలేని సంవాహకుడు 'నాది' అంటూ ముందుకు దూకుతాడు. ఇద్దరూ యథాశక్తి సంవాహకుణ్ణి మర్దిస్తారు. ఆ సందర్భంలో తప్పించుకునేందుకు సంవాహకుడు గొప్ప ఉపాయాన్ని ఆలోచించి, ఆచరిస్తాడు. చూడండి.

---

1 A dwarfish whole, it's body brevity and it's soul wit - says Coleridge - Dictionary of Literary terms P. 230

2 మృచ్ఛకటికం 2/5

సంవా : అర్ధం తుభ్యం దాస్యామి, అర్ధం మే ముంచతు

ద్యూత : ఏవం భవతు

సంవా : (సభికముపగమ్య) అర్ధస్య గండం కరోమి, అర్ధమపి ఆర్యో ముంచతు

మాథు : కో దోషః? ఏవం భవతు.

సంవా : (ప్రకాశమ్) ఆర్య! అర్ధం త్వయా ముక్తమ్?

ద్యూత : ముక్తమ్

సంవా : (ద్యూతకరం ప్రతి) అర్ధం త్వయాపి ముక్తమ్?

ద్యూత : ముక్తమ్

సంవా : సాంప్రతం గమిష్యామి

వాళ్ళిద్దరూ చెరి రెండు సగాలు వదలివేశారు కాబట్టి రెండు సగాలు కలిపి పూర్తి వదలినట్లే అని ఇతని 'లాజిక్'- మరల ఘర్షణ -

ఆ సమయంలో దర్దురకుడు వస్తాడు. ద్యూత విషయంలో ఇతడు అభావ విరక్తుడు - జూదంలో అంతా పోగొట్టుకున్న వ్యక్తి. అందుకే తన అనుభవసారాన్ని అందరకీ పంచి పెట్టడానికి ఎంతో ప్రయత్నిస్తాడు. ఎలుకలు కొరికినట్లుండే ఉత్తరీయాన్ని ధరిస్తాడు. ఆ ఉత్తరీయం మడత పెట్టినపుడే శోభిస్తుందన్న నిర్ణయం తీసుకుంటాడు. తన తెలివితేటలన్నీ ఉపయోగించి సంవాహకుడు పారిపోయేందుకు సహకరిస్తాడు దర్దురకుడు. ఈ అంకాన్ని మృచ్ఛకటిక ప్రకరణం నుండి వేరుచేస్తే ఒక చక్కని ప్రహసనంగా మిగిలిపోతుంది.

ఈ మృచ్ఛకటికంలోనే ఎనిమిదవ అంకం మరో ప్రహసనం. బౌద్ధభిక్షువు (సంవాహకుడు), విటుడు, చేటుడు, వసంతసేన, శకారుడు - ఈ అంకంలో పాత్రలు. మూర్ఖుడూ, దుష్టుడూ అయిన శకారుడి ప్రవర్తన ఈ అంకంలో రాజ్యం చేస్తుంది. అది హాస్యాస్పద మవుతుంది. పునరుక్తులు, హేత్వాభాసాలు, ఉపమాభాసాలు, ఆత్మస్తుతి - ఆత్మనిందాకాత్మకాలైన వచనాలు మొదలైనవి ఎన్నో ఈ అంకంలో శకారుడి అవివేకదౌష్ట్యాన్ని ప్రకటిస్తాయి.

శకారుడు శిథిలాలైన గోడలమీదుగా ఎడ్లబండిని తోటలోకి ప్రవేశపెట్టమని తన సేవకుణ్ణి ఆదేశిస్తాడు. బండి విరిగిపోతుందనీ, తానూ ఎడ్లూ చనిపోవచ్చుననీ సేవకుడు చెప్పినా శకారుని అహంకారం వినిపించుకోదు. ఆ సంభాషణను గమనించండి.

చేట : భట్టారక! వృషభౌ మ్రియేతే. ప్రవహణమపి భజ్యతే - అహమపి చేటో మ్రియే.

శకార : అరే! రాజశ్యాలకోహమ్. వృషభౌ మృతౌ. అపరౌ క్రేష్యామి. ప్రవహణం భగ్నం, అపరం కారయిష్యామి. త్వం మృతః. అన్యః ప్రవహణ వాహకో భవిష్యతి.

ఇటువంటి అహంకార పూరిత తత్త్వాన్ని, తత్ఫలితాలను మనం చూడటం ద్వారా మనలోని అహంకారతత్త్వం ప్రక్షాళిత మవుతుంది. అయితే అది హాస్యం ద్వారా. Aristotle చెప్పినట్లు ఇక్కడ ఆనందం ద్వారా Katharsis (ప్రక్షాళన) జరుగుతుంది. ఈ హాస్యం వికృత మయితే కావచ్చు కానీ బాధాహేతువు గాదు. విమర్శగానే వుంటుంది గానీ హృదయాన్ని గాయ పరచదు.

ఆ తరువాత విపరీత వేష చేష్టల ద్వారా హాస్యాన్ని అందించే ప్రహసన శకలం నాగానందంలో కనిపిస్తుంది. మలయవతీ, జీమూతవాహనుల వివాహానంతరం తృతీయాంకంలో విట- చేట - చేటీ- విదూషకులతో ఈ సన్నివేశం నడుస్తుంది.

విటుడు సురాభాండాన్ని భుజాన వేసికొని చేటుడితో పాటు ప్రవేశిస్తాడు. నవమాలికాన్వేషణ అతని లక్ష్యం. అతడు త్రాగుబోతు. కాబట్టి దాని గొప్పతనాన్ని వర్ణింపక పోడు గదా ! అతనికి నచ్చిన ఇద్దరు దేవుళ్ళను ప్రకటిస్తున్నాడు, చూడండి

నిత్యం యః పిబతి సురాం ప్రియసంగమం చ యః కరోతి |
మమ తౌ ద్వావేవ దేవౌ బలదేవో కామదేవ శ్చ ||

అదే సమయంలో విదూషకుడు ప్రవేశించి భ్రమరబాధను భరించలేక రక్త వస్త్రాన్ని ముఖాన కప్పుకుంటాడు. ఆ వేషంలో అతణ్ణి చూచి, నవమాలిక అని భ్రమ పడతాడు విటుడు. నోటికి తాంబూలాన్ని అందివ్వబోతాడు. విదూషకుడు పెడమొగం పెడతాడు. నవమాలిక కోపించినదనే భావంతో కాళ్ళపై పడతాడు

విటుడు. అదే సమయంలో నవమాలికా ప్రవేశం. విటుడు సత్యాన్ని గుర్తించి, విదూషకుణ్ణి చేటుడి కప్పగించి, తాను నవమాలికను అనునయింపబోతాడు. విదూషకుడు పారిపోవాలని చేసే ప్రయత్నంలో యజ్ఞోపవీతం తెగుతుంది. నవమాలిక విదూషకుణ్ణి గౌరవించాలని ప్రోత్సహించగానే విటుడు విదూషకుణ్ణి కల్లుతో సన్మానించబోతాడు. చివరకు అదంతా పరిహాసమంటూ విదూషకుడికి క్షమాపణ చెప్పుకుంటారు.

యథార్థానికి ఇది ప్రహసన తుల్యమైనా ఇక్కడ సన్నివేశానికి తప్ప పాత్రలకు ప్రాధాన్యంలేదు. ఎవరినీ బాధించే మాటలు కానీ, విమర్శిస్తూ ఎత్తి చూపటం కానీ ఈ సన్నివేశంలో లేవు. విదూషకుడి అవైదికత్వాన్ని విమర్శించినట్లు కన్పించినా అది వైయక్తికమే గానీ సామాజికం గాదు. అంతే గాక, ఇది చేష్టా బహుళ మైనందువల్ల ఆ చేష్టలే హాస్య హేతువులు. కాబట్టి, చేష్టా సన్నివేశ ప్రధానం కాబట్టి ఇది ఫార్స్ (Farce).

ప్రబోధ చంద్రోదయం తృతీయాంకంలో మొదటి కొద్దిభాగం తప్ప మిగిలిన దంతా ఒక రమణీయ ప్రహసనం. దానిలోని పాత్రలన్నీ సాంకేతికాలు. బౌద్ధ, జైన, సోమ సిద్ధాంతాలకు ప్రతిరూపాలు. ఆయా పాత్రల ద్వారా ఆ సిద్ధాంతాల చర్చ, సదసన్నిర్ణయం- తదనుసర్తలలోని లోపాలను ఎత్తిచూపటం ఈ అంకంలోని విషయాలు. ఇది అధిక్షేపణాత్మక మయిన హాస్యమే. కామెడీ ఆఫ్ ఐడియాస్ (Comedy of ideas)[1] మరియు కామెడీ ఆఫ్ మోరల్స్ (Comedy of morals)[2] కు ఈ సన్నివేశంలో ప్రాధాన్యం.

జైన సిద్ధాంత ప్రతినిధిగా క్షపణకుడు, బౌద్ధ సిద్ధాంత ప్రతినిధిగా బౌద్ధ భిక్షువు, సోమ సిద్ధాంత ప్రతినిధిగా కాపాలిక, కాపాలకుడు ఈ అంకంలో పాత్రలు.

---

1 A term loosely applied to plays which tend to debate in witty and humorous passion, ideas and theories- Dictionary of literary terms P 137.

2 The morality is a drama in which the character allegorical, symbolical or abstract. The main purpose of the play being didactic. - A History of English literature P. 95

వీళ్ళతో కృష్ణమిశ్రుడు ఈ అంకంలో ఒక చక్కని ప్రహసనానికి రూపకల్పన చేశాడు. బౌద్ధ, జైన సిద్ధాంతాలు కఠిన నియమాలు గలవి. ఆ సిద్ధాంతాలు ఎంత గొప్పవో కాలక్రమంగా తదనుయాయులు అంత దిగజారిపోయినట్లు చరిత్ర సాక్ష్యం చెప్తోంది. బౌద్ధ విహారాల నన్నింటినీ భ్రష్టకేంద్రాలుగా చేయటం కనిపిస్తుంది. పాపం! పరోక్షంగా విషయ వాంఛలకు పరిష్కారాలను వెతుక్కుంటున్న బౌద్ధ, దిగంబర సిద్ధాంతానుయాయులకు సోమ సిద్ధాంతం ఒక దివ్యవర మనిపిస్తుంది. కాపాలికుడు సోమ సిద్ధాంతాన్ని ఎలా వివరించాడో చదవండి —

దృష్టం క్వాపి సుఖం వినా న విషయై రానంద బోధోజ్ఝితైః
జీవస్య స్థితిరేవ ముక్తి రుపలావస్థా కథం ప్రార్థ్యతే|
పార్వత్యాః ప్రతిరూపయా దయితయా సానంద మాలింగితో
ముక్తః క్రీడతి చంద్ర చూడవపు రిత్యూచే మృడానీపతిః|| 3/14

ఈ సిద్ధాంతం మహోన్నతంగా- కాపాలిక కౌగిలిని అనుభవించిన తర్వాత- భిక్షు, క్షపణకులకు కనిపిస్తుంది. అందుకే ఈ సిద్ధాంతానికి లొంగిపోతారు. అంతకు పూర్వం వారి పరిస్థితి బాగా బాధాకరమైనది. బౌద్ధ సిద్ధాంతానికి వారిచ్చిన అన్వయం ఆనాటి బౌద్ధమత హీన స్థితికి అద్దం పడుతుంది. చూడండి -

క్షణికాః సర్వ సంస్కారాః. నాస్త్యాత్మా స్థాయీ. తస్మాద్భిక్షుసు దారా నాక్రమత్సు నేర్షితవ్యమ్. చిత్తమలం హి ఈర్ష్యా నామ -

‘ధమ్మపదం’లో కాషాయానికి అర్హత ఎవరి కున్నదో చాలా స్పష్టంగా చెప్పటం జరిగింది.[1] కానీ కాషాయానికి అర్హతలేని వారందరూ బౌద్ధ భిక్షువులుగా మారి, ఆ సిద్ధాంతాలను చాకచక్యంగా హాస్యాస్పదంగా అన్వయించటాన్ని ఈ రచయిత చక్కగా ఆక్షేపించాడు. అంతే కాదు సంసారాన్ని పరిత్యజించి, బౌద్ధ విహారాలలో వుండే వ్యక్తుల సుఖమయ జీవితాన్ని ఎలా వర్ణించాడో చూడండి-

---

1 అనిక్కసావో కాసావం యో వత్థం పరిదహేస్సతి |
అపేతో దమసచ్చేన న సో కాసావ మరహతి||

ధమ్మపదం, యమకవగ్గో-9.

ఆవాసో లయనం మనోహర మభిప్రాయానురూపా వణిక్
నార్యో వాంఛిత కాల మిష్ట మశనం శయ్యా మృదు ప్రస్తరా |
శ్రద్ధా పూర్వ ముపాసితా యువతిభిః క్లప్తాంగ రాగోత్సవ
క్రీడానందభరై ర్వ్రజన్తి విలసజ్జ్యోత్స్నాకలా రాత్రయః || 3/9

వాఙ్మనః కరణాలను నియమించి, అధ్యాత్మరతుడైనవాడే భిక్షువు అని ధమ్మపదం[1] చెప్తూండగా, ఆ భిక్షు ధర్మాలను బౌద్ధులెలా దిగజార్చారో పై శ్లోకం చెప్తుంది.

కాపాలిక సిద్ధాంతానికి బౌద్ధ దిగంబరులు లొంగిపోయిన తరువాత కాపాలిక ఎంగిలి చేసిన సురను అందరూ త్రాగి, ఉన్మత్త ప్రలాపాలతో నాట్యం చేస్తారు. వికార చేష్టలన్నీ బాగా నవ్విస్తాయి. కర్తవ్యపరాఙ్ముఖత, అనే లక్షణానికి సరియైన అధిక్షేపణ ఈ సన్నివేశంలో వుంది. అందువలననే వారు పరిహాసాస్పదులు. వారి చరిత్ర ఒక ప్రహసనం.

నాగానందంలోని ప్రహసనంలా ఇది శుద్ధ స్వరూపం కాక, సమాజావగాహనను తదధిక్షేపణను కూడా తనలో నిబిడీకరించుకొని వుంది. మృచ్ఛకటికం లోని అష్టమాంకం, నాగానందంలోని తృతీయాంకం కేవలం 'ఫార్సు'లు. వాటి కన్న కొంచెం ఉదాత్త స్థాయికి చెందింది మృచ్ఛకటికంలోని ద్వితీయాంకం. ప్రబోధ చంద్రోదయం లోని తృతీయాంకం మాత్రం అధిక్షేపణాత్మకమైన ఒక రసమయ ప్రహసనం.

---

1 హస్తసఞ్ఞతో పాదసఞ్ఞతో వాచాయ సఞ్ఞతో సఞ్ఞతుత్తమో |
అజ్ఝత్తరతో సమాహితో ఏకో సన్తుసితో తమాహు భిక్ఖు ||
— ధమ్మపదం- భిక్ఖువగ్గో-3

ప్రహసనాలు

(FARCE)

ప్రహసన రూపక పరామర్శ చేయటంలో సంస్కృతాలంకారికులు ఆదరించిన ప్రహసన విభాగ మంతగా కార్యకారి కాదు. ఆధునిక కాలంలో సంస్కృత ప్రహసన రచన క్రొత్త పోకడలతో కొనసాగిపోవటం, ప్రాచీన ప్రహసన విభాగం లోని లక్షణాలు సంకీర్ణాలై, ఆయా ప్రహసనాలకు ఏకవిధత్వాన్ని కల్పించలేకపోవటం కారణం. ఇతివృత్త, పాత్ర, నిర్వహణాది విశేషాలలో ఆధునిక ప్రహసనాల తీరే వేరని ఇంతకు ముందే చెప్పబడింది గదా! పాశ్చాత్య రూపక ప్రక్రియయైన 'కామెడీ' లోని అనేక విభాగాలకు సరిపోలిన ప్రహసనాలు చాలా కనిపిస్తున్నాయి. కాబట్టి ఆయా విభేద విశేషాలను స్వీకరించి, ప్రహసనాలను పరామర్శించటం సముచితం.

ప్రాచ్య లాక్షణికులు చెప్పిన ప్రహసన లక్షణాలతో దాదాపుగా సరిపోగలది పాశ్చాత్యుల రూపక విభాగంలోని ఫార్స్ (Farce). 'ఫార్స్' లక్షణాన్ని పాశ్చాత్యు లీ విధంగా వివరించారు.

.... to provoke the spectator to laughter, not of the reflective kind which the comedy is intended to elicit, but the uncomplicated response of sudden appearance or disclosure, the mechanism suggested by many physical actions, repetitions, gross exaggeration of character and so on"[1]

ప్రహసనం (Farce) దాదాపు కథ మీదనే ఆధారపడుతుంది. సంఘటనలకు, వాటి పరిణామాలకు కొంతకు కొంత ప్రాధాన్య ముంటుంది. పాత్రలు కానీ, సంభాషణలు కానీ ప్రాణంలేని బొమ్మలే. ఇతివృత్తనిర్వహణకు ఆధారభూతాలు మాత్రమే.

ఈ సన్నివేశ కల్పనలోని అతిశయాన్ని ఆధారం చేసికొని, ప్రహసన రచయితలు (Farce) సభ్యతాపరిధులను అతిక్రమించి కూడా రచనలు సాగించారు. కొన్ని ప్రహసనా లయితే నలుగురిలో కలిసి చదువుకునేందుకు వీలుగాని స్థితిలో వుంటాయి. 'ఫార్స్' [Farce] కోవకు చెందిన ప్రహసనాలను ఈ అధ్యాయంలో ముందుగా పరిశీలిద్దాం —

---

1 Encyclopeadia of poetry and poetics. P 271.

దామక ప్రసహనం

ప్రహసన సాహిత్యంలో తొలిదనుటకు తగిన ఆధారాలు లేకపోయినా, కొందరు దీనిని భాసుని రచన మన్నందున ముందు దీన్ని గురించి ఆలోచించ వలసి వచ్చింది. నిజానికి 13 నాటకాలు రచించిన భాసుడే ఈ ప్రహసనాన్ని రచించాడని కొందరి వాదన. శ్రీ మానపల్లి రామకృష్ణకవి తమ ఉపన్యాసంలో ఇది భాసునిదని చెప్పినట్లుగ దీన్ని పరిష్కరించిన వేంకటరమణశర్మగారు తమ ముందుమాటలో చెప్పినారు. ఆ ప్రతిపాదనకు అనుగుణమైన కొన్ని కారణాలను వేంకట రమణశర్మగారు ఆ పీఠికలోనే సూచించినారు.

(1) My learned friend Mr. Ramakrishna Kavi, M. A has called this as the 14th play of Bhasa, in his lecture at the recent Oriental Conference held in Madras.

(2) But in matter and diction and Phraseology and plan, it bears a companionship to the thirteen works of Bhasa and to Bhagavadajjuka, Mattavilasa Prahasana and Kalyanasaugandhika. The facts that stage direction 'Nandyante tatah Pravisati Sutradharah' comes before the Nandi verse, that Sthapana appears to have taken to the place of Prastavana and that there appears no suggestion of names of the drama or the author in the Sthapana portion, taken together with the direction of the piece prove the similarities

వారు అక్కడ చూపించిన కారణాలు- 1. విషయ వివరణంలో భాస నాటక చక్రం, మత్తవిలాస ప్రహసనం, భగవదజ్జుకం మొదలగువానిని అనుసరించుట. 2. నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధారః - అన్న తరువాత నాందీపఠనం. 3. ప్రస్తావవనను స్థాపన అని పేర్కొనుట. 4. కవి కావ్యాది చర్చ ప్రస్తావనలో లేక పోవుట. ఈ కారణాలనే సంవదిస్తూ డాక్టర్ వీరబాలాశర్మ ఇది భాసకృతమే అని, బహుశః ప్రాథమిక దశలో వ్రాసినది కావచ్చుననీ తెలిపారు.

కాని యథార్థానికి భాసవిరచిత మనేందుకు తగినంత అవకాశం లేదు. ఇందున్న మాటలలో చాలా అవిమారక-చారుదత్త-స్వప్ననాసవదత్త-మత్తవిలాస ప్రహసనాల నుండి స్వీకరించ బడినవే. అట్లే కర్ణభారంలోని అనేక వాక్యాలిందులో కనిపిస్తాయి. దీనిలోనున్న నాలుగు శ్లోకాలలో ఒకటి కుమార సంభవంలోనిది,

మరొకటి కౌటిల్యుని అర్థశాస్త్రంలోనిది. కాబట్టి ఇది వాటినన్నింటి నాధారముగ చేసికొని కూర్చబడిన ఒక ఏకాంకిక మాత్రమే. ఈ విషయమున S. K. De అభిప్రాయంతో ఏకీభవించవచ్చు. The slight work looks like a selection of secnes or half scenes containing verses called from wellknown works and compiled for some kind of diversion[1]

ముద్రణలో ఇది నాలుగు పేజీలకు పరిమితమైనది. అందులో ఒక పుట నాందీ ప్రస్తావనలకు సంబంధించినది. అది —

సువర్ణపుష్పాం బ్రహ్మణీం బ్రహ్మణంచ కుశధ్వజమ్ |
సర్వాశ్చ దేవతా వందే వందే సర్వాంశ్చ తాపసాన్ ||

అని అర్థశాస్త్రశ్లోకంతో ప్రారంభమౌతుంది. ఆ తరువాత అవిమారక చారుదత్తాదుల ప్రభావంతో :

నటీ: ఆర్య! ఇయమస్మి త్వయా సహోద్యానవనం గన్తుకామా కః కాల స్త్వా మన్విష్యామి

మొదలగు వానితో ప్రస్తావన ముగుస్తుంది. ఆ పై దామక ప్రవేశం. ఈ దామక పాత్ర ప్రహసన పాత్రల వంటిదికాక విదూషక పాత్రను పోలినది. అభిజ్ఞాన శాకున్తల, చారుదత్తాది నాటకాలలోని విదూషక పాత్ర ప్రభావం దీనిమీద ఎక్కువ. ప్రభావం మాత్రమేకాక వాటిలోని వాక్యాలు-భావాలు చాలా ఉంటాయి. ఈ పాత్ర దాదాపు మిగిలిన ప్రహసన భాగంలో సగానికి పైగా, ఏక పాత్రాభినయంగా అభినయించి, నిష్క్రమిస్తుంది. ఆ తర్వాత కనిపించదు. ఆ తర్వాత కర్ణ పరశురామ ప్రవేశం. ఐదు మాటలతో సంభాషణ ముగింపు. వారి నిష్క్రమణం. వారి మాటలపై కర్ణభార ప్రభావం. అందలి శ్లోకార్ధం స్వీకరింపబడ్డాయి. వారి నిష్క్రమణం తర్వాత భరత వాక్యం-ప్రహసన సమాప్తి. ఇదీ దీని స్వరూపం.

ఇది ఏకాంకికయే కాని సంస్కృత రూపక లక్షణానికి విరుద్ధంగా ఒకే అంకంలో రెండుమూడుసార్లు పాత్రలన్నీ రంగస్థలంనుండి నిష్క్రమించటం - అదీ ఔచిత్య శోభితం కాకపోవటం ఇందులో కన్పిస్తుంది. పేరు దామక ప్రహసనం కాబట్టి దామక పాత్ర విరివిగ పోషించబడింది. కాని రూపక లక్ష్యం దామక

1 History of Sanskrit literature -P. 496.

ప్రహసనంగా కనిపించదు. ఆ లక్ష్యానికి, ఈ ప్రహసనానికి ఏకసూత్రత లేదు. ప్రధాన భావం దృశ్యం కాక కేవలం శ్రవ్యమైంది. అనగా భటులచే చెప్పబడింది. అధమ పాత్రలకూ, హాస్యప్రాయుడైన దామక పాత్రకూ కూడ ప్రాకృతంకాక సంస్కృతమే వాడబడింది. కనుక ఇది అర్వాచీనం కావచ్చు. "భాసుడు ప్రాకృతం నేర్చుకొనక ముందు అతిబాల్యంలో వ్రాసియుండవచ్చు" అనే మాట కూడ హాస్యాస్పదమైనదే. కనుక అర్వాచీన కాలంలో ఏ కవియో దీనిని అనేక కావ్యాలు చదివిన పాండిత్యం ద్వారా కూర్చియుండవచ్చును. అంతకు మించి దీని ప్రత్యేకత కన్పించదు.

లటక మేలకం

అర్వాచీన కాలంలో హాస్యార్ణవ ప్రహసనం వంటి అనేక ప్రహసనాలకు హాస్యనిర్మాణ రీతులలో దారి చూపిన ప్రహసనాలలో లటకమేలకం ప్రధానమైనది. రచనా సరళిని బట్టి ఇది ప్రహననమే (Frace) కానీ, ఇది ఒక అధిక్షేపణ రూపకంగా పనిచేసి, సమకాలీన సమాజాన్ని తీర్చి దిద్దాలని రచయిత లక్ష్యం.[1] సమాజం పట్ల బాధ్యతగల ఏ కవీ తాత్కాలిక సంఘస్థితిని చూచి నిమ్మకు నీరెత్తినట్లు నిలవ డనేందుకు లటకమేలక కర్త శంఖధరుడు ఉదాహరణం. ఇతడు 12వ శతాబ్దికి చెందినవాడు. కనోజ్ భూపాలుడైన గోవిందచంద్రుడికి సమకాలికు డితడు. ప్రాచీనాలంకారికుల నిర్ణయం ప్రకారం లటకమేలకలమ్ ఒక సంకీర్ణ ప్రహసనం. దీనిలో రెండంకా లుంటాయి. లజ్జా విక్రయం, దంతురాపరిణయం - అని విడివిడిగా రెండింటికీ నామనిర్దేశం కూడా చేశాడు రచయిత.

లజ్జా విక్రయం

ఒక వేశ్యాగృహం ఈ ప్రహసనానికి రంగస్థలం. ఆ వేశ్య పేరు దంతుర. ఆమె కుమార్తె మదనమంజరి. ప్రహసన కథకు మదనమంజరి కేంద్రబిందువు. సభాసలి అనే మహాపండితుడు కలహప్రియ అయిన (పేరు కూడా అదే) భార్యకు భయపడి, కులవ్యాధి అనే శిష్యుడితో దంతుర ఇంటికి వస్తాడు. కొంత సేపటికి మదనమంజరి గొంతులో గుచ్చుకొన్న చేపముల్లును తీసేందుకు జంతుకేతుపు

---

1 చిత్రం చరిత్రం స్థలిత వ్రతానాం శీలాకరః శంఖధరస్తనోతి |
విద్వజ్జనానాం వినయానువర్తీ ధాత్రీపవిత్రీకరణః కవీంద్రః ||

ప్రవేశిస్తాడు. విచిత్ర మైన ఆతని వైద్యవిధానాలు బాగా నవ్విస్తాయి. ఆపై జటాసురుడనే జైనాచార్యుడు, అజ్ఞానరాశి అనే కాపాలికుడు ఘర్షణ పడుతూ వస్తారు. సభాసలి వారి తగవును పరిష్కరిస్తాడు. అందరి కన్నులూ మదనమంజరి మీదనే. దానితో గొడవలూ, నిష్క్రమణలూ - ఇదీ లజ్జా విక్రయం.

దంతురా పరిణయం

ద్వితీయాంకంలో సంగ్రామవిసర మహారాజు ప్రవేశిస్తాడు. అతడి మిత్రుడు విశ్వాసఘాతకుడు. వారి సంభాషణ సమయంలో ఝకటకసారుని ప్రవేశం. సంగ్రామ విసరుడు ఝకటకసారుడి దగ్గర అప్పు పెట్టి, ఒక కుక్కను కొని, దానిని దంతురకు బహూకరించి ఉంటాడు. డబ్బివ్వమని అడుగుతున్న ఝకటకసారుడితో కొద్ది సేపు మర్షణ - మిథ్యాశుక్లుడు, పుంకటమిశ్రుడు ఒకరి తర్వాత ఒకరుగా ప్రవేశిస్తారు. వారి పరస్పరాధిక్షేపణలు, గొడవలు, కొట్లాటల తరువాత మిథ్యాశుక్లుని ధాటికి ఆగలేక పుంకటమిశ్రుడు కాళ్ళకు బుద్ధిచెపుతాడు. ఆపై చమరసేనవిహారంలో ఉండే వ్యసనాకరుడు ప్రవేశిస్తాడు. బౌద్ధ మతాధిక్షేపణ, వ్యసనాకర నిష్క్రమణం. చివరగా దిగంబరుడు దంతురను, సభాసలి మదనమంజరిని వివాహ మాడేందుకు ఒప్పందం, ముహూర్తనిర్ణయంముందు గందరగోళం, ప్రహసనసమాప్తి - ఇది దంతురాపరిణయం.

ప్రథమాంకాన్ని లజ్జావిక్రయమనీ, ద్వితీయాంకాన్ని దంతురా పరిణయమనీ అనటంలో ఒక చమత్కార ముంది. దంతుర వేశ్య కాబట్టి, ఆమె పరిణయాన్ని లజ్జా విక్రయం అననవసరం లేదు. ఆమె అంతకుముందే విక్రీతలజ్జ. ఇక లజ్జా విక్రయ మెవరిది? దంతురను పెండ్లాడిన వారిది కావలె. అనగా వేశ్య అయిన దంతుర సలజ్జ కాదు. సమాజంలో ప్రముఖులుగా వ్యవహరింపబడిన సభాసలి, దిగంబరాదులకు లజ్జ లేదు. ఇద్దరినీ సమానంచేసి పెండ్లి చేశాడు. ఈ యిద్దరిలో ఆలోచిస్తే దంతుర, మదనమంజరులనే ఉన్నతులు అనవలసి వస్తుందేమో!

ఇక ఇందలి పాత్రలూ, వాటి పేర్లు హాస్యాస్పదాలు. సమాజంలోని స్ఖలిత వ్రతుల చరిత్రను చెప్పటం కవి లక్ష్యం. కాబట్టి ఏదో ఒక విధంగా సామాజిక సంబంధం గల వ్యక్తులే ఎక్కువగా ఈ ప్రహసనంలోని పాత్రలు. పది మంది బాధ్యత తనమీద వేసికొన్న వ్యక్తిచేసిన తప్పు, ఏ బాధ్యతలేని వ్యక్తిచేసిన తప్పుకన్నా చాలా

పెద్దది. దీనిలో అందరూ సమాజ ప్రతినిధులే. దంతుర మదనమంజరులు కన్యలు, కానీ వీరు అస్ఖలితవ్రతలు. ఒక మహాపండితుడు - ఒక వైద్యుడు - ఒక జైన మతస్థుడు - ఒక కాపాలికుడు లజ్జా విక్రయం చేయటం హాస్యాస్పదం. పై వారందరూ సంఘంలో బాధ్యత గల వ్యక్తులు. అంతేకాదు ఒక గ్రామానికి అధిపతి, ఒక వేదార్థవేత్త, ఒక దార్శనికుడు, ఒక బౌద్ధుడు, ఒక సిద్ధాంతి ఘర్షణ పడుట మరీ హాస్యాస్పదం. ఈ ప్రహసనంలో కుక్కను అమ్మిన వ్యక్తి తప్ప మిగిలిన అందరూ సమాజానికి ఆదర్శ ప్రాయులు, మార్గదర్శకులు. కానీ వారే అపమార్గాన్ని ఆశ్రయించారు. అందుకే శంఖధరునికి వారి స్థలితవ్రతత్వాన్ని అధిక్షేపించవలసిన అవసర మేర్పడింది. ఇక వారి పేర్లు చూడండి - ఒకడు సభాసలి, ఒకడు జంతుకేతువు, ఒకడు ఝుకటకసారుడు, ఒకడు అజ్ఞానరాశి. సంగ్రామవిసరుడు రాజు. విస్వాసఘాతకుడు మిత్రుడు. ఝుకటకసారుడు కుక్క నమ్మినవాడు. మిథ్యాశుక్లుడు వేదాంత బోధకుడు. పుంకటమిశ్రుడు దార్శనికుడు. వ్యసనాకరుడు బౌద్ధుడు. జంగముడు సిద్ధాంతి. ప్రవర్తనానుగుణంగా పేరు పెట్టి, వ్యక్తిత్వాన్ని స్ఫురింపజేస్తూ, హాస్యాన్ని సృష్టించటం ప్రహసనకర్తలలో ఆధునికులకు, ప్రాచీనులకు కూడా సహజలక్షణం.

ఈ ప్రహసనంలో సన్నివేశ కల్పన హాస్యాస్పదం, హాస్యానుకూలం. యథార్థానికి ఆలంకారికు లన్నట్లు ఈ ప్రహసనంలో పంచసంధులకు అవకాశం లేదు. కేవలం వేశ్యకు అన్యునితో వివాహం. అది కూడ అనురాగపూరితం కాక కామపూరితం. కాబట్టి రసక్రమాభివృద్ధికి కానీ, పంచసంధ్యనుగుణంగా కథాభివృద్ధికి గానీ అవకాశం లేదు. అందుకే కథ ఉన్నచోటనే ఉండి పరిమాణాన్ని పెంచుకోవాలి. దానికి అనేక సన్నివేశాలు, అనేక పాత్రలు దోహదం చేస్తాయి. కాబట్టి ఎక్కడి కక్కడ ఏ సన్నివేశానికి ఆ సన్నివేశం ఆయా పాత్రలనే ఆలంబనం చేసికొని హాస్యాన్ని సృష్టిస్తుంది. అంటే ప్రాకరిణిక హాస్యం బాగా కనిపిస్తుంది.

ఇక ప్రాచీనులన్నట్లు వికృతవేష, చేష్టా, వచనాల హాస్యం ఇందులో ముమ్మార్తులా కనిపిస్తుంది. వికృతవేష వర్ణనను చూడండి —

భుజంగదంశవ్యసనాకులాయాః దన్తా బహిర్గా ఇవ దంతురాయాః |
బంధానుసంధానపరా యదీయా పాశోపమా వల్గతి కర్ణపాలీ ||

ప్రథమాంకం —15

అయితే ఈ రచయిత దంతుర వర్ణనలోనే వాచ్యం కాకుండా చక్కని భావంతో హాస్యాన్ని ధ్వనింపజేయగలడు కూడ.[1] ఇంతకు మించి వేష గత హాస్య మీ ప్రహసనంలో కనిపించదు. ఏ పాత్ర విషయంలో అయినా అంతర్ధర్మాన్ని వర్ణించటానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని బాహ్యవేషవర్ణనకు ఈ కవి ఇవ్వడు. ప్రతిపాత్ర ప్రవేశించే సమయంలో వారి స్వభావాన్ని వివరంగా వర్ణిస్తాడు, కానీ స్వరూపాన్ని క్వాచిత్కంగానే ప్రదర్శిస్తాడు.

చేష్టాగతమైన హాస్యం కూడా ఇక్కడ కొద్దో, గొప్పో కనిపిస్తుంది. అయితే ఈ చేష్టలు సున్నితమైనది కావు. లజ్జావిక్రయంలో ఝుకటకసారుడు కర్ర పుచ్చుకొని అందరినీ తరమటం, దంతురాపరిణయంలో చతుర్వేద దిగంబరులు కలహోకులులై నృత్యం చేయటంలో మాత్రమే చేష్టా గత హాస్యాలు కనిపిస్తాయి. ఒకచోట చేష్టా వర్ణన ద్వారా హాస్యం కల్పించబడుతుంది. భార్యాభర్తల కలహంలో భార్య భర్తను తరిమివేసిన విధానాన్ని కులవ్యాధి వర్ణిస్తాడు. అవి ఆ సమయంలోని చేష్టలు. ప్రకృతం వర్ణనాత్మకాలు. “అయే దన్తురే! అద్యైవ కలహప్రియయా సమ మేతేషాం దశనాదశని, నఖానఖి, కరచరణ నిర్బంధభీషణో మహాహవః సంవృత్తః. తతో దర్వీఖండేన, తతోఽలాతఖండేన, తతః పీఠికయా, తతో హండికయా ఏష ఉపాధ్యాయః హత్వా నిస్సారితః - [P-12]. ఇది Domestic comedy శకలం. అయితే దీని ప్రదర్శనలో నట దర్శకుల నేర్పుకొలది చేష్టాగత హాస్యాన్ని సృష్టించుకోవచ్చు. నిజానికి చేష్టాగత హాస్యం కవి ప్రతిభ మీదకన్నా దర్శక నటుల ప్రతిభ మీదనే ఎక్కువ ఆధారపడి ఉంటుంది. ఇక మిగిలినదంతా - ప్రహసనాన్ని సంపూర్ణంగా ఆక్రమించినది - వాగ్గతమైన హాస్యం. దీనిలో అనేకవిధాలైన హస్యాలు కనిపిస్తాయి. కొన్ని ఛలోక్తులు, కొన్ని అలంకారాభాసాలు, కొన్ని గూఢోక్తులు, కొన్ని ప్రగల్భాలు, కొన్ని వికారాలు, కొన్ని నర్మోక్తులు, కొన్ని యథార్థోక్తులు, కొన్ని వ్యతిరేకోక్తులు, శాస్త్ర ప్రహాసాలు, శాస్త్ర వికారాలు, అనుచితాశీస్సులు మొదలగునవి ఎన్నో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. అంతకు ముందుగా ఆలోచిస్తే ఇది రసాభాసం కాబట్టి ఆద్యంతమిది అలా భాసిస్తూనే ఉంటుంది. హాస్యం ప్రధానంగా అనౌచిత్యం మీద ఆధార పడుతుంది.

---

1 అంతర్నిమగ్నం నయనద్వయేన క్వచిత్ప్రయాతం నవయౌవనేన |
భగ్నౌ కపోలౌ పతితం కుచాభ్యాం మన్యే భయాన్మన్మథ సాయకానామ్ ||

ఆ అనౌచిత్యం రసంలో కనిపిస్తే అది రసాభాసమై విశేషంగా నవ్విస్తుంది. దంతురా మదనమంజరులు వేశ్యలు. ఆ యిద్దరితో ప్రత్యక్షంగా అనేకులు అనేక విధాలుగా ప్రవర్తించటం రసాభాసం. వారిలో ఏ ఒక్కరు కూడ అటువంటి ప్రణయానికి అర్హులు కారు. కాబట్టి అనుచిత ప్రణయానికి వారు పాల్పడటం రసాభాసం. పతివ్రతయైన దంతురతో సరసాలాడడం మరో విధంగా రసాభాసం. అది చివరగా సభాసలి మదనమంజరినీ, దిగంబరుడు దంతురనూ వివాహ మాడటంతో పరాకాష్ఠకు చేరుతుంది. అది ఆ స్థితికి చేరేవరకూ మధ్యనున్న మార్గమంతా హాస్యమయమే. దోషాన్ని గుణంగా వర్ణిస్తూ ప్రగల్భాలు పలకట మీ ప్రహసనంలో ఎక్కువగా కన్పిస్తుంది. తనను తానే వర్ణించుకొన్నా, ఇతరులెవరైనా వర్ణించినా ఈ ప్రాగల్భ్యం తప్పని సరిగా హాస్యాస్పద మౌతుంది. మిథ్యాశుక్లుని పరిచయాన్ని పరిశీలించండి.

పరధన నివిష్ట దృష్టిః మిథ్యాశుక్ల స్తమోమయో జగతి |
సితదశన కిరణ ధోరణీ ధౌత దిగన్తః పరిస్ఫురతి ||

అపి చ -

బ్రహ్మణ్యదర్ప పరిమృష్ట విరించిలీలః
శంభోరపి వ్రత విధా వుపహాస శీలః |
కూపాంబు ధౌతకపిలాంబర వేషవర్తీ
దంభ ప్రియః స్ఫురతి వంచక చక్రవర్తీ ||

ఈ రెండవ శ్లోకంలో మొదటి మూడు పాదాలు అతన్ని ఆకాశాని కెత్తు తున్నట్లుగా కనిపిస్తాయి. అయితే నాలుగవ పాదం చదివిన వెంటనే మనకు నవ్వు తెప్పిస్తూ అతడు పాతాళంలోకి పడిపోతాడు. సర్వ పాత్రల పరిచయ మిదే రీతిన కొనసాగుతుంది. తనంతతానే తెలివి తక్కువతనాన్ని గుణంగా చెప్పుకోనే శ్లోకాన్ని చూడండి -

వ్యాధయో మదుపచారలాలితాః మత్ప్రయుక్త మమృతం విషం భవేత్ |
కిం యమేన సరుజాం కిమౌషధైః జీవహర్తరి పురస్థితే మయి ||

ఇది జంతుకేతు వైద్యుని వాక్యం. అతని వైద్యవిధాన మంతా హాస్య హేతువే. అతని పాత్ర పోషణ చక్కని చమత్కారాన్ని సృష్టిస్తుంది.

అతని వైద్య సూత్రాన్ని చూడండి —

యస్య కస్య తరోర్మూలం యేన కేనాపి పేషయేత్ |
యస్మై కస్మై ప్రదాతవ్యం యద్వాతద్వా భవిష్యతి ||

ఇక కొన్ని ఉక్తిమూల హాస్యాలను పరిశీలించుదాం-

సభాసలి, జంతుకేతు, కులవ్యాధుల సంభాషణ చూడండి -

సభా : అద్యేహ హాట్టే రోదన కలకలః సంవృత్తః. తత్ర కిం భవదుపదారః సంజాతః?

జంతు : నహి నహి, భవద్భి రేవ యది తత్ర స్వస్త్యయనం కృతం స్యాత్

సభా : నహి నహి

కుల : ఆర్యౌ! యది యువాం ద్వావపి తత్ర న గతౌ తత్ కిం వజ్రేణ మారితో వణిక్ తనయః?

ఇది చక్కని గూఢోక్తి. సభాసలి, జంతుకేతుల ప్రభావాన్ని కులవ్యాధి ఒక్క మాటలో తేల్చివేశాడు. అట్లే జంతుకేతువు, దంతురల సంభాషణ చూడండి- దంతురకు చూపు సరిగా ఆనటం లేదంటే జంతుకేతువు మందివ్వబోతాడు.

జంతు : కియద్దూరం పశ్యసి ?

దంతు : వటవృక్షం తావత్

జంతు : అత్ర వటవృక్షోఽప్యస్తి కిమ్ ?

అందరికీ శకునం చెప్పే బల్లి కుడితి తొట్టిలో పడితే చేసేదేముంది ?

దంతురా దిగంబరుల వివాహం నిశ్చయమైన సన్నివేశం నుండి మరో హాస్యపు మెరుపు మెరుస్తుంది. చతుర్వేదుడు జ్యేష్ఠా నక్షత్రంలో శనైశ్చరాధిష్ఠితమైన ధనుర్లగ్నంలో వివాహముహూర్తాన్ని నిర్ణయిస్తాడు. వెంటనే సభాసలి- తత్రైవ వైధవ్యం ధ్రువం- అంటాడు. అప్పుడొక హేత్వాభాసను చూడండి. "ఉపరితనభాగే యదా వైధవ్యం తదా కో దోషః." సభాసలి వెంటనే అంగీకరిస్తాడు.

వెంటనే చతుర్వేదుడు వారిని ఆశీర్వదిస్తాడు. ఇది అనౌచిత్యానికి తుది మెట్టు -

జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ |
తస్మా దపరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి ||

ఎట్టకేలకు వారి వివాహం పూర్తయింది. సభాసలి వధూవరులకు రెండు గ్రామాలు బహూకరిస్తాడు. అప్పుడు చతుర్వేదుడు సభాసలితో వారి కార్యాన్ని గురించి ముచ్చటిస్తాడు -

చతు: భోభో ఉపాధ్యాయ! యావదాభ్యాం లీలాగారే రతి ర్నదీయతే తావత్ కుతో యౌతుక కౌతుకమ్ –

ఆ మాటకు సభాసలి అంగీకరిస్తాడు. వెంటనే దానిని ఒప్పుకుంటూ ఒక అంతరర్థాన్ని చూపిస్తాడు. అది ఆభాసమై అర్థాంతరన్యాసాభాస మూలకంగా హాస్యాన్ని సృష్టిస్తుంది – చూడండి -

ఏతయో రత్ర కౌతుకాగారే మహాశయ్యా క్రియతామ్. యో యత్ర మ్రియతే తస్య తత్రైవ దాహో యుక్తః ।

ఈ రీతిగా లటక మేలకం చక్కని ప్రహసనంగా రూపొందింది. వీటితో బాటు జైన, బౌద్ధ, కాపాలిక మతాలను విమర్శించటం ఆనాటి ఆయా మతస్థుల దుస్థితిని పట్టి చూపుతుంది. ఆయా ప్రవక్తల అభిప్రాయాలకు వీరు వికృతార్థాలు కల్పించటం నవ్వుతో బాటు జాలిని కూడ కల్గిస్తుంది. అంతేగాక శాస్త్ర పాండిత్యాదులను, ఆసంబద్ధ వైద్యాలను, వారి విధానాలను విమర్శించుతూ సమకాలీన సమాజానికీ ఈ ప్రహసనం అద్దం పడుతుంది. ఈ ప్రహసనంలో మదనమంజరీ వర్ణనవ్యాజంతో ఎక్కువగా శృంగార వర్ణన జరుగకుండా ఉన్నట్లయితే, ఇంకా చక్కని సెటైర్ (Satire) గా రూపొంది ఉండేది.

భగవదజ్జుకం

బోధాయన కవి రచితమైన ఈ ప్రహసనం శుద్ధ ప్రహసన కోటికి చెందుతుంది. ఆ మేరకు సింగభూపాలుడు రసార్ణవ సుధాకరంలో ఉదాహరిస్తాడు.[1] ఈ ప్రహసన రచనా కాలంలో అభిప్రాయ భేదాలు అనంతాలు. మత్త విలాస ప్రహసనం కన్నా యిది ప్రాచీన మైనదని (అనగా క్రీ.శ. 6వ శతాబ్ది) కొందరి అభిప్రాయం. మరి కొందరు 12వ శతాబ్దికి చెందిన దానినిగా అభిప్రాయపడుతున్నారు. వ్యాఖ్యలు, టీకలు కూడ ఉండట మీ ప్రహసనం యొక్క ప్రాశస్త్యాన్నీ, రసవత్తనూ తెలియ జేస్తుంది.

---

1 శుద్ధం కీర్ణం వైకృతం చ తచ్చ ప్రహసనం త్రిధా ।
శుద్ధం శ్రోత్రియ శాఖాదే ర్వేష భాషాది సంయుతమ్ ॥
ఆనందకోశ ప్రముఖం తథా భగవదజ్జుకమ్ ॥
చేట చేటీ జనవ్యాప్తం కీర్ణం లక్ష్యం నిరూప్యతామ్ ।

ప్రస్తావనలో సూత్రధారునకు విదూషకుడు సహకరించడం, అంతేగాక దశరూపకాలలో ప్రహసనమే ప్రధానమన్నట్లు పలకడం[1] కూడ ఇతనికి హాస్య రసంపై గల అభినివేశాన్ని, ఆసక్తిని తెలియజేస్తాయి. అయితే ఇతడు ప్రహసనాదు లన్నీ నాటక ప్రకరణాదులనుండి ఆవిర్భవించిన వనడం విమర్శకు లొప్పని విషయం.

పరివ్రాజకుడు, అతని శిష్యుడు శాండిల్యుడు రంగస్థలం మీదకు రావటంతో ప్రహసనం ప్రారంభమౌతుంది. అనేక విషయాలను గురించి వారిరువురి వాద ప్రతివాదనలతో చాలా ప్రహసనం నడుస్తుంది. అయితే విచిత్ర మేమిటంటే ఇందలి పరివ్రాజకుడు ఇతర పరివ్రాజకులవలె కుహనా వ్యక్తిత్వం కలవాడు కాదు. శిష్యుడు మాత్రం బుభుక్షితుడై శిష్యత్వాన్ని స్వీకరించినవాడే. ఆధునిక కాలంలోని నాటికలలా కాక ఇది ఏకాంకిక. దీనిలో కాలైక్యం, స్థలైక్యం కనిపిస్తాయి. అయినా గురుశిష్యుల సంవాదాంతం వరకు ఒక ముక్కగా దీనిని పరిగణింపవచ్చును.

ఇంతవరకు సాగిన హాస్యంలో అనేక రీతులు గోచరిస్తాయి. ప్రధానంగా కవి వాటిని సృష్టించటంలోని ఆంతర్యాన్ని గ్రహించాలి. ఇతర ప్రహసనాలలో కుహనా తత్త్వాలనే ఉదాత్తులకు అంటగట్టటం హాస్యకారణమైంది. అయితే ఆ పరిస్థితిని చక్కదిద్ది, వారి విలువను కాపాడటం కోసం బోధాయనుడు ఇట్లు సృష్టించి యుండవచ్చును. అంటే ఇతరరచయితలు విరక్తులు ఎలా ఉండకూడదో తెలియ జేస్తే భోదాయనుడు ఎలా ఉండాలో తెలియజేసినట్లయినది. అయితే అది పూర్వపక్ష, సిద్ధాంతాలకు లొంగితే అందంగా ఉంటుంది. కాబట్టి ఆయా తత్త్వాలనూ, సిద్ధాంతాలనూ అధిక్షేపించేందుకు శాండిల్యుని పాత్రను స్వీకరించాడు. గురువు గారెంత విడమర్చి చెప్పినా శాండిల్యుడు దానిని అంగీకరించని స్థితిలో ఉంటాడు. నిరూపించ గల అవకాశం పరివ్రాజకునకు కావాలి. అలా ఇవ్వటం, నిరూపించటం కవి కభిమతం-

దాని కోసమే రెండవముక్క ప్రారంభ మౌతుంది. ఒక గణిక తన ఇద్దరు చెలికత్తెలతో తోటకు వచ్చి గానం చేస్తూ ఉంటుంది. శాండిల్యుడు దాని ప్రభావానికి

---

1 నాటక ప్రకరణోద్భవాసు పాతేహామృగడిమ సమవకార వ్యాయోగ భాణ సంలాపక వీథ్యుత్సృష్టికాంక ప్రహసనాదిషు దశజాతిషు నాట్యరసేషు హాస్యమేవ ప్రధాన మితి పశ్యామి, తస్మాత్ప్రహసన మేవ ప్రయోక్ష్యామి - ప్రస్తావనా.

లొంగుతాడు. పరివ్రాజకుడు నివారించే ప్రయత్నం చేస్తాడు. ఆ సమయంలో యమభటుడు ప్రవేశిస్తాడు. గణిక జీవితకాలం పూర్తయినందున ఆమెను తీసికొని రమ్మని యముని ఆదేశం. దానికై అవకాశాన్ని చూస్తూ యమభటుడు సర్పంగా మారుతాడు. ఆమెను కాటువేస్తాడు. ఆమె మరణిస్తుంది. శాండ్యిల్యుడు ఆమె మృతికి దుఃఖిస్తాడు. ఆమెను స్పృశిస్తాడు. అయితే గురువుగారు ఎప్పటికప్పుడు వారిస్తూనే ఉంటారు. అభిప్రాయాలు భేదిస్తాయి. ఆ సమయంలో పరివ్రాజకుడు శాండిల్యునికి యోగశాస్త్రంపై విశ్వాసం కలిగించేందుకు, తాను తన శరీరాన్ని పరిత్యజించి, పరకాయ ప్రవేశ విద్య ద్వారా గణికా శరీరంలో ప్రవేశిస్తాడు. ఆమె లేస్తుంది. ఆమె మాటలు, ప్రవర్తనలు పరివ్రాజకుని బోలి ఉంటాయి. అందరూ ఆశ్చర్యపడుతారు. ఆమెకు వైద్యం చేయడానికి వచ్చిన వైద్యుడు కూడ తికమక పడి, వెళ్ళిపోతాడు. ఆ సమయంలో యమభటుడు మరల ప్రవేశిస్తాడు. తాను చేసిన తప్పు తెలిసికొని గణికను పునరుజ్జీవికను చేయాలని వస్తాడు. అయితే ఆమె శరీరంలో పరివ్రాజకుని ఆత్మ ప్రవేశించి ఉండడాన్ని చూచి, అతను కూడ కంగారు పడి, ఆమె ఆత్మను పరివ్రాజకుని శరీరంలో ప్రవేశ పెడతాడు. పరివ్రాజకుడు లేచి గణికవలె ప్రవర్తన ప్రారంభిస్తాడు. ఆ సమయంలోనే శాండిల్యుడు - నైవ భగవాన్, నైవ అజ్జుకా. అథవా భగవదజ్జుకమ్ నా మేదం సంవృత్తమ్- అని భగవదజ్జుకాన్ని వివరిస్తాడు. ఈ ప్రహసనం సాగుచుండగా మరల యమభటుడు ప్రవేశించి, పరివ్రాజకుని (గణిక శరీరంలో ఉన్న వానిని) ప్రార్థించి, ఆ శరీరం వదలగానే గణిక ఆత్మను ఆ శరీరంలో ప్రవేశపెట్టి, పరివ్రాజకుడు మరల తన శరీరంలో ప్రవేశించే అవకాశాన్ని కల్గిస్తాడు - ఇదీ కథ.

ఈ ప్రహసన మితర ప్రహసనాలవలె కథాబలం, సన్నివేశబలం లేక కేవలం మాటల మీదనే హాస్యం సృష్టించే రకం కాదు. కథాకల్పనలోనే ఇందు హాస్యం నిబిడీకృతమై యున్నది. అంతేగాక, సన్నివేశకల్పన కూడ ఇందుకు సహక-రిస్తుంది. గురు శిష్యుల సంవాద సన్నివేశం తప్ప, మిగిలిన సన్నివేశాలన్నీ స్వల్ప పరిమితి కలవై, ఉత్సాహ పూరిత వాతావరణంలో హాస్యాన్ని సృష్టిస్తాయి. ఆ గురు శిష్య సంవాద సన్నివేశం కూడ ఉక్తి చమత్కృతి కలిగినది. కాబట్టి చక్కని హాస్యాన్ని అందజేయ గలుగుతుంది. కనుక ప్రాకరణిక హాస్యానికి ఈ ప్రహసనం పెట్టింది పేరు.

ఇతర ప్రహసనాలవలె ఈ ప్రహసనముదాత్తతను కోల్పోలేదు. అంతే కాదు. నిరభ్యంతరంగా, నిస్సంశయంగా ఎక్కడైనా, ఎప్పుడైనా ప్రదర్శించడానికి కానీ, ఎవ్వరైనా చదవడానికి కానీ ఇది అనుకూలంగా ఉంటుంది. ఉక్తి వైచిత్రిలో కానీ, సంభాషణలలో గానీ అనౌచిత్య స్ఫూర్తి కనిపించదు. కాబట్టి ఇది ఉదాత్త హాస్యంగా పరిగణింపబడింది. అందుకే సింగభూపాలుడు దీనిని శుద్ధ ప్రహసనాలలో చేర్చాడు. లటకమేలక, హాస్యార్ణవ ప్రహసనాదులలో వలె ఈ ప్రహసనంలో కూడ వైద్యుని పాత్ర కనిపిస్తుంది. అయితే పాత్ర చిత్రణ మాత్ర మా ప్రహసనాలలో వలె ఉండదు. ఈ ప్రహాసనంలోని ఉదాత్తత వాటిలో ఏకోశానా కనిపించదు. వైద్య పాత్ర ప్రవేశం రెండు మార్లు జరగడం ఇందులో గమనింపదగిన అంశం. గణికా వేషంలో ఉన్న పరివ్రాజకుడు ఆ వైద్యునితో సర్ప, సర్ప విషాదుల భేదాలను గూర్చి చర్చించే సన్నివేశం మృదుహాస్యాన్ని అందిస్తుంది.

పరివ్రాజకుడు (గణిక) సర్ప భేదాలను వివరించ మంటాడు. వైద్యుడు శ్లోకం కొంత చెప్పి మరచిపోయి “పుస్తకం – పుస్తకం” అని అరుస్తాడు. వెంటనే శిష్యుడు ఆ మాట విని, ‘ఇతడు నా మిత్రుడే’ అంటూ పుస్తకాన్ని అందిస్తాడు. వైద్యుడు దాన్నందుకొని -

వాతికా పైత్తికా శ్చైవ శ్లైష్మికాశ్చ మహావిషాః |
త్రీణి సర్పా భవంత్యేతే చతుర్థో నాధిగమ్యతే ||

అని ఒక అసంబద్ధ శ్లోకాన్ని చదువుతాడు. పరివ్రాజకుడు ‘త్రీణి’ నపుంసక లింగం కాబట్టి, సర్పశబ్దం పుంలింగం కాబట్టి, “త్రయః సర్పాః” అని సవరిస్తాడు. వెంటనే వైద్యుడు - వైయాకరణ సర్పేణ బాధితా భవేత్ - అని సమయోచితంగా మాటాడుతాడు. ఈ సమయోక్తి కూడ ఆ సన్నివేశాని కందాన్నిస్తుంది. ఆ చర్చలో గెలవలేక వైద్యుడు పారిపోతాడు. ఆ సన్నివేశం ప్రాకరణికంగా చక్కని హాస్యాన్ని అందిస్తుంది. ఈ రీతిగనే ప్రతీ సన్నివేశం సాగుతుంది.

ఈ ప్రహసనంలో హాస్య మెక్కువ భాగం శాండిల్యుని మీద ఆధార పడుతుంది. ఆభాస హాస్యాలకూ, ఉక్తిమూల హాస్యాలకూ, అనౌచిత్యాలకు ఇతడు ఆస్పదుడౌతాడు. అటు పరివ్రాజకుడు, ఇటు గణిక ఇద్దరూ ఉదాత్తులే కావడంతో హాస్యపోషణ శాండిల్యుని మీద ఆధారపడుతుంది. ఇక పరివ్రాజకుడు, గణిక తారుమారు కావడంతో ఏర్పడిన హాస్యం అనుచిత ప్రవృత్తిలో, అసహజతలో నుండి జనించునది. కాబట్టి అది

ఏ ఒక్క పాత్రకూ సంబంధించిన దనే అవకాశం లేదు. తన గురువుగారితో మాటాడు తున్నది మొదలు, చివరి వరకు శాండిల్యుడే ప్రధాన పాత్రను వహిస్తాడు. అతడు మొదట బ్రాహ్మణుడు. తిండి కోసం శ్రమణకు డౌతాడు. అక్కడ తిండి దొరకకపోగా, మరల మతం మార్చుకొని సన్యాసిని ఆశ్రయిస్తాడు. కాబట్టి అతని జీవితమే హాస్య ప్రాయం. కేవలం చద్దెన్నం కోస మన్ని మార్పులు చేయట మనుచితం. కాబట్టి అది హాస్యాస్పద మౌతుంది. అయితే అతని యథార్థోక్తులు మనకు చాలా హాస్యాన్ని కల్గిస్తాయి. తన ప్రవర్తన తాను కప్పి పుచ్చు కోవాలని ప్రయత్నించకపోగా -

న మామకోఽస్తి న భ్రాతృకో వా
పితా కుతో మే భగవత్ప్రసాదః ।
ఏకోఽహమస్మ్యన్న హతశ్చ తేన
యతిం ప్రవిష్టో న తు ధర్మలోభాత్ ॥

అనటం మనకు జాలిని, హాస్యాన్ని కూడ కలిగిస్తుంది. అయితే అతని వాదాలు ఆభాసాలై అతని తెలివిని ప్రకటిస్తూ నవ్విస్తాయి.

సుఖేషు దుఃఖేషు చ నిత్య తుల్యతాం భయేషు హర్షేషు చ నాతిరిక్తతామ్ ।
సుహృత్స్వమిత్రేషు చ భావతుల్యతాం వదన్తి తాం తత్త్వ విదోహ్యాసంగతామ్॥

అని గురూపదేశం విని, అది అసంభవ మని గురువుగారితో వాదిస్తాడు. ఎందువల్లనంటే 'నేను చదివినా, చదవకపోయినా ముక్తులైన మీకనవసరం గదా! నేను చదవటం లేదని ఎందుకు కోపం[1] అని ఎదురు ప్రశ్న వేస్తాడు. అంతేకాదు విశ్రాంతి కోసం తోటలో ప్రవేశించాలని గురువు అన్నపుడు సుఖదుఃఖాలు సమానా లయిన మీకు విశ్రాంతి ఏమిటని ప్రశ్నిస్తాడు. తెలివి గల ప్రశ్నలుగా సాగినా ఇవి వాదాభాసాలై పరివ్రాజకుని ద్వారా తత్త్వాన్ని చెప్పించేందుకు సహకరిస్తాయి. వారి చర్చలలో బౌద్ధాది మత విషయాలు కూడ దొర్లిపోతాయి.

అయితే గణిక మరణించిన తరువాత శాండిల్యుడి ప్రవర్తనలు కరుణ, ఆభాసితా లవుతాయి. ఆ కరుణ ఆభాస హాస్యాన్ని కల్గిస్తుంది. అయితే ఆ సమయంలో కూడ నిశ్చలంగా శిష్యుని అధ్యయనానికి ఆహ్వానించే పరివ్రాజకుని పరిస్థితి కూడ ఆభాస మైనదనే అనవలసివస్తుంది. ఆతడు ఎంత విజితేంద్రియుడైనా, సమసుఖదుఃఖములు

1 యద్యహ మధ్యేమి వా నాధ్యేమి వా కిం తవ ముక్తస్య?

కలవాడైనా, ఎదురుగా శవం కన్పించే సమయంలో అధ్యయనానికి ఆహ్వానించట మనుచితం. అదే హాస్యానికి ఆలంబన మవుతుంది. అదే కారణంగా శిష్యుడు అతనిని నిందిస్తాడు. అయినా సరే! పరివ్రాజకుడు చలింపడు. గణిక దగ్గరకు చేరి శాండిల్యుడు -

"ఆః! ఆకులాకులోస్మి, శీర్షపాదం న జానామి. ఏతౌ తాళ ఫల పీనౌ కాలేయ చందనాలిప్తౌ స్తనావధోముఖౌ తత్ర భవత్యా ఆధన్యస్య మమ జీవంత్యా అనాసాదితౌ" అనటం కరుణాభాసానికి పరాకాష్ఠ. కొంచె మెబ్బెట్టుగా కన్పించినా ఇతర ప్రహసనాల లోని సన్నివేశాలతో పోల్చి చూచినపుడు ఇది సన్నివేశానుగుణమై ఉచితమే అనిపిస్తుంది. పరివ్రాజకుడు మరణించినపుడు శాండిల్యుడు "ఏవం బహు జానంతోపి మ్రియంతే" అని ఆశ్చర్య పడటం నింపాదిగా నవ్విస్తుంది.

ఈ రీతిగా అనేక కోణాల్లో చక్కని హాస్యాన్ని కల్గించి సంస్కృతంలోని ప్రహసన సాహిత్యానికి విలువ తెచ్చి పెట్ట గల ప్రహసన మిది. సంఘంలో శాస్త్రాల మీద గౌరవం తగ్గిపోయే కాలంలో దానిని పునరుద్ధరించేందుకు చేసిన ప్రయత్నంగా ఈ ప్రహసనం భాసిస్తుంది.

హాస్య చూడామణి ప్రహసనం

సంస్కృత సాహిత్యంలోని మనోహర ప్రహసనాలలో హాస్య చూడామణి ప్రహసన మొకటి. సంస్కృతంలో వివిధ రూపక ప్రక్రియలను ఆదరించి రచించిన వత్సరాజు ఈ ప్రహసనానికి రచయిత. ఇతడు పదమూడవ శతాబ్దికి చెందినవాడు. పరమర్ధి దేవుని అమాత్యుడు. సభ్యతా పరిధికి చాలా దగ్గరగా, సుందరంగా సాగిన చాలా తక్కువ ప్రహసనాలలో హాస్య చూడామణి ప్రధాన మైనది. రచన, సన్నివేశ కల్పనలలో, భావాలలో సహజతను, మార్దవాన్ని పుణికి పుచుకున్న హాస్య మీ ప్రహసనంలో కనిపిస్తుంది. కవి శైలీభావాలు సహజంగా ఉదాత్త గంభీరాలు కావడంతో ప్రహసన నిర్వహణలో సైతం మవి ప్రస్ఫుటమై ప్రహసనానికి విలువను తెచ్చి పెడుతున్నాయి.

ఈ ప్రహసనంలోని ఇతివృత్తిమే మనోరంజకం, హాస్యానుకూలం. కపటకేళి వేశ్య. ఆమె కొక పుత్రిక. పేరు మదనసుందరి. ఆమె కలాకరండకుడనే ద్యూతకరుణ్ణి ప్రేమిస్తుంది. పెళ్ళాడ దలచుకొంటుంది. కానీ అది కపటకేళికి ఇష్టం లేదు.

కళాకరండకుని భృత్యులు కోకిల, పారావతులు. కళాకరండకుడికి ద్యూతంలో జ్యోతిషం ద్వారా సలహా లిచ్చే సిద్ధాంతి జ్ఞానరాశి. అతడి కొక శిష్యుడు. పేరు కౌండిన్యుడు. ఈ నేపథ్యంతో ప్రహసనం ప్రారంభమవుతుంది.

ఒకనాటి రాత్రి కపటకేళి గృహం దోచుకోబడుతుంది. తన పుత్రిక వల్లనే అదంతా జరిగి ఉంటుందని ఆమె అనుమానిస్తుంది. కేవలీవిద్య ద్వారా సత్యాన్ని తెలుసు కోవాలనే తాపత్రయంతో చేటుడితో జ్ఞానరాశి దగ్గరకు వెళ్తుంది. ఆ సమయంలో జ్ఞానరాశి కౌండిన్యుడికి శ్లోకాలు చెప్తుంటాడు. గురుశిష్యులకు అభిప్రాయైక్యం లేదు. అయినా సర్దుకొని పోతుంటారు. కపటకేళి ప్రశ్న అడుగుతుంది. జ్ఞానరాశి శాస్త్రీయంగా గుణించినట్లు గుణించి, నటించి, యుక్తిగా కోకిల, పారావతులే తీసి ఉంటారని చెప్పి పంపుతాడు. ఇది ప్రథమాంకం.

అక్కడ నుంచి జ్ఞానరాశి శిష్యుడితో కలసి ఉద్యానవనానికి వెళతాడు. అక్కడ మదనసుందరి చెలితో కలసి, కలాకరండకుడి కొఱకెదురు చూస్తూ ఉంటుంది. గురుశిష్యులు ఒకరికి తెలియకుండా ఒక్కరు ఆమెను చూడాలని తహతహ పడతారు. విరహాతురుడైన జ్ఞానరాశి వశీకరణ మంత్రమూలంగా ఆమెను వశపరచు కోవాలని, దానికి తగిన ఏర్పాట్లు చేసి, ధూపం వేసి తెమ్మని ఆ పత్రాన్ని శిష్యుడి కిస్తాడు. శిష్యుడు దానిలో జ్ఞానరాశి వ్రాసిన మదనసుందరీ నామాన్ని చెరిపి కపటకేళి పేరు వ్రాసి తెస్తాడు

కపటకేళి జ్ఞానరాశిపై వలపువ్వులు చల్లుతూ ప్రవేశిస్తుంది. అతడికి కంపరం కలుగుతుంది. అయినా తప్పదు. ఒళ్ళుమండి ఆమెను దండంతో కొట్టబోతాడు. అదే సమయంలో కపటకేళి ఆక్రోశం విని, కోకిల పారావతులు ప్రవేశిస్తూండగా జ్ఞానరాశి రక్షించమని కపటకేళి కాళ్ళపై పడతాడు. అయితే కోకిల, పారావతులు నిర్భయంగా జ్ఞానరాశిని, కౌండిన్యుడినీ ఇద్దరినీ కలిపి మంటల్లో పడవేయ బోతారు. కౌండ్యిన్యుడు తెలివిగా లంకెబిందెల ప్రస్తావనం తెచ్చి, కోకిల పారావతులను ప్రలోభ పెడతాడు. జ్ఞానరాశి నీటిపిప్పలి రసంతో అంజనాన్ని తయారుచేసి వాళ్ళందరి కళ్లలో పెడతాడు. నిధులు కన్పించవు. వాళ్ళు కోపంతో ఆ అంజనాన్ని గురుశిష్యుల కళ్ళకు కూడా అంటిస్తారు. అందరూ కళ్ళుమండి ఏడుస్తుంటే కలాకరుండకుడు వచ్చి, గుర్వాదేశానుసార మందరి కళ్ళు కడిగి బాధ పోగొడతాడు. జ్ఞానరాశి గొప్పతనాన్ని అందరికి వివరించి విశ్వసింప జేస్తాడు.

ఈ ప్రహసనంలో గురుశిష్యులు ప్రధానంగా హాస్యకారకులు. వీరి చేష్ట లన్నీ నవ్వించేవే. విశేషించి జ్ఞానరాశి పాత్ర. అతడు కార్తాన్తికుడా? కాదా? అన్న సంశయం, అతని మంత్ర విద్యలు సరియైనవా? కావా? అన్న అనుమానం ఆద్యంత ముంటుంది. ఒక సమయంలో విజ్ఞానిగా కనిపిస్తుంటాడు. వేరొక సమయంలో అజ్ఞానిగా కనిపిస్తుంటాడు. చివరకు కలాకరండకుడు జ్ఞానరాశిని మహానుభావునిగా వివరిస్తాడు. దీనిని బట్టి జ్ఞానరాశి తెలివి ఉండీ, సద్వినియోగం చేసుకోలేని వ్యక్తి అని మనం నిర్ణయించవలసి వస్తుంది. అయితే ఆది ఆవంశానికే సహజాతలక్షణమని జ్ఞానరాశియే వివరిస్తాడు. చూడండి -

దివ్యే శుద్ధికృతా వ్యలీకకథనా చ్చౌరేణ తాతో హతో
భ్రాతా మే వినవాశ కాలఫణినా దష్టో నిధానం ఖనన్ ।
యుద్ధజ్ఞాన విపర్యయాన్నృపతినా హన్తుం సమాకాంక్షితో
జాతోఽహం భగవానియం కులరిపు ర్విద్యా హి నః కేవలీ ॥

ఇలా అగతిక గతి న్యాయంతో భగవత్స్వరూపాన్ని ధరించిన జ్ఞానరాశి ఆధ్యాపనం, కౌండిన్యుడి అధ్యయనం రెండూ హాస్య రసజీవనదులే. వారి సంభాషణా సరళి సుమనోరంజకంగా భాసిస్తుంది. చూడండి -

జ్ఞాన :- అయి! కంఠగతౌ శ్లోకౌ తవేమౌ సంవృత్తౌ?

శిష్య :- జ్ఞానరాశే! ఉదర గతావిమౌ సంవృత్తౌ

జ్ఞాన :- (సక్రోధమ్) మూర్ఖ! నామగ్రహణేన మాం వ్యాహరసి?

శిష్య :- కిం తవ నామగ్రహణేన పాపం భవతి?

జ్ఞాన :- ధిజ్ మూర్ఖ! న గృహ్యతే గురూణాం నామ

శిష్య :- తత్కథం శైలానాం నామ గృహ్యతే -

జ్ఞానరాశి ఎంత శ్రమపడి బోధించినా కౌండిన్యుడి బుర్రకెక్కదు. ఇక ఆ చదువు లాభంలేదని నిర్ణయించుకొన్న శిష్యుడు లోకుల సొమ్మును సంపాదించుకునేందుకు వీలుగా కేవలీ విద్యా రహస్యాలను నేర్పమంటాడు. దాని వలన సుఖంలేదని జ్ఞానరాశి ఎంతగా చెప్పినా కౌండిన్యుడు వినడు. గురువునే రెచ్చగొడతాడు. తప్పని సరియై జ్ఞానరాశి ప్రబోధించిన ఆ కేవలీ విద్యా రహస్యాలను ఈనాటికీ రహదారుల ప్రక్కన

అనేకులు పాటిస్తుండటం వత్సరాజు ప్రతిభకు మణిదర్పణం. ఆ రహస్యాలను గమనించండి.-

కిం వాగ్భిః నికషో హి నః ఫలమితి స్యాద్గాఢ గర్వ గ్రహః
ప్రశ్నేష్వావిల ముత్తరం విరచయేన్న వ్యాహరే న్నిర్ణయమ్ ।
సిద్ధం కార్యమవేక్ష్య నిశ్చిత మిదం పూర్వం మయాసీ దితి
స్ఫారం స్ఫారముదీరయే దుపచరే త్కంచిన్మృషా సాక్షిణమ్ ॥

తన భవిష్యద్దర్శనం తప్పినప్పుడు దబాయింపు ఒక్కటే ఆయుధమన్న సూత్రాన్ని కూడా తెలియ జేస్తాడు —

చిన్తా చుంబిత చేతసా న రచితః ప్రశ్నః ప్రశస్తస్త్వయా
నూనం సమ్యగుపశ్రుతిర్న భవతా జ్ఞాతా గ్రహీతుం తదా ।
త్వద్దోషేణ ఫలే భ్రమోఽయమభవ ద్విద్యా హి నః కేవలీ
కల్పాన్తేఽపి న కంపతే జనమితి ప్రత్యాయయే ద్వంచితమ్ ॥

ఆ సమయంలో కపటకేళి ప్రశ్నకు వస్తుంది. పాద నమస్కారం చేస్తుంది. అటువంటివి తన కిష్టం లేనట్లు ముందుగా నటించి, అనిష్టంగానే అంగీకరిస్తున్నట్లు జ్ఞానరాశి నటిస్తాడు. కుండలి చక్రాన్ని వేసి, పరిశీలించి ఆపై శిష్యుడితో సంభాషణ మొదలు పెడతాడు. సంభాషణ ఎంత హాస్య భావనమో!

జ్ఞాన :- (లిఖనాభినయం కృత్వా) కౌండిన్య! కవర్గీయోఽయం నకారః

శిష్య :- అహం పునః సవర్గీయం జానామి

జ్ఞాన :- తదస్య కతి మాత్రాః

శిష్య :- పంచ

జ్ఞాన :- అనుస్వారస్య కతి భవన్తి?

శిష్య :- యావత్యః లిఖితుం పారయసి

జ్ఞాన :- త్రయోదశ తావత్. అథ త్రయోదశభిః పంచభిశ్చ ద్వావింశతి

శిష్య :- నహి నహి. వింశతి ర్భవతి

కపటకేళి :- నను అష్టాదశ భవన్తి. గణయ త్వార్యః

జ్ఞాన :- (స్వగతం విభావ్య) అయే! గణిత దుర్విదగ్ధేయం. తద్యథా తథా తావత్సమాపయానిమి (ప్రకాశమ్) భద్రే! అన్య ఏవాస్మదీయో గణనా సంప్రదాయః

దీనిని అవివేకంగా భావించినా లేక సమయానుగుణ ధీవిశేషంగా భావించినా నవ్వురాక తప్పదు. జ్ఞాననాశి చోరుణ్ణి గుర్తించే హేతువాదం మరీ విచిత్రంగా ఉంటుంది. ఇంటి సభ్యులందరి పేర్లూ అడుగుతాడు. ముద్గరకుడు (చేటుడు) గౌరవం కొద్దీ కపటకేళితో ప్రారంభించి, అందరి పేర్లూ చెప్తాడు. ఎక్కువగా అనుమానింప దగిన వ్యక్తినే మొదట పేర్కొంటారని హేతువాదం చేసి, కపటకేళియే దొంగ అని నిర్ణయిస్తాడు. అయితే వారి హావభావాల వలన జరగబోయే ప్రమాదాన్ని గుర్తించి, నేర్పుగా తప్పించుకొంటాడు. శిష్యుడు సైతం గురువుకు తగినవాడే కావడ మా యిద్దరి అదృష్టం. గురువులోని లోపాలన్నీ కౌండిన్యుడికి తెలిసి ఉన్నందున అప్పు డప్పుడు శిష్యుడే గురువుగారి కన్న పైచేయిగా ఉంటాడు. విధి లేక జ్ఞానరాశి లొంగిపోతూ ఉంటాడు.

ఈ ఇద్దరి తర్వాత కపటకేళి కొంత వరకు విలక్షణమైన పాత్ర. జ్ఞానరాశికి వశమై, అతని సన్నిధికి చేరి అతడితో ఆమె సంభాషించే తీరు, వారికి ఆమె సూచించే తరణోపాయాన్ని పరిశీలించండి -

భగవాన్ కురుతే నిత్యం యః కందర్పనిషేవణమ్ |
సుతరాం ప్రీతయే తస్మై కందర్పజనకో హరిః ||

ఇంకా ఇంకా అనేకరీతులుగా వత్సరాజుమేధావిశేష మీ ప్రహసనంలో హాస్యాన్ని కుప్పతెప్పలు చేస్తుంది. కౌండిన్యుడు ఏ విషయాన్ని వివరించాలన్నా జ్ఞానరాశినే ఉపమానంగా స్వీకరించుట మొక అధిక్షేపణం. మాత్రాహీనమపి నిధానా న్నిధనం శ్రేయః - వగైరా ప్రకటనలు కూడా నవ్వించేవే.

కుక్షింభర భైక్షవం

మత్తవిలాస, లటకమేలకాది ప్రహసనాల జాతికి చెందిన మరో ప్రహసనం కుక్షింభర భైక్షవ ప్రహసనం. ప్రధాని వేంకప్ప రచయిత. 18వ శతాబ్దమునకు చెందిన వాడితడు. దేవవాణిలో అనేక గ్రంథాల నీ కవి రచించాడు.

కుక్షింభరుడనే భ్రష్ట బౌద్ధాచార్యు డీ ప్రహసనంలో నాయకుడు. కుక్కురి అతడి భార్య. కుక్షింభరుడు కామపాలిక అనే వేశ్యపై మోహంతో, ఆమెతో సమాగమానికి ఏర్పాటు చేయమని తన శిష్యుడైన వక్రదంతుని అభ్యర్థిస్తాడు. కొంత సేపటికి కుక్కురి చెలి, పిచండిల తన స్వామి ప్రణయవృత్తాలను తెలిసికొని, స్వామినికి నివేదించేందుకు వస్తుంది. వక్రదంతు డామెకు తాత్కాలిక విషయాన్ని తెలియజేస్తాడు. అప్పుడు పిచండిల “కామపాలిక మరో హూణునియం దనురక్త” అని చెప్పి పోతుంది.

అయినా కుక్షింభరుడు ఆమెను మరువలేడు. కుక్కురి అంటే భయాన్ని విడువ లేడు. అతడి మోహోపశాంతికై అంతా కలసి బౌద్ధారామానికి తీసికొని వెళతారు. మధ్యదారిలో ఒక బాలవిధవను, గొడవపడుతున్న దాసరిని, జంగాన్ని పరామర్శించి, వారికి ఉపదేశాలిస్తాడు. ఆపై ఒక కాపాలికుడు, క్షపణకుడు, చార్వాకుడు వరుసగా కలుస్తారు. వారివారి మతాలకు, తమ బౌద్ధానికి వున్న సాదృశ్య వైదృశ్యాలను చర్చించి, వారిని పంపుతాడు.

ఆపై ఇద్దరు దిగంబరుల కలహం. త్రాగటం తప్పని ఒకడు, మాంసభక్షణం తప్పని మరొకడు ఆరోపించుకొని ఘర్షణ పడుతుంటారు. ఆ రెండూ తప్పులేనని కుక్షింభరుడి తీర్పు. ఆ తర్వాత ఇద్దరు హూణ విటులు కనిపిస్తారు. పరస్త్రీ క్రీడా, వార విలాసినీ విలాసాలలో ఏది మంచిదని వారి విచికిత్స. ఆ రెండింటికన్న దాసీ సంయోగ ముత్తమమని విదూషకుడి నిర్ణయం.

కుక్షింభరుడు పిచ్చివాడవుతాడు. కుక్కురి వస్తుంది. అతనిని బెదిరిస్తుంది. ఇక చివరగా కామపాలికా ప్రియుడైన ఆంగ్లేయుడి వేషాన్ని ధరించి, కుక్షింభరుని భయపెట్ట వస్తుంది. వారి ఘర్షణ జరుగుతుండగానే అసలయిన ఆంగ్లేయ యువకులు వస్తారు. రంగస్థలమంతా అసభ్యంగా తయారవుతుంది. ఆంగ్లేయులచే మానభంగం చేయబడిన ఆమెకు ప్రాయశ్చిత్తం చేయించి, మఠం ఆస్తిని ఆమెకు, మఠం ఆధిపత్యాన్ని వక్రదంతుడికి అప్పగిస్తాడు కుక్షింభరుడు.

ఈ ప్రహసనంలో కథా భాగం బాగా విస్తృతం. మధ్య మధ్య సర్వ మతాలను, సిద్ధాంతాలను విమర్శించటం, అధిక్షేపించటం లక్ష్యంగా చాలా వరకు రచన సాగుతుంది. ప్రధానేతివృత్తం బౌద్ధ మతాన్ని నిరసించటం. అవాంతరంగా జైనుడు, కాపాలికుడు, దాసరి, జంగందేవర, యోగి, చార్వాకుడు వగైరా వ్యక్తులు నిందాస్పదు లవుతారు. సర్వమత సిద్ధాంతాలలోని లోపాలను, వాటికి బౌద్ధంతో గల తేడాను

సూటిగా విమర్శిస్తాడు కవి. జైన, చార్వాకులను మరీ ఎక్కువగా నిందిస్తాడు. అమర్ష తగదన్న జైనమునిని కట్టెతో కొట్టబోయి కోప మెందుకని ప్రశ్నిస్తాడు. చార్వాకుడు –

యభతు కామపి కశ్చన కామినీం,
పిబతు నిత్య సుధామధురం మధు,
అపిచ ఖాదతు మాంస మలం ముదా
అపిచ మూర్ఖమతోదిత సంభ్రమైః –

అని సిద్ధాంతీకరించగానే "అయితే నీ భార్యతోనే ప్రారంభిస్తా" నని విదూషకు డంటాడు. చార్వాకుడు పళ్ళు కొరికి పారిపోతాడు.

భార్యా బాధితుల స్థితిని కళ్ళకు కట్టించే సన్నివేశ మొకటి ఈ ప్రహసనంలో కనిపిస్తుంది. కుక్షింభరుడు కామపాలిక విరహంతో మూర్ఛ పొందుతాడు. అతడిని స్పృహ లోనికి తెచ్చేందుకు భల్లూకుడు చెవిలో మంత్రం చదువుతాడు. ఆ మంత్రమిది-

ఉత్తిష్ఠోత్తిష్ఠ కర్మన్ది న్నుపశ్రుత్య భవద్దశామ్
సమేత్య జీర్ణశూర్పేణ సంతాడయతి కుక్కురీ.

ఆ మంత్రం వినగానే కుక్షింభరుడి చెవులు నిక్క పొడుచు కుంటాయి.

ఈ ప్రహసనంలో అసభ్యతాశ్లీలతలకు లోటు లేదు. దిగంబర దర్శనం చేయిస్తా మని దిగంబరుడి బట్టలు ఊడబీకటం, రంగస్థలంపైనే సురతం జరిగినట్లు వర్ణించటం మొదలయిన వాటిని పరిహరించాలని కవి భావించకపోవటం దురదృష్టం. రండాగమనాన్ని పొందుమని ఆశీస్సు... 'పూజా పాత్ర మభాణి యత్ర సుభగ స్తద్భాల రండాభగః' అనటం వగైరాలు కవి వాగ్రూపంగా సైత మశ్లీలతను ఆదరించాడని నిరూపిస్తాయి. అయితే ప్రాచీన ప్రహసన రచయితల మార్గాన్నే యథాతథంగా ప్రధాని వెంకప్ప అనుసరించాడు కానీ ఇది వైయుక్తిక దోషంగాదు. కవిప్రతిభకు నిదర్శనంగా ఒక్క శ్లోకాన్ని గమనించి ముందుకు సాగండి.

ఆమీల్యాక్షియుగం క్షణం న చలతి ధ్యానావధానాదివ
త్రాయస్వేతి వదత్యథాశ్రు విసృజత్యున్మాదమోహాదివ ।
ఆహారాది యథాపురం న తనుతే వైరాగ్య భావాదివ
ప్రాయేణాంచతి చైత్యవందన విధివ్యాజేన వీథీమపి ॥

గౌరీ దిగంబర ప్రహసనం

శంకరమిశ్రుని రచనమిది. 14వ శతాబ్దానికి సంబంధించినది. శంకరమిశ్రుని తండ్రి భవనాథమిశ్రుడు. చిరకాల మనపత్యుడై వున్న అతనికి శంకరకృప వలన పుత్రోదయ మయినదట. అందుకే అతని పేరు శంకరమిశ్రుడు. శంకరమిశ్రుని కృతు లనేకాలున్నాయి.[1]

ఈ గౌరీ దిగంబర ప్రహసన నాందీ శ్లోకాన్ని భవనాథమిశ్రుడు శంకరమిశ్రుని బాల్యదశలో అతనిని ఆడించేందుకు రచించి, ఆ తర్వాత కుమారుడు పండితుడైన పిదప, దానిని నాందిగా చేసి ప్రహసనాన్ని రచింపమని ఆదేశించాడట. ఆ రీతిగా ఈ గౌరీ దిగంబర ప్రహసనం దిగంతాలను చూచింది.

ఈ ప్రహసనం శుద్ధ ప్రహసన జాతికి చెందుతుంది. దిగంబరుడైన ఈశ్వరుడు - ధృష్టుడు- ఇందు నాయకుడు. ఈ ప్రహసనంలో ప్రత్యేకించి ఎన్నదగిన హాస్య ధోరణులు కనిపించవు. కథా సంభావనతోనే దీనిలో హాస్యం ద్యోతకమవుతుంది. కాబట్టి ఆ రీతిగా రచనను సాగించాలని కవికి భావన ఏర్పడటం, ఆ భావానికి అనుగుణంగా రచనను సాగించటమే ఇందులో ప్రధాన హాస్యాలంబనం. ఈశ్వరునకు దిగంబరుడని పేరు, ప్రసిద్ధి ఉన్నాయి. అయితే ఎక్కడా సాహిత్యంలో అతని దింగంబరత్వాన్ని దిగంబరంగా చిత్రించటం కాని, చిత్రించేందుకు ప్రయత్నించటం కాని కనిపించదు. శివుడు తోలు ధరించి ఉంటాడని కనీస ధర్మంగా వర్ణించటం జరుగుతుంది. అయితే ఈ ప్రహసనంలో దిగంబరుడిని నిజంగా దిగంబరునిగానే వర్ణించి, ప్రవర్తింపజేయటం చమత్కారాంశం. కాబట్టి కథా సంభావనమే ఈ ప్రహసనంలో చమత్కార హేతువవుతుంది. ఆ సంభావనయే లౌకిక దశలో కొంచెం జగుప్సాత్మకంగా కనిపిస్తోంది. ప్రహసనంలో కూడా అది అలాగే కనిపించవలసినది. కానీ రచయిత ఆ దిగంబరత్వ స్ఫూర్తికి ఎక్కువ అవకాశం కల్గించకుండా అతనిలో లోపాలుగా వ్యవహరింపబడే సమస్త విషయాలమీద దృష్టిని కేంద్రీకరిస్తాడు. అందువలననే సంభావనలో ఉన్నంత అసభ్యత పోషణలో కనిపించదు. అయితే ఆ సంభావన కూడా అలౌకిక దశలో ఆయన లోకవిలక్షణత్వాన్ని తెలియజేసేదే. ఆ

1 గౌరీ దిగంబర ప్రహసనమ్ - కృష్ణ వినోదనాటకమ్ - మనోభవ పరాభవ నాటకమ్- రసార్ణవమ్-దుర్గా టీకా - ఛందోగాహ్నికోద్ధార-వాదివినోదః- వైశేషిక సూత్రాలకు ఉపస్కారము(టీక) - కుసుమాంజలికి ఆమోదము(టీక) - ఖండన ఖాద్యటీకా -

లక్ష్యమే లేకుంటే ఈ కల్పనయే అసంభవం, అనుచితం కూడా. అనగా లౌకికదశలో దోషంగా కనిపిస్తూ; అలౌకికంగా, ఆధ్యాత్మికంగా వైశిష్ట్య ప్రతిపాదకంగా ఈ ప్రహసనం, ఇందలి హాస్యం కన్పిస్తాయి.

మైనాకుడు తన చెల్లెలును ఈశ్వరున కివ్వ సంకల్పించి, అతని అభ్యర్థించేందుకు వస్తాడు. అయితే ఆ సమయంలో ఈశ్వరుడు పిశాచాలతోపాటు శ్మశానంలో ఆడుకుంటూ ఉంటాడు. నంది భృంగిరిటులు మైనాకుని వద్ద తమ స్వామి లోపాలను కప్పిపుచ్చాలని ప్రయత్నించి, శివుడు అంతఃపురంలో కుబేరునితో మాటాడుతున్నాడని అబద్ధం చెప్తారు. ఆ మాట అంటున్న సమయంలోనే ఈశ్వరుడు దిగంబర స్వరూపంతో ప్రవేశిస్తాడు. ఇక్కడ సంఘటన మంచి నవ్వుని తెప్పిస్తుంది. నంది ఇక అబద్ధం చెప్పినా తర్వాత అయినా బయటపడుతుందని గ్రహించి, శివుణ్ణి మైనాకునకు పరిచయం చేస్తాడు. పాపం మైనాకుడు “కౌపీన మాత్ర మపి దుర్లభమస్య భిక్షోః” అని బాధపడి, దిగంబరుని తిరస్కరించి, వెళ్ళబోతాడు. అయితే దిగంబరుడు మైనాకుని బ్రతిమిలాడుతాడు. మైనాకుడు అంగీకరింపక శివుణ్ణి నెట్టేస్తాడు. శివుడు కూడ అతన్ని పట్టుకొని అనుసరిస్తాడు. ఆ సమయంలో పిశాచాలు వచ్చి, అవి కూడ వారిని నెడ్తాయి. అంతా నిష్క్రమిస్తారు. నంది సిగ్గుపడుతూ ఏం జరుగబోతోందో అని బాధ పడతాడు -

శివుడు బ్రహ్మను కూడా వైవాహిక కర్మానువర్తనంలో వ్యతిరేకిస్తాడు. అది నారదుడికి కోపాన్ని తెప్పిస్తుంది. నారదనందులకు వాగ్వాదం జరుగుతుంది. దిగంబరుడిది గాంధర్వవివాహమా? బ్రాహ్మ వివాహమా అని వారిద్దరూ ఘర్షణ పడతారు. చివరకు గాంధర్వవివాహమనే నారదుని అభిప్రాయాన్నే నంది అంగీకరిస్తాడు. నారదుడు వివాహ సందర్భంలో జరిగిన గొడవనంతా వివరిస్తాడు. బ్రహ్మ వివాహం జరిపిస్తుంటే శివుడు ప్రతివిషయానికి అడ్డుపడతాడు. ముందు హిమవత్స గోత్రుడ నంటాడు. ఆ తర్వాత గోత్రమే లేదంటాడు. ఆ తర్వాత హిమవంతుని కూడా గోత్రరహితునిగనే వ్యవహరించమంటాడు. ఎట్టకేలకు చిట్టచివరకు ఈశ్వరాభిప్రాయానుగుణంగానే వివాహం జరుగుతుంది. ఆ తర్వాత గౌరి సఖియైన సుమంగళికై ఘర్షణపడే పిశాచాల గొడవ. గౌరి మహేశ్వరుల ప్రవేశం, కలయికలతో ప్రహసనం ముగుస్తుంది.

మైనాకుడు శివుని గొప్పవ్యక్తిగా భావించి రాగా, దానికి భిన్నంగా జరగటం, దిగంబరుడు లజ్జను కూడా పరిత్యజించి మైనాకుని బ్రతిమలాడటం హాస్యాస్పదా

లయిన విషయాలు. మైనాకుడు శివుని నిందించటం సహజంగా కోపాన్ని తెప్పించ వలసిన విషయం. అయితే అంతకన్నా అధమ దశలో శివుడు కనిపించటంతో కోపస్థానంలో నవ్వే కలుగుతుంది. మైనాకుడు శివుని తిరస్కరించే సన్నివేశం రమణీయంగా వుంటుంది. చూడండి -

మై : అయే! ప్రతీహార! మహేశ్వరోఽన్తఃపుర మధితిష్ఠతీతి ఇదానీమపి ప్రతారణైవేయమ్-

నంది: ఆర్య! న జానామి. ప్రతారణ బహులైవ వైవాహికీ కథా, కథ మన్యథా దిగంబరస్య వివాహః సంభావనా పథమవతరేత్ -

మై : తర్హి వయమేవ ప్రతారణ పాత్రమ్. (అంజలిం బద్ధ్వా) దిగంబర! వర్ధస్వ. వయం గృహాయ గచ్ఛామః (ఇతి నిష్క్రాన్తః)

దిగ :- (మైనాకం హస్తే గృహీత్వా పరావృత్త్య సదైన్యమ్) అయే! గౌరీ సహోదర! అయే గిరిజా సోదర్య! అయే పార్వతీ సగర్భ్య! అయే హిమవత్తనూజ! అయే మైనాక! న వయముపేక్షా మర్హామః సర్వథా శీతల ప్రకృతేః హిమవతః ఖలు పుత్ర స్త్వమ్? కథ మస్మాన్ సంతాపయసి. విపక్ష స్తవ పితా. త్వం పుత్రః సపక్ష ఏవ, తత్సర్వథా కారుణ్యేన వర్తితు మర్హసి.

ఈ సందర్భంలో నంది మోసం చేయటం తప్పుకాదంటూ, అలా చేయకపోతే దిగంబరుడి పెళ్ళి కాదంటూ, దిగంబరుని స్థాయిని తగ్గించటం; దిగంబరుడు పునరుక్తులతో, శ్లేషోపయోజనతో మైనాకుని అర్థించటం ఉక్తిమూల హాస్యాలవు-తున్నాయి. తన స్థాయిని తగ్గించుకొని ప్రవర్తించటం కూడ ఇక్కడ హాస్యాస్పద మయిన విషయమే. చివరకు మైనాకుడు -

విషమలోచన లోచన హీనయా యది వృతోఽసి తయా లఘుచిత్తయా |
తదపి సా భవతే న వితీర్యతే నహి సితా కరభాయ నివేద్యతే ||

అని పరమ శివుని కరభంతో పోల్చి తిరస్కరిస్తాడు.

ఇక నారదుని మాటల ద్వారా వ్యక్తీకరింపబడ్డ వైవాహిక సన్నివేశంలోని శివ ప్రవర్తన మరొక హాస్య ఘట్టం. బ్రహ్మ సింధూర దానానంతరం హోమసమాప్తి అంటే, కాదు హోమ సమాప్త్యనంతరం సింధూర దానమని ఇతని వాదన. హిమవంతుడు ఇచ్చిన మధుపర్కాలతో జటాజూటాన్ని ముడివేసుకుంటాడు. బ్రహ్మకు కోపం వచ్చి

పుస్తకం పడేస్తాడు. ఇక్కడ బ్రహ్మ చేతిలో పుస్తకాన్ని ఉంచటం కూడ ఒక విధమైన చమత్కారమే. బ్రహ్మ తన గోత్రాన్ని చెప్పమని అడిగినప్పుడు శివుని మాట ఎలా ఉందో చూడండి -

న పితా న పితామహో న గోత్రం ప్రవరాణామపి నామ న ప్రతీమః |
తనురీదృగియం చ మే గతిర్గతి రేషైవ చ సర్వమంగళా ||

బ్రహ్మకు మరల కోపం వస్తుంది. మరల హిమవంతుడు ప్రార్థిస్తాడు. హిమాలయుడు కాశ్యప గోత్రమని చెప్పగనే, నాది కూడా కాశ్యప గోత్రమే నంటాడు శివుడు. మరల బ్రహ్మ కోపగించటం, హిమవంతుడు బ్రతిమిలాడటం - ఈ రీతిగా సన్నివేశమంతా చివరకు శివుని అభీష్టాన్ని అనుసరించే జరుగుతుంది. ఆ సందర్భం లోనే రెండు పిశాచాలు గౌరీసఖిని సుమంగలిని ఎత్తుకొని గొడవ చేసుకుంటూ పారిపోతాయి.

మొత్తం మీద పరిశీలింపగా మంకుపట్టు పట్టి, తన పనులు తాను సాధించుకునే వ్యక్తికీ, శివునికీ పెద్ద తేడా కనిపించదు. ఆ పట్టు కూడా తెలిసీ తెలియని విషయాల్లో

అజ్ఞః సుఖమారాధ్యః సుఖతర మారాధ్యతే విశేషజ్ఞః |
జ్ఞానలవదుర్విదగ్ధం బ్రహ్మాపి నరం న రంజయతి ||

అన్న భర్తృహరి సుభాషితం ఇక్కడ దిగంబర, బ్రహ్మల విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి ఆయన మూర్ఖత ఒక విధమయిన మనస్తత్వానికి ఆలంబనమై హాస్యాన్ని కల్గిస్తుంది. కేవల మా ఒక్క మనస్తత్వం మీదనే ఆధారపడి ఈ ప్రహసన మంతా సాగిపోతుంది. అయితే ఈ మూర్ఖత లౌకిక దశలో మాత్రమే అని మనం గ్రహించాలి. అలౌకిక దృష్టితో - కవి ఆ రచనను లక్షించిన దృష్టితో - ఆలోచిస్తే అంతా తన భావాల కనుగుణంగా జరిపించుకోవట మతని సర్వజ్ఞత్వానికీ, విలక్షణత్వానికీ నిదర్శనమని చెప్పవలసి వస్తుంది.

మరో విధంగా ఆలోచిస్తే, లోకాతీతంగా మనం భావించే విషయాలు, లేక లోకాతీత మనుష్యులుగా మనం భావించే వ్యక్తుల వ్యక్తిత్వాలు సాక్షాత్తుగా మన ముందు నిలిస్తే, వాటిని సామాన్య వ్యక్తి ఎంతవరకు సహించగలడు అనేది ఇక్కడ ప్రధానాంశమవుతుంది. దిగంబరుడు, సర్వజ్ఞుడు అని అతనికి మనం బిరుదులు లేక పేర్లు ఇచ్చినపుడు, ఆ పేర్ల భావనతో మనం భక్తిని పంచుకొన్నప్పుడు, ఆ పేర్లు యథార్థాలై ముందు కనిపిస్తే మన పరిస్థితి ఏమిటి? అన్నదే ప్రశ్న. కేవలం మన

పరిస్థితే కాదు. మనకన్నా ఉన్నతస్థాయి వ్యక్తిత్వంతో మనం భావించే మైనాకుడు, చివరకు సర్వ సృష్టికర్త అయిన బ్రహ్మ కూడ సహించలేకపోయినారు. ఇక మన మనగా ఎంత? కాబట్టి లోక విలక్షణాలయిన తత్వాలు భావనలో మెప్పించినంతగా ప్రత్యక్షతలో మెప్పించలేవు, అనే సత్యాన్ని కూడ ఇక్కడ అనుసంధించవలసి ఉంటుంది. నిత్య జీవితంలో కూడా అనేకులు మహాపురుషులు, మేధావులు వారి అలవాట్లు, అభిరుచులు, ప్రవర్తనల వలన సామాన్య మానవులకు పిచ్చివారుగనో, తెలివితక్కువ వారుగనో కనిపించటం మనం చూస్తూనే వున్నాం. వారిని చూచి నవ్వుతాము కూడ. దానికి కారణం మనలోని అజ్ఞతయే కాని వారిలోని విశిష్టత కాదు. అదే పరిస్థితి ప్రస్తుత ప్రహసనంలోని హాస్యంలో వర్తిస్తుంది. మనం నిత్యం భావించే శివుడు యథార్థస్వరూపంతో వుంటే ఆయన స్థాయికి మనం చేరుకొనలేము కాబట్టి దానిని భరించలేక మన తెలివితక్కువతన ముద్రిక్తతను పొంది మనకు నవ్వు కల్గిస్తుంది.

ఇక్కడ పాశ్చాత్యులు చెప్పిన Catharsis (ప్రక్షాళనం) సిద్ధాంతాన్ని అన్వయించు కుంటే, ఆ దిగంబరుడి చేష్టలను చూచుటవలన మనలో కలిగే నవ్వు మనలో వున్న హాస్యంలోని మాలిన్యాన్ని తొలగిస్తుంది. అనగా ఇక్కడ నవ్వుకు కారణం మన అజ్ఞతయే యని నిర్ణయించాము కాబట్టి ఆ అజ్ఞతతో మలినమైన హాసం ప్రక్షాలితం కావలసి వుంటుంది. కడకు అదే జరిగి పార్వతీ పరమేశ్వరుల వైశిష్ట్యాన్ని గుర్తించటం జరుగుతుంది. అప్పుడు ఉత్తరకాలంలో అంతకు ముందు మనం నవ్విన నవ్వు గుర్తు వచ్చి, నిష్కారణంగా యథార్థ విషయానికి నవ్వామనే అనుభూతి మిగిలి, ఆ స్థితిని ప్రకృత స్థితితో పోల్చిచూసుకొని, మరోసారి నిండుగా నవ్వుకుంటాము. ఇది ప్రక్షాళిత మైన హాసం, కాబట్టి Catharsis సిద్ధాంతాన్ని ఈ ప్రహసనంలో చక్కగా అన్వయించి, Thory of purgation (ప్రక్షాళన వాదం)గా దానిని స్వీకరించటం కుదురుతుంది. కాబట్టి ఇందలి హస్యం హాస మాలిన్య పరిమార్జనకు చక్కగా సహకరిస్తుంది.

కౌతుక రత్నాకర ప్రహసనం

ప్రాచీన ప్రహసనాల కోవకే చెందిన మరో ప్రహసనం కౌతుక రత్నాకర ప్రహసనం. 16వ శతాబ్దానికి చెందిన కవి తార్కికుడు ఈ ప్రహసనానికి రచయిత.

పుణ్యవర్జితం ఒక నగరం. ఒక రాజ్యానికి రాజధాని. దురితార్ణవుడు దానికి రాజు. తెలివితక్కువవాడు. అతని భార్య దుశ్శీల. మంత్రి కుమతిపుంజుడు. పురోహితుడు ఆచారకాలకూటుడు. వైద్యుడు వ్యాధివర్ధనుడు. సిద్ధాంతి అశుభచింతకుడు. గురువు

అజితేంద్రియుడు. పట్టమహిషి దుశ్శీలను ఎవరో అపహరిస్తారు. ఎంత వెతికించినా కనిపించదు. రాజు ఆమె వియోగంతో బాధ పడతాడు.

వసంతోత్సవ సమయ మాసన్నమవుతుంది. రాజవర్గమంతా కలసి అనంగ తరంగిణి అనే వేశ్యను రాణిగా చేయిస్తారు. అదే సమయంలో కపటవేషధారి అనే బ్రాహ్మణుడు రాణిని అపహరించినట్లు, ఆమె సుశీలాంతకుడి దగ్గర సురక్షితంగా వున్నట్టు తెలుస్తుంది. వసంతోత్సవం కాబట్టి కపటవేషధారిని క్షమించి, విడుదల చేస్తారు. ఇదీ కథ.

ఈ కథ కన్న కథలోని పాత్రలు, వాటి పేర్లు ఎక్కువగా ఆకర్షిస్తాయి. పదవికి, పేరుకు సామ్యం లేకపోవట మిక్కడ ప్రధానంగా హాస్యాన్ని కల్గిస్తుంది. నిత్య జీవితంలో అయినా దరిద్రుడి పేరు లక్ష్మీపతి అయితే మనకు నవ్వురాక మానదు. అట్లే ఇక్కడ కూడా అధికారానికి, అభిధానానికి; వృత్తికీ, ప్రవృత్తికీ పొందిక లేక పోవటం నవ్విస్తుంది. విమర్శకుల అభిప్రాయం ప్రకారం దీనిలోని హాస్య ముత్తమకోటికి చెందినది కాదు. సంభాషణలయందు అసభ్యత, గ్రామ్యత ప్రాచీన ప్రహసనాల ధోరణిలోనే కనిపిస్తుంది.

నవరస ప్రహసనం

నవరస ప్రహసన రచయిత అభిరాజేంద్రమిశ్ర. ఇది నాట్య పంచగవ్యంలోని ఒక ప్రహసనం. నవరసాలకు, పాత్రల పేర్లకు సంబంధం కల్పించి, పాత్రలను సృష్టించి, రచించిన ప్రహసన మిది. కథా భాగం పెద్దగా కనిపించదు. ప్రహసన పరిమాణం కూడ చాల తక్కువే.

వీరభద్రుడిందు నాయకుడు. శృంగారవల్లి నాయిక. హాస్యముఖుడు విదూషకుడు. అద్భుతిక నాయికాసఖి. రౌద్రపాణి ప్రతినాయకుడు. కరుణాలయుడు సేనాపతి. వార్తాహరుడు బీభత్సకుడు. భయానకి ప్రతినాయకుని భార్య. శాంతదర్శనుడు నాయక ప్రతినాయకుల కులగురువు. శృంగారవల్లీ వీరభద్రుల వివాహానికి రౌద్రపాణి అంగీకరింపక పోవటం, చివరకు శాంతదర్శనుని ఆదేశంతో తన సుతను వీరభద్రున కివ్వటానికి రౌద్రపాణి అంగీకరించట మిందలి ఇతివృత్తం.

ఈ ప్రహసనంలోని చమత్కార మంతా పాత్రల పదవులకు వారి స్వభావాలకు వుండే తేడామీద ఆధారపడుతుంది. సేనాపతి కరుణాలయుడు. సేనాపతిలో కనిపించ

వలసిన క్రౌర్యం కానీ, దృఢత్వం గానీ సేనాపతిలో వుండవు. ప్రతినాయకుడు రౌద్రపాణియే. కానీ అతడికి భయ మెక్కువ. పదేపదే సేనాపతిని శరణుకోరే తత్త్వం. అయితే అతని భార్య పేరుకు మాత్రం భయానకి. కాని కోపం, ధైర్యం ఎక్కువ. వీరభద్రునకు శృంగారవల్లి నివ్వటానికి రౌద్రపాణి ఇష్టపడనప్పుడు కరుణాలయుడు - 'అయితే నాకే ఇవ్వండి' అంటాడు. ఆ సమయంలో భయానకియే ముందుకు దూకి కార్యాచరణాన్ని ఆపుతుంది. అప్పటి రౌద్రపాణి మాటలు చూడండి—

రౌద్ర : [దుర్వారయా గత్యా సమాలింగ్య] ధన్యాసి మమ కరేణో !
అద్య త్వయా ధరిత్ర్యా భగవాన్ వరాహ ఇవ సముద్ధృతోస్మి
పాతాళ గహ్వరే. (కరుణాలయం ప్రతి) అరేరే నీచ జంబుక !
కిం న జానాసి మాం భయానికీ ద్వితీయమ్-

గేహే శూరం ప్రగల్భం ప్రథితగతి మతిం యం సమాలోక్య నిత్యం
భార్యాభృత్యాదయ శ్చా ప్రముదిత రుదితై ర్వేపమానా భవన్తి |
కీటో యో వేశ వాట్యాః నిపతితపతితో యోషితః స్వప్రజాయాః
సోఽహం భోః రౌద్రపాణిః నృపతి పతి ర్వావధూకోస్మి శంభుః ||

ఇక్కడ రౌద్రపాణి తనకుపయోగించుకొన్న ఉపమానంలోని వ్యత్యస్తత హాస్య హేతువవుతుంది. నాయకుడి పేరు వీరభద్రుడయినా వీరత్వం కనిపించదు. తనయ నిమ్మని రౌద్రపాణి పాదాలపై బడి బ్రతిమిలాడుకుంటాడు. శృంగారవల్లిలో శృంగారం కన్పించదు.

అక్కడ నుండి ప్రహసనంలో అంతా అనుచిత శృంగార ప్రవృత్తియే. ఆ రసాభాస సన్నివేశంలో బీభత్సకుడు ప్రవేశించి, శాంతదర్శనుడి ఆగమనాన్ని నివేదిస్తాడు. శాంతదర్శనుడి ఆదేశాన్ని అనుసరించి శృంగారవల్లీ వీరభద్రులు, అద్భుతికా హాస్య ముఖులు ఒకటవుతారు. ఇది ప్రదర్శనకు అంతగా అనుకూలించే ప్రహసనం కాదు.

పురుషరమణీయ ప్రహసనం

కాంచీ కామకోటి పీఠాధిపతుల సన్నిధానంలో కలకత్తాలో ప్రదర్శింపబడిన ఈ పురుషరమణీయ ప్రహసనం భక్తిభావాన్ని, లక్ష్యసిద్ధిని ప్రహసనాత్మకంగా ప్రదర్శి-స్తుంది. కథా స్వరూప మీషద్వైచిత్ర్య ప్రాయమైనా అధిక్షేపణ రచయిత లక్ష్యంగాదు. అందుకే రచయిత జీవన్యాయ తీర్థుడు

Regarding the nature of this play, I leave to the public to have their own Judgement. I have classed it under prahasana (Farce or comedy) in the absence of any better classification.

అని ఉపోద్ఘాతంలో వ్యక్తీకరించాడు.

సీమన్తిని ఒక రాణి. ఆమె మహోదాత్రి. సుబంధుడు, సోమదత్తుడు అనే ఇద్దరు బ్రహ్మచారులు బ్రతుకు తెరువు కోసం ఆమె దగ్గరకు వెళ్ళాలనుకుంటారు. అయితే ఆమె దగ్గరకు వెళ్ళేవారు తమ సర్వస్వం బయట విడచిపోవాలి. సుబంధుడు ద్వార రక్షకులనే అనుమానిస్తాడు. అయితే అదే సమయంలో రాణివద్ద సన్మానింపబడిన ఒక వృద్ధ దంపతుల జంట, దంపతీ రూపంతో వెళితే అధికంగా సన్మానం లభిస్తుందని ఆ ఇద్దరికీ సలహా ఇస్తుంది. అంతేగాక సోమదత్తుడికి స్త్రీ వేషానికి అవసరమయిన సరంజామా కూడా అందజేస్తుంది. సుబంధుడు సోమదత్తులు కానుకలు పొంది వచ్చిన తర్వాత, సోమదత్తుడు యథార్థంగానే స్త్రీగా మారిపోవటాన్ని గుర్తిస్తారు. సోమదత్తుడు ఏడుపు లంఘించుకుంటాడు. నీవు లేక నేను బ్రతకలేనని సుబంధుడి గొడవ. లోనికి వెళ్ళేటప్పుడు లేని స్త్రీ వెలుపలకు వచ్చేటప్పుడు కనిపించటంతో రాజపురుషులు వాళ్ళను బంధిస్తారు. సుబంధు సోమదత్తులు పరమేశ్వరుని ప్రార్థించగానే శివుడు ప్రత్యక్షమై వారిద్దరూ పూర్వజన్మలో సైతం దంపతులేనని తెలిపి, కర్మవశాన విడిపోయిన వాళ్ళు మరల ఆ రీతిగా దంపతులు కావటాన్ని ఆశీర్వదించి, నిష్క్రమించటంతో ప్రహసనం ముగుస్తుంది.

కల్పన యథార్థం కావట మిందులో హాస్య హేతువు. సుబంధు సోమదత్తు లిద్దరూ కలవరపడే సమయంలోనే

కృత్రిమ మురోజ యుగళం సరోజముకులం జయతి సమున్నత్యా |
కఠినం పీనం శ్రీ ఫలమపి విఫలయతి శ్రియా విజయా ||-

అని వర్ణించట మొక విధంగా హాస్య రూపాన్నే పొందుతుంది.

ప్రహసనంలో తగ్గిన హాస్యాన్ని ప్రస్తావనలో గుప్పించాడు రచయిత. సూత్రధార విదూషకుల సంభాషణమంతా హాస్యైకఘనమే. ఏనుగులకు అంత పెద్ద ఉదరాన్నిచ్చి, మానవులకు ఇంత చిన్న పొట్ట నివ్వటం బ్రహ్మ చేసిన అన్యాయమని విదూషకుడు దోషారోపణ చేయట మతడి తిండిపోతుతనానికి పతాకాయమానమై భాసిస్తుంది.

క్షుత్ క్షేమీయ ప్రహసనం

భూలోక యమలోకాలకు సంబంధించిన ఈ ప్రహసనం జీవన్యాయ తీర్థునిదే. దీనిలో స్థలైక్య ముండదు.

చిత్రగుప్తుడు భూలోకానికి వచ్చి, అలసిపోయి, రంగనాథుడనే శ్రేష్ఠి ఇంటికి వెళ్ళి, ఆతిథ్యాన్ని కోరుతాడు. రంగనాథుని వంటవాడు, సేవకుడు అతన్ని అటకాయించి, కాలంకాని కాలంలో ఎందుకు వచ్చావని విసుక్కుంటారు. చిత్రగుప్తుడు తనకు నిధినిక్షేపాలు తెలుసునని, హస్త సాముద్రికం తెలుసునని గృహస్వామితో చెప్ప మంటారు. అయితే ఆ నౌకర్లు యజమానివద్ద చాలా డబ్బుందని తమకే ఆ రహస్యాలు చెప్పమని, తమ తమ చేతులు చూపించుకోవాలని తొందర పడతారు.

ఆ సమయంలో రంగనాథుడు వచ్చి, వారిని ప్రక్కకు నెట్టి, చిత్రగుప్తుని ధర్మశాలకు వెళ్ళమంటాడు. అయితే అతడికి నిధినిక్షేపాల విషయం తెలుసు ననగానే వినమ్రుడై సేవకు డవుతాడు. అతనికి సమస్త సౌకర్యాలు ఏర్పాటు చేస్తాడు. నిధులు లభించిన వారు అల్పాయుష్కులు, కాబట్టి నా ఆయుస్సెంతని రంగనాథుడు అడుగుతాడు. చిత్రగుప్తుడు తన యథార్థ స్వరూపాన్ని చెప్పి, సంవత్సరం మించి బ్రతకవవి రంగనాథుడికి చెప్తాడు. తాను చిరంజీవి అయ్యే దారి చూపమని రంగ నాథుడు బ్రతిమిలాడగా చిత్రగుప్తుడు సంవత్సర మంతా బీదా, బిక్కి ఇళ్ళమీద గడ్డి కప్పించమంటాడు.

రంగనాథుడు చనిపోయి యమపురికి వెళతాడు. చిత్రగుప్తుడికి ఇతడిని మరల భూలోకం పంపాలనిపిస్తుంది. దానితో నేర్పుగా, యమధర్మరాజు అడిగినపుడు ఇతడి పేరు కనిపించటం లేదనీ, వెళ్ళి బ్రహ్మ నడగాలనీ చెప్తాడు. యముడు అతడి పేరు తెలుసుకొనేందుకు బ్రహ్మలోకానికి వెళ్తాడు. యముడు వచ్చే సమయానికి ముందు వేసుకున్న పథకం ప్రకారం రంగనాథుడు తుమ్ముతాడు. యమధర్మ రాజు జీవ! జీవ! అంటాడు. అన్నమాట ప్రకారం రంగనాథుని మరల భూలోకానికి పంపక తప్పదు.

కవి భూలోక యమలోకాలను కలిపి సన్నివేశాలను ప్రహసనప్రాయాలను చేశాడు. ఈ ప్రహసనంలో వక్రత ఎక్కువ. రంగనాథుని మనః ప్రవృత్తిలోని వక్రత, నౌకర్ల ఆశలోని వక్రత – అంతా హాస్యాస్పదం. అది Comedy of humours కోవకు చెందినది. యమలోకంలోని సన్నివేశం మరీ సరదా అయినది. పేరు కనిపించక

పోవటం మరీ విచిత్రం. దాని కోసమే యమ ధర్మరాజే బ్రహ్మలోకానికి బయలు దేరడం గొప్ప Farce. అంతేగాదు. భూలోకంలో ఎప్పటి నుండి ఆరంభ మయినదో కానీ తుమ్మితే 'చిరంజీవ' అనటం భారతదేశంలో అలవాటు. ఈ తుమ్ముతో అనేక చేష్టలకు, ఉపశ్రుతులకు సంబంధముంది. అది ఒక్కొక్క దేశంలో ఒక్కొక విధంగా వుండటం ఆశ్చర్యాన్ని కల్గించే విషయం. భారతీయులలో తుమ్మితే చేసే చేసే పని మానటం, చిరంజీవ అనటం బాగా అలవాటు. అది ఈ రచయితకు అధిక్షేపణీయ మైన విషయంగా దొరికింది. అందుకే నేర్పుగా రంగనాథుని చేత తుమ్మించి, ప్రాణాలను రక్షింపించాడు. వాగ్వ్యవహారాలతో గాక చేష్టలతో బాగా హాస్య ముత్పన్న మవుతుంది. నౌకర్లు అహమహమికగా హస్తసాముద్రికం కొరకు చేయి చాపటం సన్నివేశహాస్యానికి మచ్చుతునక. అది ప్రదర్శనలో బాగా రక్తిగట్టే హాస్య ప్రక్రియ.

భట్టసంకట ప్రహసనం

జీవన్యాయ తీర్థుడు రచించిన కథాత్మకమయిన మరొక ప్రహసనం భట్ట సంకట ప్రహసనం. కథాకల్పన మొక వినూతన దిశలో కన్పిస్తుంది.

యజ్ఞనారాయణభట్టు ఒక శ్రోత్రియుడు. అతని భార్య గయ్యాళి. కురూపి కూడా. ఆమె అంటే ఆ బ్రాహ్మణుడికి భయం. అయినా సరే యాగంలో ఆమె ఉపస్థితి తప్పదు గదా! అందుకని ఆమెకు 'నెక్లెస్' కూడా చేయిస్తాడు. అయితే ఇతని యాగాలతో ఉద్విగ్నుడైన ఒక రాక్షసుడు ఆ పతివ్రతను అపహరిస్తాడు. బ్రాహ్మణుడు రాజుతో మొరపెట్టుకుంటాడు. బంగారు బొమ్మతో యాగంగానీ, పెండ్లి కానీ జరిపిస్తా నంటాడు రాజు. అయినా ఇతడు వినడు. ఎవడో యోగి రాక్షను డామెను గ్రహించిన విషయాన్ని తెలియజేస్తాడు. రాజు గూఢచారులను పంపుతాడు. అక్కడ రాక్షసుడు ఒక కోతితో ఆమెకు పెండ్లి తలపెట్టి వుంటాడు. రాజు కోతి వేషంలో వెళ్ళి, ఆమెకు రహస్యంగా విషయం చెప్పి, పెండ్లికి అంగీకరించేటట్లు చేసి, ఒడుపుచూసి రాక్షసుడిని బంధిస్తాడు. దానితో రాక్షసుడు భయపడి, ఆమెను అందగత్తెను చేసి తాను విముక్తు డవుతాడు.

ఇది ప్రహసనాత్మకంగా దాంపత్య జీవితంలోని వైశిష్ట్యాన్ని వ్యక్తం చేస్తోంది. ఆమె గయ్యాలి అయినా సరే - అపహృత అయితే - మరొక స్త్రీని వివాహ మాడేందుకు యజ్ఞనారాయణుడు అంగీకరింపక పోవటం ఆ విశిష్టతకు పరాకాష్ఠ. ఆమె అంటే

అతనికి భయం. అయినా సరే ఆమే కావాలి. వివాహబంధ నిర్ణేతకు జోహార్లు పలుకక తప్పదు

ఇక రాక్షసుని భావాలు మరీ పరిహాసాస్పదాలు. వానరంతో ఆమెకు వివాహం జరిపించాలని తలపెట్టటంలో వికారం తప్ప మరే కారణమూ కనిపించదు. అతని ఆలోచనే వక్రమయితే ఆ వానర రూపంలో వెళ్ళి రాజు ఆమెను విడిపించటం మరో వక్రత. అది భావవక్రత అయితే ఇది చేష్టావక్రత. రెండూ హాస్యాస్పదాలే.

హాస్యార్ణవ ప్రహసనం

లటక మేలకం ప్రభావాన్ని అత్యధికంగా స్వీకరించి, జగదీశ్వర భట్టాచార్యుడు రచించిన ప్రహసనం హాస్యార్ణవ ప్రహసనం. ఇతని కాల మనిశ్చితం.

అనయసింధు నరపతి ఈ ప్రహనసంలో నాయకుడు. భోగలాలసుడై భ్రష్టుడైనవాడు. అయథార్థవాది అతని అనుచరుడు. అయథార్థవాది రాజ్య విషయాలు వివరిస్తూ ప్రజలు ఉన్మత్తులై ఉన్నారనగానే అనయసింధువు మండిపడతాడు. రాజు తన మంత్రి అయిన కుమతివర్మతో కలసి వేశ్య ఇంటికి వెళతాడు. అక్కడ వృద్ధ వేశ్య బంధుర, ఆమెసుత మృగాంకలేఖ. పరస్పర సంభాషణ సమయంలోనే కుల పురోహితుడు విశ్వభాండుడు మృంగాకలేఖకు మన్మథశాస్త్రాన్ని బోధించేందుకు వస్తాడు. అతని శిష్యుడు కలహాంకురుడు. నమస్కరించిన వారికి శిష్యుడిచేత ఆశీస్సు లిప్పించటం గురువు లక్ష్యం. ఆ సందర్భంలోనే మదనజ్వరాకుల అయిన బంధురకు వైద్యం చేయించటానికి వ్యాధిసింధువనే వైద్యుని పిలిపిస్తారు. అతని వైద్యవిధానాలు, వానిలోని అసంగతాలు, అనౌచిత్యాలు... ఆపై రక్తకల్లోలుడనే నాపితుని ప్రవేశం, అతనిపై ఆరోపణ. మంత్రి తీర్పు. దానిలో తెలివి తక్కువతనం. ఆపై మిథ్యార్ణవ బ్రాహ్మణ ప్రవేశం. విశ్వభాండుని నుండి ఏదో విషయం తెలిసికొన గోరటం, అతడు వివరించటం. అయితే మిథ్యార్ణవుడు యథార్థంగా వేశ్యా సాంగత్యం కోసం వస్తాడు. అప్పుడు కుదరదనుకొని నిష్క్రమిస్తాడు. సాధుహింసక నరపాల ప్రవేశం. రణజంబుక సేనాపతి ప్రవేశం. ఒక సంఘటనాభాసం. మహా మాంత్రిక జ్యోతిష ప్రవేశం. యుద్ధానికి ముహూర్త నిర్ణయం - ఆపై మృంగాంకలేఖ కొరకు గురుశిష్యుల కోలాహలం. సంధ్యా వైతాళికగీతి. అందరి నిష్క్రమణ — ఇది సభా నిర్ణయం అనే ప్రథమాంకం.

ద్వితీయాంకంలో మరల విశ్వభాండుడు, కలహాంకురుడు ప్రవేశిస్తారు. ఆపై బంధుర, మృంగాంకలేఖల ప్రవేశం. అప్పుడు ప్రత్యూష హోమం. కులాలుడు అనే శిష్యుడితో మదనాంధమిశ్రుడు ప్రవేశిస్తాడు. అతడు మహా నైష్ఠికుడు. కుహనా తత్త్వంతో హరిస్మరణ. విశ్వభాండుడు కూడా ప్రగల్భాలు పలకటం, మదనాంధ మిశ్రుడు లొంగిపోవటం, కందర్పహోమ నిర్వహణ. మృగాంకలేఖను సంయుక్తంగా పెండ్లాడేందుకు విశ్వభాండ మదనాంధమిశ్రుల నిర్ణయం. కులాలుడు కలహాం-కురుడితో చేయి కలుపుట. శిష్యులు బంధురను పెండ్లాడే ఏర్పాటు చేయించేందుకు మహానిందకాచార్య ప్రవేశం. ఇతడు మరీ ప్రగల్భి. ముహూర్తం పెట్టేందుకు మరల మహామాంత్రిక ప్రవేశం. అతడు లటకమేలకంలోని వైద్యుని అనుకరిస్తూ మహూర్తం పెట్టటం. ఆశీస్సులలో లటకమేలకానుసరణ - మహా నిందకుడు డబ్బు అడగటం. గురువులు తిరస్కరిస్తే మృంగాంకలేఖను జప్తు చేయడం. నిష్క్రమణం.

సంస్కృతాలంకారికుల నియమాన్ననుసరించి ఆలోచిస్తే, ఇది వికృత ప్రహసన మవుతుంది, షడ్విధ హాస్యరస పోషణ ఇందులో కనిపిస్తుంది. ప్రహసనాలకు ప్రాణ మైన ఆభాసత ఇందులో బాగానే కన్పిస్తుంది. లటకమేలకాన్ని అనుసరించి సాగిన రచన అగుటవలన ఆ లక్షణాలన్నీ స్పష్టంగా కన్పిస్తాయి. ఆభాసతతో పాటు అనేక హాస్య ప్రక్రియలు ఇందులో మనః పూర్తిగా నవ్వుకునే ఆవకాశాన్నిస్తాయి.

అనయ సింధునృపాలుడు గుణాన్ని దోషంగా భావించటం, దాని వలన కలవర పడటం, అతని తెలివి తక్కువ తనాన్నీ, దోషిత్వాన్నీ తెలియజేస్తూ హాస్యాస్పదా లవుతాయి. సర్వజనులు ధర్మ మార్గంలోనే నివసిస్తున్నారని అతని బాధ. చాలా కాలం నుండి తాను పట్టించుకొననందున ఈ అవ్యవస్థ ఏర్పడిందని అతని బాధ. దానికై మంత్రిని పిలిపిస్తాడు. అతడు కుమతివర్మ. ఎడమ చేతితో నమస్కారం చేస్తాడు. ఇది చేష్టావక్రత. అయితే చర్చించేందుకు గాను తగిన స్థానం వేశ్యా గృహమే అని మంత్రి నిర్ణయించటంతో ఇద్దరూ అక్కడికే బయలుదేరుతారు. ఆ విధంగా వేశ్యాగృహం ప్రధాన కేంద్ర మవుతుంది. వేశ్యాగృహంలో ప్రవేశిస్తూ అనయసింధువు - ప్రాప్తంమయా తీర్థశత పర్యటన పుణ్యమ్ - అనుట అనుచితమై విశేషంగా నవ్విస్తుంది.

ఆశీర్వాదాభాసాలు ఇందులో విశేషంగా ఆకర్షిస్తాయి. అంతేగాక ఆశీర్వాదం లోనే ఒక వక్రత. నమస్కరింపబడిన వ్యక్తి ఆశీస్సుల నివ్వక తన శిష్యుని ఆదేశిస్తాడు

ఆశీస్సు నివ్వమని. విశ్వభాండుని శిష్యుడు కలహాంకురుడు ఇటువంటి ఆశీస్సులు చాలా ఇస్తాడు. నేత్రే పుష్పోదయో భవతు భవతామ్ - అపిచ -

శత్రోర్వృద్ధిః ఖియోవృద్ధిః వృద్ధిర్వ్యాధేః ఋణైనసామ్ |
దుర్గతే ర్దుర్మతే ర్వృద్ధిః సన్తు తే సప్త వృద్ధయః ||

చివరలో మహానిందకుడు ఇరువురు పతులను బడసిన బంధుర వివాహాన్ని జరిపిస్తూ మధుపర్కాన్ని ఇస్తూ ఆశీర్వదించటం గమనించండి -

ఓం శ్మశానానల దగ్ధోసి పరిత్యక్తోఽసి బాన్ధవైః |
ఇదం నీర మిదం క్షీరం స్నాత్వా పీత్వా సుఖీభవ ||

మరణం ప్రాణినాం నిత్యం జీవనం స్వప్నవద్ భువి |
భవద్భి రితి విజ్ఞాయ కర్తవ్యా నాత్ర శోచనా ||
పితృకానన మేదిన్యాం మృదుశయ్యానుశాయిభిః |
సుచిరం స్థీయతాం నిత్యం మహా నిద్రావలంబిభిః ||

వీటి కన్నింటికి మూలం లటకమేలక కర్త స్వీకరించిన భగవద్గీతా శ్లోకమే -

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ |
తస్మా దపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి || -

అట్లే లటకమేలక కర్త వైద్యుని చేత చెప్పించిన వైద్య విధానాన్ని - హాస్యార్ణవ కర్త ముహూర్త నిర్ణయంలో ప్రదర్శిస్తాడు. చూడండి ఒక అసందర్భ ప్రలాపం.

యత్ర కుత్రాపి లగ్నే చ వాసరే యస్య కస్యచిత్ |
యత్ర కుత్రాపి నక్షత్రే యద్వా తద్వా విధీయతామ్ ||

స్తోత్రాభాసాలు కూడా ఇందులో ఎక్కువగానే కనిపిస్తాయి. తుచ్ఛమైన వేశ్యా సంయోగాన్ని పరమపుణ్యంగా వర్ణించిన శ్లోకాన్ని గమనించండి.

ఆశ్లేష పీడిత కుచం శ్రమ ఘర్మితాస్యం
దష్టాధరం లలిత శీత్కృత మీలితాక్షమ్ |
చాటూక్తి చారు లలితభ్రు చలత్కటాక్షం
వేశ్యారతం జని శతార్జిత పుణ్యలభ్యమ్ ||

ఉక్తిమూల హాస్యాలకుగూడ ఈ గ్రంథంలో కొదవలేదు. మృగాంకలేఖ విశ్వ భాండుని వృద్ధుడని నిందించినప్పుడు గురువును సమర్థిస్తూ శిష్యుడు ఆమెతో వాదించే ఛలోక్తిని చూడండి.

"యస్య నిధువనానురక్తా బ్రాహ్మణీ నక్తం దివం విదగ్ధానాం స్థానే బన్ధవివహం శిక్షమాణా అద్యాపి భ్రమతి, అతిస్నేహేన ఉపాధ్యాయపురతః వైధవ్య మండనం కృత్వా నిత్య మనుమరణార్థం సుసజ్జితా భవతి తం వృద్ధం జల్పసి – అపి చ అద్యాపి ఉపాధ్యాయః లజ్జాకులః వసనం పరిహృత్య జనన్యంకే శయనం కరోతి. ఏనం హతవ్రీడం జల్పసి"

వ్యాధిసింధు వైద్యుడి ప్రవేశంతో రంగస్థలానికి క్రొత్త సొగసులు వస్తాయి. అతడు వైద్యుడే. అయితే అతని స్వరూపం మాత్రం మహారోగనిలయం. అందుకే ఆతని పేరు వ్యాధిసింధుపు. ఆ వైద్యుని పరిచయం చేస్తూ వ్రాసిన శ్లోకాన్ని చూడండి -

పానీయస్థూల పాదే కథ మపి ధరయా ధారితే సాంకురోఘే
హస్తన్యస్తాంచలాగ్ర ప్రచలిత పవనై ర్వారయన్ మక్షికాలీమ్ |
కాసాత్ కంఠస్వనౌఘైః సపది ముఖరయన్ దిఙ్ముఖం వ్యోమ వీథీ
మప్యేష వ్యాధిసింధుః ప్రవిశతి సరుజా మస్తకో రాజ వైద్యః ||

ఆ వ్యాధిసింధువు ఆత్మోత్కర్షతో చెప్పే మూర్ఖోక్తులు[1] ప్రగల్భోక్తులు[2] నవ్విస్తాయి. అయితే వ్యాధిసింధువు తెలివిలేని వాడేమీ కాదు. చాలా నర్మగర్భితంగా మాటాడ గలడు. విశ్వభాండుడు – "భో వ్యాధిసింధో! తవ పితుః ఆతురాన్తకస్య అన్తకాలయ ప్రాప్తస్య కుశలమ్?" అని అడిగినపుడు "కుతః కుశలం భవద్దర్శనం వినా" అనుట ఉత్తమ నర్మోక్తి. హాయిగా నవ్వడానికి ఆలంబనమైన వాక్యం. కలహాంకురుడు మృగాంకలేఖకు చందనాది లేపనం వలన గాత్ర కండూతి ఏర్పడిన దని, దానికి వైద్యం చెప్పమని వ్యాధిసింధువును ప్రశ్నించినపుడు బంధుర- "యథా ఉపాధ్యాయః

1 వైద్యోఽహం వ్యాధి వర్గాణా మాశ్రయోఽప్యయశోనిధిః |
మయా చికిత్సితః సద్యో మార్కండేయో న జీవతి ||

2 సర్వౌషధాని తిష్ఠన్తు చికిత్సాపి చ తిష్ఠతు |
మమ దర్శనతో రోగీ కిల ప్రాణై ర్విముచ్యతే ||

శిష్యోఽపి తథా. యుక్తం భస్మపుంజే సారమేయావస్థానమ్” - అని సమాలంకారాన్ని ఆభాసం చేయటం చమత్కారాన్ని కల్గిస్తుంది.

ఒక నాపితుని ప్రజలందరూ పట్టుకొని వస్తారు. రక్త కల్లోలుడు ఒక వ్యక్తికి గోరు తీస్తుంటే, ఆ సమయంలో అతడు తన నేత్రాల మధ్యకు ఆ వ్రేలు లాక్కుంటాడు. బడిశ విరుగు తుంది. అతనికి గ్రుచ్చుకొని నెత్తురు వస్తుంది. అయితే దానికి మంత్రి ఇచ్చే తీర్పు నవ్వు తెప్పిస్తుంది.[1] గాయపడిన వ్యక్తిని నాపితుడికి బడిశ మూల్యాన్ని ఇవ్వమంటాడు అనయసింధు మంత్రి.

ఆ తర్వాత మరో అధిక్షేపణ. మిథ్యార్ణవుడు ఎవరో వ్యక్తి మరణించాడని, అది కూడా మక్షికాపాద ఘాతం చేత [ఆ వ్యక్తి చతుర్వేదాధ్యాయి, బ్రహ్మచర్యా నిపుణుడు, సంవత్సరస్నాయి] ప్రాయశ్చిత్తం తెలుసుకొనేందుకు స్మార్త పండితుని అన్వేషిస్తూ వేశ్యాప్రాంగణంలో ప్రవేశిస్తాడు. ఇది స్మార్త పండితుల దుఃస్థితిని వ్యక్తీకరించెడి అధిక్షేపణ. అయితే వెంటనే రహస్యంగా ఆ వ్యక్తి చాకలిదానితో సరసాలాడుతూ పురజనులు బెడ్డలతో కొట్టగా మరణించాడని చెవిలో చెప్పినపుడు మరల నవ్వువస్తుంది. అందుకు కారణం ఆ వ్యక్తి వ్యక్తిత్వంలో పూర్వాపర వైరుధ్యం కన్పించటమే -

ఆ తర్వాత మరో సమయోక్తి. చోరబాధ మరీ ఎక్కువగా వున్నందున రక్షణకై ఏమి చేయాలని రాజు మంత్రిని అడిగినపుడు, మంత్రి వెంటనే “దేవ! సైన్యం సజ్జీకృత్య ప్రథమతో మమ రక్షణం విధేయం, తతో దేవ్యాస్తతః ప్రాసాదస్య చ” — అన్నప్పుడు - ప్రథమంలో నా రక్షణం - అనే సమయోక్తి తెలివితక్కువతనంలో కూడా మంత్రి కుండే నేర్పును వ్యక్తీకరించి నవ్విస్తుంది.

మరో వ్యతిరేకార్థోక్తిని చూడండి – మదనాంధమిశ్రుడు, కులాలుడు ప్రవేశించినపుడు కులాలుడు భోజన సిద్ధికై బంధురగృహానికి వెళ్లామంటాడు. కులీనా సా? అని గురువుగారి ప్రశ్న. వేశ్య అంటుంటే మరలా కులీనా అని ప్రశ్నించట మేమిటి? అది అటుంచండి - అత్ర క స్సందేహః? చండాలోపి అస్యాః గృహే పానీయం న పిబతి - అని శిష్యుని సమాధానం. అయితే వెళ్దాం అని గురువుగారి అంగీకృతి. అంతట మదనాంధమిశ్రుడు కుహనాతత్త్వంతో హరి నామస్మరణ చేసి, ఆ పాప ప్రాయశ్చిత్తం చేసికోవాలనుకుంటాడు. అది మరీ ఆశ్చర్యకరం. అధిక్షేపణం.

---

1 అరే పౌర ! బడిశ మూల్యం దాతు మర్హసి-

మహా నిందకాచార్యుడు వివాహాన్ని జరిపించటానికి వస్తాడు. అతని ప్రగల్భోక్తులు లోకాతీతాలుగా కన్పిస్తాయి. అందరూ తన కన్నా తక్కువే[1] అంటూ చివరగా ఒక మాట పేలుస్తాడు, 'మయా రచితాః చత్వారో వేదాః' - అని. ఇది ప్రగల్భోక్తులకు పరాకాష్ఠ. ఆ మాట వినగానే అతణ్ణి వ్యాస భగవానుడు అంతటివాడు అనుకోము గానీ, హాస భగవానుడని మాత్రం వెంటనే అనిపిస్తుంది.

ఈ రీతిగా, పాత్రల ప్రవృత్తులలో, పాత్రల నామాలలో, సన్నివేశాలలో, భావాలలో కూడ చక్కని హాస్యాన్ని సృష్టించిన ఈ రచయిత మరీ అనుచితంగా కొన్ని భావాలను ప్రకటిస్తాడు. ఇది ప్రహసన మయితే కావచ్చు. ఇందులో శృంగారాభాసం ప్రధాన మయితే కావచ్చు. కనిపించే వాళ్ళందరూ భ్రష్టులు అయితే కావచ్చు. అంత మాత్రంచేత రచయిత, పాఠకులు కూడా భ్రష్టులు కారు కదా! ఆభాస శృంగారం అసహ్య శృంగారం కాకూడదు కదా! పాత్రలకు సంయయనం లేకపోయినా, సంస్కారం లేకపోయినా కవి కొంతవరకు సంయమనంతో సంభాషణలు కల్పించాలి కదా! అయితే ఈ స్థితి ప్రహసనకర్తలలో అనేకుల కున్నందున వ్యక్తిగతంగా నిందించలేము.

హాస్య సంఘటనలు, ఛలోక్తులు అత్యంత రమణీయంగా సాగే సన్నివేశంలో మరీ అసభ్యకరమైన భావాన్ని ఒకదానిని ప్రవేశపెడ్తాడు. దానితో అది భ్రష్టమవుతుంది. ఒకచో అది ఉత్తమ హాస్యం కాకపోదు, కానీ ప్రచారానికన్నా గుణానికి ప్రాధాన్యాన్నివ్వక తప్పదు కదా!

కలహాంకురుడు బంధురను వర్ణించే సందర్భంలో[2] రెండు మూడు తావుల్లో మరీ అసభ్యంగా వర్ణన జరుగుతుంది. అట్లే కలహాంకురుడు విశ్వభాండుడు కలహించే సమయంలో కలహాంకురుడు – "లిగి ప్రేరణే ఇతి ధాతోరచ్ ప్రత్యయేన యద్రూపం సిద్ధం భవతి తవ తస్య ఉత్పాటనం యోగ్యమ్" – అనుట కొంత వ్యక్తీకృతిలో చమత్కారం అనిపించినా, భావం బహిరంగపడటానికి సంకోచించవలసినదే. పంచశరాధ్వరాన్ని

1 బ్రహ్మాండే కే ద్విజా స్సన్తి పాండిత్యేన కులేన వా |
యే స్పర్ధితుం మయా సార్ధం కించి దావర్జితోద్యమాః ||

2 స్తనౌ తుంగౌ నిపతితౌ కామసంగ్రామ మర్దితౌ |
పురస్తా దవలోక్యాస్యా భగం శుష్కం భయా దివ ||-

సావయవ రూపకంగా[1] పోల్చటం కూడా అలంకార రీత్యా చమత్కారమైనా, సభ్యతా రీత్యా పరిహరణీయమే అవుతుంది. విశ్వభాండుడు తన శిష్యుడు కలహాంకురుడికి బంధురతో పరిణయం నిశ్చయమైన తర్వాత ఆత్మగతంగా అనుకున్న మాట అసభ్యతకు పరాకాష్ట. ఇటువంటి వాటినన్నింటిని తొలగించి చూస్తే హాస్యార్ణవ ప్రహసనం నిజంగా హాస్యార్ణవ ప్రహసనమే అవుతుంది. అయితే ఆ అనౌచిత్యాలు మధ్యలో ఉప్పుగా తగిలి ఆ ప్రహసన మంటే చిన్నచూపు ఏర్పడే అవకాశాన్ని కల్గిస్తాయి.

ఇంతవరకు పరిశీలించిన ప్రహసనాలలో కొన్నింటిలో అసభ్యత, అశ్లీలత అక్కడక్కడ కనిపిస్తాయి. కానీ ప్రహసనమంతా వ్యాపించి వుండవు. ఒకటి రెండు విషయాలను పరిహరిస్తే మిగిలిన భాగమంతా అందరూ కలిసి ఆనందంగా నవ్వు కోటానికి వీలుగా వుంటుంది. అయితే సంస్కృత సాహిత్యంలో కొన్ని ప్రహసనాలు కేవలం బూతుల బుంగలు. వాటి సంఖ్య చాలా తక్కువే అయినా వాటికీ, సంస్కృత ప్రహసన సాహిత్యానికి ఏర్పడిన అపఖ్యాతి మాత్రం చాలా ఎక్కువ. గోరుచుట్టుపై రోకలిపోటులాగా అటువంటి ప్రహసనాలు ముందుగా ముద్రణకు నోచుకొని ప్రహసన సాహిత్య మంటే ఇదే కాబోలు అన్న భావాన్ని సామాన్యపాఠకులలోనే గాక, పండితులలో సైతం కలిగించగలిగాయి. అటువంటి ప్రహసనాలను అశ్లీల ప్రహసనాలని వ్యవహరించ వలసి వస్తుంది. ఆటువంటి ప్రహసనాలను ఒకటి రెండింటిని పరిశీలించటం ప్రస్తుతాంశం —

కాళిదాస ప్రహసనం

ప్రహసనం, కాళిదాస ప్రహసనం, లంబోదర ప్రహసనం, వేంకటేశ్వర ప్రహసనం, భానుప్రబంధ ప్రహసనం- ఈ అయిదు పేర్లతోనూ వ్యవహరింపబడే ప్రహసన మిది ఒక్కటే. కాళిదాస లంబోదర ప్రహసనములని ఆంధ్రానువాదంతో సహా ఇది ప్రకటింపబడింది కూడా! ఈ అనువాదంలో కొంత స్వతంత్ర భావకల్పన కూడ కన్పిస్తుంది. ఈ అనువక్త హాస్యకళానిధి అని మాత్రమే తన పేరును ప్రకటించు

---

1 వేదీ సజ్జఘనం చ తత్పరిసరే కుండం వరాంగం ఫలం
నైవేద్యాయ కుచద్వయం మృగ దృశః కామానల ప్రోజ్జ్వలః |
హోతాఽహం ఖలు శుక్ర హవ్య నివహాః శేఫః స్రువో వర్తతే
నిత్యం పంచశరాధ్వరం త్యజతి కః సద్యః సుఖం యత్ఫలమ్ || - 2-16.

కొన్నాడు. అయితే వేంకటేశ్వర కర్తృకంగా మరొక లంబోదర ప్రహసనం రామ్ జీ ఉపాధ్యాయచే పేర్కొనబడింది. ఇవి రెండూ ఒకటి అవునో, కాదో తెలియదు. ఒకటే అన్నచో కర్త కాళిదాసా, లేక వేంకటేశ్వరుడా అని నిర్ణయించే అవకాశం ఉండేది.

అయితే ఈ ప్రహసనం ప్రదర్శనానికి ప్రతికూలం. పఠనమయితే ఏక వ్యక్తి పరిమితం కాబట్టి సర్దుకొనే అవకాశముండునేమో! అది కూడా అన్ని ప్రకృతుల వ్యక్తులూ పఠనాని కిచ్చగించక పోవచ్చును. కేవలం బండబూతులను కలిపి ప్రహసనంగా తీర్చిదిద్దుట ఈ రూపకంలో కన్పిస్తుంది. కథాకల్పన కన్నా బూతుమాటల బాటల తీర్పే మిన్నగా దర్శన మిస్తుంది. జీవితాలలో కొన్ని విషయాలు బహిః ప్రదర్శనార్హాలు, కొన్ని అంతర్నిగూఢార్థాలు, కొన్ని వక్తవ్యాలు, మరి కొన్ని గోప్యా లుంటాయి. గోప్యాలను వ్యక్తీకరించుట, నిగూఢాలను ప్రదర్శించుట అంత ఉచితం కాదు, ఆనందదాయకం కాదు, సభ్యతా స్ఫోరకం కూడా కాదు.

ఇది కాళిదాస కర్తృకంగా ప్రసిద్ధం. కర్తృత్వ ప్రశ్న ఇక్కడ ప్రధానం కాక పోయినా ఇటువంటి హాస్యానికి కాళిదాసును అనుబంధించటంలోని ఔచిత్యాన్ని గురించి ఆలోచించవలసిన అవసర ముంది. కాబట్టి కాళిదాస కర్తృకత్వాన్ని కొంత పరిశీలించాలి.....

ఇది కాళిదాసకర్తృకమని ప్రతిపాదిస్తూ కాళిదాస లంబోదర ప్రహసన ప్రచురణకర్త - యస్. చిన్నయ ఇలా పలికినాడు-

“భోజరాజు కంఠములో నొక వ్రణము పుట్టెనని యెక్కువగా నవ్వినగాని, యా వ్రణము పరిపక్వమునకు రాదని వైద్యులు సలహానీయుట వలన కాళిదాసీ ప్రహస నమును రచించి పంప భోజరాజు మిక్కిలిగా నవ్వుటచే అతని కంఠమున గల వ్రణము పరిపక్వమునకు వచ్చెనని అనాదినుండి అనుకొనెడి జనశ్రుతిని బట్టియు, డిండిమ ప్రహసనము కూడ ఇట్లే అవాచ్యములతో నుండుటవలనను, ప్రతాపరుద్రీయము మొదలుగా గల నాటకములయందు హాస్యరస పోషణమునందు అవాచ్యములే వాడి యుండుట వలనను ఈ ప్రహసనము మహాకవి కాళిదాస విరచితమని మా అభిప్రాయము – ‘తొడిమ’ (ఉపోద్ఘాతము) కాళిదాస లంబోదర ప్రహసనాలు.

పై కథను ఆధారంగా స్వీకరించి కాళిదాస కర్తృత్వమును నిర్ణయించుట హాస్యాస్పదమైన విషయం. పై పెచ్చు కాళిదాస కర్తృత్వాన్ని నిరసించటానికే

గ్రంథస్థాలైన ప్రమాణాలు కూడ కొన్ని కనిపిస్తున్నాయి. ప్రహసనమ్ అను పేర వావిళ్ళ వారు ప్రచురించిన ఈ ప్రహసనానికి పీఠిక వ్రాస్తూ, ఉత్పల వేంకట నరసింహాచార్యులు –

“తత్తాదృశమిద మభిజ్ఞాన శాకున్తలాదీనాం రచయితు ర్మహాకవేః కాళిదాసస్య కృతిరితి కేచి ద్విమర్మకాః మన్యంతే. నైతద్ యుజ్యతే. ప్రహసనే - శిష్యా లక్ష్మణ దేశికస్య సిత మృత్పుంఢ్ర స్ఫురస్మూర్తయః – ఇతి, దృశ్యంతే పురతో ధృతాంజన దృశో రామానుజీయాంగనాః - ఇతి చ విక్రమార్క సభాలంకారమణేః కాళిదాసా దర్వాచీనస్య శ్రీ భగవద్రామానుజగురోః నామగ్రహణేన తస్యాదర్వాచీనేనైవ కవినాఽవశ్యం భావ్యత్వాత్, వస్త్యుత్తంభిత తైలయంత్రముసల వ్యామోహకృన్మేహనం - కరే లగ్నో దీర్ఘపృథుర్ముఖస్రుతరసః కస్యాపి కామ ధ్వజః - ఇత్యాది పరశ్శత గ్రామ్య వచస్సాహిత్యాత్ తత్తాదృక్కాళిదాస మధురతరవచో విలాన విరహాచ్చ.” అంటాడు.

ఈ అంతః ప్రమాణాలనుబట్టి ఆలోచించినపుడు ఇది కాళిదాస కృతం కాదని నిర్ణయించవచ్చు. ప్రాచీన పండితులకు ఆధునిక పండితులలో అనేకులకు – మహా కర్మిష్ఠుల కైనను అసభ్య సంభాషణలు, అశ్లీల రచనలు చేయుట అలవాటై ఉండటాన్ని మనం గుర్తించవచ్చును. విశృంఖల శృంగారవర్ణనాత్మకాలైన భాణ ప్రహసన రూపక రచయితలలో అనేకులు బహుశాస్త్ర పండితులు. అయితే అంతమాత్రాన ఈ ప్రహసనాన్ని కాళిదాసకృతంగా నిర్ణయింపలేము. కాళిదాస రచనే అయి ఉన్నచో అసభ్యత, అశ్లీలతల విషయాన్ని అటుంచినా వాటిని వ్యక్తీకరించుటలోనైనా ఇంకా చమత్కృతి కన్పించి యుండెడిది. శైలిలో కూడ మరి కొంత విలక్షణత స్పష్టమై యుండెడిది. కనుక ప్రబలాధారాలు దొరికేటంత వరకు ఇది కాళిదాస విరచితం కాదనియే అనవలసివస్తుంది.

ఇక దీనిలోని కథ. వక్రనాసయమి నాయకుడు. గృధ్రి వేశ్య. జంబుకుడు, కాసరుడు వక్రనాసయమి శిష్యులు, దీర్ఘదంతుడు వక్రనాసయమి మిత్రుడు. అలాబూస్తని వేశ్య. విష్ణుమిత్రుడు వక్రనాసయమి ప్రతిద్వంద్వి. నిపుణిక వక్రనాసయమి భార్య.

జంబుకుడు తన సహపాఠకుడైన కాసరుని, గురువుగారి కొరకు నదీతీర్థం తెమ్మని పంపగోరుతూ ప్రవేశిస్తాడు. ఆ సమయంలో కాసరుడు అలాబూస్తని గుమ్మం ముందు నిదురిస్తుంటాడు. కాసరుడు తన ఖరప్రహార వృత్తాంతాన్ని కలవ

రిస్తుంటాడు. లేచిన తరువాత జంబుకునకు అన్యాసక్తుడైన తనను గురించి, అన్యాసక్త యైన తన భార్య గురించి చెప్పక తప్పదు. కౌలాచారాన్ని స్వీకరింపుమని జంబుకుడు సలహాయిస్తాడు. కాసరుడు నిష్క్రమిస్తాడు. దీర్ఘదంతుడు తల గొరిగించుకొని వస్తాడు. జంబుకుని ప్రతిభముందు తన గురుపత్నీ సమాగమ ప్రయతాన్ని, తత్పర్యవసానాన్ని చెప్పక తప్పదు. ఆ సమయంలో వక్రనాసయమి పాఠప్రవచనం చేస్తూ ప్రవేశిస్తాడు. వక్రనాసయమి దీర్ఘతంతుని ఊరడిస్తాడు. అప్పుడే వచ్చిన కాసరునకు కౌలాచారాన్ని అనుగ్రహిస్తాడు. కౌలాచారం వలన దీర్ఘదంత కాసరులకు సఖ్యం, కాసరుని భార్యను దీర్ఘదంతునకు సమర్పించటం జరుగుతాయి.

వసంతోత్సవ దర్శనానికి వక్రనాసయమి, జంబుకుడు వెళతారు. అక్కడ వైష్ణవ - మాధ్వ - కర్ణాటకకాంతా - అద్వైతుల విమర్శనం. శిష్యుడు వినయనిధితో విష్ణుమిత్ర ప్రవేశం, నిష్క్రమణం. గృధ్రినాట్యం. ఆమెను కూర్పమని వక్రనాసయమి జంబుకుని బ్రతిమిలాడటం. వక్రనాసయమి నిష్క్రమణ. జంబుకుడు వక్రనాసయమి ఇంటికి వెళ్ళుట. ఆతని భార్యతో సంగమం. వక్రనాసయమిని రాజభటులు బంధించి తెచ్చుట. ఆతనిని అందరూ కొండముచ్చు అనుకోవటం. పర్యంతంలో యథార్థస్థితి ప్రకటీకృతి - నిష్కృతి. ఇది సభ్యతతో కూడిన మాటలలో చెప్పుకొనగలిగిన ప్రహసన కథ.

ఇది హాస్యమా? అయితే ఇది ఏ తరగతికి చెందిన హాస్యం? హాస్యం కాకపోతే దీని పరిస్థితి ఏమిటి? ఇది ప్రధానంగా విమర్శించవలసిన విషయం. అభినవగుప్తుడు ప్రహసనాధికారులు స్త్రీ, బాల, మూర్ఖాదులనుటలోని ఆంతర్య మేమిటో కూడ దీని వలన తెలిసే అవకాశం కన్పిస్తుంది. దీనిలో కనిపించే ప్రధానాంశం గోప్యవిషయ ప్రకాశం. తద్వారా కల్పింపబడిన సన్నివేశంలో మాత్రమే వికృతచేష్ట. వికృతచేష్ట హాస్యాలంబన మనుకున్నాం గదా! ఆ వికృతిలో కూడా మరీ హీనస్థితికి చేరినది ఈ ప్రహసనంలో హాస్యావలంబనం. వాగ్విషయకంగా సైతం అంతే హాస్యాన్ని కల్గించవలసిన వికృత చేష్టలు దీనిలో ఉన్నాయి. అయితే అవి ఒకచో హాస్య పరిధిని అతిక్రమించి కనిపిస్తాయి. మాన సంరక్షణ అనేది స్త్రీ పురుషుల కిరువురకు ప్రధానాంశం. మానవుడు నాగరకుడు అనటానికి ప్రధాన కారణమదే. అయితే శరీరంలో ఏ కొంత భాగానికో మాత్రమే ఆ గోప్యమానతావశ్యక మేమి? అని ప్రశ్నింపవచ్చును. అది అన్యత్ర విమర్శనీయం. దాని కిది వేదిక కాదు. కాబట్టి

నాగరకుల మనుటకు ఏదయితే ప్రధానకారణమో తత్పరిత్యాగమే ఈ ప్రహసనంలో హాస్యానికి ప్రధానాలంబనంగా కన్పిస్తుంది. అయితే ఇది నిజంగా హాస్యాన్ని కల్గిస్తుందా? అన్నది సంశయం-

పఠన కాలంలో మనస్సును ఉద్రిక్తపరచగల శక్తి, ఉద్రిక్త వాతావరణంలోని వికృతి ద్వారా నవ్వించగల శక్తి - అని రెండు కోణాలు దీనిలో కన్పిస్తాయి. హాస్యాలంబనమైన వికృతి కన్పిస్తుంది. కాని అది అసభ్య శృంగార మూలక మౌతుంది. శృంగారపరిధిని దాటి దానిలోని వికృతిని మాత్రమే గ్రహింపగల ఏ కొద్ది మందిలో మాత్రమే ఈ ప్రహసనం హాస్యాన్ని కల్గించగలదు. అందరూ శృంగారాన్ని వదలి వికృతిని ఆశ్రయింపలేరు. కేవల మా శృంగార సన్నివేశాల వలన ఉద్రిక్తులు కావడం తప్ప. అది కూడ కొంతవరకే. ఆ తర్వాత తత్పర్యవసానం జగుప్స. మానవుని మనఃప్రవృత్తిలో అది ప్రధానాంశం గదా! చాలా తక్కువ కాలం మానవునిలో కామ ప్రవృత్తి యథార్థంగా శృంగారాసక్తిని కల్గిస్తుంది. ఆ తరువాత ఎక్కువ భాగం అది జుగుప్సనో, విరక్తినో కల్గించేదే కాని, నియత నిరత శృంగార ప్రేరకం కాదు. కనుక అదేస్థితి ప్రహసనంలో కన్పిస్తుంది. ఆ సమయంలో వికృతిని మించి బయటపడిన కాముకప్రవృత్తి హాస్యానికి బదులు ఉద్రిక్తతను కలిగించి, ఆ తర్వాత జుగుప్సా రూపంగా పరిణమిస్తుంది. ఇటువంటి ప్రహసనాలు చదివినవారు, ఆ సమయంలో ఎక్కువ ఆసక్తితో చదివినా, నాలుక చప్పరించివేయుటకు ప్రధానకారణ మిదే! కనుక ఈ ప్రహసనంలోని వికృతి కన్నా ముందు ఉద్రిక్తత, ఆ తరువాత జుగుప్స బయట పడతాయి. చాలా తక్కువమందిలో మాత్రమే ఆ వికృతి హాస్యాన్ని కల్గిస్తుంది. ఆ భావాలు, పదజాలం మొదలైనవి అధమ ప్రకృతిలో హాస్యాన్ని కలిగిస్తాయి.

“నారీస్తన భర నాభీ దేశం
దృష్ట్వా మాగా మోహావేశం
ఏతన్మాంస వసాది వికారం
మనసి విచిన్తయ వారం వారం” —

అన్న శంకరాచార్యుని సూక్తి ఆలోచనలోనున్న కొంతసేపు దానిని మానవుడు విస్మరిస్తాడు. కొంత సేపే. ఆ సమయంలో అది అతనికి అజేయరాజ్యం. కాని ఆ తర్వాత అది జుగుప్సామూలం. అదే పరిస్థితి ఈ ప్రహసన పథకంలో కూడ.

మానవునిలో చాలా సున్నితాలైన శృంగార తంత్రుల్ని స్పందింప చేయటానికి ఉపయోగపడినట్లుగా, ఇది హాస్యాన్ని సృష్టించడాని కుపయోగపడదు. హాస్యసృష్టికున్న అనంతావకాశాలలో ఇది ఒకటి. స్వల్పమైనది కూడా. అయితే దీని సందరూ అంగీకరింపలేకపోవచ్చు. ఈ నాటికి కూడ ఈ నాగరక సమాజంలో విద్యావేత్తలలో, మేధావులలో సైతం అసభ్యభావోపబృంహితమైన వికృతినే హాస్యంగా స్వీకరించే లక్షణం కనిపిస్తుంది. అలా మాటాడేవాడిని చాలా చమత్కారంగా మాటాడుతాడని అనటం కూడా వినిపిస్తుంది. ఈ స్థితికి ఏది ఆలంబనమో అదే ఈ ప్రహసన స్థితికి ఆలంబనం. ఆ మాటలలోని హాస్యానికి ఎవ రధికారులో ఈ ప్రహసనంలోని హాస్యానికి కూడ వారే అధికారులు. కేవలం అనుభావాలమీద ఆధారపడి చేసిన హాస్య విభాగంలో ఈ హాస్యం దేనిలోనూ చేరకపోవచ్చును. కానీ హాస్యాన్ని స్థాయిలను బట్టి, దానిని స్వీకరించే ఆలంబనాలను బట్టి ఒక వేళ విభజిస్తే, అప్పుడు ఈ హాస్య మసభ్య శృంగార మిశ్రితమైన అధమ హాస్య మనవలసి వస్తుంది కానీ, నిర్మల హాస్య మనిపించుకోదు. అయితే వికృతే ఆలంబనంగా గల హాస్యంలో నిర్మలత ఏమిటి అనే ప్రశ్న వస్తుంది. కాని వికృతి ప్రతిదీ అనిర్మలం గావలసిన అవసరం లేదు. అసభ్యం కావలసిన ఆవశ్యకం కూడ లేదు. కాబట్టి ఆ వికారంలోని నిర్మలతాస్థాయిని బట్టి హాస్యాన్ని విభజించి వున్నట్లయితే హాస్యస్థితి మరో విధంగా వుండేదేమో!

ఇక హాస్య ప్రయోజనాలను బట్టి ఆలోచించినా ఇది ఉత్తమ హాస్యమనే ఆవకాశం లేదనిపిస్తుంది. ఉత్తమ హాస్యఫలం మనో విశుద్ధత, నిర్మలత, ప్రశాంతత, ఉల్లాసం మాత్రమే.

రాజాస్థానాలలో విదూషకుని లాంటి వాళ్ళుండటం కూడా ఇందుకే. ఈ ప్రహసన హాస్యం ఉద్రిక్తతను, శారీరక మానసిక వ్యాకులతను, పశుప్రవృత్తిని ప్రకోపింపజేస్తుంది. మానవులలో మౌలికంగా వున్న బలహీనతలను వికృతంగా చిత్రించే దిగంబర కవిత్వ మిది. అందుకే ఇది దిగంబర హాస్యం, తద్వారా దోష ప్రక్షాళనను కోరటం రచయిత లక్ష్యం కావచ్చు. ఈ గ్రంథంలోని శృంగార శ్లోకాలలో ఉదాత్తమయిన దానినిగా చూపగలిగిన శ్లోక మొక దానిని చూడండి-

వేశ్మద్వారి రతోత్సవేషు లిఖితుం యా రంగవల్ల్యైతయా
ప్రక్రాంతా కుచయో ర్ధ్వయం నిపతితం వ్యాలంబి లుంపే దితి |

పార్శ్వద్వంద్వనివిష్ట బాలక కర వ్యామృష్ణ వక్షోజయా
కర్తుం తాం నతయా తయా తతగరుత్మంకస్థితిః స్మర్యతే ||

కాళిదాస ప్రహసనం యొక్క అడుగుజాడలలో ఎక్కువగా నడచిన ప్రహసనం వేంకటేశ్వరుడు రచించిన ఉన్మత్త కవికలశ ప్రహసనం. సంస్కృత సాహిత్యంలో కొన్ని ప్రహసనాలు మరీ అసహ్యాస్థితికి చెందినవి. ఏ ఇద్దరూ కలిసి చదువు కునేందుకు వీలులేని ప్రహసనాలలో ఉన్మత్త కవికలశ ప్రహసనం కూడా ఒకటి. భారత సంస్కృతి మానవబలహీనతలను వీలయినంతవరకు దూరం చేయాలనే ప్రత్యేక ప్రయత్నంతో వుంటే, ఆ బలహీనతలకు నీరుపోసి పెంచేవిగా ఇటువంటి ప్రహసనాలు కనిపిస్తాయి.

ఈ ప్రహసనంలో ఉన్మత్తుడైన కవికలశ నామకుడు నాయకుడు. అతని ప్రవృత్తిని వర్ణిస్తూ రచయిత వ్రాసే శ్లోకాన్ని చూడండి —

దౌర్జన్యస్య తపఃఫలం సుచరిత స్యోత్పాత కేతుః కలే
రావృత్తి ర్దురితస్య గర్భసదనం మోహస్య కాశీ పరా||
తృష్ణాయాః పరదేవతాఽనత గిరాం సీమా ఖల శ్రేయసా
మాస్థానాం కలశస్స ఏష కవి రిత్యాయాతి మాయానిధిః || - 13

ఆనాటి దినవెచ్చమునకై అప్పుచేయటం లక్ష్యంగా కలశుడు బయలుదేరతాడు. అయితే అతని దగ్గర నుండి బాకీలు రాబట్టుకునేందుకు చాలా మంది తిరుగుతుంటారు. వారందరినీ తప్పించుకుంటూ అతడు ప్రక్కకు పోతుంటాడు. విధవలను వశం జేసికొని వారిని సనాథలను చేయటం ద్వారా మోక్షమార్గాన్ని చూపే పౌరాణికులు, మాధ్వ సన్యాసులు, మఠాధిపతులు, వారి శిష్యులు, వారి విశేషాలు అన్నీ దీనిలో ఉంటాయి. ప్రౌఢబాలకవుల ప్రవేశం, ఆ బాలకవి ఈ కలశుణ్ణి వర్ణించటం, ఎలా వుంటుందో చూడండి -

మత్కుణ వృశ్చిక మహిష ప్లవంగ కాలేయ కీట గోష్ఠశ్వానః |
పృథక్ పృథగవలోక్యాః కవికలశే దృష్టి గోచరే జాతే || - 47

విటచక్రవర్తి వైశ్యకుమారుడు; చేటితో కామక్రీడ నెరపి, ఆమె నిద్రించగానే ఆమె సొమ్ము దొంగిలించుకొని వచ్చిన బ్రాహ్మణుడు; ఏకస్తని అయిన తన భార్య ఎవడితోనో లేచిపోయిందని ఏడ్చే మరో మానవుడు - కడకు అతడు ప్రాపణికుడి దగ్గర అప్పుకు వెళ్ళడం, అక్కడ బాధలు - ఇదంతా దీనిలో ఇతి వృత్తం.

తన ఇంటి ప్రవృత్తికి మాత్రం పరిమితమైన ఏ వర్గమూ, ఇందులో కన్పించదు.

ఈ ప్రహసనంలోని హాస్యస్థితికి అసభ్యతా గతికి అతని భరత వాక్యాన్ని మాత్ర ముదాహరణంగా చూడండి -

"సాధుషు వివేకమత్యోః యోగో గాఢః శునో రత ఇవాస్తు |
త్యక్తురిభశేఫః తనురివదైర్ఘ్యం మర్త్యాయుషాం సదా భూయాత్" ||

ఇటువంటి వర్ణనలు, భావాలు కల్పించినది హాస్యం సృష్టించటానికి. మహా కవులు ఇంతకన్న ఉదాత్తంగా ప్రయత్నించకపోవటం పాఠకలోకం యొక్క దురదృష్టం. అయితే ఇటువంటి హాస్యాన్ని కూడా రహస్యంగా దాచుకొని, పఠించి ఆనందించే వ్యక్తు లుంటారు. అది మానవ మనస్తత్వం లోని బలహీనత.

అయితే ఇది అసభ్య శృంగార వర్ణన కాబట్టి అనుభూతి కలగవలసిన దానికి బదులు నవ్వు వస్తుంది. అంటే అది శృంగార దశను అతిక్రమించినదని అర్థం. అందుకే హాస్యరూపాన్నే పొందుతుంది. శృంగార మెప్పుడూ హార్దికంగా మిగిలి పోవలసిన అనుభూతి. బాహిరమైన చర్యలకు ప్రాధాన్యమిస్తే అది నవ్వుల పాలవుతుందనే నగ్నసత్యాన్ని మాత్ర మీ ప్రహసనాలు నిరూపిస్తాయి.

అలాగే కౌతుక సర్వస్వ ప్రహసనం, ధూర్త సమాగమ ప్రహసనం, అద్భుత తరంగ ప్రహసనం, ప్రాసంగిక ప్రహసనం, చండానురంజనం, వినోద రంగ ప్రహసనం, సోమవల్లీ యోగానంద ప్రహసనం, సుభగానంద ప్రహసనం, నాటవాట ప్రహసనం, చౌరచాతురీయ ప్రహసనం, అనంగదా ప్రహసనం, అనుకూల గళ హస్తకం, మణికాంచన సమన్వయ ప్రహసనం, కుహనాభైక్షవ ప్రహసనం మొదలయినవన్నీ ఈ అధ్యాయంలో పరామర్శించిన ప్రహసనాల (Farce) కోవకు చెందినవే. అయితే సర్వాత్మనా అశ్లీల ప్రహసనాలు కావు.

విపరీత ప్రవృత్తి ప్రహసనాలు

(COMEDY OF HUMOURS)

But deeds and language, such as man do use,
And persons, such as comedy would choose,
When she would show an image of the terms,
And sport with human follies, not with crimes,
Except we make them such by loving still
Our popular errors, when know they are ill:
I mean such errors, as you will all confess,
By laughing at them, they deserve no less[1]

అని బెన్ జాన్సన్, కామెడీ ఆఫ్ హ్యూమర్స్ (Comedy of humours) స్వభావాన్ని స్పష్టంచేశాడు. ఈనాడు మన ముపయోగిస్తున్నంత విస్తృత పరిధిలో 'హ్యూమర్' పదం 'కామెడీ ఆఫ్ హ్యూమర్స్'లో కనిపించదు. కొన్ని రకాలయిన మనఃస్థితులకు మాత్రమే అది పరిమితం.

ప్రాణుల వ్యక్తిత్వాలలో కొంత ఔచిత్య ముండాలన్న మౌలికాంశాన్ని అందరూ అంగీకరించాలి. ఆ ఔచిత్యంలో లోటుపాట్లు, తారుమార్లు కనిపిస్తే అవి హాస్యాస్పదాలూ, ప్రక్షాళనార్హాలు అవుతాయి. ఆ అంకాన్ని అనుసరించి Ben Jonson కామెడీ ఆఫ్ హ్యూమర్స్ అన్న రూపక ప్రక్రియను నిర్దేశించాడు. అతని నిర్దేశం శారీరక సూత్రాలను బట్టి ఏర్పడింది. మానవ శరీరంలో నాలుగు మౌలిక లక్షణాలుంటాయి. "black and yellow bile, blood and phlegm". భారతీయ సంప్రదాయం ప్రకారం వాత, పిత్త, శ్లేష్మాలు శరీరతత్త్వాలు. వాటి కలయికలో ఏర్పడే పాళ్ళభేదాలను బట్టి మనఃప్రవృత్తులు రకరకా లవుతాయి. ఒకడు పరమలోభి అయితే మరొకడు కేవలం సోమరి అవుతాడు. ఒకడు తిండిపోతు అయితే వేరొకడు తిరుగుబోతు కాగలడు. ఇవన్నీ ప్రక్షాళన చేయదగిన లోపాలు. ఇవి వ్యక్తిగత జీవితాన్ని, సామాజిక జీవితాన్ని సైతం దుఃఖమయం చేయగలవి. కాబట్టి జీవితాలను ఆనందరూపాలుగా మార్చాలంటే వీలయినంత మృదువుగా, సున్నితంగా, చమత్కారభరితంగా ఆ లోపాల నెత్తి చూపి ప్రక్షాళన చేయాలి. అందుకు సమకాలీన సంఘాన్ని ఆధారం చేసుకొని Ben Jonson చేపట్టిన ప్రక్రియయే Comedy of humours.

1 Prologue-Every man in his humour

ఆశ-లోభం-స్వార్థం - ఇవి ఇంచుమించు పర్యాయపదాలు. మానవుడి మనుగడను ఇవి తమ గుప్పిటలో నుంచుకొని ఆడిస్తాయి. వాటికి లొంగిపోవటం మానవనైజం. అయితే వాటికి లొంగినట్లు నటిస్తూ, వాటిని లొంగదీయవలసిన అవసరం మానవుల కెక్కువ. అప్పుడవి క్రమబద్ధాలై జీవితాన్ని సాఫీగా నడిపిస్తాయి. అటువంటి అవసరాన్ని గుర్తింపజేసి, ఆచరింపజేసేందుకు ఉపయోగపడే హాస్య రూపక ప్రక్రియ Comedy of humours.

సంస్కృత ప్రహసన సాహిత్యంలో ప్రాచీన ప్రహసనాలలో ఇటువంటి పాత్రలు అక్కడక్కడ కనిపించినా అవి ఇతర విశేషాల చాటున పడిపోయాయి. ఆధునిక ప్రహసనాలలో 'కామెడీ ఆఫ్ హ్యూమర్స్' ప్రక్రియకు సర్వాత్మనా లక్ష్యాలయిన ప్రహసనా లున్నాయి. ఈ శీర్షిక క్రింద వాటిని పరామర్శించటం జరుగుతుంది.

ఆధునిక సంస్కృత పండితులలో ప్రహసనాలకు విశేషంగా పరిగణింప దగిన వరివస్యను అందించినవాడు జీవన్యాయతీర్థుడు. దరిద్ర దుర్దైవప్రహసనం అతడి ప్రహసనాలలో పద్దెనిమిదవది. Ben Jonson చెప్పిన Comedy of humour లక్షణం చక్కగా దీనికి సరిపోతుంది. Alex Preminger వివరించిన Comedy of humours తత్త్వం[1] దరిద్రదుర్దైవ ప్రహసనంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇతివృత్తం పూర్తిగా కల్పితం.

వక్రేశ్వర శర్మ ఒక పేద బ్రాహ్మణుడు. వృత్తిరీత్యా యాచకుడు. అతనికి భార్యా, కుమారు లుంటారు. అందరూ తిండిపోతులే. ఒక రోజు తాను సంపాదించిన భిక్ష ఇంటికి వెళ్తే అందరికీ చాలదని, దానిలో కొంత కొంగుముడిని దాచుకొని గృహ ప్రవేశం చేస్తాడు. చాలీచాలని ఆ భిక్షను చూచిన భార్య మండోదరి మండిపడుతుంది. యథేచ్ఛగా భర్తను నిందిస్తుంది. వక్రేశ్వరశర్మ భార్యా పుత్రులను విడిచి పారిపోవా లనుకుంటాడు. కానీ మండోదరి అంగీకరించదు.

1 Jonson parades before his audience a variety of ecentrics marked by some particular bias of character, some folly or meanness, short, however of crime which prevents him being satisfactory human.

Encyclopaedia of poetry and poetics

భార్యా, కుమారులతో వక్రేశ్వరుడు వీథిన పడతాడు. ఎండ మండిపోయే సమయం. పిల్లలు దప్పికతో సొమ్మసిల్లుతారు. ఆ మార్గాన ఒక ధనికుడైన వర్తకుడు వెళ్తూ కనిపిస్తాడు. కాని అతని లుబ్ధత వీళ్ళకు సహకరించేందుకు సిద్ధపడదు.

ఈ పరిస్థితినంతా గగన మార్గాన వెళ్తున్న ఒక దేవతల జంట చూస్తుంది. వాళ్ళ దగ్గర అక్షముల జత ఉంది. అది అన్ని కోర్కెలను పూర్తి చేయదగిన శక్తి కలది. ఆ దేవతల జంటలో పురుషుడు ఆ పాచికల ద్వారా నీటిని తెప్పించి వక్రేశ్వరశర్మ పుత్రులకు అందిస్తాడు. అతని భార్య ఆ పేద కుటుంబానికి ఏదైనా సహాయం చేయమనగానే పాచికలను వక్రేశ్వర శర్మ కిచ్చివేస్తాడు ఆ పురుషుడు.

వక్రేశ్వరశర్మ బియ్యాన్ని ఇవ్వమని ఆ పాచికలను కోరుతాడు. అతడి పాత్ర నిండటమే గాక, చుట్టు ప్రక్కల ఉన్న ఇతర భిక్షుకుల పాత్రలు కూడా బియ్యంతో నిండిపోతాయి. అది చూచిన వక్రేశ్వరుడికి ఈర్ష్య పుడుతుంది. వెంటనే తనతో బాటు అందరికి మరల దారిద్య్రం సిద్ధించాలని పాచికలను అభ్యర్థిస్తాడు వక్రేశ్వరశర్మ. ఇతని మనస్తత్వంలోని దుస్థితిని చూచిన ఆ దేవతాపురుషుడు వెంటనే తన పాచికలను తీసికొని నిష్క్రమిస్తాడు. ఇది దీనిలోని ఇతివృత్తం.

మానవుడి మనుగడకు మౌలిక మయిన గుణం, అవ్యవస్థిత పరిణామంలో దోషం స్వార్థమే. స్వార్థం పరిహరిణీయం కానీ, పరిహసనీయం కానీ కాదు. అయితే ఆ స్వార్థస్థితి లుబ్ధతాదశకు చేరినప్పుడు అది హాస్యాస్పద మవుతుంది. వ్యక్తిలోని వివేకాన్ని చెడుపుతుంది. అప్పు డత డాశ్రయించే కుమార్గాలు, వాటివలన కలిగే దుష్ఫలితాలు ఒకచో అతనిపై జాలిని, వేరొకచో హాస్యాన్ని కల్గిస్తాయి. అటువంటి లోభాన్ని, దాని పర్యవసానాన్ని చిత్రించిన రచన కాబట్టి దరిద్ర దుర్దైవ ప్రహసనం Comedy of humours శాఖకు చెందిన రమణీయ రూపకం.

ఈ ప్రహసనంలో సన్నివేశాలకన్నా పాత్రలు విపరీతంగా ఆకర్షిస్తాయి. అనగా పాత్రల కోసం సన్నివేశాలే గానీ సన్నివేశాల కోసం పాత్ర లిందు కనిపించవు. ప్రతిపాత్ర లుబ్ధమే. అది కూడ మరీ వికారదశకు చెందినది. ప్రాణికి జీవనావకాశం విస్తృతంగా ఉన్నప్పుడు ఆ పరిధిలోనికి చాలమందికి ప్రవేశం లభిస్తుంది. కానీ ఆ అవకాశాలు తగ్గినపుడు ఆ పరిధిలో మరెవ్వరికీ తావుండదు, భార్యాపుత్రులకైనా సరే. పరాకాష్ఠకు చెందిన అటువంటి స్వార్థానికి ప్రతినిధి వక్రేశ్వర శర్మ. ప్రవృత్తిని బట్టి ఏర్పడిన పేరు. భార్య మండోదరి సార్థక నామదేయం గలదని ఆమె భర్తయే

అంగీకరిస్తాడు. ఇక కుమారులు లంబోదర షడాననులు. వారికి వయస్సుకు మించిన భోజనశక్తి సిద్ధించినదని వక్రేశ్వరుని తీర్పు. మార్గమధ్యంలో కలిసిన బాటసారి క్షుద్రారాముడు. అతని లుబ్ధత, దాని లోని దానశీలత పరిహాసభాజనాలు. ఇక వీరెవ్వర్ని గూర్చి మనం బాధ పడటం గానీ, జాలి పడటం కానీ చేయనవసరం లేదు.

యథార్థానికి వక్రేశ్వరుడి మీద, అతని కుటుంబ సభ్యులమీద మనకు జాలి కలగాలి. మనం సానుభూతిని ప్రదర్శింపగలగాలి. కానీ మన మనస్సందు కంగీకరించదు. వారు ఆకలికి బాధ పడటంకన్న తిండిపోతుతనాన్ని ఎక్కువ ప్రదర్శిస్తారు. క్షుధాతురుడిపై జాలి చూపవచ్చు కానీ, తిండిపోతుపై అవసరం లేదు. అందుకే ఆ కుటుంబంలోని ఏ ప్రాణితోనూ మనకు సానుభూతి కలుగదు. రాజ్యాలు పోయినా లక్షణాలు పోని వ్యక్తి వక్రేశ్వరుడు. భిక్షానికి వెళ్ళినా అహంకారం తగ్గదు. తన దురదృష్టాన్ని నిందించుకుంటూ అతడన్న శ్లోకాన్ని చూడండి.

ద్వారి ద్వారి నివారితోఽపి విచరన్ హా సారమేయో యథా
దండం కుత్ర చ తండులం కిల లభే ముష్ట్యామితం కష్టతః ।
ప్రత్యాఖ్యానపరం గృహస్థనికరం దుశ్శ్రావ్య శాపాక్షరై
రూక్షైర్బుక్కరవైః కరోమి విధురం త్వాస్ఫాలనం నిష్ఫలమ్ ॥

అతని జీవితంలోని మరో విచిత్రం, భార్య అధిక్షేపించేందుకు సంపూర్ణంగా లభించిన అవకాశం, అతనికి అది ద్వితీయ వివాహం కావటమే. శక్తి యుక్తులను ఆలోచించకుండా ద్వితీయ వివాహానికి సిద్ధపడట మతని నేరం. అయితే అతని జీవితంలో అత్యంత బాధాకరమైన అంశం లుబ్ధతయే.

అన్ధః కుష్ఠీ దరిద్రో వా ప్రతివేశీ వరం భవేత్ ।
సమాన ధనగర్వేణ స్పర్ధమానో హి దుస్సహః ॥

ఇది అతని మనస్తత్వంలోని కేంద్ర బిందువు.

"సర్వేషాం తండులాగమో మమ కర్మఫలేన సమానో యది స్యాత్ తదా వరం మే దారిద్ర్యమ్" – ఇది అతడి ప్రగాఢ నిర్ణయం. ఇటువంటి వ్యక్తిత్వమున్నా అతడు 'హరేరామ' అని పదేపదే అనుకుంటూ తృప్తి పడుతుంటాడు.

ఇక క్షుద్రారాముడి పాత్ర, దాని నాశ్రయించిన సన్నివేశం, ఈ ప్రహసనానికి పతాకాయమానం. 'జయరాధే' అనేది అతని ఊతపదం. పలికే ఊతపదాలకు

ఆశ్రయించే ప్రవృత్తికి లంగరు కుదరక పోవటం హాస్య హేతువు గదా! క్షుద్రారాముడు కోటీశ్వరుడు కాగలడని ఒక సిద్ధాంతి చెప్పి వుంటాడు. అది నిజమయితే ఆ సిద్ధాంతికి లక్షరూపాయలు ఇవ్వాలని పూర్వసంకల్పం. ఇక పశ్చాత్ప్రవర్తన ఎలా వుంటుందో తానే వివరిస్తాడు. చూడండి.

ఆశాసాఫల్య సంస్పీతం చిత్త మన్యాదృశం భవేత్ ।
అంగుష్ఠ దర్శనం కుర్యా ద్దేవాయ చ ద్విజాయ చ ॥

అతో న కించిత్ దేయమితి సిద్ధాంతః.

అని వ్యంగ్యార్థాన్ని విడమరచి మరీ చెప్తాడు. అటువంటి క్షుద్రారాముడికి వక్రేశ్వరశర్మకు మధ్య సంభాషణ. ఒకడు లుబ్ధయాచకుడు. మరొకడు లుబ్ధదాత. ఆ హృద్యమైన సన్నివేశాన్ని ఆస్వాదించండి -

వక్రే : తద్దేహి నః కాంచన భిక్షామ్

క్షుద్రా : ఆః (స్వగతమ్) కాంచన భిక్షాం, న రజితం న తామ్రం న తండులం యాచతేయమ్ ....

... ...

క్షుద్రా : పథి భిక్షాదానం మే పిత్రా నిషిద్ధమ్. జయరాధే! గృహం గతేభ్యో యాచకేభ్యో దీయతే యథాశక్తి ధనాదికమ్-

పాపం హీనస్థితిలో నున్న వక్రేశ్వరశర్మ క్షుద్రారాముడి ఇంటిదాకా వెళ్ళి యాచించటానికి సైతం సిద్ధపడతాడు. ఆ తరువాత మాటలు చదవండి.

వక్రే : హరేరామ! యది గచ్ఛేయం భవద్భవనం కీదృశం దానం భవతో లభ్యతే?

క్షుద్రా : సర్వేభ్యో యథాశక్తి తావ ద్దీయతే. తుభ్య మపి తావద్దానం న హీయతే

వక్రే : తస్య పరిమాణం కియత్ ?

క్షుద్రా : పూర్వ పురుషక్రమాదేషా రీతి ర్వర్తతే యదా కదాప్యతిథి ర్న విముఖీ కర్తవ్యః. జయరాధే!

వక్రే : పూర్వ పురుషాణా మాదేశః కీదృశః? హరేరామ!

క్షుద్రా : తామ్రపణార్ధం దేయ మితి. జయరాధే!

వక్రే : హరేరామ! తామ్రపణమపి న లభ్యతే. ధన్యోఽసి కోటిపతే !

పాపం వక్రేశ్వరశర్మ చిన్నబోతాడు. క్షుద్రారాముడు ఏమీ ఇవ్వకుండ నిష్క్రమిస్తాడు. అప్పుడు వక్రేశ్వరశర్మ తన గొప్పతనాన్ని వర్ణించుకునే శ్లోకాన్ని చూడండి.

తృణేషు వంశః ఖచరేషు హంసః శూరేషు కంసో మశకేషు దంశః |
విప్రేషు వక్రేశ్వరశర్మనామా సంసార చక్రే విదితో న కేన ||

ఈ రీతిగా దరిద్రుడైన వక్రేశ్వరశర్మ తన గొప్పతనాన్ని ఎంతగా విస్తరించుకున్నా దుర్దైవం మాత్రం అతడిని విడువలేదు. అందుకే దరిద్రదుర్దైవం ప్రహసన మైంది. ప్రహసనం దరిద్రదుర్దైవ మైంది.

కౌండిన్య ప్రహసనం

తినేందుకు బ్రతకటమా? బ్రతికేందుకు తినటమా? అన్నది లౌకిక జీవితాలలో ప్రధానమైన ప్రశ్న. ఈ ప్రశ్నకెంత నిష్కర్షగా సమాధానం చెప్పినా, కోటి విద్యలు కూటి కొరకే అయినా, కేవలం తిండికోసం బ్రతకటాన్ని ఏ సంఘ మయినా అధిక్షేపిస్తుంది. తానెక్కువ తినటం, ఇతరులకు అసలు పెట్టకపోవటం రెండూ లోపాల క్రిందనే లెక్క. ఈ రెండు భిన్న భిన్న వ్యక్తులలో కనిపిస్తే అదొక పద్ధతి. ఒకే వ్యక్తిలో ఉంటే అది మరీ విశిష్టత. ఒకనాటి సమాజం దానం చేయటాన్ని మహోన్నత ధర్మంగా భావించినా, ఈనాటి సమాజ మనేక సందర్భాలలో యాచనను పూర్తిగా తిరస్కరిస్తోంది. దాని వలన ఏర్పడుతున్న దుష్పరిణామాలు - సోమరితనం పెరిగిపోవటం వంటివి - కారణా లయితే కావచ్చును. అయినా ఎంగిలి చేత్తో కాకిని తోలనివాడంటే లోకం ఈసడిస్తుంది. అటువంటి వ్యక్తి గృధ్రనాసుడు. అతని భార్య జిహ్మల. వీరిద్దరూ మహాలింగశాస్త్రి రచించిన కౌండిన్య ప్రహసనంలో ప్రత్యక్షమవుతారు.

అయితే ఈ కౌండిన్య ప్రహసనంలోని కౌండిన్యుడు గృధ్రనాసుని తలదన్నే వాడు. అతడు మృష్ట భోజన ప్రియుడు, అది కూడా పరుల గృహాలలోనే. ఎక్క డెక్కడి వాసనలనూ పసిగట్టి, ఆహారపదార్థాల చిరునామాలను తెలిసికొనగల్గిన 'డిటెక్టర్' కౌండిన్యుడు. అసలు వాళ్ళవంశమే తిండికి పెట్టింది పేరు. ఆ వంశానికి పేరును ఇనుమడింపజేసే వాడితడు. కేవలం పై మూడుపాత్రలమీద ఆధారపడి సాగిపోయిన రసనీయ ప్రహసన మిది. తిండిపోతుదనం దీనికి కేంద్ర బిందువు.

ప్రాతఃకాలాన్నే ద్వాదశిపారణ చేసి, మధ్యాహ్న మాకలవుతుంటే ఏం చేసుకొని తిందామా అని ఆలోచిస్తున్న జిహ్మలాగృధ్రనాసుల విచికిత్సతో ప్రహసనం

ప్రారంభమవుతుంది. పాపం జిహ్మాల తనకు తెలిసి, తాను చేయగల పదార్థాల నన్నిటినీ ఏకరువు పెడుతుంది. గృధ్రనాసుడు చిక్కుల్లో పడతాడు. దక్షిణ నాయకుడికి అనేక సతులతో ఎంత సంకటమో, రుచుల నేర్చిన వాడికి అనేక పదార్థాలతో అంతే శ్రమ అని తన గోడు వెళ్ళబోసుకుంటాడు. చివరకు గుడచిపిటకాన్ని నిర్ణయించి చెప్తాడు. తాను ద్రాక్ష, ఏలకులు తెచ్చేందుకు బజారు వైపు బయలు దేరుతాడు. కౌండిన్యు డెదురు పడబోతుంటే చాలా ప్రయాసమీద తప్పించుకొని పారిపోతాడు.

అక్కడ నుండి కొంత దూరం కౌండిన్యు డొక్కడే రంగస్థలాన్ని, ప్రేక్షకుల హృదయాలను ఆక్రమిస్తాడు. అతడి తత్త్వ మమోఘం, ఆచరణీయం కూడా!

అహో! పరాన్న భోజనం నామ స్వర్గ భోగో మనుష్యాణామ్. ఆతిథ్య సూత్రకారై ర్న్యూనం చిన్తారత్న మస్మద్ధస్త గతం విహితమ్. తథాహి-

కుతస్సంభార చిన్తా మే కుతో మే పాక సంభ్రమః ।
దేశకాల విదా పాత్రే సమితేనైన స్థీయతే ॥
కామ మవిగితేయ మీదృశీ పరాన్ననియమ చర్యా, యతః-
నార్థ సంగ్రహణే లోభో నేర్ష్యా స్వీతేషు గేహిషు
న స్వయం న పరాధీన మాతిథ్యే కేవలే స్థితిః ॥

పరాన్న ప్రతీక్షణాన్ని అష్టకష్టాలలో ఒకటిగా పెద్దలు నిర్ణయించారు. అయితే కౌండిన్యుడి అనుభవం దానికి విరుద్ధంగా ఉంది. ఆది స్వర్గతుల్య మని అతని ఏకాత్మ నిర్ణయం. ఈ విపరీత భావన ప్రేక్షకులను నవ్వులలో ముంచెత్తుతుంది. అయితే అతడి వ్యక్తిత్వాన్ని తర్వాత శ్లోకాల ద్వారా మనం అభినందించాలి. అతడికి పరధన సంగ్రహణం మీద ఆశలేదు. ఇతరులపై ఈర్ష్య లేదు. స్వపర భేదం లేదు. కేవలం పరగృహ భోజనాసక్తియే.

ఇక వారి వంశంలోని గొప్పతనాన్ని వివరిస్తాడు. అతడి పితృవ్యుడు వటికానాథ మిశ్రుడు – పేరులోనే పెన్నిధి వుంది. ఒకసారి అతడు ఒక స్పర్ధలో పాల్గొన్నాడట. ఆ సమాచారాన్ని గుర్తించండి.

కృత్వా పణం హి వటికాశత భక్షణాయ
పూర్ణే నవాధిక నవత్యశనేఽథ యస్య ।
ఉత్తీర్ణలోచన యుగస్య పురా ముమూర్షోః
శిష్టైక సంగ్రహరుచిం కృతినః స్మరన్తి ॥

ప్రాణంపోయినా పందెంమానని స్థిరచిత్తత, స్థితప్రజ్ఞత ఆ వంశంలోనే జీర్ణించుకుపోయిన గుణాలు. వారి వంశానికి లంబోదరుడే ప్రమాణదేవత.

అప్పుడు కర్తవ్యస్మరణ చేస్తుండగా తనను తప్పించుకొని పారిపోవటానికి ప్రయత్నించే గృధ్రనాసుడు కన్పిస్తాడు. అతని వాలకాన్ని పసిగట్టి, అతని ఇంటికే బయలుదేరుతాడు కౌండిన్యుడు. ఆ సమయంలో అతడు తాత్త్విక చింతన సారాన్ని రంగరించి ఒక కీర్తన పాడుతాడు. చూడండి-

చిన్తా నాస్తికిల శేషాం చిన్తా నాస్తి కిల
పరగృహభోజన పరితుష్టానాం నిత్యాతిథ్యోత్సవనిష్ఠానామ్
కాలత్రయవిరతోద్యోగానాం కించ సమేతాధిక భోగానామ్
గృహమేధినిమంత్రణ చిత్తానాం షడ్రస భరితాశన మత్తానామ్ -

ఈ కీర్తన రచయిత యొక్క హాస్యదృష్టికి కూడా నికషోపలం వంటిది.

జిహ్మల కౌండిన్యుడి రాకను గుర్తిస్తుంది. ప్రమాదాన్ని శంకిస్తుంది. గృధ్రనాసుడు కూడా కౌండిన్యుణ్ణి చూచి వెనుక ద్వారం గుండా ఇంటిలోనికి వెళ్తాడు. ఏలకులు, ద్రాక్ష మొదలగునవి అంతకు ముందే తయారై వున్న పదార్థంలో కలుపుతారు. ఆ వాసనను పసిగడతాడు కౌండిన్యుడు. వెంటనే ప్రమాణ పూర్వకంగా నిర్ణయం చేస్తాడు. ఆ విధానంలోని చమత్కారాన్ని పరిశీలించండి -

తజ్జిహ్మలా ప్రస్తుత మస్తి కించిత్
నూనం గృహాన్తర్గుడసంవిధానమ్ |
జిహ్వాజుషా మాధృత సంశయేషు
కిల ప్రమాణం రసనా జలార్ద్రా ||

కౌండిన్యుడు పశ్చిమ ద్వారం గుండా గృధ్రనాసుడి గృహాన్ని పావనం చేస్తాడు. వెంటనే తినేయాలన్న తపనతో గృధ్రనాసుడు వేడి తగ్గకముందే గొంతులో వేసుకుంటాడు. నోరూ, గొంతూ కాలుతాయి. హాహాకారాలు ప్రారంభిస్తాడు. కౌండిన్యుడు పరిశోధన కొనసాగిస్తాడు. అతన్ని తప్పించేందుకు వైద్యుణ్ణి పిలిచే మిషతో పంపివేస్తుంది జిహ్మల. అయితే సర్వవేత్త అయిన కౌండిన్యుడు అక్కడే దాక్కుంటాడు. గృధ్రనాసుడు మరల లేచి తినబోవటం - కౌండిన్యుడిదే పైచెయ్యి కావటం, చివరకు కౌండిన్యుడా గుడచిపిటకాన్ని భక్షించటం, క్రమంగా జరుగుతాయి.

భరతవాక్యం పలుకుతూ కౌండిన్యుడు నిష్క్రమిస్తాడు. ఆ భరత వాక్యం తోటే మనం కూడా ముగిద్దాం.

న వితరతి బుభుక్షా క్షీణ సత్త్వాయ భిక్షాం
యది గృహ ముపగమ్యోపాత్త దీనాక్షరాయ |
సువిహిత మపి భక్తం తస్య లుబ్ధస్య వక్త్రం
ప్రహరతు బుసకల్పం నీరసత్వం చ యాతు ||

రాగవిరాగ ప్రహసం

మంచికి చెడు అంటే ఇష్టంలేదు. చెడుకు మంచి అంటే ఆదరంలేదు. ఆది వాటి సహజ లక్షణం. అట్లే కొందరికి కొన్ని ఎప్పుడూ నచ్చవు. కొందరికి కొన్ని కొంత కాలం నచ్చవు. సకారణంగా అయినా నిష్కారణంగా నయినా రుచ్యరుచులు ఇలా సాగుతూనే ఉంటాయి. ఆనాడు ప్లేటో (Plato) కవిత్వాన్ని నిరసించాడు. ఈనాటి రాగ విరాగ ప్రహసనంలోని రాజు సంగీతాన్ని నిరసిస్తాడు. ఈ ప్రహసనం జీవన్యాయతీర్థుని సృష్టి.

సంగీతమంటే ఇష్టంలేని ఒకరాజు తన రాజ్యంలో సంగీతాన్ని, గాయకులను నిషేధిస్తాడు. అతని సైనికులు ఆ నియమాన్ని తు, చ తప్పకుండా పాటించేవారు. ఒక యువక దంపతుల సంగీత గాన శ్రవణంతో ఏర్పడిన పరిణామాలు పరిశీలించిన తరువాత, ఆ రాజు ఆ శాసనాల నన్నింటిని తొలగించి సంగీతాన్ని ఆమోదిస్తాడు. ఇది ఈ ప్రహసన సారాంశం.

ఈ ప్రహసనం, ఇందులోని హాస్యం కొంతవరకు సామాన్యం. ఆ తరువాత ఉదాత్తం. గానంచేస్తూ వచ్చిన భిక్షుకుని ద్వారపాలకుడు నిరోధించడం, తినుటకు గుడం కావాలంటే ఇక్కడ లగుడమే లభిస్తుందని అనడం చక్కని హాస్యాలు. పారిపోతున్న ఆ భిక్షుకుని పట్టుకోవటానికి సైనికులు పరుగెత్తడం, అంతకు ముందే గాయకుడైన మరొక సైనికునకు ఇతర సైనికునితో గొడవరాగా వారిద్దరూ ఘర్షణ పడటం, గాయకుడు రెండవ వానిని పడవేసి పారిపోవడం చేష్టాగత హాస్యానికి ప్రదర్శనలో రక్తికి అవకాశాన్నిస్తాయి. సంగీతాన్ని నిషేధించిన రాజు ఒక దశలో సంగీతాన్ని అంగీకరించి, కానుకలు మాత్రం తీసికోకూడ దనడ మతని మనస్తత్వం లోని ఒకానొక వికృతిని ప్రకటించి నవ్విస్తుంది.

సంగీత ప్రాధాన్యాన్ని ప్రహసనాత్మకంగా ఉదాత్తంగా చిత్రించాలనే ప్రయత్నం, సఫలీకృతి ఈ ప్రహసనంలో కనిపిస్తాయి. అయితే చక్కని గానాన్ని ప్రదర్శనశాలలో అందించగలగాలి.

చిపిటకచర్వణ ప్రహసనం

పండుగనాడు ప్రదర్శింపబడిన ఈ సుమనోహర ప్రహసనం జీవన్యాయ తీర్థునిది. అర్థణా కోతికి అణాబెల్ల మని ఒక తెలుగు సామెత. ఆ రీతిగా చిన్న నష్టం పూడ్చుకొనేందుకు దానిమీద లోభంతో పెద్ద నష్టాలను కొని తెచ్చుకొనేవారు చాలా మంది కనిపిస్తుంటారు. అటువంటి వ్యక్తులను చూచినపుడు ఒక దశలో జాలిపడినా, అది దశాంతరంలో కడదాకా హాస్యాస్పదంగానే కనిపిస్తుంది. మనస్తత్వంలో మౌలికంగా కనిపించే ఒకానొక లోపమది. అనాదిగా మానవ నామ మేర్పడిన నాటినుండి నేటివరకు యిటువంటి భావాలు, ఆ వ్యక్తులు పరిహాసాస్పదులే. ఆ తత్వమే చిపిటకచర్వణానికి మూలం.

కపాలి ఒక కోటీశ్వరుడు. అతని భార్య రంగిణి. పంగురాముడు, మన్దర వాళ్ళ నౌకర్లు. పంగురాముడు కపాలి గొడుగును పోగొడతాడు. దానితో కపాలి బెంగపెట్టుకుంటాడు. మన్దర, పంగురాముడు గొడవ పడతారు. పంగురాముడు కపాలి చెప్పులను పారవేశాడని, తాను గొడుగును పారవేశానని మన్దర చెపుతుంది. దానితో కపాలి ఖంగుతింటాడు. పంగురాముడు ఆ పాదుకలను కుక్క తీసికొని వెళ్ళినదని చెప్తాడు. కపాలి దాని వెంటపడతాడు. దానిని కొట్టడంలో గొడుగు విరిగిపోతుంది. ఆ కుక్క కపాలిని కరుస్తుంది. వైద్యుడిని పిలిపిస్తారు. ఆ వైద్యుడు అది పిచ్చికుక్క అని, ఆవునేతిని త్రాగించాలని చెప్తాడు. డాల్డాతో పని పూర్తిచేయ మంటాడు కపాలి. కటి స్థానంలో వాతలు పెట్టబోతారు. కపాలి పిచ్చిపట్టినట్లు వైద్యుణ్ణి కరవబోతాడు. అతడు పారిపోతాడు.

రంగిణి తాంత్రికుణ్ణి పిలిపిస్తుంది. ఇంతలో పంగురాముడు రెండు జతల చెప్పులతో తిరిగివస్తాడు. ఒకటి పోయినచోట దొరికిందని, రెండవది తాను చెప్పుల కోస మేడుస్తుండటం చూచి, ఒక దయాళువు తన ఇంటినుండి తెచ్చిచ్చిన పాతజోడని చెప్తాడు. దానితో తన ప్రతిష్ఠ మంటగలిసిపోయినట్లు కపాలి బాధపడి పంగురాముణ్ణి కొట్టబోతాడు. అతడు పారిపోతాడు.

అప్పటికి నకిలీ తాంత్రికుడు వస్తాడు. కపాలి దగ్గరనుండి డబ్బుగుంజి దానిలో కొంత రంగిణి కివ్వట మతని ప్రణాళిక. కామినీ భూతం పట్టినదని అతడు కపాలికి చెప్తాడు. వైద్యుడు అది శ్వదంశ వికారమే అంటాడు. మూడు మాసాల వరకు ఇంట్లో అందరూ అటుకులు తినాలనీ, ఆ ఖర్చు మాత్రమే వైద్యాని కవుతుందనీ అంటాడు వైద్యుడు. ఖర్చులేదు కాబట్టి కపాలి ఒప్పుకుంటాడు. రంగిణి అంగీకరించదు.

అయితే స్వస్తిసాధనకై కలశంలో పంచరత్నదానం కొరకు 20 తులాల బంగారం వెయ్యాలని, అది 60 తులాలవుతుందని తాంత్రికుడంటాడు. ఒక తులం వేసి పరీక్షించుదామని కపాలి. సున్నతో కూడిన సంఖ్యయే వుండాలని తాంత్రికుడు. లేకుంటే అంతా పోతుందని కూడా చెప్తాడు. కపాలికి మత్తుమందిస్తాడు. కపాలి లేవగానే పంగురాముడు తాకినందువల్ల అది నీటిలో కలిసి పోయిందని కల్ల లాడుతాడు. రంగిణి వాటా ఆమె కిచ్చివేస్తాడు.

ఆశ మనిషికి అవసరం. అది దురాశ కాకూడదు. ఇది జీవిత సత్యం. రెండవ దానిని ఆశ్రయిస్తే ఇలా నవ్వులపాలు కాక తప్పదు. ఈ ప్రహసనంలో కపాలి ఆ కోవకు చెందినవాడు. తాము అనుభవింపక, సత్కార్యములకు వినియోగింపక వినాశోన్ముఖంగా బ్రతికి, బ్రతికించే ఇటువంటి వ్యక్తులను చూస్తే నవ్వువస్తుంది. ఇక వారి చేష్టలను గమనిస్తుంటే హేళన పట్టించాలనీ, ఎదురుగానే నవ్వాలని అనిపిస్తుంది. అయినా వారు తమ ప్రవృత్తిని సమర్థించుకుంటారు. రంగిణి అతనికి తగిన భార్య. భర్తనే మోసంచేసి డబ్బులాగవలసి వచ్చిందంటే నేరమనే కన్నా అవసరమంటే బావుంటుందేమో! నౌకర్లూ తగినవారే!

ఒకే రకం పక్షులన్నీ ఒకే గూటికి చేరతాయి అన్నది తెలుగుసామెత. అటువంటి వారు వైద్యుడు, తాంత్రికుడు. అయితే వైద్యుడికంటే తాంత్రికుడు తెలివైనవాడూ, తగినవాడు. కుక్క కరచిన వారెలా వుంటారో సప్రమాణంగా వివరిస్తాడు తాంత్రికుడు.

ఆత్మానం మన్యతే స్వస్థ మన్యాన్ సర్వాన్ వికారిణః
శ్వముఖాత్ పాదుక గ్రాహీ వికారగ్రస్త ఉచ్యతే ॥

ఖర్చులేని వైద్యం చెప్పినట్టే చెప్పి, బంగారం కాజేయగలిగాడు. తగిన రీతిగా శిక్షించ గలిగాడు. అతని వలన మోసం చేయబడే కొద్దీ కపాలి హాస్యాస్పదు

డవుతుంటాడు. అయితే తాంత్రికుడు అబద్ధాలు ఏమీ చెప్పకుండా యథార్థం చెప్పి మోసం చేస్తాడు. సున్నతో వున్న అంకెతోనే బంగారాన్ని వెయ్యాలని చెప్పేందుకు ప్రమాణాన్ని చూపెడతాడు.

అంకః శూన్యయతో గ్రాహ్యః స్వర్ణ త్రైగుణ్య కర్మణి |
శూన్యహీనో యదా హ్యంకః శక్యః సర్వలయ స్తదా ||

ఇటువంటి అభూత సాక్ష్యాలు చాలా చక్కని హాస్యాన్ని కల్గిస్తాయి. ప్రహసనాల లోని అనేక హ్యాస్యాంశాలలో ప్రధానమైనవి ఇటువంటి అభూతసాక్ష్యాలే.

రంగిణి పాత్రను, ఆమె పాతివ్రత్యాన్ని కవి చక్కగా వర్ణిస్తాడు. ఆమెకు పతిభక్తి ఎక్కువ. ఎప్పుడూ అతనికి నమస్కరిస్తుంది. స్తోత్రం చేస్తుంది కూడ. ఆమె పతి దేవుని కీర్తించిన ఒక శ్లోకాన్ని చూడండి.

నమోఽస్తు పతి దేవాయ బ్రహ్మవిష్ణు స్వరూపిణే |
చతుర్ముఖోఽసి కలహే తాడనే చ చతుర్భుజః ||

జీవన్యాయ తీర్థుని ఇతర ప్రహసనాలలోవలె ఈ చిపిటకచర్వణంలో కూడ కథాకల్పన, సన్నివేశ కల్పనలలోని హాస్యం మనోహరంగా ఉంటుంది. విశేషించి ఇందులో పాత్రలు సైతం హృదయాలను ఆకట్టుకుంటాయి. మృదువైన శైలిలో సున్నితములైన భావాలతో ఉదాత్తమయిన హాస్యాన్ని ఈ ప్రహసనంలో జీవన్యాయ తీర్థుడు సృష్టిస్తాడు. చెప్పులు పోయాయని ఏడుస్తుంటే ఎవరో దయాశాలి మరో పాత చెప్పుల జతను ఇచ్చినట్లు కల్పించుట మత్యంత ప్రశంసార్హమైన కల్పన, కుక్క కరచిన దొకరినయితే ఇంటిల్లపాదిని నేతితో అటుకులు తినాలనటం కూడా చక్కని ఛలోక్తి, హాస్యాలంబనం. జీవన్యాయ తీర్థుని ప్రహసనాలలో ఇది ఒక చక్కని ప్రహసనం.

ఆత్మస్తుతి ప్రహసనం, అమర్షమహిమా ప్రహసనం, ధన్యేయం గాయనీ కళా మొదలైన ప్రహసనాలు ఈ విపరీత ప్రవృత్తి ప్రహసనాల కోవకు చెందినవే.

కౌటుంబిక ప్రహసనాలు

(DOMESTIC COMEDY)

"A Counterpart to domestic tragedy: it (domestic comedy) is a form of drama about, predominently, upper middle or middle class life and characters. It has been particularly fashionable since late in the 19th century and as the words suggest is often concerned with family situations and problems"[1] - ఇది Domestic comedy (కౌటుంబిక ప్రహసన) నిర్వచనం, వివరణ కూడా. సాంఘిక జీవితంలో కుటుంబ వ్యవస్థ చాలా ప్రధానమైనది. కుటుంబసభ్యుల సంఖ్య, బంధువర్గాలతో ఆ కుటుంబానికున్న సంబంధాలు, వారి వారి శారీరక, మానసిక ప్రవృత్తులు, వారి ఆశలూ, ఆశయాలూ, అభిరుచులూ, వాటినిబట్టి ఏర్పడే అన్యోన్య సంబంధాలూ, పరస్పర వైరుధ్యాలూ - ఇవన్నీ కలిసి కుటుంబ జీవనాన్ని స్వర్గంగానో, నరకంగానో చేయగలవు. మానవతా సహజమైన వైవిధ్యం కొన్ని మార్లు వైరుధ్యాలకు తావునిస్తుంది. ఇటువంటి విలక్షణమైన కుటుంబవ్యవస్థ వినోద - విషాదాలతో పాటు, వికాస హాస్యాలకు కూడా ఆలవాల మవుతుంది

కుటుంబాలు ఆర్థిక వ్యవస్థ ననుసరించి మూడు విధాలుగా ఉంటాయి. సంపన్న కుటుంబాలూ, మధ్య తరగతి కుటుంబాలూ, పేద కుటుంబాలూ అని. వీటిలో కూడా వినోద విషాదాలకు సహజంగా సంపన్న కుటుంబాలో, పేద కుటుంబాలో ఆలవాలమైతే మధ్య తరగతి కుటుంబాలు వికాస హాస్యాలను అందిస్తాయి. అయితే ఈ నియమం తప్పనిసరి కాదు. సంపన్న కుటుంబాలూ, పేద కుటుంబాలు కూడా హాస్యాస్పదాలు కాకపోవు. కానీ మధ్య తరగతి కుటుంబాలలో తీరీతీరని ఆశలు, అందీఅందని ఆశయాలూ ఎక్కువ. అవి జాలిని కలిగించగలవు. అయితే జాలితోబాటు ఆ వ్యక్తుల స్థాయీ, ఆ ఆశల స్థాయీ ఒకొక్కసారి పొందిక కుదరనివై వ్యక్తులను హాస్యాస్పదులుగా చేస్తాయి. వారి ప్రవృత్తులలో వున్న మూర్ఖత, లంపటత్వం మొదలైనవన్నీ కలసి నవ్వులపాలు చేస్తాయి. ఈ స్థితి వారి మీద జాలిని మాత్రమే చూపకుండా హేళన చేయటానికి కూడా ప్రోత్సహిస్తుంది. ఇది డొమెస్టిక్ ట్రాజెడీకి (Domestic tragedy) బొరుసు. ఈ ప్రక్రియతో మిగిలిన

1 A dictionary of literary terms Cuddon P. 196

ప్రహసన విభేదాలు కూడా ముడిపడి వుంటాయి. అయితే ప్రాధాన్యాన్ని బట్టి కౌటుంబిక హాస్య ప్రహసనాలుగా నిర్దేశించబడతాయి.

సంస్కృత సాహిత్యంలో ప్రాచీనకాలంలో మధ్య తరగతి ప్రజల కథలు ఇతివృత్తాలుగా వెలువడిన సాహిత్యం తక్కువ. ఆధునికకాలంలో అటువంటి ప్రయత్నం విరివిగా జరుగుతోంది. ప్రస్తుతం అటువంటి కౌటుంబిక హాస్య ప్రహసనాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

లీలా విలాస ప్రహసనం

K.L.V.శాస్త్రిగారి ప్రహసన త్రయంలో లీలావిలాస ప్రహనన మొకటి. సంసారాల్లో ఉండే వైవిధ్యాలను, అభిప్రాయ భేదాలను, తత్పరిమాణాలను, తరాలలో కన్పించే అంతరాలను హాస్యధోరణిలో ప్రతిబింబింపజేసిన రచన ఇది. ప్రధానంగా దంపతుల అభిరుచులలో వైవిధ్య మున్నప్పుడు, సమన్వయ మార్గం దొరకనప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో చక్కగా వివరించే రచన. గృహ సమస్యలనూ, వాటి పర్యవసానాన్నీ మృదుహాస్య సరళిలో వెలువరిస్తూ ఇది కౌటుంబిక ప్రహసన మవుతుంది.

గౌతముడు చంద్రిక దంపతులు. లీల వారి పుత్రిక. సత్యవ్రతుడు కుమారుడు. లీల వివాహం సమస్య. గౌతముడు వేదాంతభట్టు అనే మూర్ఖపండితుడికి లీలనిచ్చి పెండ్లి చేయాలంటాడు. చంద్రిక సోమలుడు అనే త్రాగుబోతుకు – ధనం చూసి - తన బిడ్డ నివ్వాలంటుంది. భర్త పాండిత్యానికి ప్రాధాన్యమిస్తే, భార్య ఐశ్వర్యాన్ని అభిలషిస్తుంది. అంతేగాని మూర్ఖతను గాని, త్రాగుబోతుతనాన్ని గాని ఇద్దరూ గుర్తించరు. లీలకు రెండు సంబంధాలూ ఇష్టం లేదు. తన అన్న సహకారంతో అతనికి మిత్రుడైన విలాసుని పెండ్లాడటంతో కథ ముగుస్తుంది.

ప్రహనన లక్షణాల్లోని ఆధునికత ఈ ప్రహసనంలో సంపూర్ణంగా కన్పిస్తుంది. కథ, నిర్వహణ రెండూ ప్రాచీన ప్రహసనాల వంటివి కావు. అంతేకాక ఇది ఏడంకముల ప్రహసనం.

ప్రహసన ప్రారంభంలోనే సూత్రధారుణ్ణి భార్యానిధేయునిగా చిత్రించి చక్కని హాస్యానికి రచయిత అవకాశ మిచ్చాడు. సభాజనుల ఆనందం కోసం కలహాన్ని

అభినయించటానికి నటీ, సూత్రధారులు సిద్ధమయ్యే సమయంలో చంద్రికా గౌతముల యథార్థ కలహమే ప్రారంభం కావటంతో వారు నిష్క్రమించి, వీరు ప్రవేశిస్తారు.

ఈ ప్రహసనంలోని హాస్యం సంభాషణల మీద ఎక్కువ ఆధారపడుతుంది. చంద్రిక తన హేతువాదంతో, అహంకారపూరిత తత్త్వంతో గౌతముని అధఃకరించే ప్రతి సన్నివేశం హాస్యాస్పదమే. ధనమే ప్రధానమని నిరూపించేందుకు ఆమె చెప్పిన శ్లోకం రచయిత స్థాయిని పెంచుతుంది.

దుందుభిస్తు సుతరా మచేతనః తన్ముఖాదపి ధనం ధనం ధనమ్ |
కాంస్య పాత్ర మపి య న్నపుంసకం తచ్చ రౌతి హి పణం పణం పణమ్ ||

దుందుభి నుండీ, కంచు గిన్నెనుండీ ఉద్భవించే శబ్దాలను అనుకరించి ధన ప్రాధాన్యాన్ని నిరూపించడం చంద్రిక మేధాశక్తికి నికషాయమానం.

ద్వితీయాంకం ప్రత్యక్షర హాస్యరూపం. వేదభట్టు తన కుమారుడు వేదాంత భట్టుతో కలసి, వివాహాన్ని నిశ్చయం చేసుకునేందుకు గౌతముని ఇంటికి వస్తాడు. అయితే వారిముందు కూడా చంద్రిక స్థాయి తగ్గదు. ఆ సందర్భంలో వేదాంతభట్టు పాండిత్యం ప్రత్యేకంగా ఆకర్షించి, హాయిగా నవ్విస్తుంది. అతని తెలివి తక్కువతనం ఆ పాండిత్యంలో స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. అవసరం లేకపోయినా, అసందర్భ మైనా, ఏ మాటకైనా ఒక ప్రాచీన సూక్తిని ఉదహరించటం అతని లక్ష్యం. అందరూ కంబళిపై కూర్చునే సమయంలో చంద్రిక దాన్ని లాగేస్తుంది. అపుడు వేదాంతభట్టు "తృణాని భూమి రుదకం వాక్చతుర్థీ చ సూనృతా" అని హితోపదేశాన్ని వల్లించి, అత్తగారి ధార్మికత నభినందిస్తాడు. చంద్రిక వాళ్ళమీద కోపంతో మిరియాలు వేసిన మజ్జిగ తెచ్చియిచ్చినపుడు "పయోదుర్లభ మస్మాకం తక్రం శక్రస్య దుర్లభం" అని ప్రకటిస్తాడు. కడకు అత్తగారు వేగంగా నిష్క్రమించినపుడు "ధర్మస్య త్వరితా గతిః" అని సమర్థిస్తాడు. పెళ్ళి చూపుల ఘట్టం వింతగా ఉంటుంది. విష్ణుసహస్ర నామావళి, పురుషసూక్తం - ఈ రెండింటిలో వేదాంతభట్టు పండితుడు. సంగీతంలో కూడా- శ్రోతలకు లేకుంటే - అతనికి కొంత ప్రవేశం ఉంది. లీల వచ్చి, ముందు పురోహితుడికి ఆ తరువాత ఇతరులకు నమస్కారం చేసినప్పుడు వేదాంతభట్టు

యథాలాపంగా "దుర్జనం ప్రథమం వందే సజ్జనం తు తతః పరం" అని ఊరుకుంటాడు.

ఇక షష్ఠాంకమంతా ద్వితీయాంకం వలెనే ప్రహసన ప్రాయం. అది వివాహఘట్టం. గౌతముడు లీలావేదాంతభట్టుల వివాహానికి అన్ని ఏర్పాట్లు చేస్తూ ఉంటాడు. చంద్రిక అతనితో కలహించి పారిపోయింది. గౌతముడు "సా గర్దభీ గర్దభాత్ భీతా స్వయమేవ పలాయితా" అని నిర్భయంగా అంటాడు. అంతలోనే చంద్రిక ప్రవేశించగానే "సేయం శూర్పణఖా నామ రాక్షసీ పునరాగతా" అని ప్రకటిస్తాడు. ఇదంతా అతని అనుచిత ప్రవర్తనను సూచిస్తూ హాస్యం కలిగిస్తుంది. కొండొకచో ఇది మేధావిశేషం అనుకొనే అవకాశముంది, కాని వేదాంతభట్టు విషయంలో అది పొసగదు. లీలను తనకివ్వటం లేదని తెలిసిన తరువాత కూడ వేదాంతభట్టు నిశ్చితంగా "సన్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుం" అని వల్లిస్తాడు. అది బాధలో వచ్చిన మాటకాదు. ఏదో ఒకటి ఉదహరించాలన్న తపన మాత్రమే.

సన్నివేశగతమైన హాస్యం కూడా ఈ ప్రహసనంలో పుష్కలంగా లభిస్తుంది. ఒకవైపు గౌతముడు లీలావేదాంతభట్టుల వివాహానికి తతంగం జరిపిస్తుంటే, మరో వైపు చంద్రిక లీలాసోమిలుల వివాహానికి పూనుకుంటుంది. ఇద్దరు ప్రక్క ప్రక్కనే ఉంటారు. చంద్రిక శక్తి వలన సరంజామా అంతా - గౌతముడు పురమాయించినా - చంద్రిక దగ్గరకే వెళ్ళిపోతూంటుంది. పాపం వేదాంతభట్టు ఒక్కొక్క మాటే అంటుంటాడు. పురోహితుడు సమయానుకూలంగా "అస్మాకం వరస్య శని పీడా పరిహారార్థం తత్సర్వం దానత్వేన మన్యామహే" అనటం బాగా నవ్విస్తుంది. "గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం" అన్న సామెతను గుర్తు చేస్తుంది.

మధ్య తరగతి కుటుంబాల్లో సర్వసామాన్యంగా కన్పించే కలతలను హాస్య ధోరణిలో చిత్రించట మీ ప్రహనన పరమార్థం. విషాద సన్నివేశాలనైనా ఆనంద రూపంగా మలచుకోవటం దీనిలో కన్పిస్తుంది. ఉక్తిమూలక, సంభాషణ మూలక హాస్యాలకిది పుట్టినిల్లు. రచయిత దీనిని "An original farce in 7 acts" అని ముఖపత్రం మీదనే ముద్రించినా, సూక్ష్మవిభాగంలో ఇది చక్కని కౌటుంబిక ప్రహసన మవుతుంది.

ధరిత్రీపతి నిర్వచనం

బ్రతుకుతెరువు అందరి జీవితాలలోనూ ప్రధాన సమస్య. దానికోసం ఎన్నెన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుందో, ఎన్నెన్ని పాట్లు పడవలసి వస్తుందో, సంఘంలో వారి స్థానమెలా ఉంటుందో చక్కగా తెలియజేసే ప్రహసనం ధరిత్రీ పతి నిర్వచనం. సిద్ధేశ్వర చటోపాధ్యాయ రచన యిది. ఒక సామాన్య స్త్రీకి భర్తను నిర్ణయించట మెంత సమస్యో కూడా ఈ ప్రహసనం మనకు నిరూపిస్తుంది.

భగవానుడు ఒక చిన్న హోటల్ యజమాని. విశ్వకర్మ అక్కడ పనివాడు. ధరిత్రి భగవానుడి పుత్రిక. వీరు ముగ్గురే అక్కడ నిత్యనివాసులు, అల్పాహార శాఖా నిర్వాహకులు. మగవాళ్ళిద్దరూ వృద్ధులే. భగవానుడు ఈ సంఘంలోని శబ్దాలను వినలేక చెవులలో దూది పెట్టుకొని వ్యవహరిస్తుంటాడు. అప్పుడప్పుడు ఎవరో రావటం తప్ప ఆ హోటల్లో రద్దీ కూడా ఉండదు. ఆ వచ్చేవారు కూడా ధరిత్రి కోసం వస్తారు. అంతేకాని అక్కడ పదార్థాలు ఏమంత రుచిగా ఉండవని వారికి స్పష్టంగా తెలుసు. ఆ విషయం భగవానుడికి కూడా తెలుసు. అయినా తప్పదు. జీవిక ప్రధానాంశం కదా. ధరిత్రికి పెండ్లి చేయాలని వరనిర్ణయం కోస మప్పటికే కొన్ని సమావేశాలు జరిగే ఉంటాయి. అంతకు ముందే అటువంటి సమావేశ రూపంలో జరిగిన అవ్యవస్థ ఇంకా చక్కబడలేదు. ఆ సమయంలోనే మరల ఆ రోజు వరనిర్ణయ సమావేశాన్ని ఏర్పాటు వేస్తాడు భగవానుడు. అది ప్రహసన పూర్వరంగం.

లెక్కలు చూచుకుంటున్న భగవానుడు, గురక పెడుతున్న విశ్వకర్మలతో ప్రహసనం ప్రారంభ మవుతుంది. భగవానుడు విశ్వకర్మను పిలుస్తాడు. అతను పలికినా ఇతనికి వినిపించదు. కోపం వస్తుంది. కోపంలో 'బధిర' అని విశ్వకర్మను తిడతాడు. ఇది గొప్ప ఛలోక్తి. సంఘంలో సహజంగా చెవిటివాళ్ళు తమ మాటలు ఎదుటివారికి వినిపించటం లేదేమో అనుకుంటారు. హాస్యాత్మకంగా జరిగే వారిద్దరి సంభాషణలో భగవానుడు అప్పుల పట్టిక తయారు చేసి, వసూలు చేయమని విశ్వకర్మకు ఇస్తాడు. ఆ సమయంలోనే ఆనాటి సమావేశాన్ని గూర్చి చెప్తాడు. ధరిత్రి ఆ సభ తన కిష్టం లేదని చెప్పినా 'అంతా విధి' అని తండ్రి ఓదార్చుతాడు.

ఆ తరువాత గాడ్డోలికుడు, యుయుధానుడు, లఘువంచకుడు, దురంధరుడు, వరండలంబకుడు, హైయ్యంగులుడు వరుసగా కొంత కొంత వ్యవధిలో ప్రవేశిస్తారు.

వీరందరూ ధరిత్రి మీద వ్యామోహంతో వచ్చినవారే. వీరంతా ధరిత్రి కోసం గొడవ పడి, కొట్టుకొని పడిపోతారు. చివరగా విశ్వకర్మ ఒక్కొక్కడిని బయటి కీడ్చివేస్తాడు. ధనమదమత్తులైన వాళ్ళ చేష్టలు లాభాలాభాలను లక్ష్యపెట్టవని, అదే ప్రహసనమని భగవానుడు వాపోతాడు.

ఇది ఏకాంకిక కావటంతో కథాభాగం తక్కువ. సంభాషణా నిర్మాణ కౌశలం ఎక్కువగా కనిపిస్తుంది. సన్నివేశాలను, సంభాషణలను నిత్య వ్యవహారానికి దగ్గరగా తీసికొని రావటంలో రచయిత కృతకృత్యుడయ్యాడు. ఆనాటి సమావేశాన్ని గూర్చి భగవానుడు విశ్వకర్మకు చెప్పే సన్నివేశాన్ని పరిశీలించండి.

భగ : తత్ర తవ మస్తకమపి దత్త్వా సర్వం సుసిద్ధం కర్తవ్యం. రే మూర్ఖ! నను కథ్యతే మయా యద ద్యైవ నిర్వాచన సభా -

విశ్వ: నిర్వాచన సభా? అత్ర భవతఃపాన్థశాలయామ్ ! కస్య నిర్వచనమ్ ?

భగ: పతి నిర్వచనం రే గర్దభ ! పతి నిర్వచనమ్.

విశ్వ: పతిః కస్య ?

భగ: తవ (స్వగతమ్) ఉన్మాదం కరిష్యతి మామయం మూర్ఖః.

విశ్వ: మమ! నను భవాన్ కిం తర్హి అవసరం గ్రహీష్యతి –

విశ్వకర్మ, గాడ్డోలకుని బాకీ తీర్చమని అడిగే సందర్భంలో సంభాషణ ఎలా ఉంటుందో చూడండి.

విశ్వ: (గాడ్డోలకం ప్రతి) త్వం తు బహుక్షణం యావత్ ఉపవిష్ట ఏవ దేహి తర్హి

గాడ్డోలక: ఆసనే ఉపవిశ్య సుస్థిరో భవతు మే మాతులః. తతో దాస్యామి.

విశ్వ: కిం మాతులస్తే పూర్వభక్షితస్యాపి మూల్యం దాస్యతి ?

గాడ్డోలక: అత ఏవ మాతులః

సంభాషణలేకాక కొన్ని సూక్తులు కూడా హాస్యాత్మకంగా ఉంటాయి. “ఋణం ఖలు లక్షణ మాభిజాత్యస్య” “అర్థప్రదానే కాలక్షేప ఏవ నీతిః” మొదలైన చమత్కార సూక్తులు వాటి సారాన్ని జీర్ణించుకొని, జీవిత సత్యాలనుగా పారాయణం

చేస్తున్న సంఘంలోని చాలామందిని గుర్తు చేస్తాయి. దారి ప్రక్కన కన్పించే అల్పాహారశాల కావటంతో సంఘానికింకా దగ్గరగా వస్తుంది. దీనిలో చేష్టామూలక మైన హాస్య మెక్కువ. రూపకమంతా ప్రదర్శన ప్రధానంగానే కన్పిస్తుంది. నాటక ప్రదర్శనలు బాగా పెరిగిన ఈ రోజుల్లో ఆ మెలకువల కనుగుణంగా రచన సాగించటం అభినందనార్హమైన విషయం. ఈ ప్రహసనంలోని సన్నివేశాలన్నీ ఆంగికాభినయ ప్రధానాలే.

వరండలంబకుడు, లఘువంచకుడు పరస్పర స్పర్ధతో ధరిత్రిని ఒకేమారు వర్ణించే సన్నివేశం అస్తవ్యస్తమై పరిహాస భాజన మౌతుంది. చూడండి.

లఘు : రూపస్య గుణానాం వాస్యా ఉపమానం జగతి న విద్యతే ఏవ.

వరం : స్వయం స్వహస్తే నైవ.

లము : కుసుమ పేలవాం స్వకీయాం తను మావృత్య.

వరం : అత్ర సమాగతాన్ సర్వాన్.

లఘు : సుకఠోర మస్యాః పాన్థశాలాయాః

వరం : సుమహతా ప్రయత్నేన.

ఇటువంటివన్నీ ప్రదర్శనవేళలో విశేషంగా ఆకర్షించే అంశాలు. “నారీ ఖలు కారణం మహతః అనర్థస్య" అని భగవాను డన్నప్పుడు “అర్థస్యాపి” అని విశ్వకర్మ “ధరిత్రీ రూప సమాకృష్టః ఏవ క్రేతృవర్గః అత్ర సమాగచ్ఛతి” అని చేదు నిజాన్ని తెలియజేస్తాడు. సంఘంలో అటువంటి చేదు నిజాలు జీవించి ఉన్నంత కాలం ఇటువంటి ప్రహసనాలకు క్షతి లేదు.

ఛలితాధమర్ణం

అభిరాజేంద్ర మిశ్ర వ్రాసిన మరో చిన్న ప్రహనసం ‘చలితాధమర్ణం’. దీనిలో కథకాని, హాస్యసరణి కాని బాగా తక్కువ. పర్యంతహాస్య పర్యవసాయిత్వమే దీనికి ప్రహసనత్వాన్ని చేకూర్చి పెడుతుంది.

ధనమే జీవితమనే తండ్రి శిరోమణి తన కొడుకు ఆలోకుడికి ఒక భాగ్యవంతుల పిల్లను తెచ్చి పెండ్లి చేయాలని ఉబలాటపడతాడు. ఆ కుమారుడి కది ఇష్టం లేదు.

ఈ అభిప్రాయ భేదాలు ఎంతకూ తెగవు. దానితో తండ్రి గుండెపోటు వచ్చినట్లు నటించి, కొడుకును మోసగించి, వివాహానికి అంగీకరింపజేస్తాడు. అది నటన అని తెలియని కుమారుడు తండ్రి మాటకు తల వొగ్గుతాడు. ఇది ప్రహసనంలో కథ.

ఇది ఆధునిక సమాజంలో చాల ఇళ్ళలో జరిగే భాగవతమే. తరాలలో అంతరాలు, అభిప్రాయాల్లో వైవిధ్యం తప్పని సరియైనందున ఇది సర్వసాధారణ సమస్యగా పరిణమించింది. ఈ సమస్యకు సరియైన పరిష్కారం స్పష్టంగా లేదు. ఈ ప్రహసనంలో రచయిత చూపించిన పరిష్కారం యథార్థ జీవితాల్లో అంత తేలికగా సంభవించదు. అందుకే ఇది ప్రహసనమైంది. ఈ ప్రహసనాన్ని చదివిన యువతరం పెద్దవాళ్ళకు నిజంగా గుండెనొప్పి వచ్చినపుడు కూడా నటన అనుకుంటే ప్రమాదమే మరి. ప్రహసనంలోని సంభాషణాసరణి వ్యవహారానికి దగ్గరగా ఉండట మీ ప్రహసనంలో గమనించదగ్గ అంశం.

స్నుషావిజయం

తెలుగు నేలలో అత్తాకోడళ్ళ సంబంధానికి ఒక ప్రత్యేకత ఉంది. అనాదిగా ఆ సంబంధం తన ప్రత్యేకతను నిలద్రొక్కుకుని రాణిస్తోంది. దాన్ని కేంద్రీకరించి సుందరరాజ రచించిన ప్రహసనం 'స్నుషావిజయం'. ఈ కవి కేరళకు చెందినవాడు. 19వ శతాబ్ది ఇతని కాలం. డా. వి.రాఘవన్ స్నుషావిజయాన్ని ఒక ప్రహసనంగా పరిగణించాడు. అయితే డా. రామ్‌జీ ఉపాధ్యాయ తన 'ఆధునిక సంస్కృత నాటక్' గ్రంథంలో స్నుషావిజయాన్ని ఉత్సృష్టికాంకంగా[1] పరిగణించాడు. హాస్య సంఘటనలు ఈ రూపకంలో లేవనీ, అనుచిత ప్రవృత్తి ఉన్నప్పుడే హాస్య మేర్పడుతుందనీ, ఈ రూపకంలోని పాత్రలలో ఉచిత ప్రవృత్తియేగాని అనుచిత ప్రవృత్తి లేనందువల్ల హాస్యాని కవకాశం లేదని రామ్‌జీ ఉపాధ్యాయ అభిప్రాయపడ్డాడు. కానీ డా. రాఘవన్ అభిప్రాయ మంతగా పరిహరింపవలసినదేమీ కాదు. ఇది ఒక ప్రహసనమే.

---

1 ఉత్సృష్టికాంకే ఏకాంకో నేతారః ప్రాకృతాః నరాః
రసోఽత్ర కరుణః స్థాయీ బహుస్త్రీ పరిదేవితమ్ ||
ప్రఖ్యాత మితివృత్తం చ కవిబుద్ధ్యా ప్రపంచయేత్ |
భాణవత్ సంధి సంధ్యంగాన్యస్మిన్ జయ పరాజయౌ ||
యుద్ధంచ వాచా కర్తవ్యం నిర్వేద వచనం బహు || –

ప్రస్తావనలో ఈ కవి ప్రహసన లక్ష్యాన్ని ఇలా వివరించాడు.

సుగుణ స్నుషయా యోగం సుతస్యోద్వీక్ష్య దుర్ధియః |
న సహంతే పరం నార్యో న తథార్యాః కులస్త్రియః ||

సుచరితాసుగుణులు నవదంపతులు. దురాశ సుగుణుడి తల్లి. ప్రహసనానికి కేంద్రబిందువు ఆమెయే. ఆమె ఎవ్వరిని లెక్కింపదు. భర్త బ్రతికియున్నపుడు కూడా అతడు ఆమె అధీనంలోనే వుండేవాడట. కోడలు కొడుకును గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తోందని దురాశ అభిప్రాయం. ఆమె దానిని సహించలేదు. వాళ్ళిద్దరూ కలసి ఉండటాన్ని ఆమె ఎప్పుడూ సహించదు. కళ్ళలో నిప్పులు పోసుకుంటుంది. సుగుణుడే ఆమెను గూర్చి చెప్పిన శ్లోకాన్ని పరిశీలించండి.

"శ్వశ్రూజనః కాంక్షతి దుష్ట చిత్తో
గర్భం స్నుషాయా స్సురతం వినైవ |
ఆహార సంపత్తి మహో వినైవ
శరీర పుష్టిం గృహకృత్యయోగ్యమ్ ||

కొడుకూ, కోడళ్ళ మధ్య వికసించే అనురాగాన్ని విషమయం చేసేందుకు ఆమె సిద్ధపడి, కోడలు వంశాన్ని మొత్తం నిందించటం ప్రారంభిస్తుంది.

తస్యాః పితా విదిత ఏవ పురాతి దుష్టః
మాతా చ దుర్మతి రితి ప్రథితా పృథివ్యామ్ |
భ్రాతా విటోఽథ భగినీ వ్యభిచారిణీతి
ఖ్యాతా న వేత్సి ఖలు తత్కుల మర్భక! త్వమ్ ||

అంతేకాదు. నిర్దయగా కోడల్ని బంధించి, పస్తులు పెట్టి, బాధించమని కుమారుడికి సలహా ఇస్తుంది. తానో, తన కుమార్తెయో లెక్కగా కొంచెం కొంచెంగా సుచరితకు ఆహారాన్ని అందిస్తామని కూడా ఆమె సూచిస్తుంది. తన కూతురు కూడా ఒకింటి కోడలు కాబోతుందని తెలిసీ, ఆ రీతిగా ఎందుకు ప్రవరిస్తుందో చెప్పలేము. అయితే సుచరిత తన భర్త సహకారంతో అత్తగారి దౌష్ట్యాన్ని అరికట్ట గల్గుతుంది. ఈ ప్రహసనంలో కవి ఆడపడుచులను కూడా బాగా విమర్శిస్తాడు. నేటి సంఘంలో కొన్ని కుటుంబాల్లో పుత్రులకన్న పుత్రికలకు ప్రాధాన్యం కన్పిస్తుంది.

పుట్టినింటిని మొత్తంగా దోచుకోవటానికి కూడా సిద్ధపడే స్త్రీ రత్నాలకు సంఘంలో కొదవలేదు.

పుత్రీ నామా మూషికా జన్మ గేహాత్ ।
కించిత్ కించిద్వస్తు గూఢం హరేత్ కిం ?
... ...
వసనా యేదం విత్తం దాతవ్యం భూషణా యేదమ్ ।
భాజన కృతే మమేదం దేయమితి స్వం హరత్యహో దుహితా ॥

స్త్రీ అనురాగ రూపమనీ, విశేషించి అమ్మ ప్రేమైక రూపమనీ లోకమంతా విశ్వసిస్తోంది. అయితే ఆ అమ్మ అత్తగా మారగానే ఒక రాక్షసిగా ఎందుకు మారుతుందో లేక కనిపిస్తుందో అర్థం కాదు. యథార్థాని కది అనభిలషణీయమైన, అనుచితమైన ప్రవృత్తి. ఆ ఆనౌచిత్యమే దాన్ని హాస్యాస్పదం చేస్తోంది. కాబట్టి అటువంటి అనౌచిత్యంతో కూడిన స్నుషావిజయం ఒక ప్రహసనమే.

నవోఢా వధూః వరశ్చ

"నవోఢా వధూః వరశ్చ" అన్నది మరో ప్రహసనం. పట్టాభిరామశాస్త్రి దీని రచయిత. వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెండ్లి చెయ్యాలని తెలుగు సామెత. అయితే ప్రస్తుత ప్రహసనంలో ఒక అబద్ధం చెప్పి, పెండ్లి జరిపించడం కన్పిస్తుంది. మరో మాటలో - ఒక రహస్యాన్ని దాచిపెట్టి ఒక కళ్యాణాన్ని సాధించటం దీనిలో ప్రధానాంశం. కోమలాంగి, కృష్ణకుమార్ - వీళ్ళిద్దరికి పెండ్లవుతుంది. మంజుభాషిణి కోమలాంగి తల్లి. ఆమె ఎప్పుడూ కుమార్తెను అల్లుడికి దూరంగా ఉంచాలనే ప్రయత్నిస్తూ వుంటుంది. ఈ సందర్భంలో అనేక విధాలుగా హాస్యం సాక్షాత్కరిస్తుంది. కృష్ణకుమార్ అత్తగారి ప్రవర్తనను సహింపలేక ఒక రాత్రి కోమలాంగి అనే భ్రమతో పనిమనిషిని కౌగిలించుకుంటాడు. ఈ కడగండ్లన్నీ పూర్తి అయిన తరువాత ఒక శుభముహూర్తంలో కోమలాంగి తాను నపుంసక అని ప్రకటిస్తుంది. దోషాలను కప్పిపుచ్చి పెండ్లిండ్లు జరిపించి, సంసారాలను నాశనం చేస్తున్న చాలామందికి ఈ ప్రహసనం ప్రతిబింబం. నిర్వహణలో ఇది హాస్యరూపాన్ని ధరించినా పర్యంతంలో ఇది విషాదాత్మకమే అనవచ్చును.

ఉభయ రూపకం

ఈ అత్తా కోడళ్ళ సమస్యనే ప్రధానంగా చేసి, మరికొన్ని ఆధునిక విషయాలను జోడించి, కొనసాగించిన ప్రహసనం ఉభయ రూపకం. మహాలింగశాస్త్రి దీని రచయిత. ప్రొ. M. రామకృష్ణభట్ట దీనిని పరిచయం చేస్తూ దీనినొక Social satire గా పరిగణించాడు. కుక్కుటస్వామి కుటుంబ కథ దీనిలో ఇతివృత్తం. అతని భార్య, ఇద్దరు పుత్రులు, ఒక కోడలు, పనిమనిషి ప్రధాన పాత్రలు. సందర్భాన్నిబట్టి మరికొన్ని పాత్రలు ప్రవేశించి, నిష్క్రమిస్తుంటాయి.

కుక్కుటస్వామి కుటుంబం సమకాలీన సమాజంలోని హిందూ అవిభక్త కుటుంబానికి ప్రతినిధి రూపం. ఆ అవిభక్త కుటుంబాల్లోని కష్టాలు, గొడవలు అన్నీ దీనిలో ప్రతిబింబింపబడ్డాయి. కుక్కుటస్వామి ఒక వ్యవసాయదారుడు. అయితే అతడికి నగరవాసం, నాగరిక జీవితం మీద మోజు. పెద్ద కొడుకు ఛందోవృత్తి గ్రామీణ జీవితాన్నే ఇష్టపడి, పొలంపనులు చేసుకుపోయేవాడు. అతని భార్య శంప. భాగలుడు కుక్కుటస్వామి రెండవ కొడుకు. పట్టణంలో చదువుతుంటాడు. అక్కడ ఒక అమ్మాయిని ప్రేమిస్తాడు కూడా. కుక్కుటస్వామి మరో సంబంధాన్ని నిశ్చయించి కొడుకును పిలిపిస్తాడు. దాంతో ప్రహసనం ప్రారంభ మవుతుంది.

ఈ ప్రహసన ప్రస్తావనలోనే రచయిత సూత్రధార విదూషకుల సంభాషణలో ఆచార పరిచ్యుతులైన ఆధునికుల పరిస్థితిని మృదువుగా అధిక్షేపించి, చక్కని హాస్యం సృష్టిస్తాడు. ఆ సంభాషణను పరిశీలించండి.

సూత్ర : కిం తావత్తే గోత్రనామ?

విదూ : తత్ఖల్వభివాదన వాక్యే పఠ్యతే

సూత్ర : తదేవ పృచ్ఛామి

విదూ: (సరోషమ్) కథ మంగాన్ పృష్టః కళింగా నుపక్షిపసి. అతః పరం సంధ్యా వందన మపి పృచ్ఛసీతి మన్యే (పునః సానునయమ్) భవతు యత్సత్యం చిరాయ వృద్ధాభివాదన విచ్ఛేదాత్ అభివాదన క్రమ ఏవ మయా విస్మృతః.

సూత్ర: సంధ్యావందనే కా కథా?

విదూ: సమ్యక్పృష్టం భావేన. అనభ్యాసాత్ సర్వం జన్మాంతర వాసనా ప్రాయం

ప్రయత్నోద్భేదన సాపేక్షం వర్తతే -

ఛాగలుడు ప్రవేశించగానే ఆ ఊరిలో ఉపాధ్యాయుడైన వజ్రఘోషునితో చర్చ జరుగుతుంది. వజ్రఘోషుడు ఆధునికతకు వ్యతిరేకి కాకపోయినా కుహనానాగరికతకు మాత్రం వ్యతిరేకి. అందుకే కుక్కుటస్వామికి వజ్రఘోషుడికి ఎప్పుడూ చుక్కెదురు. వజ్రఘోషుడి ద్వారా తన తండ్రి తనను పిలిపించడానికి కారణం తెలిసికొన్న ఛాగలుడు ఆశ్చర్యపడతాడు. అప్పటికే అమ్మ, వదినల ఘర్షణ తారాస్థాయికి చేరుతుంది. వాటితో విసుగెత్తి ఉన్న ఛాగలుడికి గురువుగారి దగ్గరనుండి వచ్చిన ఉత్తరం దారి చూపిస్తుంది. వారు అంతకు ముందే నిర్ణయించుకొని ఉన్న Hamlet (హామ్లెట్) అనే షేక్స్పియర్ నాటక ప్రదర్శనకై బయలుదేరి రమ్మని లేఖలోని సారాంశం. ఛాగలుడు సిద్ధపడి, మంగలి రావటంలో ఆలస్యం కావటంతో తానే గడ్డం గీచుకొని ఆ కేశ శకలాలను రహస్యంగా ఒక కాగితంలో కట్టి, కిటికీలో పడవేసి, పనిమనిషితో స్టేషన్కు వెళ్ళిపోతాడు. ఆ తొందరలో నాటకంలోని తన పాత్రను వ్రాసికొని ఉన్న కాగితం మర్చిపోతాడు. ఛందోవృత్తి ఆ పాత్ర సంభాషణలను చూసి, తమ్ముడు ఆత్మహత్యకు సిద్ధపడి పోయాడని భ్రమపడి, గ్రామ వైద్యుణ్ణి పిలిపిస్తాడు. ఆ అన్వేషణలో కేశ శకలాలను చూసి, అది గొప్ప విషమని వైద్యుడు నిర్ణయిస్తాడు. ఈ గందరగోళంలో ఛాగలుణ్ణి రైల్వే స్టేషన్లో దిగవిడిచి వచ్చిన సేవకుడు ప్రవేశించి, విషయమంతా చెప్తాడు. కథ సుఖాంత మవుతుంది.

గ్రామీణ భావాలతో పెరిగిన ఛందోవృత్తి ఆధునిక సంస్కారాన్ని విమర్శించటం సంఘంలోని అనేకుల అభిప్రాయానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

సకంచుక మురస్సదా సదన చంక్రమేష్వప్యహో
పదత్ర పిహితం యుగం చరణయో ర్వపుర్మానినః ।
ఉపోఢ ముపలోచనం వదతి సార్ధకాకుస్వరం
ప్రనర్తిత శిరోధరం ఝటితి కూణితం పశ్యతి ॥

ఫాలం విశోధయతి పుండ్ర మపోహ్యా తూర్ణం
సంధ్యాదికం నియతకర్మ నిరాకరోతి ।
ఉచ్ఛిష్ట దోష మవిమృశ్య చరత్యభోజ్యమ్
అభ్యస్యతి స్వయ మహో క్షురకర్మ దాక్ష్యమ్ ॥

వైద్యుడుగా ప్రవేశించిన సిందూరకుడి చేష్టలూ, మాటలూ బాగా హాస్యాత్మ-కాలుగా ఉంటాయి. కేశ శకలాలను చూసి మహావిషంగా ప్రకటించే ఆతని పద్ధతీ, వాదం చాలా తీవ్రంగా ఉంటాయి. చూడండి

సిందూరకః :- (విభావ్య) ఆయే మాతః । అస్మత్పూర్వ పర్వ పరా రహస్య మిదం మహార్ఘం కుష్ఠ చూర్ణమ్. అతి దారుణం ఖల్విదం విష మకుష్ఠినామ్, కుత ఏత స్యాభిగమః యుష్మ త్కుమారస్య?

తిన్త్రిణీ దళ మాత్రం ప్రాశ్య హాలాహలోపమమ్ ।
ముహూర్తం జీవితుం శక్యం న చేత్కుష్ఠార్దితో జనః ॥

గోత్రే ష్వాదీప్యతే దావః స్ఫుటతి త్వక్చ సర్వతః ।
పర్పటీస మితి ఖ్యాతం కాలచూర్ణం హి దారుణమ్ ॥

కష్ట మిదంభోః! అథ వివర్తమానః పునరప్యాసాదయిష్యే ప్రవృత్తిమ్.

అత్తా కోడళ్ళ అధిక్షేపణోక్తులకు పరమోదాహరణంగా నిలువదగిన ఒక సన్నివేశ భాగాన్ని చూడండి. అత్త పిప్పలి, కోడలు శంప.

పిప్పిలి: యది రాజదారవత్ సౌకుమార్యం లాలనీయమభిమన్యసే కుతస్తే విభవః? జనక ప్రభావేణ ఉత భర్తృ మహిమ్నా?

శంపా: అత్తికే! నాహం రాజదారాః. యుష్మాకం పుత్రస్యైవ దారాః యః జ్యేష్ఠోఽపి యుష్మాకం మనోరథేభ్యః దవిష్ఠః. యా రాజదారాః భాగ్యవతీ సా వంచనా అచిరాదలంకరిష్యతి వః సదనమ్. యూయంచ రాజపితరౌ రాజ్ఞీశ్వశురౌ విరాజిష్యథ.

పిప్పిలి: అహో తు భోః! అహో తు భోః! మారయతి మాం వాక్ప్రక్షేపణీభి రియం

ఇట్లే సిద్ధేశ్వర ఛటోపాధ్యాయుని 'ననావితాడనమ్'; K.L.V. శాస్త్రి రచించిన నిపుణికా, చాముండికా; విశ్వేశ్వరుని సంకర వివాహ ప్రహసనమ్; స్కంద శంకర ఖోత రచించిన 'హా హన్త శారదే'; శ్రీమతి K. కమల అనువదించిన 'అన్త్యేష్టి సంస్కార ప్రహసనం' మొదలయినవన్నీ ఈ కోవకు చెందినవే!

విపరీత విధాన ప్రహసనాలు

(COMEDY OF MANNERS)

Comedy of manners, in other words comedy of wit "has for it's main subjects and themes, the behaviour of men and women living under special codes. It tends to be preoccupied with the codes of the middle and upper classes and is, often marked by elegant wit and sophistication"[1] అని Cuddon ఈ రూపకాన్ని నిర్వచించాడు. విధానాలకు, సిద్ధాంతాలకు విపరీతమైన అన్వయాలను కల్పించి, ఆ రీతిగా వాద ప్రతివాదాలను నిర్వహించే వ్యక్తులు విపరీత విధాన ప్రహసనాలలో (Comedy of manners) ప్రధాన పాత్రలు. పాత్రలన్నీ ఛలోక్తి ప్రధానంగా, నీతి బాహ్యంగా కనిపిస్తాయి. వాక్చమత్కృతికి ఇందులో ప్రాధాన్య మెక్కువ. సన్నివేశాలు ప్రహసనాత్మకాలుగా కనిపిస్తాయి.

17వ శతాబ్ది చివరి భాగంలో ఆంగ్ల సాహిత్యంలో ఈ ప్రక్రియ రూపు దిద్దుకున్నది. ఆనాటి సాంఘిక పరిస్థితులలోని నైతిక పరిస్థితులను చక్కదిద్దే ఉద్దేశ్యంతో ఈ ప్రక్రియ తన స్వరూపాన్ని సంతరించుకున్నది. దీనినే Restoration comedy అని కూడా వ్యవహరిస్తారు. సంస్కృతంలో 7వ శతాబ్ది నుండి కూడా ఈ విధమైన ప్రహసనాలు కన్పిస్తాయి. మత్తవిలాస ప్రహసనం వంటి వట్టివి.

మత్తవిలాస ప్రహసనం

అసభ్యతకు కానీ, అశ్లీలతకు కానీ కొంచెం కూడా అవకాశ మివ్వకుండా పల్లవ చక్రవర్తి మహేంద్ర విక్రమవర్మ రచించిన ప్రహనన మిది. క్రీ.శ. 600 నుండి 630 మధ్య ఇతని కాలమని నిర్ణయింప వచ్చును.[1] కథా నిర్మాణంలో కానీ, పాత్ర చిత్రణలో కానీ ప్రత్యేకమైన మెరుపులు కనిపించకపోయినా పిండీభూత స్వరూపంతో చక్కని ప్రహసనంగా రాణించ గలిగిన దిది. అనగా ఏ పాత్ర మీదనో లేక ఏ ఒక్క సన్నివేశం మీదనో దృష్టిని కేంద్రీకరింపక హాస్యానుగుణంగా ఆద్యంతమూ తీర్చి దిద్ద బడిన ప్రహసన మిది.

దీనిని Comedy of manners కోటికి చెందిన దానినిగా నిర్ణయింప వచ్చును. దీనికి satire అనుబంధ మవుతుంది. సమకాలీన సమాజంలోని మతతత్త్వాలలో,

1 Introduction to Mattavilasa Prahasana by Kapila Devagiri

ఆయా మతాలలో కనిపించెడి - విశేషించి మత సిద్ధాంతాలలో కాక మతానుయాయులలో, ఆ అనుయాయుల వలన ఆ మత సిద్ధాంతాలు అపహాస్యం చేయబడటంలో - లోపాలను సూటిగా, సంక్షేపంగా, అధిక్షేపిస్తూ సాగిన రచన ఇది. ఆ ఆధిక్షేపణ కూడా ప్రయత్నపూర్వకంగా కొనసాగించినట్టు కనబడదు. కథతో పెనవేసుకొని కథానుగుణంగా ముందు హాస్యాన్ని అందించి, ఆపై అంతర్వాహినిగా ఉన్న అధిక్షేపణను వెలువరించే స్వభావం గల విశిష్ట రచన ఈ మత్త విలాస ప్రహసనం.

కాపాలికుడు దేవసోమతో కలసి మత్తుగా త్రాగి, ప్రసంగవశాత్తు మధ్యలో జైన ధర్మ స్మరణ చేయుట జరుగుతుంది. అయితే ఆ జైన ధర్మ స్మరణం వలన దూషితమైన జిహ్వాను ప్రక్షాళన చేసుకొనేందుకు అతడు మరల కాంచీపురం లోని సురశాలకు వస్తాడు. అక్కడ సుర త్రాగబోయి తన భిక్షాపాత్ర ఎక్కడో పోయిందని తెలుసుకుంటాడు. అది కనిపించకపోగా, లభించిన సురను నిరాదరించటం దోషమని నిర్ణయించుకొని, గోశృంగంతో సురాపానం పూర్తి చేసి, కపాలాన్ని వెతుకుతూ బయలు దేరతాడు. తన పాత్రలో శూల్య మాంస ముండుటవల్ల ఏ శునకమో, శాక్య భిక్షువో దాన్ని కాజేసి వుండవచ్చని అనుకుంటాడు. అదే సమయంలో ఒక శాక్య భిక్షువు తన బట్టల మాటున ఒక పాత్రను దాచుకొని ప్రవేశిస్తాడు. తన పాత్రనే అతడు దొంగిలించి దాస్తున్నాడని అనుమానించిన కాపాలికుడు అతడితో గొడవ పడతాడు. అయితే తగవు తీరనందు వలన పాశుపతుని న్యాయనిర్ణేతగా పిలుస్తారు. పాశుపతుడు విచారించే సమయంలోనే ఉన్మత్తకుడు ప్రవేశించుట, కుక్క దొంగిలించుకపోగా దాని దగ్గర నుండి తీసుకొని తన దగ్గరుంచుకున్న ఆ కపాలాన్ని కాపాలికుడు ఉన్మత్తుని దగ్గరనుండి స్వీకరించటం జరుగుతుంది. ఆపై ముందు ఉన్మత్తకుడు, ఆతరువాత పాశుపతుడు, ఆ తరువాత శాక్యభిక్షువు, ఆ తరువాత కపాలి దేవసోమలు నిష్క్రమిస్తారు. ఇదీ దీనిలోని కథాభాగం.

ఈ పాత్ర ప్రవేశ, నిష్క్రమణలలో ఒక చమత్కారముంది. పాత్రలు ఏ క్రమంలో రంగస్థలంపై ప్రవేశిస్తాయో దానికి వ్యతిరేకమైన క్రమంలో నిష్క్రమిస్తాయి. అంటే మొదట ప్రవేశించిన పాత్ర చివరవరకుంటుంది. ఆ తరువాతది నిష్క్రమణలో చివరి దానికన్న ముందున్నదవుతుంది.

ఇది ఒక చక్కని నాటకీయ ప్రతిభ. ప్రత్యేకించి దీని ద్వారా సాధించగల ప్రయోజనమంటూ కనిపించకపోయినా అతని నాటకీయ ప్రతిభని అభినందింపక తప్పదు. అందుకే చివరలో శాక్యభిక్షువు కూడ కపాలి దేవసోమలతో కలిసి నిష్క్రమించే అవకాశమున్నా భరత వాక్యానికి ఒక క్షణం ముందుగానే అతనిని నిష్క్రమింపజేస్తాడు కవి. సామాన్యంగా మరే నాటకంలోనూ ఇటువంటి సంవిధానం కనిపించదు.

ప్రస్తావనయందే మనస్తత్త్వాలలోని సున్నితమైన ఒక అంశాన్ని ఆధారం చేసుకొని, శ్లేషను తీసికొని, సున్నితమైన హాస్యాన్ని సృష్టిస్తాడు రచయిత. సూత్రధారుని పిలుపుచే వచ్చిన నటి "చాలా కాలానికి యౌవన గుణ భరమత్త విలాసాన్ని చూపించ టానికి వచ్చావా" అంటుంది. యౌవనగుణ భరమత్త విలాస ప్రహసనాన్ని రూపక పరంగా స్వీకరించి అవునంటాడు. అయితే "నీ వగలాడి తోనే చూపించు" (తయైవ తావత్ దర్శయ యా త్వయా రమయితవ్యా) అని ఊరుకుంటుంది. ఇదంతా సున్నితంగా హృదయ తంత్రులను మీటి చక్కిలిగింతలు పెడుతుంది. అనురాగాల లోని అసూయా స్వరూపాన్ని తెలియజేస్తూ పెదవులపై హాస్యంతో లాస్యం చేయిస్తుంది.

ఇక రూపకంలో హాస్యపోషణ అనేక రీతుల కన్పిస్తుంది. ప్రప్రథమంగా త్రాగుబోతులయిన కాపాలికా దేవసోముల సన్నివేశం, త్రాగిన మైకంలో అతని పునరుక్తులు, మేలప్రాపిజమ్, చేష్టా మూలక హస్యం మొదలైనవి కనిపిస్తాయి. త్రాగుబోతుల గోల ననుసరించి చాలా మాటలను పునరుక్తులు చేస్తాడు. అది నవ్విస్తుంది. తన ప్రియ దేవసోమ పేరును సోమదేవగా మార్చి ఉచ్చరించి, ఆమెకు కోపం తెప్పిస్తాడు. అదో విధమైన హాస్యం. దేవసోమను లేవనెత్తుటకు చేయి అందిస్తూ నేలపై బడి, ఆమె దూరంగా జరిగి పోతోందని మాటాడతాడు. ఆ చేష్ట ఒక హాస్యం. ఇక త్రాగుబోతుతనానికి పరాకాష్ఠ మరొకటి - తాను ఈశ్వరుణ్ణి ఆశీర్వదించడానికి సిద్ధ పడతాడు. ఆ పని చేస్తాడు.

పేయా సురా ప్రియతమాముఖ మీక్షితవ్యం గ్రాహ్యః స్వభావ లలితో వికృతశ్చ వేషః
యేనేద మీదృశ మదృశ్యత మోక్షవర్మ దీర్ఘాయు రస్తు భగవాన్ స పినాకపాణిః

ఈ రీతిగా కాపాలిక మతాన్ని అధిక్షేపింపజేసిన రచయిత వెంటనే జైన మతాన్ని గూడ అధిక్షేపిస్తాడు.

కార్యస్య నిస్సంశయ మాత్మ హేతోః సరూపతాం హేతుభి రభ్యుపేత్య |
దుఃఖస్య కార్యం సుఖమామనన్తః స్వేనైవ వాక్యేన హతా వరాకాః ||

ఇతని వారుణీప్రియత్వం అల్ప విషయానికి అధిక్యాన్ని కల్పిస్తూ హాస్యగత మవుతుంది. కాంచీనగరాన్ని కూడా సురతోనే ఇతడు పోలుస్తాడు. ఇతని నిర్ణయంలో సుర అంటే — శివనేత్రాగ్నికి భస్మమైన మదనుడు ద్రవరూపాన్ని స్వీకరించి ఎత్తిన అవతారమే.[1] అందుకే దాని నెలా ప్రశంసిస్తాడో చూడండి

ఏషా భగవతీ వారుణీ చషకేష్వావర్జితా ప్రత్యాదేశో మండనానామ్
అనునయః ప్రణయ కుపితానాం, పరాక్రమో యౌవనస్య, జీవితం విభ్రమాణాం
- పుట. 12

ఇతనికి సురయే కాదు. సురాపాత్ర కూడా అత్యంత ప్రీతిపాత్రమే. దాని వియోగానికి ఇతడు పడే బాధ అర్ధాంగిని కోల్పోయిన మగవాని బాధకన్నా ఎక్కువే. ఆ కరుణాభాస మెలా హాస్యాన్ని కలిగిస్తుందో చూడండి.

యేన మమ పానభోజన శయనేషు నితాంత ముపకృతం శుచినా |
తస్యాద్య మాం వియోగః సన్మిత్రస్యేవ పీడయతి || శ్లో. 22

అటువంటి కపాల వియోగం వలన సుఖపడే ఇతని ఒక వాక్యం ద్వారా రచయిత బౌద్ధ మతాన్ని ఎంత భయంకరంగా విమర్శిస్తాడో చూడండి.

తర్కయామి శూల్యమాంస గర్భత్వాచ్ఛునా శాక్యభిక్షుణా వేతి పుట.15

అయితే ఇది కేవల మధిక్షేపణ స్వరూపంలో కన్పించక కథతో పెనవేసుకొని పోయి ఉంటుంది.

ఇక బౌద్ధ మతాన్ని విమర్శించడానికి శాక్య భిక్షువే ఇతనికి చక్కని ఆశ్రయం. ఆ శాక్య భిక్షువు చేతనే బౌద్ధమతమెలా భ్రష్ట మయినదో నిరూపించే మాటలు పలికిస్తాడు. చూడండి.

అవశ్యమేతై ర్దుష్ట బౌద్ధస్థవిరైః నిరుత్సాహై రస్మాకం తరుణజనానాం
మత్సరేణ పిటక పుస్తకేషు స్త్రీ సురాపాన విధానాని పరామృష్టానీతి తర్కయామి -

1 మత్తవిలాస ప్రహసనం శ్లో|| 10

ఈ మాట బౌద్ధమత భ్రష్టతను సూచించటమేగాక, అతని హేత్వాభాసంలో వున్న చమత్కృతి మనలో హస్యాన్ని కల్గిస్తుంది. స్వార్థసిద్ధి కోసం అతడు చేసే ఆలోచన, హేతుపరిశీలన ఎంత ఆభాసమో, దయనీయమో గుర్తించినపుడు బుద్ధ భగవానునిపై సానుభూతే కలిగినా సన్నివేశంలో నవ్వు వస్తుంది. బుద్ధుడు బహు చీవర ధారణాన్ని కూడ యిటువంటి దొంగవస్తువులను దాచుకునేందుకు ఏర్పాటు చేసినాడనీ, వేదాంత గ్రంథాలనుండి అర్థస్వీకారం చేసి తన ధర్మాలుగా ప్రకటించా డని, అనేక రీతుల సమకాలీన సమాజంలోని బౌద్ధ ధర్మ దుస్థితిని విమర్శిస్తాడు కవి. మరో చమత్కారమైన మాటను చూడండి.

కాపాలికుడు, దేవసోమ, శాక్యభిక్షువు కలహించే సమయంలో దేవసోమ శాక్యభిక్షువు జుట్టు పట్టుకోవాలని ప్రయత్నించి, వీలుగాక క్రింద పడుతుంది. అప్పుడు శాక్యభిక్షువు "అహో బుద్ధస్య విజ్ఞానం యేన మండనమ్ దృష్టమ్" అని సమర్థించుట అతని సర్వాత్మనా వినాశాన్ని, బౌద్ధ సంప్రదాయాలకు ఏర్పడిన అనుచితాచరణాన్ని చక్కగా సూచిస్తుంది. అయితే ఆ సన్నివేశంలో అది విశేషంగా నవ్వు కలిగిస్తుంది, అతని ఆలోచనల్లో ఆ వక్రత కనిపిస్తుంది కాబట్టి.

కపాలాన్ని తెచ్చియిచ్చిన ఉన్మత్తకుని ప్రవర్తనలో ఒక చక్కని మనఃస్థితిని వర్ణించి రచయిత తన సూక్ష్మపరిశీలనను, చమత్కారిత్వాన్ని ప్రదర్శించి నవ్విస్తాడు. ఉన్మత్తకుడు ఆ కపాలాన్ని సువర్ణ భాజనంగా భ్రమపడతాడు. అదే ప్రతిపాదన చేస్తాడు. అయితే అది వింటున్న శాక్యభిక్షువు "కి మయ మున్మత్తకః?" అని ప్రశ్నించగా ఉన్మత్తకుని సమాధానం చూడండి - "ఉన్మత్తక ఇతి బహుశః ఏతం శబ్దం శృణోమి ఏతద్గృహీత్వా దర్శయోన్మత్తకమ్" - అని అనటం అతని పిచ్చిని స్పష్టంగా నిరూపింప జేయటం. పిచ్చివారి ప్రవృత్తిలో తమ్ము తాము మరిచిపోవట మన్నది సైతం స్వాభావికమేమో! దాన్ని ఆధారంగా చేసి విక్రమవర్మ హస్యాన్ని కల్గించే ప్రయత్నం చేసాడు.

ప్రత్యక్షరంలో కూడ బౌద్ధ ధర్మాన్ని విమర్శించేందుకు సిద్ధపడి, సమయ స్ఫూర్తితో దానిని కొనసాగించిన మహేంద్ర విక్రమవర్మ మరోవిషయంలో కూడా నేర్పు ప్రదర్శించాడు. శాక్యభిక్షువు ఆ కపాలాన్ని స్వీకరించి యుంటాడనీ, ఉన్నాడనీ కాపాలికుని విశ్వాసం. ఆ విశ్వాసాన్ని ఆధారంగా చేసికొని అనేక విధాలుగా కాపాలికుడు అతనిని నిందిస్తాడు. అతని ధర్మాలను అవహేళన చేస్తాడు. అయితే

యథార్థానికి శాక్యభిక్షువు ఆ పాత్రను దొంగిలించలేదు. అంటే ప్రత్యక్షంగా శాక్యభిక్షువును చోరునిగా నిరూపించలేదు. కాని చౌర్యాన్ని అంటగట్టి ఆ ఆధారంతో అధిక్షేపించే అవకాశాన్ని తీసుకున్నాడు. అయితే ఒక్క చౌర్యంనుండి రక్షింప బడినంత మాత్రాన మిగిలిన విషయాలలో అతని నిర్దుష్టత నిరూపించ బడలేదు.

ఈ రీతిగా ఇది సమకాలీన సమాజంలోని మతతత్త్వాలను సున్నితంగా అధిక్షేపిస్తూ, హాస్యాన్ని కల్గించే ప్రయత్నం చేసినందువలన ఇది పరిశుభ్రమయిన హాస్యంతో కూడిన చక్కని ప్రహసనం.

వివాహ విడంబన ప్రహసనం

సమాజంలో ఆర్థిక, సామాజిక, భౌగోళిక పరిస్థితుల ప్రభావం వలన ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క సంప్రదాయం ప్రబలంగా కనిపిస్తుంది. ఆ సంప్రదాయం వలన వచ్చిన కష్టనష్టాలను అనుభవిస్తున్నా, సంప్రదాయతా ముద్రను దానికి వేసినందువలన దానిని పరిత్యజించరు. ఆచరించినా శక్తిలేనపుడు ఆక్రోశింపక తప్పదు. అటువంటి సామాజిక సంప్రదాయాలలో బాల్యవివాహం, కన్యాశుల్కం ఒకనాటి కాలాన్ని ముంచెత్తాయి. ఈనాడు వరకట్నం సమస్యే అయింది. కానీ కొంత కాలం క్రితం కన్యాశుల్కం సమస్య. చక్రంలా పరివర్తనాన్ని పొందే ఈ తారుమారులను సంఘం గాని, వ్యక్తులుగాని సరిగా అవగాహన చేసికొని మూలాన్ని భేదించటం మాని, ఏది ఎప్పుడు విజృంభిస్తే దానిపై వీరు విజృంభించాలని ప్రయత్నిస్తుంటారు. అది కూడా ఒక సంప్రదాయం. ఈనాడు వరకట్నం వలన ఒక విధమయిన సమస్యలయితే ఆనాటి కన్యాశుల్కం వలన మరో విధమయిన సమస్యలు తల ఎత్తేవి. ఆంధ్ర సాహిత్యంలో కన్యాశుల్క, బాల్యవివాహాలు ప్రధాన సమస్యలుగా అద్భుతమైన నాటకం కన్యాశుల్కం ఏర్పడింది. అంతటి స్థాయితో కాకపోయినా కొంతవరకు బాల్యవివాహాలు, కన్యాశుల్కం సమస్యలను చిత్రంగా పరిష్కరిస్తూ చేయబడిన రచన వివాహ విడంబన ప్రహసనం. ఇది జీవన్యాయతీర్థునిది.

బాల్యవివాహ లన్నప్పుడు మనం మరొక ప్రధానాంశాన్ని గుర్తుంచుకోవాలి. చిన్నపిల్లకు పెళ్ళి అనేకంటే పెద్దపిల్లవాడికి పెళ్ళి అనటం అందంగా వుంటుంది. బెంగాలీభాషలో ప్రారంభమయిన ఈ సమస్య లేక రచనలు అన్ని భాషలలోనికి చొరబడ్డాయి.

ప్రకృత ప్రహసనంలో రతికాంతుడు 60 ఏళ్ళ యువకుడు. అతనికి విధవ ఆయిన చెల్లెలు కూడా వుంటుంది. ఆమె పేరు ఖడ్గధార. ఆ అన్నాచెల్లెళ్ళకు ఒకరినొకరు అధిక్షేపించుకునేందుకే సమయం చాలదు. ఘటకుడని మరొక బ్రోకర్. రతికాంతుడి అభిలాషను - వివాహం చేసుకోవాలని - అంగీకరించి దానిని పూర్తి చేసేందుకు నడుం కడతాడు. కంకుడు రతికాంతుని నౌకరు. పెండ్లి అయితే జీతం పెంచుతానని రతికాంతుడు అతనిని ముందే ఓదార్చుతాడు. ఘటకుడు చంద్రలేఖ అనే అమ్మాయితో సంబంధం తెస్తాడు. ఆమె తండ్రి దరిద్రుడు. అతని అప్పులు తీర్చేందుకు రూ.2000/-, వివాహవ్యయానికి రూ.1000/- ఇవ్వడానికి రతికాంతుని ఒప్పిస్తాడు.

పెండ్లికి ముందు చంద్రలేఖను చూడాలని రతికాంతుడు అడిగినా అంగీకరింపక పెండ్లి పెద్దగానే చూడమని సలహాయిస్తాడు. మరొక అందగాడిని వరరూపంలో పరిచయం చేస్తానంటాడు. పెండ్లి కాదేమో అని భయపడిన రతికాంతుడు అంగీక రిస్తాడు. ఒక అందగాడిని వరుడుగా వారికి చూపిస్తారు. ఘటకుడు రతికాంతుడిని యువకుడిని చేయటానికి శంకరనాథ వైద్యునకు కూడ కొంతడబ్బు ఖర్చు పెడతాడు. వివాహ సమయందాకా రతికాంతుడు వరుడుగా కనిపించకూడదని, అవసర మయితే పోలీస్ సహాయముంటుందని అంగీకరింపజేస్తాడు ఘటకుడు.

రతికాంతుడు బంగారు నగలుకూడ చేయించి అవికూడ పంపిస్తాడు. అక్కడకు వెళ్ళిన తరువాత చివరగా తెలుస్తుంది, తన ఖర్చుతో చంద్రలేఖకు భాస్కరశర్మ అనే వ్యక్తితో వివాహ మయిపోయిందని. విలాపం తప్ప మరేమి మిగలదు రతికాంతుడికి-

ఈ కథలో ప్రతిపాత్ర సమకాలీన విషయాలకు, సామాజిక సమస్యలకు ప్రతిబింబం. వయసు పండినా వలపు పండని వృద్ధయువకులకు రతికాంతుడు ప్రతిబింబం. ఇక ఖడ్గధార, ఇది ప్రత్యేక పాత్ర. తనకులేని సుఖాలు ఇతరుల కెందుకు అనే ఈర్ష్యకూడా ఇటువంటి పాత్రలలో కనిపిస్తుంది. ఇవి సంఘం చెక్కిన శిల్పాలే. ఇక డబ్బు గుంజే డాక్టర్. ఇటువంటి పరిస్థితులకు ఇలాగే మోసపోయేవారు సంఘంలో కోకొల్లలు. కూతురి పెళ్ళితో అప్పులు తీర్చాలనుకునే దరిద్రుడైన తండ్రి కన్యాశుల్కం కాలంలోని పేదవారికి సరియైన ప్రతినిధి. ఇక ఘటకుడు మధ్యవర్తి. ఆ పాత్రకూడా సంఘంలోనిదే. ఇటువంటి పాత్రలతో ఒకనాటి సామాజిక సమస్యను

రచయిత మనోహరంగా చిత్రించాడు. అయితే వారు చూపిన పరిష్కారం సంఘంలో ఎంతవరకు సంభవ మన్నది ఆలోచింపవలసిన విషయం.

రతికాంతుడు తన సోదరిని మరీ దారుణంగా విమర్శిస్తాడు. చూడండి.

భోజనే ద్విగుణా మాత్రా శయనే చ చతుర్గుణా|
కర్మకాలే ఖమాత్రా చ తతః శూర్పణఖాస్వరః ||

తెలుగులోని గురజాడవారి కన్యాశుల్కంలోని మీనాక్షి లుద్దావధానులకు వీరు తీసిపోరు. అక్కడి అసిరిగాడే ఇక్కడ కంకుడు. అయితే అక్కడ రామన్న పంతులుకు, ఇక్కడ ఘటకుడికి కొంచెం తేడా వుంది.

ధూర్తనర్తక ప్రహసనం

లటకమేలకాది ప్రహసనాలకన్న కొంతసున్నితమైన ప్రహసనంగా వ్యవహరింప దగినది సామరాజదీక్షితుడి ధూర్త నర్తక ప్రహసనం. ఈ రచయత క్రీ.శ. 1655-1700 ప్రాంతంవాడని డా॥ రుద్రదేవ త్రిపాఠి నిర్ణయం. శ్రీదామ చరితమ్, త్రిపురసుందరీ స్తోత్రమ్, ఆర్తత్రిశతీ, శృంగారామృతలహరీ మొదలైనవి సామరాజదీక్షితుని ఇతర రచనలు.

సామరాజదీక్షితుడు నాందీ శ్లోకంలోనే అతడి ప్రహసనంలో హాస్యానికి ఆలంబనమయ్యే అంశాన్ని వివరిస్తాడు. గమనించండి –

క్రీడన్నారీకదంబే కలయతి జగతామీశ్వరే కంసశత్రౌ
మిథ్యావైరాగ్యదంభం నిఖిల వరవధూదత్త లీలం తథోచ్చైః
హాస్యం చక్రే కదాచిన్మధుభిదభిమతం పీతవస్త్రే చకర్షే.
జాతేత్విత్థం మురారిః స్మిత సుభగముఖః పాతు యుష్మాన్ స తస్మాత్ ||

దీనినిబట్టి ఈ ప్రహసనంలో మిథ్యావైరాగ్యదంభం యొక్క ప్రాముఖ్యం అవగతమవుతోంది. కథాభాగాన్ని పరిశీలించినా అది సత్యమే అని ఋజువవుతుంది.

మూఢేశ్వరుడు మిథ్యావైరాగ్యనిధి. ముఖరుడు, జగద్వంచకుడు అతడి శిష్యులు. వారంతా ఒక ఉద్యానవనంలోకి ప్రవేశించడంతో ప్రహసనం ప్రారంభ మవుతుంది. వసంతఋతువర్ణన ద్వారా తాను వలచిన వసంతలతికను స్మరిస్తాడు

మూఢేశ్వరుడు. విషయాన్ని తనలోనే ఇముడ్చుకొనలేని మూఢేశ్వరుడు శిష్యుల నుండి మాటతీసికొని (ఎవరికీ చెప్పకూడదని), వారికి తెలియజేసుకుంటాడు. అంతలో మూఢేశ్వరుడి మిత్రుడు బ్రహ్మానందస్వామి తన శిష్యుడు పాపుడితో విజయం చేస్తాడు. బహ్మానందస్వామికి కూడా ఒక ప్రేయసి. ఆమె పేరు పద్మ. నేపథ్యలో నుండి వినిపించిన గాథ ఆధారంగా మూఢేశ్వరుడు వసంతలతిక వియోగంలో బాధను ప్రకటిస్తాడు. అవతల వసంతలతిక నాట్యాన్ని శుంఠాచార్యుడు, అతడి శిష్యుడు నీలకంఠుడు తిలకిస్తుంటారు. నాట్యావసానంలో శివపూజకు ఏర్పాటుచేసే నెపంతో వసంతలతిక వెంట నిష్క్రమించి, ఆమెను అభ్యర్థించి, ఆరేయి తన ఇంటికి ఆమె వచ్చేటట్లు మాటతీసుకుంటాడు.

ద్వితీయ సంధిలో మూఢేశ్వరుడు జగద్వంచకుణ్ణి వసంతలతిక దగ్గరకు రాయబారానికి పంపుతాడు. జగద్వంచకుడు గురువంచకుడై తననే ప్రేమించమని వసంతలతికను కోరుతాడు. మూఢేశ్వరుడు సైతం అక్కడికే రావటంతో గురుశిష్యులిద్దరికీ ఘర్షణ జరుగుతుంది. జగద్వంచకుడు రాజభటులను పిలిపించి గురువును ఖైదు చేయిస్తాడు. పాపాచారుడు రాజు. వసంతలతికను చూడగానే ఆ రాజుకుకూడా మనస్సు కలుక్కుమంటుంది. కొంత సేపటికి మూఢేశ్వరుడి గురువు నిర్మేధాశ్రయుడు ప్రవేశిస్తాడు. గురు శిష్యుల పరామర్శ తరువాత విషయమంతా తెలుసుకుంటాడు. మంగళకుఠారమిశ్రుడు సైతం ఆ సభను పావనం చేసి వసంతలతికను వర్ణిస్తాడు. పాపాచారుడు వసంతలతికను మంగళకుఠారమిశ్రుడికి ఇవ్వబోగా అతడు తిరస్కరించి మూఢేశ్వరుడికే అర్పింపజేస్తాడు. ప్రహసనం ముగుస్తుంది.

సామరాజదీక్షితుడు శబ్దాన్ని అద్భుత రీతుల్లో నడిపింపగల శక్తిని సొమ్ము చేసుకున్నవాడు. ప్రస్తావనలో ఆ విషయాన్ని సూత్రధారుడి చేత పలికిస్తాడు. చూడండి.

తన్వతే నిర్వృతిం యస్య వాచో లోకస్య కర్ణయోః |
రతి ప్రమత్తవనితా కంకణక్వాణ మంజులాః||

ఇతని శైలి - గద్యపద్యాలలోను అంత మంజులంగానే వుంటుంది. ఈ శైలి సర్వత్ర సహజమే అయినా దానిలోని కొన్ని విరుపులు మరీ మనోహరాలై హాస్యానికి కూడా సహకరిస్తాయి. సంఘంలో హాస్యప్రియులైన అనేకులు శబ్దాన్ని ఎక్కువగా

ఆశ్రయించటం అనుభవసిద్ధమే. ఈ ప్రహసనంలో అటువంటి పరిస్థితియే కనిపిస్తుంది. ఆది ప్రయత్నకృతమో, అప్రయత్నసిద్ధమో మరి.

"చిన్తయన్తి హి సదా ముదా హృదా"

"కథమేషా యోషా శేషావయవై స్తోషయతి"

"ప్రియా హ్రియావనత ముఖీ తిష్ఠతి" మొదలైన అనుప్రాసలు పాత్రల ననుసరించి ఆలోచిస్తే హాస్యహేతువు లవుతాయి.

ఇది సహజంగా ప్రహసనమైనా ఇందులోని ముఖరుని పాత్ర హాస్యానికి ఎక్కువగా సహకరిస్తుంది. ఈ ప్రహసనంలోని హాస్యం ఉక్తిమూలకంగా కాక సన్నివేశ ప్రధానంగా భాసిస్తుంది. ఆ సన్నివేశాలన్నిటిలో ముఖరపాత్ర అపరిహరణీయం.

"గురుణాఽపి సమం హాస్యం కర్తవ్యం కుటిలం వినా" అన్నది ముఖరుని సిద్ధాంతం. ఆ సిద్ధాంతాన్ని అక్షరాలా పాటిస్తాడు. మూఢేశ్వరుడు వసంతలతికతో తన సంబంధాన్ని ఎవ్వరికీ చెప్పకూడదని మాట ఇవ్వమన్నప్పుడు ఆ సిద్ధాంతాన్నే అవలంబిస్తాడు. చివరకు మూఢేశ్వరుడి మిత్రుడైన బ్రహ్మానందస్వామితో సంభాషించటంలో కూడా ఆపద్ధతినే స్వీకరిస్తాడు. బ్రహ్మానందస్వామి గురు మిత్రుడు కాబట్టి తనకు గురుతుల్యుడని ప్రకటిస్తూ ముఖరుడు నమస్కరిస్తాడు. ఆ సందర్భంలోని ఒక అందమైన ఛలోక్తిని చదవండి.

బ్రహ్మ: అభీష్టలాభీ భూయాః (విలోక్య విహస్య) యత్సమర్కట ఇవా కలయతే చేష్టయా

ముఖర: అహం మర్కట ఇవ త్వం పునర్మర్కట ఏవ.

ఈ ముఖరుడికి, బ్రహ్మానందస్వామి శిష్యుడు పాపుడికి అభిప్రాయ వైషమ్యం ఎక్కువగా కన్పించి, మనకు హాస్యంగా రూపొందుతుంది. ఈ ప్రహసనంలో విదూషకపాత్ర మరొక ప్రత్యేక ఆకర్షణ. ఇతడి మాటలు, చేతలు కూడా నిండుగా హాస్యకారణాలే అవుతాయి. రాజుతో ప్రసంగించే సమయంలో విదూషకుడు ఎంత ఆందమైన హేత్వాభాసాన్ని కల్పించి, నవ్విస్తాడో పరిశీలించండి -

రాజా - వయస్య! యవనః జటిలోపి భవతి ?

విదూ - భవత్యేవ.

రాజా - కథమ్ !

విదూ - యథా తురుష్కో బ్రాహ్మణో భవతి .

చేష్టామూలకమైన హాస్యవిషయంలో విదూషక పాత్రను విశేషించి అభినందించక తప్పదు. మూఢేశ్వరుడికి నమస్కరించాలని ముందుకు వచ్చి, అతడి జుట్టు పట్టుకొని, శిరస్సువంచి, తన పాదాలపై నుంచి, ఆశీర్వదిస్తాడు. ఇది విపరీతాభివందనం. ఇక ప్రహసనాలకు, ప్రహసన హాస్యానికి ప్రాణాయమానాలైన ప్రగల్భోక్తులు సైతం దీనిలో మనోహరంగానే వుంటాయి. విదూషకుడు, మూఢేశ్వరుడు ఒకరికన్నా మరొకరు గొప్ప కావాలనే అభిలాషతో పలికే తీరును పాఠకులు పరిశీలించండి.

విదూ - పూర్వం గతే హరగృహే చ మయా చ తేన
ప్రక్షాళితం గిరిసుతా కరనీరజైః |
జంఘాయుతం చ పరికల్పిత మాసనం మే
తది చ్ఛితా కరజ స్పర్శనేన ముక్తమ్ ||

మూఢేశ్వర - (విహస్య) ఆహో! దురాత్మనో వచనభంగీనాగరతా.
తదేనం ప్రత్యేవం (ప్రకాశమ్) కథంరే! న వాంఛ స్యస్మాన్? పశ్య-
అస్మాకం నియమోఽస్తి దైవత సరిత్కల్లోల కిమ్మీరితే
స్థానే స్థేయమతో మురారిభవనం యాతా వయం తత్ర చ |
తాం దృష్ట్వా చరణే శివస్య సదనం యాతాశ్చలజ్జాహ్నవీ
వీచీపుంజతరేణ జాతు సహసా తేనాఽపి మూర్ధ్నా ధృతాః ||

ప్రహసనం మొత్తంమీద ఒకే ఒక తావున నిగూఢంగా కొంత - అత్యల్పంగా - అసభ్యతకు అవకాశమిచ్చినా దీనిని ఉదాత్తమైన శృంగారంతో గూడిన ప్రహసనం గానే పరిగణించవచ్చు.

రామనామ దాతవ్య చికిత్సాలయ ప్రహసనమ్

సాంఘిక జీవన పరిణామంలో మనస్తత్త్వ చక్రభ్రమణంలో గుణదోష నిర్ణయం చాల కష్టం. ఒక సందర్భంలో గుణం, మరో సందర్భంలో దోషంగా భాసించే అవకాశాలు లేకపోలేదు. అవి అలా పరిణమించకపోయినా మనిషి పరిణమింప

జేయవచ్చు. అటువంటి దోషీభూతగుణం ఆధారంగా రచింపబడినది రామనామ దాతవ్య చికిత్సాలయ ప్రహసనం –

భారతీయసంస్కృతి కార్యసాధనలో పురుషకారానికి, దైవసహకారానికి సమప్రాధాన్యాన్ని ఇస్తుంది. "దైవం నిహత్య కురు పౌరుష మాత్మశక్త్యా యత్నే కృతే యది న సిద్ధ్యతి కోஉత్రదోషః" అని ఉత్సాహపరచినవాళ్ళు కూడ లేకపోలేదు. అయితే వర్తమానకాలంలో ప్రజలలోని బలహీనత భారతీయులను రెండిటికీ దూరం చేస్తోంది. ఏ విషయంలో ఎంతవరకు పురుషకారమో, ఎక్కడినుండి దైవసహకారమో నిర్ణయించగల స్థాయికి ప్రజలింకా పెరగలేదు. లేదా పెరిగి పతన మైనారు. ఆపద్ధతిలో దైవశక్తిని పూర్తిగా సాధింపక, అటు భౌతిక శక్తిని సమగ్రంగా వినియోగించుకోలేకపోయిన ఒకవ్యక్తి కేంద్రబిందువుగా రచింపబడినది రామ నామ దాతవ్య చికిత్సాలయ ప్రహసనం. జీవన్యాయ తీర్థుడు రచయిత.

ఒక క్షీబుడు రామనామ దాతవ్య చికిత్సాలయం అన్న పేరుతో ఒక హాస్పిటల్ ప్రారంభిస్తాడు. అక్కడ అన్నిరోగాలకు ఒకే మందు - రామనామం. ఆస్మా అయినా, క్షయ అయినా, కడుపునొప్పి అయినా, గుప్తరోగమైనా, చివరకు గయ్యాళి భార్యను వశం చేసుకోవాలన్నా కూడా చికిత్స రామనామమే.

బెంగాలీ రచయిత ఓంకారనాథుడు రచించిన "సంలాపకం" ఈ ప్రహసన రచనకు మూలం.

శరీరం పాంచభౌతికం. వైజ్ఞానికంగా అయినా వేదాంతానుసారంగా అయిన మనిషి ఇక బ్రతకడని నిర్ణయించి చెవిలో "నారాయణ" పదోచ్చారణ జరిగేదాకా, ఏ పాటి ఆశవున్నా శరీరంలోకి మందులు వెళ్ళవలసినదే. శరీరం ఒక యంత్రం. భౌతిక పరికరాలతోనే దానిని బాగుచేయాలి. పంటినొప్పితో బాధపడుతుంటే రామ నామం పనిచేయదు. ఒకప్పుడు చేసేదేమో! ఈనాడు అలా చేయించగల శక్తి - క్షమించాలి – ఎవ్వరికీ లేదు. ఆ శక్తివున్నా కేవలం దానినే ఆశ్రయించటం పురుషకారాన్ని పరిత్యజించటమే అవుతుంది. అది క్షమించరాని విషయం కాబట్టి ఈ ప్రహసనానికి స్వీకరించిన మనస్తత్త్వం హాస్యానుకూలమై రాణిస్తుంది.

పిచ్చివాడి చేతిలోని రాయిలాగా దీనిలోగూడా చాలా ఆరోగ్యసూత్రాలను చెప్పటం జరిగింది. వైద్యుడు క్షీబుడు కాబట్టి గీత నృత్యాలకు సైతమీ ప్రహసనంలో

లోపం లేదు. అక్కడ మందులు, మరే సరంజామా కూడా వుండదు కాబట్టి బాధ లేదు. క్షయరోగానికి అతడి చికిత్స చూడండి - తులసివనం - దానిలో పర్ణశాల – గోడలనిండా రామనామం. 24 గంటలూ అందులోనే నివాసం, రామనామ జపం.

సామ్యసాగర కల్లోలప్రహసనమ్

వర్తమాన సమాజంలో సోషలిజం అన్నది ఎంతో అందమైన పదం. ప్రజలను ఓట్లకోసం వశపరచుకొనేందుకు కుక్క బిస్కట్లకన్నా రుచియైన పదం. ప్రజాసేవ చేయదలచుకొన్న వారందరికీ ఎమ్. ఎల్. ఎ. అంచుపంచెతోపాటు, 'సోషలిజం' అన్న పదంకూడా తప్పనిసరి. ఆ ఆయుధాన్ని ఉపయోగించటంలో మాత్రం తెలివి వెట్టి తలలు వేయటం స్పష్టమైన విషయం. స్వార్థపరులు దానిని బంగారు బాతులా ఉపయోగించుకుంటున్నారు. ఆ సామ్యవాద సిద్ధాంతాన్ని ఆచరించటంలోని అనేకాలైన అవాంఛనీయ పరిస్థితులకు అద్దంపట్టే రచన సామ్యసాగర కల్లోల ప్రహసనం. రచయిత జీవన్యాయ తీర్థుడు.

గణనాథుడొక నాయకుడు. సామ్యవాదంలో తీవ్రవాది. అతనికి చాలామంది అనుయాయులుంటారు. సమస్తదేశాన్ని, జాతిని వశపరచుకొని సమాన సుఖంతో బ్రతికించాలన్నది వారి ఆశయం. ప్రాచీన సంప్రదాయాలను పాటించే ఒక యతి గణనాథుని కలవటం జరుగుతుంది. అంతఃకలహాలు కల సామ్యవాదులు ఏమీ సాధించలేరంటాడు యతి. సామ్యవాదుల్లో గల ధనవంతుల ప్రవర్తనను ప్రశ్నిస్తాడు. మీరు భోగాల ననుభవిస్తూ, మీ అనుచరుల నెత్తుటిని ఎండింపజేయట మేం ధర్మం అని నిలదీస్తాడు. తాను నాయకుడు కాబట్టి ఏదోషం తనకంటదనీ, హింసతోనే సామ్యవాదం సిద్ధిస్తుందని గణనాథుని సమాధానం.

గణనాథుడి మాటల ప్రకారం కార్మికులు సమ్మెచేస్తారు. యజమానులు "లాకౌట్" ప్రకటిస్తారు. కార్మికులకు తిండి దొరకదు. యజమానులను హింసించమని గణనాథుని సలహా. తలుపులు మూసినా, కాల్పులు జరిపినా ముందుకు దూకమని, బాదటమో చంపటమో మాత్రమే సామ్యవాదానికి పునాది అని ప్రబోధిస్తాడు. ఆకలితో ఒక కార్మికుడు మరణిస్తాడు. దానికి దుకాణాదారుడు కారణమని దుకాణాన్ని దోచటంలో మరో బాలుడు చనిపోతాడు. కార్మికులకు, కర్షకులకు మధ్య గణనాథుని కారణంగా వైరమేర్పడుతుంది. యతి ఆశ్రమంలో

శాంతి సైనికులుంటారు. వారు గణనాథుని, అతని అనుయాయులను బంధిస్తారు. గణనాథుడు చేస్తున్న వంచనను తెలుసుకున్న సన్నిహితులే అతనిని చంపబోతే యతి కాపాడుతాడు. ఇదీ ఇతివృత్తం.

దీనిలో సామ్యవాద సిద్ధాంత విమర్శ ప్రథమస్థానాన్ని, హాస్యరసపోషణ ద్వితీయ స్థానాన్ని వహిస్తాయి. అందుకే ఇది బ్లాక్ కామెడీ (Black Comedy)కి దగ్గరవుతుంది. గణనాథుడు నిష్కారణంగా యతిని దేశద్రోహిగా చిత్రించాలని ప్రయత్నించటం అర్థరహితమై నేటి కునాయకుల మనోగతికి దర్పణం అవుతోంది. తనకు ఏ తప్పు అంటదని తప్పించుక తిరగటం అతని స్వార్థాన్ని, పలాయన వాదాన్ని ప్రకటిస్తుంది. ఆ విషయాన్ని రచయిత చాలా స్పష్టంగా నిరూపించాడు. అంతేకాక సామ్యవాదమన్న పేరుతో ప్రస్తుత నాయకుల ప్రవర్తన భవిష్యత్తులో కలహాలకు కారణమవుతుందని జీవన్యాయతీర్థ భవిష్యద్దర్శనం చేయటం సైతం ఈ ప్రహసనానికి విలువను పెంచుతుంది.

వన భోజన ప్రహసనం

ప్రాచీనకాలంనుండి వనాలూ, భోజనాలూ, వనభోజనాలూ అనూచానంగా వస్తూనే వున్నాయి. అయినా ఆధునిక కాలంలో "పిక్నిక్" పేరుతో అవి నాగరికతా చిహ్నాలైనాయి. కాలక్షేపానికి, సుహృద్భావ వర్ధనానికి కూడా ఇవి దోహదం చేస్తున్నాయి. అయితే వాటి నిర్వహణయే ఎక్కడ చూచినా సమస్య అవుతోంది. అన్ని కార్యక్రమాలు నిర్వహించేవారు, పాల్గొనేవారు సైతమున్నారు కాని నిర్దుష్టంగా, క్రమబద్ధంగా నిర్వహించగలవారు కరువైనారు. ఇది జగమెరిగిన సత్యం. ఆవేశస్థాయిలో ఆలోచన లేకపోవటం, హడావుడి తీవ్రతలో లక్ష్యం లేకపోవటం దానికి కారణాలు. ఆ రీతిగా సరదాగా ప్రారంభమై ఆభాసంగా ముగిసిన ఒక వనభోజన కార్యక్రమం కేంద్రబిందువుగా రచింపబడిన రూపకం వనభోజన ప్రహసనం, జీవన్యాయ తీర్థునిదే.

సుప్రియుడు, సుమంత్రుడు, అభిరాముడు, సుబుద్ధి, అతిరాముడు, దేవ ప్రియుడు - వీరార్గురూ విద్యార్థులు. వనభోజనకార్యక్రమాన్ని ఏర్పాటుచేసుకొని సరంజామాతో తోటకు వెళ్ళారు. ఒక పెద్ద చెట్టునీడన వంట కుపక్రమిస్తారు. పై నుండి పిట్టలు రెట్టవేస్తే ఎలా అని సంశయం కలుగుతుంది. విల్లు, వడిసెలతో రాళ్ళు

విసురుదామనుకుంటారు. తమ మీదనే ఆ రాళ్ళు పడగలవని మరల అనుమానం. ఇక తప్పదని దగ్గరనేవున్న జీర్ణ మందిరంలో దూరుతారు. వంటచెరకు మరచి పోయామని అప్పుడు గుర్తు వస్తుంది. దాని కోసం కొడవలి పుచ్చుకొని బయలు దేరుతారు సుప్రియుడు, సుబుద్ధి, దేవప్రియుడు మాత్రమే.

అక్కడేదో చప్పుడయితే పులి అయివుంటుందని సుప్రియుడు పరువెత్తుతాడు. ఒక భిక్షుకుడు ప్రవేశిస్తాడు. అయితే అతడు పులికన్న భయంకరుడని సుబుద్ధి పరుగు లంఘించుకుంటాడు. సంధ్యాకాలంలో వెలిగించిన దీప మారిపోతుంది. మరల ఎవరు వెలిగించాలన్న విషయంలో పోటీ పడతారు. మరల వెలిగించడం ఎవరిపనీ కాదని వారి నిర్ణయం. అందుకే అందరూ మౌనం వహించి, ఎవరు ముందుమాటాడితే వారు వెలిగించాలని నిర్ణయించుకుంటారు. భిక్షువువచ్చి, దీపం వెలిగించి, సమస్త పదార్థాలు స్వాహాచేస్తున్నా ఎవ్వరూ నోరు మెదపరు. ఆ సమయంలో పోలీసులువచ్చి, దొంగ అని భిక్షువును బంధించబోతే, అతడు మిత్రబృందాన్ని చూపిస్తాడు. కొత్వాలు వచ్చి కొట్టేదాకా ఎవ్వరూ కిమ్మనరు. అతిప్రియుడు ముందు “మ్రియేఽహమ్మ”ని ఆక్రోశించగానే అందరూ మాములు పరిస్థితికి రాగలుగుతారు.

దీనిని Comedy of fools అంటే బావుంటుందేమో! పాపం అందరూ విద్యార్థులు ఒకే కోవకు చెందినవారు. వారి ఆలోచలనలోని అన్ని మలుపులలోనూ వక్రత దృగ్గోచరమవుతుంది. ఔచిత్యం కనిపిస్తుంది. అయితే పరిష్కారాలను మాత్రం ఔచిత్య స్థాయిలో వారు చేయలేకపోవటం హాస్యాలంబన మవుతుంది. వనభోజనానికి వంటచెరకు లేకుండా బయలు దేరటం మరో హాస్యాస్పద విషయం.

అసలు మూర్ఖత అంతా దీపం వెలిగించడానికి వారంతా పంతం పట్టడం లోనే వుంది. ఎవరిపని వారు చేయాలన్నది మంచిమాట. అయితే పని పెరిగినపుడు ఎవరో ఒకరు చేయాలన్నది పరిష్కారం. మిత్రబృందంలో అటువంటి సమన్వయం లేనిస్థితి ఇక్కడ హాస్యానికి ఆశ్రయమైంది. పట్టినపట్టు విడువకూడదన్నది ఉత్తమాదర్శమే. అయితే పోలీసులు కొట్టే దశవరకు మాట్లాడకపోవటం పరిష్కారం లోని ఔచిత్యం తెలియక పోవటమే. అందుకే అది హాస్యాస్పదం.

పులి అనుకొని సుప్రియుడు పారిపోతే పులికి భయపడని సుబుద్ధి భిక్షువు అని తెలియగానే పారిపోవటం చక్కని అధిక్షేపం. అది యాచక వృత్తిలోని హేయతను తెలియజేస్తుంది. రచయిత మాటల్లో చూడండి—

శార్దూలో మర్దయే జ్జీవం వనే నిర్ధూయ చేతనామ్ ।
భిక్షుకోఽర్దతి జీవన్తం వసన్తం యత్ర కుత్ర వా॥

ఈ ప్రహసన ప్రస్తావనలో సైతం మనోహరహాస్యం పోషింపబడింది. ఉదరాన్ని స్తోత్రం చేస్తూ సుప్రియదేవప్రియులు కలిసిచేసిన స్తోత్రం - గేయం - సైతం మనోరంజకంగా వుంటుంది.

చండతాండవ ప్రహసనం

రెండవ ప్రపంచయుద్ధ సందర్భంలో యూరపు దేశాల విశృంఖల ప్రవర్తనను పరిహాసపూర్ణంగా చిత్రించటానికై జీవన్యాయ తీర్థునిచే రచింపబడిన ప్రహసనం చండతాండవం.

స్టాలిన్, ధర్మపురుషుడు, పాపపురుషుడు, హిట్లర్, ఆంగ్లేయమంత్రి, క్రోధ, లోభ, హింసా, పాపులు పాత్రలు. ఇందులో పాత్రలలో సగం భావరూపంగా వున్నందువలన “సింబాలిక్ కామెడీ” అని దీనిని వ్యవహరింపవలసి ఉన్నది.

ధర్మమే విశ్వాసాన్ని పాడుచేస్తున్నందున ధర్మధ్వంసమే లక్ష్యంగా స్టాలిన్ బయలుదేరుతాడు. అతని భటులు రాజులను, తత్పక్షపాతులను, ధర్మాచార్యులను సంహరిస్తారు. అప్పుడు ధర్మపురుషుడు ప్రవేశించి, ధర్మాచరణలాభాలను వివరిస్తాడు. అయితే స్టాలిన్ అతనిని బంధించమంటాడు. అప్పుడు ధర్మపురుషుడు జ్యోతీరూపాన్ని ధరించి, భారత దేశంవైపు పరుగెత్తుతాడు. పాపపురుషుడు అక్కడ వృద్ధిపొందుతూంటాడు.

ప్రపంచం మొత్తాన్ని నారింజపండులాగ చేస్తానని హిట్లర్ ప్రవేశిస్తాడు. అతని అనుచరులు ముసోలిని, ఆంగ్లేయులుకూడా వారితో కలుస్తారు. జర్మన్లు లేకుండా చేయాలని వారి భావన. రష్యా మరియు ఇంగ్లాండువారు జర్మనీ, ఇటలీలకు విరుద్ధంగా సంధిచేసుకుంటారు. జపాన్ హిట్లర్‌తో సంధి చేసికొని

ఆసియా దేశాలను వశం చేసుకోవాలనుకుంటుంది. రష్యా హిట్లరును, ఇంగ్లాండు ముసోలినిని హతమారుస్తారు. అమెరికా జపాన్‌ను ధ్వంసం చేస్తుంది. అపుడు పాపం తన నాయకులయిన క్రోధలోభులను తీసుకొని తిరిగి తిరిగి భారతదేశానికి వస్తుంది. క్రోధ లోభ హింసా పాపపురుషులు కలిసి ఆలోచిస్తారు. హింసని విజృంభించమని మిగిలిన వారు ప్రోత్సహిస్తారు. ధర్మమంతలో అక్కడకు వస్తుంది. ధర్మం దగ్గరున్న పూజాది సామగ్రిని చూచి, మరల ఇవి అధిక్షేపిస్తాయి. ధర్మపురుషుడు రావటంతో మిగిలిన శత్రువులంతా పారిపోతారు. “విశ్వకళ్యాణ మస్తు” అని భరతవాక్యం

చౌరచాతురీయ ప్రహసనం

చౌర చాతురీయ ప్రహసనం జీవన్యాయ తీర్థుడు రచించిన ఒక ఉదాత్త ప్రహసనం. హాస్యపోషణకన్నా దోషప్రక్షాళన ప్రధానలక్ష్యంగా గల ప్రహసన మిది.

ఘటంకరుడీ ప్రహసనంలో నాయకుడు. అత డొకదొంగ. దొంగతనాలు చేసినా తప్పించుకోగల నేర్పు అతడికెక్కువ. ఒకనాడు ఒక సాధువు ఘటంకరుడి ఇంటికి భిక్షకు వస్తాడు. పోలీసులు ఆ సాధువును ఘటంకరుడి సహచరుడని భావించి బంధిస్తారు. నిజం తెలిసిన తరువాత వదలివేస్తారు.

ఘటంకరుణ్ణి బాగుపరచాలనే ఉద్దేశ్యంతో సాధువు అతడి దగ్గరకు వెళ్ళి రెండుమాటలు తీసుకుంటాడు. ప్రతిదినం దైవదర్శనం చేయటం, ఎప్పుడూ యథార్థాన్ని చెప్పటం ఆ రెండు వాగ్దానాలు. ఒకరోజు రాజుగారి నల్లగుఱ్ఱాన్ని దొంగిలించాలని ఘటంకరుడు వెళ్తాడు. ప్రతీహారులు ప్రతిఘటించగా యథార్థాన్ని ప్రకటిస్తాడు. అయితే ప్రతీహారు లతనిని పిచ్చివాడని భావించి లోపలికి పంపుతారు. ఘటంకరుడు అశ్వాన్ని దొంగిలించి, దైవదర్శనం కోసం గుడిదగ్గర ఆగుతాడు. రక్షకభటులు వచ్చి బంధించే సమయంలో సాధువు తన శక్తివలన ఆ హయాన్ని తెల్లగుఱ్ఱంగా మార్చేస్తాడు. రాజు తికమకపడి యథార్థాన్ని అడుగగా ఘటంకరుడు సత్యాన్ని ప్రకటిస్తాడు. అప్పుడే సాధువు వచ్చి, అతడిని విడిపించి, సన్మార్గ ప్రవర్తనను గురుదక్షిణగా స్వీకరించి, నిష్క్రమిస్తాడు. ఘటంకరుడు రాజోద్యోగి అవుతాడు.

ఈ ప్రహననంలో ప్రథమసంధి పూర్తిగా చేష్టామూలక హాస్యాన్ని పోషించేందుకు సహకరిస్తుంది. ఘటంకరుడు దొంగతనం చేయటం, రక్షకభటులు బంధించబోగా గ్రుడ్డివాడుగా, పిచ్చివాడుగా నటించి, తప్పించుకోవటం, పట్టుబడిన తర్వాత కూడా రక్షకభటుల కళ్ళలో దుమ్ముకొట్టి పారిపోవటం వగైరా చేష్టలతో ప్రథమసంధి మనోరంజకంగా వుంటుంది. ద్వితీయ సంధి మాత్రం దోష ప్రక్షాళన పరమార్థంగా సాగి, ఉదాత్తసరణిలో ముందుకు పోతుంది. ఈరీతిగా హాస్యపోషణం, పవిత్రీకరణం రెండూ సమప్రధానాలుగా రచింపబడిన ప్రహసనం చౌర చాతురీయం.

A.R.హబరే రచించిన మనోహరం దివమ్ ప్రహసనం ఇటువంటిదే. విద్యాలయం నుండి పారిపోవాలనుకునే విద్యార్థి ప్రదర్శించే తెలివితేటలన్నీ దీనిలో కనిపిస్తాయి. రామచంద్రమిశ్ర రచించిన కర్మఫల ప్రహసనం కూడా ఈ కోవకు చెందినదే.

క్షీరసాగర రచితమైన 'నాట్యే చ దక్షా వయం' ప్రహసనం కూడా కామెడీ ఆఫ్ మేనర్స్ ప్రక్రియయే. నాట్యప్రదర్శనకు సిద్ధంకావటమన్నది మొదట ఉత్సాహంగా కనిపించినా, ఆ తర్వాత అది ఎంత బుద్ధితక్కువ పనిగా నిర్వాహకులకు అనిపిస్తుందో తెలియజేసే రచన ఇది. భరతుడు నాట్యశాస్త్రంలో ఏ భావంతో నటుల శాపకథను కల్పించాడో కానీ, ఈ నాటికీ ఆ పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నాటికీ సాంఘికంగా వారిస్థితిని పూర్తిగా ఉన్నతంగా అంగీకరించలేక పోతున్నారు ప్రజలు. అంకితమైన నటులు లేకుండా నాట్యప్రదర్శనను నిర్వహింపబూనట మెంత నరకమో ఈ రూపకం చిత్రించి చెపుతుంది!

SATIRE

(సెటైర్)

కాలప్రభావం వలన సామాజిక వ్యవస్థలో వచ్చే మార్పులు సాహిత్యంపై తప్పనిసరిగా ప్రభావాన్ని చూపుతాయి. ఆధునిక కాలంలో ఏపాటి వివక్షా విచక్షణలు కల్గిన రచయిత అయినా సమకాలీన సమాజాన్ని విమర్శించకుండా మౌనం వహించడం లేదు. అందునా విశేష ప్రచారాన్నిపొంది, అటు రచయితలను ఇటు విమర్శకులను సైతం ప్రత్యేకంగా ఆకర్షిస్తున్న సమస్యలు రెండే రెండు, ఆర్థిక రాజకీయ సమస్యలవి. నియంతృత్వ పాలననుండి బయటపడి భారతీయులు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవటం దేశానికి ఒక విజయమైనా, నాటినుండి ఏర్పడుతున్న రాజకీయ పరిణామాలు, రాజకీయ వ్యవస్థలు, వ్యక్తిసిద్ధాంతాలలో విశ్లేషణారాహిత్యం వగైరా సమస్యలన్నీ ప్రతిరచయితకు విమర్శవిషయాలయ్యాయి. సమాజ విమర్శకు సిద్ధపడిన ఏరచయిత అయినా రాజకీయ విమర్శ చేయకుండా తృప్తిపడలేక పోతున్నాడంటే అతిశయోక్తికాదు. అటువంటి రాజకీయ వ్యవస్థకు అద్దంపట్టే రాజకీయ రచన **స్వర్గీయహసన ప్రహసనమ్.** ఇది సిద్ధేశ్వర చట్టోపాధ్యాయ రచన.

భూలోక రాజకీయాలను స్వర్గలోకానికి అంటించి, ఈ రాజకీయతత్త్వం అంతకంతకూ అందకుండా అంతదూరం వ్యాపించి ఉందని రచయిత ప్రస్తావనలో ప్రకటిస్తాడు. వస్తుధర్మాన్ని వస్తువునుండి వేరు చేసి చూపడంలో ఉన్న స్పష్టతయే రచయితను ఈ రచనకు ప్రోత్సహించి వుండవచ్చును. స్వర్గలోక రాజకీయాలు మనకు అప్రత్యక్షాలైనా, భూలోక రాజకీయ పరిస్థితిని అక్కడ ప్రతిక్షేపించి, భూలోక రాజకీయాలను స్పష్టం చేయడం కవిలక్ష్యంగా కనిపిస్తోంది.

ఇంద్రుడు దేవరాజు. బృహస్పతి ప్రధానామాత్యుడు. వరుణుడు మంత్రివర్గ సహచరుడు. అశోకుడు, అక్బర్ స్వర్గలోక ప్రతినిధులు. దుప్ధు, పుంగులు నరకలోక ప్రతినిధులు. అదితి ఆత్మోన్నతి విభాగానికి మంత్రిణి. ఊర్వశి శాసనసభ్యురాలు. ఇవి ఈ ప్రహసనంలోని పాత్రలు. అయితే వరుణుడికి రంగస్థల ప్రవేశంలేదు.

ఈకథ పూర్తిగా బృహస్పతిని అల్లుకొని తిరుగుతుంది. అతడు వయోవృద్ధుడు. వజ్రాన్ని పైకెత్తడానికి కూడా తగిన శక్తిలేనివాడు. అయితే మంత్రిగా అతడు చాలా శాఖలను నిర్వహిస్తుంటాడు. దేవరాజు పదవిని తాను పొందాలని అతడి ఆరాటం. దానితో కుట్ర ప్రారంభిస్తాడు. మంత్రి పదవులపై ఆశచూపి అశోకుని, అక్బరును తన వైపుకు తిప్పుకుంటాడు. అదితి ఇటువంటి వ్యవహారాలను అంగీకరింపదు.

సర్వసభ్య సమావేశాల్లో నిద్రతప్ప ఆమెకేమీ తెలియదు. ఊర్వశి దున్దుపుంగులతో కలిసి బృహస్పతి ఆట కట్టిస్తుంది.

బృహస్పతి దేవరాజుపై అవిశ్వాసతీర్మానాన్ని ప్రతిపాదిస్తాడు. కానీ మెజార్టీ లేదు. అయినా ఇంద్రుడు పదవినుంచి తప్పుకుంటాడు. బృహస్పతి దేవరాజు కావాలని అతని వర్గంవారు ప్రతిపాదిస్తారు. వజ్రాన్ని పైకెత్తగలిగితే అంగీకరిస్తామని ప్రతిపక్షాలు ప్రకటిస్తాయి. అతికష్టంమీద బృహస్పతి ఆపని చేయగలుతాడు. అయితే వెంటనే దున్దుపుంగులు బలాత్కారంగా బృహస్పతిని బంధించి ఇంద్రుణ్ణి దేవరాజును చేస్తారు. చివరగా ఊర్వశి బృహస్పతి కుట్రనంతా ఆధారాలతో బయటపెడుతుంది. మంత్రివర్గం నుండి బృహస్పతి తొలగింపబడతాడు.

ఈ ప్రహసనంలో కథానిర్వహణ చక్కగా సాగుతుంది. C. Simmons[1] చెప్పినట్లుగా చక్కని చెణుకులతో, నిగూఢ భావాలతో ఈ ప్రహసనం నడుస్తుంది. రాజకీయాలను ఎంతగా విమర్శిస్తుందో అంతగా నవ్విస్తుంది. దేవరాజు సంతకంతప్ప మరేమీ చేయడంలేదని మంత్రివర్గం అభిప్రాయపడుతుందని దేవరాజు తనలోతాను అనుకున్నప్పుడు[2] ఒక్కమారు మనదేశ పరిస్థితి, ఉన్నత రాజకీయ విమర్శలో సామాన్యంగా వినిపించే వాణి గుర్తుకురాక మానదు. అనుకూలంగా లేకపోయినందువలన బృహస్పతి లిఖిత రాజ్యాంగంలో చాలా లోపాలున్నాయని, వాటిని వెంటనే మార్చుకోవాలని రాజకీయమైన చిలుక పలుకులను వల్లించినప్పుడు వర్తమాన దేశస్థితి మదిలో మెదలక తప్పదు. స్వార్థం కొరకు పార్టీ ఫిరాయింపులు చేసేవారి స్థితిగతులు అశోకుడు, అక్బర్లలో కనిపిస్తాయి. అవిశ్వాస తీర్మానం, బృహస్పతి ఆశ్రయించిన "విభజించి పాలించు" అన్న సిద్ధాంతం అన్నీ హాస్యాస్పదాలే.

ఈ ప్రహసనంలో అదితిపాత్ర ప్రత్యేకాకర్షణ. సభాసమావేశంలో సైతం సుఖంగా నిద్రిస్తుంది. మధ్య మధ్య మెలకువ వచ్చినప్పుడు హడావుడిగా ఏదో

1 Arrows of satire feathered with wit and wielded with sense fly home to their mark - The new Dictionary of thoughts P. 567

2 సర్వతోరుద్ధ ప్రసరోఽయం దేవరాజః. నిర్ధార్యతే సర్వం మంత్రి పరిషదా తత్ర స్వనామ లేఖన మేవ తస్య కర్మేతి - పుట 2

అంటుంది. నిద్ర నా ఆధీనంలో ఉండదుకదా అంటుంది. అసెంబ్లీలలోను, పార్లమెంటు లోనూ నిరర్థక చర్చల ద్వారా కాలక్షేపం చేస్తున్న వ్యక్తిత్వాలు సైతం ఈ ప్రహసనంలో ప్రతిబింబిస్తాయి. సంభాషణలలో వాడిని, వేడిని మాత్రమే ఆశ్రయించి, హాస్యరస పోషణ చేయడం రచయిత శక్తికి ఒక ఉదాహరణం. అయితే కేవలం హాస్యకల్పన కన్నా సమాజ పవిత్రీకరణ లక్ష్యంగా ఈ ప్రహసనం రూపొందింది.

అథ కిమ్

స్వర్గీయ హసన ప్రహసనంలో రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరించిన - చట్టోపాధ్యాయ రాజకీయేతర విషయాలను, సమస్యలను అధిక్షేపించేందుకు వ్రాసిన మరొక ప్రహసనం అథ కిమ్.

వర్తమానకాలంలో రచనల్లో కనిపిస్తూన్న అధిక్షేపణలనే అధిక్షేపిస్తూ రచన ప్రారంభిస్తాడు చట్టోపాధ్యాయ. తన నివేదనలో "హాస్యచ్ఛలేన ప్రశ్న ఏవ ఉపస్థాప్యతే న దీయతే ఉత్తరం. న జ్ఞాయతే వా కిముత్తర మస్య, సర్వైరేవ వా జ్ఞాయతే తత్" అని విమర్శిస్తాడు. నాందీ శ్లోకమే విప్లవ భావాలకు అనుగుణంగా కనిపిస్తుంది. ఆనాడు కాళిదాసు కూడా నూతనత్వాన్నే కోరాడు. ఈనాడు చట్టోపాధ్యాయ కూడా అదే కోరుతున్నాడు.[1] అయితే భావతీవ్రతలో తేడా కనిపిస్తుంది.

అథ కిమ్ ప్రహసనంలో ఏ పాత్రకూ పేరుండదు. కేవలం వర్ణ సమామ్నాయం లోని అక్షరాలనే పేర్లుగా వాడుకున్నాడు. పాత్రలలో ఎక్కువ భాగం మధ్యతరగతికి చెందినవే. ఒక కార్యాలయోద్యోగి, పూట తిండికి కూడా నోచుకోని ఒక పేదవాడు, మరొక కర్మసాక్షి. ఓటు నభ్యర్థిస్తూ ఒక రాజకీయ మనిషి. పరీక్షలు లేకుండానే సర్టిఫికెట్లు ఇవ్వాలని ఇతని అభిప్రాయం. విప్లవం తప్ప సమాజ భవిష్యత్తుకు మరో దారి లేదనే పాత్ర మరొకటి. ఒక అధ్యాపకుడు, అతనికే పాఠాలు చెప్ప గలిగిన అతని భార్య. ఇవన్నీ ఈ ప్రహసనంలో పాత్రలు. వీరందరి సమావేశ సంభాషణలే ప్రకృత ప్రహసనం. ఒక్కమాటలో చెప్పాలంటే దీనికి కథలేదు. వివిధ సమస్యల మీద సంభాషణలు మాత్రమే కనిపిస్తాయి. అవికూడా నిశితాలూ,

---

1 పురాతనం యాత్వధునా వినాశం
నవీన మద్యేహ విభాతు కామమ్

స్పష్టాలూ కావు. బహుశః సమాజంలోని వ్యక్తిత్వాలను యథాతథంగా చిత్రించాలన్న ఉద్దేశ్యంతో రచయితే ఆ రీతిగా కొనసాగించి ఉండవచ్చు.

కొంత చర్చ తర్వాత ఏదో ఒక కొత్తది సమాజంలో ఏర్పడబోతోందని, అదేమిటో తెల్చుకొని ఏర్పడినప్పుడు చేయవలసిన పనులను నిర్ణయించేందుకు ఒక సమాజంగా ఏర్పడాలని తీర్మానించుకుంటారు. ఎవరికివారు తమంతటతామే సమాజంలో సభ్యత్వాన్ని ప్రకటించుకుంటారు. అందరూ దానిని గూర్చి ఉపన్యాస మివ్వడం ప్రారంభిస్తారు. శ్రోతలుండరు. ఆసమయంలో ఆధ్యాపకుని భార్య భర్తను ఉపన్యాసానికి ప్రోత్సహిస్తుంది. క్లాసులో పాఠం చెప్పినట్లు కాళిదాస శ్లోకాలను, పాణిని సూత్రాలను వల్లించడం మొదలు పెడతాడు. చివరగా ఎవరిదారిన వారు నిష్క్రమిస్తారు. ఇది అథ కిమ్ లోని ఇతివృత్తం. ఈ ప్రహసనంలోని కొన్ని అధిక్షేప వచనాలు నిశితంగా ఉండి, నవ్విస్తాయి. కు, అ ల అర్థరహితమైన వివాదం హాస్యాత్మకంగా ఉంటుంది. నేటి సమాజంలోని చర్చాసమావేశాలను ప్రతిబింబింప జేస్తూ సామూహికంగా ప్రజామనస్తత్వాన్ని భరతవాక్యం ఎత్తి చూపుతుంది. చూడండి -

కాలస్య గతి మాలోచ్య సాంప్రతం ప్రార్థయామహే
అస్తు మే మంగళం నిత్యం భవతా మస్తు వా నవా.

అయితే ఎంత ప్రయత్నించినా ఇది స్వర్గీయ ప్రహసనం వలె పాఠకులను ఆకర్షించలేదు. ఉత్సుకతను పెంచదు. కథారహితంగా సాగినందువలన ఆ హాస్యం విసుగును కల్గించే అవకాశంకూడ లేకపోలేదు. ప్రహసనంలో దాదాపు 75 శాతం పూర్తయ్యే వరకు పాత్రలకు ఏకవాక్యత కనిపించదు. ఇది ఐచ్ఛికంగా రచయిత నిర్వహించిన తీరు అయితే కావచ్చు. అంతేగాదు, డా. రామజీ ఉపాధ్యాయ అన్నట్లు[1] ప్రవేశించిన ఏ పాత్ర కూడా కడదాకా నిష్క్రమించకపోవడం, ఆ పాత్రల అవసరం రంగస్థలంపై అంతగా లేకపోవడం, నాట్యస్వభావాన్నే గాక ప్రేక్షకుల అనుభూతిని సైతం ఆటంకపరుస్తుంది. మొత్తం ఈ ప్రహసనంలో ప్రతిపాదిత విషయాన్ని ప్రతిపాదన విధానం లొంగదీసుకొనలేకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. అభినయంలో వికృతిని ప్రదర్శింపగల్గితే ఈ ప్రహసనం ప్రదర్శనల్లో రక్తి కట్టవచ్చు.

---

1 ఆధునిక సంస్కృత నాటక్ II-1100 పుట

వేష్టనవ్యాయోగ ప్రహసనం

రచయిత వీరేంద్రకుమార భట్టాచార్యుడు. ఆధునిక ప్రహసనాలలో ఇది యొకటి.

...యోఽవతారః కలౌ హి సంఘశక్తి మమోఘత్వం నౌమి కల్కిరూపం వంగేష్వహం వేష్ట నాయుధవన్తమ్ ॥ అని రచయిత వేష్టనాన్ని (ఘొరావ్) కల్కి అవతారంగా భావిస్తూ నాంది పల్కినాడు. వేష్టనవ్యాయోగలక్ష్యాన్ని ప్రదర్శించినాడు.

ఆధునిక సంఘంలో సంఘ వ్యవస్థ (Unionism) సర్వరంగాలలో పాతుకొని పోయింది. కార్మిక సంఘాలతో ప్రారంభించి సమస్త విషయాలకు, వ్యక్తులకు సంఘాలు ఏర్పడినాయి. అట్లే కులాలకు, కులాంతర్భాగాలకు కూడ విడివిడిగా పరిషత్తులు. ఈ వ్యవస్థలు చాలవరకు బాధ్యతలకొరకు కాకుండ హక్కుల కొరకేర్పడ్డాయి. బాధ్యతలు ఎటూ అధికారులకు సంబంధించినవి కాబట్టి హక్కుల సంరక్షణ లక్ష్యంగా సంఘాలేర్పడుతున్నాయి.

వాటి కార్యక్రమాలలో ప్రధానం అన్యాయాలను అరికట్టడం. వారు అన్యాయ మనుకొన్న వాటిని అరికట్టడం. వాటిపై ప్రత్యక్ష చర్యకు దిగడం.

పాలకులు, పాలితులు వేరన్న భావం ఈ సమాజంలో స్థిరంగా పాతుకొని పోయింది. ప్రభుత్వం, ప్రజల మధ్యా కాకుండా అధికారులు, పారిశ్రామికుల మధ్య కూడ సంభవించింది. ప్రతి వ్యక్తి తనకన్న పైన అధికారిగా వున్నవాడు తనకు విరోధి - శ్రేయోభిలాషి కాదు - అని అనుకోవడం ఈనాటి సంఘంలో ప్రథమ సమస్య. దానితో వర్గ వైషమ్యాలు, ధనిక దరిద్ర సంఘర్షణలు తప్పనిసరి అవుతున్నాయి. కార్యసాధనకు సమ్మెవంటిది తప్పనిసరి అన్న అభిప్రాయం నెలకొంది. ఆ వ్యవస్థను వ్యంగ్యంగా విమర్శిస్తూ కొనసాగిన రచన వేష్టనవ్యాయోగం.

రచయిత "ప్రహసన మిదం వ్యాయోగాఖ్యం" అని ప్రస్తావనలో దీనిని ప్రహసనంగా అభివర్ణించినా, దీనిలో హాస్యరసపోషణ చాల తక్కువగనే ఉంటుంది. ఎక్కువభాగం కార్మికుల అభిప్రాయాలు, అధికారుల ఆలోచన - ఈ రెండింటి మధ్య గల అంతరం వివరించడానికి సాగినందువలన హాస్యానికి అవకాశం చాలా తక్కువ. అయితే ఘోరావ్‌ను విష్ణుమూర్తి యొక్క (కల్కి) ఆయుధమని వర్ణించడం మౌలికంగా జరిగినది కాబట్టి అది హాస్యాలంబన మవుతుంది.

ప్రస్తావనలో కొంత హాస్యావకాశముంది. గజదన్తుడు సూత్రధారునకు సహకరిస్తూ గణేశ ప్రార్థనకు ప్రోత్సహిస్తాడు. ఆధునిక సంఘంలో గణవిజయం ప్రధానం కాబట్టి గణేశ ప్రార్థన చేయాలని అనడం (False logic) హాస్యోత్పాదక మౌతుంది. "న ఏవ న గణేశో జనగణమనోధినాయకో దరిద్ర భాగ్యవిధాతా" అని రచయిత జాతీయ గీతాన్ని Parody (వ్యంగ్యానుకరణం) చేయడం సాహసాన్ని గాక, హృదయపు లోతులలోని ఆవేదనను వ్యక్తం చేస్తుంది, అది Parody కాబట్టి ముందు కొంత మనస్సు చివుక్కుమన్నా తర్వాత నవ్వక తప్పదు.

ఆ ప్రస్తావనలో విష్ణుమూర్తి కల్క్యవతారాన్ని యుద్ధంతో వంగదేశంలోనే స్వీకరించాడని అదృష్టంగా వర్ణించి, వెంటనే దానిని వ్యంగ్యంగా "ఏతేన వంగేషు ధర్మ వ్యభిచారస్య అతిశయ్యం ప్రతిపాద్యతే"- అనటం హాస్యకారణం.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత | అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం" అని గీతోక్తి. ఈ ప్రస్తావనలో నల్లబజారును (Black Market) కూడా కవి స్పష్టంగా విమర్శిస్తాడు. బజారులో దొరకని వస్తువులు నల్లబజారులో దొరకడానికి కారణం ఉత్పత్తి లోపం కాదని వక్కాణిస్తాడు. ఇంతవరకు ప్రస్తావనాంశం. కొంతవరకు హాస్య సమ్మిళితం.

ధాత్రా నృభ్యో లఘు పదయుగ్మం
దత్తం నూనం ద్రుత సరణార్థమ్ - అని సూత్రధారుడు గుంపును చూచి నిష్క్రమిస్తాడు.

సంజయుడు, అభిజిత్తు, అరిజత్తు, సత్రాజిత్తు, జయద్రథులు కార్మికులు. అందరూ ఘెరావ్‌ను కీర్తిస్తూ రంగంపైకి వస్తారు. వీరిలో జయద్రథుడు మితవాది, అహింసావాది. ఇతరులు అతివాదులు. తుపాకిగొట్టం నుండి నూతన వ్యవస్థ పుట్టగలదనే వ్యక్తులు. జయద్రథుని వాదన వారికి నచ్చదు. కడకు – "నాహం గృహ శత్రు ర్విభీషణః. నిజమతాత్ సంఘమతమ్ అతిరిచ్యతే" అని వారి వాదనతో ఏకీభవిస్తాడు జయద్రథుడు.

వర్తమాన సంఘంలోని సర్వసమస్యలకు, పరిష్కారాలకూ ఇది ఆయువుపట్టు. కేవలం సంఘం, యూనియన్ అనే పేరుతో కొందరి అభిప్రాయాలు అందరి మీద రుద్దబడుతున్నాయన్నది నగ్నసత్యం. దాని వలన ఆలోచన అణచివేయబడి,

అవకాశం రాజ్యపాలన చేయవలసి వస్తోంది. ఈ వ్యవస్థ మారాలి. అందరి అభిప్రాయాలకు సరియైన విలువ రావాలి. బహుశః కవ్యభిప్రాయం అది కావచ్చు, కాకపోవచ్చు. ప్రజాప్రభుత్వం (Majority system) గొప్పదయినా, దానిలో వుండే లోపాలు ఈ కోణంలో నుండియే కనిపిస్తాయి. అక్కడ అధికారుల ఆలోచనలు మరో రీతిగా ఉంటాయి. అయితే రచయిత అవకాశవాదులను, ఆలోచనారహితులను కార్మికులలో సృష్టించి అధికారులలో మాత్రం ఆలోచనా మహితులను మాత్రమే పాత్రలుగా కల్పించినాడు. అధికారి వర్తమాన సంఘంలో పారిశ్రామిక కార్మికుల మధ్య కన్పించే వైషమ్యాన్ని విశ్లేషించిన తీరు చూడండి.

శర్మోత్కర్షం యది ఘటయితుం పాలకా సంయతన్తే
మాన్యన్తే తే శ్రమిక నిచయైః నిర్ఘృణా వ్యాఘ్ర కల్పాః |
కర్మి క్షేమం జనయితు మలం తత్ప్రియాసో యది స్యాత్
శిల్ప వ్యాలాన్ గణయతి తు తాన్ గృధ్నుకః స్వామి పక్షః || - 22

కార్మికులు అధికారులతో ఘర్షణ పడతారు. అధికారులను పారిశ్రామికులను నిందిస్తారు. అధికారులు నిదానంగా ఎంత వివరించినా వినరు. కడకు వారి మాటలమీద సైతం విశ్వాసం చూపక వారిని ఘెరావ్ చేస్తారు. ఘెరావ్ చేసి వీరు ఆనందంగా పాటలు పాడుకుంటారు. ఒకడు కుక్షిపటపటహాన్ని వాయిస్తాడు.

అస్త్రం నో నవీనం వేష్టన నామకం పాశుపతాత్ భృశం శాణితమ్
తూర్ణం హన్తి నూనం నిష్ఠుర శాసకం కేన భవేదిదం వారితం
గాయ భ్రాత ర్వేష్టన జయం గాయ భ్రాతర్వైరి విలయం
సాయం ప్రాతః గాయ త్వం మన్త్ర మభయం చలిష్యతి చిరం య దద్య చలితమ్
P-4

ఆ సమయంలో కల్కి అనే నాయకుడు మొరావ్ జయప్రదమైన దంటూ ప్రవేశిస్తాడు. అందరూ ఆ కల్కికి (అవతార భావన) మ్రొక్కుతారు. కల్కిని, అతని వేష్టనాయుధాన్ని ప్రశంసిస్తారు. భరతవాక్యం సైతం వేష్టన స్తోత్రంతోనే ముగుస్తుంది.

ఇలా సాగిన ఈ రూపకంలో హాస్యానికి అవకాశం అత్యల్పమని మరల చెప్ప నవసరం లేదు. సంఘాన్ని వ్యంగ్యంగా అధిక్షేపించడంలో ఇది విజయవంత మైన రచన. ఆధునిక కార్మికుల భావాలను ఇక్కడ శ్లోకంలో ఎలా వర్ణించాడో చూడండి-

గతః ప్రతాపః ఖలవిత్తశాలినాం
శ్రమార్థి సంఘః కురుతే స్వపాలమ్ ।
కుతోద్య జేతా ద్విరదః పిపీలికాః
న దంశనార్తః సహసా పలాయతే ॥ - 34

విధి విపర్యాస ప్రహసనం

స్త్రీ పురుష లనే రెండు తెగలను సృష్టించడంలో కారణం తెలియదు కాని సృష్టిని ముందుకు కొనసాగించడమే అని ప్రాచీనుల తలంపు. ఇది సమభారమని ఒకరికొకరు తక్కువేమీ కాదని వారి అభిలాష. అయితే సామాజిక నియమాలను అనుసరించి, ప్రశాంత జీవనానికి అవసరమయ్యేటట్లు స్త్రీపురుషులకు కొన్ని కట్టుబాట్లు ఏర్పాటు చేశారు. వాటిని అపార్థం చేసికొనడం వలన కానివ్వండి, అవి వికృతాకారాన్ని ధరించడం వలన కానివ్వండి, కొంతకాలంగా స్త్రీపురుమల పరస్పరాభిశంసనలు, అన్యోన్యవిమర్శలు ప్రారంభమయ్యాయి. ఎవరు అధికులు, ఎవరు అల్పులు అనే చర్చ చాలా జోరుగా సాగుతోంది. మేధావులకది విమర్శనా విషయమైంది. 1944లో హిందూ కోడ్ బిల్ (Hindu Code Bill) ను వ్యతిరేకించ టానికి ఏర్పడిన అఖిల భారత ధార్మిక విద్వత్పరిషత్తు సమావేశంలో ప్రదర్శింప బడిన ఈ జీవన్యాయతీర్థుని ప్రహసనం పై అంశాన్ని నిష్పాక్షికంగా విమర్శించింది. సృష్టి సిద్ధమై, సకారణమయిన స్త్రీ పుం తారతమ్యాన్ని ప్రతిఘటించి, తిరస్కరించా లనుకోవటం అంత ఉచితం కాదని, వ్యర్థప్రయత్నమని వివరిస్తూ శ్రీ జీవన్యాయ తీర్థ రచించిన ప్రహసన మిది.

వినోద సుందరుడు ఇందు నాయకుడు. ధర్మశాస్త్రాలు స్త్రీ పురుషుల విషయంలో తారతమ్యాన్ని వహిస్తున్నాయని, అది తగదని అతని భావం. ఆస్తిలో స్త్రీ పురుషులకు సమానంగా వాటాలుండాలని అతని అభిప్రాయం. తన విషయంలో నిర్ణయం కూడ. ఘర్ఘరకంఠ అనే ఆధునిక యువతి అతనిని కలుస్తుంది. అవివాహితుడు గానే ఉండమని సలహాయిస్తుంది. సమాజ సమస్యా పరిష్కారానికి స్త్రీపురుషు లిరువురూ వివాహం చేసికోకుండా ఉండటమే మంచిదని వారు నిర్ణయించుకొంటారు.

అయితే సంతానోత్పత్తి ఎలా? అన్నది ప్రశ్న. శాస్త్రీయ విజ్ఞానంతో స్త్రీ లేకుండా పురుషులే సంతానోత్పత్తిని చేస్తారని, అది శాస్త్రసమ్మతమని వినోదసుందరుని అభిలాష. అయితే ఇక స్త్రీల ప్రయోజన మేమిటని ఘర్ఘరకంఠ ప్రశ్న. వేదవాణి

సమస్తమూ పుం రూపమంటోంది. కాబట్టి వాళ్ళను పురుషులు చేయవచ్చు నని వినోదసుందరుని సమాధానం. అయితే అందరినీ స్త్రీలనే ఎందుకు చేయ రాదని మరల పూర్వపక్షం. వారు అబలలని సమాధానం.

ఆ సమయంలో ఘర్ఘరకంఠకు వత్తాసుగా జంబాలజిని వస్తుంది. స్త్రీలను పురుషులతో సమానం చేసేందుకు దశసూత్ర ప్రణాళికను ప్రతిపాదిస్తుంది. యాజ్ఞవల్క్యుడనే బ్రాహ్మణుడు ప్రవేశిస్తాడు. అతడు మొదటి భార్యకు పిల్లలు లేరని మరో వివాహం చేసుకున్నాడు. పురుషుడి కిద్దరు భార్యలుంటే స్త్రీ కిద్దరు భర్తలుండ కూడదా అని జంబాలజిని ప్రశ్న. అది వేద సమ్మతమని ఆ బ్రాహ్మణ సమాధానం. కోపంతో జంబాలజిని అతని కళ్ళు పీకేందుకు గొడుగు ఎత్తుకుంది. వారు పారిపోతారు. ఆమె పడిపోతుంది.

మరల నాయికానాయకుల ప్రశ్న. గర్భధారణ ఎలా జరుగుతుంది? అని. ఆ సమయంలో ఒక నపుంసకుడు పరుగెత్తుకొని వస్తాడు. ఒక డాక్టరు ఆపరేషన్ ద్వారా అతని క్లైబ్యాన్ని పోగొట్టాలని, అది తన లక్ష్యమని అంటూ వస్తాడు. ప్రసంగ వశంగా నాయికా నాయకులిద్దరూ సంతాన విముఖులని తెలిసి వారిరువురిలో ఎవరైనా అంగీకరిస్తే, వారి జననాంగాన్ని తీసి ఆ నపుంసకునికి అమర్చగలిగితే, అతనికి ఉపయోగపడుతుందని చెప్తాడు. ఆ మాటతో ఇద్దరి ఆశయాలు దెబ్బ తింటాయి. ఎవరిమట్టుకు వాళ్ళు తమకు వైవాహిక సంబంధం నిర్ణీతమైనదని ప్రకటిస్తారు. సాక్షిగా నపుంసకుడినే బ్రతిమిలాడుకొంటారు. వారిద్దరూ వివాహితులని వాడు సాక్ష్యం పలుకుతాడు. అది తప్పయితే శిక్షింపబడతారని డాక్టర్ నిష్క్రమిస్తాడు. వారిద్దరికీ అనూహ్యస్థితిలో వివాహమవుతుంది. వారిమీద సృష్టిభారం పెడుతూ నపుంసకుడు అనపుంసకమైన తన యథార్థతత్త్వాన్ని ప్రకటిస్తాడు.

సిద్ధాంతాలకు, ఆచరణలకు సంభవించే పరస్పర సంఘర్షణను రచయిత దీనిలో చక్కగా, హాస్యపూరితంగా వివరించాడు. నియమాలకు వికృత రూపాన్ని కల్పించి, పిడివాదాలు చేస్తే సంభవించే ఫలితాన్ని నవ్వుతూ, నవ్విస్తూ చిత్రించాడు.

వర్తమానకాలంలో పురుషుడిని ప్లస్ అనీ, స్త్రీని మైనస్ అనీ వ్యవహరించడం, పిల్లలెందరని ప్రశ్నించినా ఒక ప్లస్ ఒక మైనస్ అనే వాళ్ళు, ఇద్దరు మగపిల్లలంటే నీకేం రెండు ప్లస్‌లు అనేవాళ్ళు అనేకులు. దానిని ఖండించటం వినోద సుందరుని సిద్ధాంత లక్ష్యంగా రచయిత ఎలా వ్యక్తీకరించాడో చూడండి

ఏకోగర్భః స్నేహసందర్భ ఏకో బీజం తుల్యం కిన్తు మూల్యం విభిన్నమ్ |
పుత్రః ప్రాప్తస్తాత సర్వస్వమానః పుత్రీ మాత్రీభావ మేతీవ ఘృణ్యా ||

అయితే దీనిని జీవన్యాయతీర్థుడు వైయక్తికంగా విలువలను అందించే వరకే అంగీకరిస్తాడు గాని, పరమార్థాన్ని విస్మరించేంతవరకు పోడు. సృష్టిగతాలైన కొన్ని వైషమ్యాలను అంగీకరించి తీరాలని ఇతని అభిప్రాయం. వాటిలో ప్రధానమైనది స్త్రీ గర్భధారణ - పురుష గర్భకారణములే. సంఘంలో స్త్రీకి ఎన్ని కట్టుబాట్లున్నా అవి ఈ ఒక్క విషయం మూలకారణంగా ఏర్పాటు చేయబడినవే కాని స్త్రీలకు మాత్రమే ఆ నైతికస్థితి అవసరమనికాదు. కాని దానిని అపార్థం చేసికొని సంఘం చెడుతోంది. కనుక స్త్రీ పురుష తారతమ్యానికి కారణమైన ఆ విషయాన్ని ప్రధాన కేంద్రంగా చేసికొని, జీవన్యాయ తీర్థుడు ఈ ప్రహసనాన్ని నడిపించాడు. రమణీయ మైన సెటైర్ (Satire) ఇది

చమత్కారాలు దీనిలో చాలా ఉన్నాయి. జంబాలజిని స్త్రీని పురుషునితో సమానం చేసేందుకు చెప్పే సూత్రాలలో కొన్ని విచిత్రంగా ఉంటాయి. ప్రలంబ కేశచ్ఛేదన, వక్షః పేషక పట్టబంధం, సగోత్రా సవర్ణ వివాహం, వివాహ బంధ విచ్ఛేదనం మొదలగునవి నవ్వు తెప్పించే అంశాలు. స్త్రీ పురుషులు సమానమైపోతే గర్భధారణ ఎవరు చేస్తారన్నప్పుడు నపుంసకులనే సమాధానంలోని వికృతి నవ్వవలసిందే కాని వివరించవలసినది కాదు. సన్నివేశ కల్పనలు, కథాశిల్పంలో చివర వేసిన ముడి చాలా చమత్కారావహమయినది. నపుంసకుడికి అంగదానం చేయండి అన్నప్పుడు అటు ఆశయాలు, ఇటు ఆత్మజీవితం వారి కళ్ళముందు తులాదండంలా లాగి ఉంటాయి. అయితే ఆత్మజీవితమే గెలుస్తుంది. ఆశయాలు విఫలమవుతాయి. అవినీతి, అశాంతి అన్నవాటికి కారణ మిదొక్కటే.

ఒక హేత్వాభాసం (False logic) దీనిలో గమ్మత్తుగా ఉంటుంది. సృష్టిని మొత్తం పుం రూపంగా చేద్దామని వినోదసుందరుడు

పురుష ఏవేదగ్ం సర్వం యద్భూతం యచ్చ భవ్యమ్ |
భూత మధ్యే మాదృశాం భవ్యమధ్యే చ త్వాదృశాం సన్నివేశః ||

అని ప్రమాణీకరించడం హాస్యాస్పదం. నపుంసకులను ప్రజనన యోగ్యులను చేయడం లక్ష్యంగా పెట్టుకొన్న భిషక్కు -

'క్లైబ్యం మాస్మగమః పార్థ' అని భగవద్గీతను తన వాదానికి ప్రమాణంగా పలకడం మరో హేత్వాభాసం. అంతేగాదు ఆ డాక్టర్ తాను చేయబోయే ప్రయోగాలను వివరించడం కూడా హాస్య హేతువే

ఖండనా ద్వానరాంగానాం యోజనాచ్చ జనాంగకే |
నరవాసరయోః సామ్యం ప్రమాణీక్రియతే మయా ||

ఈ రీతిగా సామాజిక స్పృహ, అధిక్షేపణ, పరిష్కార ప్రదర్శన, హాస్య విశ్లేషణ కలిగిన చక్కని Satire ఇది.

శతవార్షిక ప్రహసనం

కలకత్తా విశ్వవిద్యాలయం వజ్రోత్సవ సందర్భంగా ప్రదర్శింపబడిన ఈ రచన జీవన్యాయ తీర్థునిది. ఆధునిక జీవశాస్త్రం, దాని పోకడలు, దాని లాభ నష్టములు మొదలైన వాటిని వ్యంగ్యంగా అధిక్షేపించే రచన యిది.

క్రియేత చేన్న యన్త్రీయ విజ్ఞానస్య నియన్త్రణమ్ |
శతవర్షాంతరే పృథ్వీ నూనం ధ్వస్తా భవిష్యతి ||

ఇది ప్రహసనం చివర భరతవాక్యంగా జీవన్యాయ తీర్థుడు చెప్పినమాట. వర్తమాన కాలంలోని విజ్ఞానశాస్త్ర ధోరణులను సూటిగా అధిక్షేపించే వాక్యమిది. ప్రతిశక్తి వలనా లాభం, నష్టం రెండూ ఉంటాయి. ఉపయోగించుకొనే వ్యక్తినిబట్టి దాని ఫలితం ఉంటుంది. అణుశక్తిని శాంతి సాధనకే ఉపయోగించాలి అని అందరూ అంటూనే, ఎవరి ధోరణిలో వారు స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలని ప్రయత్నించడం, ప్రతి దేశం పొరుగు దేశాన్ని చూసి భయపడడం ఆధునిక సమాజ స్థితి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని దుస్థితి. ఇదే ప్రహసనంలో ఇతివృత్తం.

మర్త్యమణి ఇందులో విజ్ఞాన శాస్త్రవేత్త. అతను రాకెట్‌లో బ్రహ్మలోకం దగ్గరకు వెళ్తాడు. అతని శరీరానికి రాకెట్ ఉంటుంది. అతనికి మొదటి భేటి స్వర్లోక పాలకుడితో జరుగుతుంది. అతనిని లోపలికి పంపరు. ఇంతలో కుజుడు వస్తాడు. అప్పుడు కుజుడు రాకెట్ చూసి హడలిపోతాడు. అటువంటి యంత్రమే నానడ్డి విరుగగొట్టినదని కుజు డనుకొంటాడు. మర్త్యమణి 'నీ విషయమేగాక త్వరలో బుధ శుక్రుల విషయంకూడ తేల్చివేస్తా'నని వివరిస్తాడు. మంగలుడు ఆ విషయాన్ని అందరకూ చెప్పేందుకు వెళ్తాడు.

తన దుర్గతిని గూర్చి చంద్రుడు బుధుడికి చెప్తుంటాడు. తన మీదకు సుధార్థులై జనులు వస్తున్నారని కంబళి కప్పుకొని ఉంటాడు. బుధుడు కంబళివల్ల లాభం లేదని, తాను రెండు కుండల నిస్తానని, వాటిలో సుధను దాచుకోమని చెప్తాడు. కుజుడికి కూడ అటువంటి ఉపాయాన్ని చెపుతాడు. బుధుడు ఒక మంత్రాన్ని కూడ ఉపదేశిస్తాడు.

మర్త్యమణి రాకెట్ నడపట మారంభిస్తాడు. అంతా భయపడుతారు. రాహువు అదంతా చంద్రుని పన్నాగమని భావించి రాకెట్‌వాలాను తీసికొని వస్తానంటూ అతనితో గొడవపడతాడు. ఇక లాభంలేదని అంతా కలిసి సైంటిస్ట్‌ను బ్రహ్మ దగ్గరకు తీసికొని పోతారు. బ్రహ్మకూడ విజ్ఞానశాస్త్రం వలన ఏర్పడుతున్న సామాజికానిశ్చిత స్థితిని వివరిస్తాడు.

దీనిలో హాస్యమంతా కథా కల్పనల మీద, వాగ్విన్యాసాల మీద ఆధారపడి ఉంటుంది. పాత్రపరంగా ఆలోచిస్తే ప్రతి పాత్రా సమాన స్థాయిలోనే కన్పిస్తుంది. కాని ప్రత్యేకంగా ఏ పాత్రా పురోగతిని అభిలషించదు. అన్ని పాత్రలు హాస్య హేతువులే. బహుళశక్తి సంపన్నములని ప్రథ ఏర్పడి ఉన్న నవగ్రహాలను భీతావహులను చేసి అందునా కూటభేదంతో కథను కూర్చడం అధిక్షేపణాత్మక హాస్యమే. ఈనాడు విజ్ఞాన శాస్త్రవేత్తలు అఖండ విజయాలను సాధిస్తున్నట్లు లోకమంతా అంగీకరిస్తోంది. దానిని మరోవైపునుండి ఆలోచించి, హాస్యస్ఫూర్తికై కల్పించబడ్డ హాస్య మిది. సర్వగ్రహాల ఆలోచనలలోని వక్రత, కవిగతమైన భావాలలోని వక్రత దీనిలో ప్రధానంగా హాస్యాన్ని కల్పిస్తుంది. బుధుడు శుక్రుడికి చేసిన మంత్రోపదేశం, చంద్రుడు బ్రహ్మకు మర్త్యమణిని పరిచయం చేయడం చాల చమత్కారంగా ఉంటాయి.

హండికా చండికా చైవ కథితా జగదంబికా |
దర్వీతండుల సంయోగాదన్నాభావస్య ఖండికా ||
దూరాత్ క్షతాని కురుతే కాయ వక్షో మనాంసి నః |
విద్యుద్ధామక్షిపై ర్యంత్రైః యంత్రణాదాముఖాః సదా || -

ఇంతే గాక ఘనశ్యాముడు రచించిన 'డమరుకం' ఆధునిక కాలంలోని రేడియో రూపకాల వంటిదై ఒక చక్కని సెటైర్. వటుకానాథ మిశ్ర రచించిన 'పాండిత్య తాండవ ప్రహసనం' మొదలయినవి కూడా అధిక్షేపణాత్మకాలై మనోహర హాస్యాన్ని అందచేస్తాయి.

PARODY

(వ్యంగ్యానుకరణం)

'పేరడీ' ఒక రమణీయ హాస్యప్రక్రియ. ఒకవ్యక్తి రచనను కానీ, భావాలను కానీ, ఒక వ్యవస్థను కానీ, ఒక వ్యవస్థలోని కేంద్రబిందువును గానీ, ఒక ప్రక్రియను గానీ వ్యంగ్యంగా అనుకరించడం 'పేరడీ' అవుతుంది. శబ్దాన్ని అనుకరిస్తే మిమిక్రీ అయినట్లు అర్థాన్ని లేక ప్రాణాన్ని అనుకరిస్తే 'పేరడీ' అవుతుంది. సాధారణదృష్టికి ఉన్నతంగా కన్పించే చాలా విషయాలు వ్యంగ్యానుకరణంలో చిన్నవైపోతాయి. అంటే మూలంలో నిగూఢంగా వుండే లోపాలు సైతం చతురుడైన వ్యంగ్యానుకర్త ముందు బయటపడిపోతాయి. ఆ అనుకరణం పాఠకుడికే గాక అనుకరింపబడే వ్యక్తికి గూడ ఉల్లాసాన్ని కల్గించే విధంగా వుంటుంది. రచయిత తన స్వరూపాన్ని తాను చూచుకునేందుకు అద్దంలాగా పేరడీ ఉపకరిస్తుంది. అయితే ఇక్కడ కూడ కుడి ఎడమలు తారుమారు కాక తప్పవు. అందుకే ప్రహసన రూపమవుతుంది పేరడీ.

ప్లేటో (Plato) కవిత్వాన్ని "Twice removed from the truth" అని నిరసిస్తాడు. ఆ లెక్కన పేరడీ Thrice removed from the truth అని అనవలసి వస్తుంది. అంటే సత్యం నుండి మూడు మెట్లు దూరమైనది. అంటే పేరడీ అనుకరణకు అనుకరణకు అనుకరణరూపం. మూడవ దశకు చేరడంతో సహజత నుండి చాలాదూరమై హాస్యాస్పద మవుతుంది.

పేరడీకి ఆధారరూపంగా గ్రీకు సాహిత్యంలో ఒక అలంకారముంది. అది 'Apostrophe'. దాని నిర్వచన మిది.

"A figure of speech which consists in addressing a dead or absent person, an animal, a thing or an abstract quality or idea as if it was alive at present and capable of understanding. The use of 'Apostrophe' gives life and immediacy to language but is also subject to abuse and open parody"

ఈ 'Apostrophe' తో ప్రారంభమైన అనుకరణం పారడీగా రూపొంది వుండవచ్చు. అది కేవలం అపహాస్యానికే పరిమితం. ఒక సత్య సందర్శనం అంతర్లీనమై ఆ హాస్యంలో వుంటుంది.

పేరడీని ఆస్వాదించాలన్నా, ఆస్వాదింపచేయాలన్నా కొన్ని పద్ధతులు (గుణాలు) అవసరం. పేరడీ, మిమిక్రీలు చేయటంలో అప్రమత్తత చాలా అవసరం. ప్రమత్తత

ప్రమాదాలను, శత్రువులను పెంచుతుంది. ఒకరికి సహజ మనిపించేది మరొకరికి అసహజ మనిపించటమే దీనికి కారణం. ఇది మౌలికాంశం. దీనినెవ్వరూ కాదన లేరు గదా!

ఒక్కొక్క మారు రచయితకు పేరడీ మీద దృష్టిలేక పోయినా అతని రచన "పేరడీ"గా పరిణమించుతుంది. ఒక రచయిత ఒక మహాకవిని అనుకరించబోయి కృతార్థుడు కాలేకపోతే అతని రచన పేరడీగా తయారవుతుంది. అపహాస్యం పాలవుతుంది. అయితే ఐచ్ఛికమైన పేరడీకి, దీనికి చాలా తేడా వుంది. ఐచ్ఛికమైన 'పేరడి' రచయిత యొక్క శక్తి సామర్థ్యాలను, మూల రచయితను అతడు అర్థం చేసుకొన్న తీరును స్ఫుటీకరిస్తే, రెండవది అనుకర్తయొక్క అసామర్థ్యాన్ని ప్రకటిస్తుంది. సంవాదం అన్నది సాహిత్యంలో సహజం కాబట్టి ఒకరచయిత మీది గౌరవంతో గాని, భావ చౌర్యరూపంగా గానీ ఇతర మహాకవుల ననుకరిస్తే, ఆ అనుకరణ కృతార్థమైతే మాత్రం అది పేరడీ కాదు, అది సాధారణానుకరణం మాత్రమే.

పేరడీ రెండు రకాలు. Critical or Literary Parody ఒకరకం. Comic parody రెండవరకం. Comic Parody, Burlesqueకు దగ్గరగా ఉంటుంది. ట్రాజెడీలను (విషాదాన్ని) వ్యతిరేకంగా అనుకరించడం Burlesque అవుతుంది. అలాకాక రచయిత శైలినో, ధోరణినో అనుకరించటం Literary Parody అవుతుంది.

ఒక రచయిత ప్రౌఢశైలిని మరోసామాన్య విషయానికి అన్వయించినా, ప్రౌఢమైన భావాన్ని అల్పవిషయంతో అనుసంధించినా, విశిష్ట వ్యక్తిత్వంమీద గౌరవాన్ని నిర్విశిష్ట వ్యక్తిత్వానికి ఆపాదించినా పేరడీ అవుతుంది. అంటే భావానికి, భాషకు పొందిక లేకపోవడం పేరడీలో ప్రధానాంశమవుతుంది. గంభీర విషయాన్ని తేలిక చేసినట్లు, తేలిక విషయాన్ని సైతం పేరడీలో గంభీరంగా మలచవచ్చును.

అల్పవిషయం కాబట్టి Comic Parodyని గూర్చి ముందు ముచ్చటించు-కుందాం.

వత్సరాజు వ్రాసిన హాస్యచూడామణిలో మనకు చక్కని 'పేరడీ' కన్పిస్తుంది. వర్ణాలలో స్వల్ప విపరిణామాన్ని తీసికొని వచ్చి, అధికవిషయాన్ని అల్పంగా ఎలా పరావర్తింపజేయవచ్చునో ఈ ప్రహసనంలోని పేరడీ నిరూపిస్తుంది.

సన్నివేశం అధ్యాపనం. జ్ఞానరాశి గురువు. కౌండిన్యుడు శిష్యుడు. గురువు నారాయణ స్తుతిరూపంగా చెప్పిన శ్లోకాలను శిష్యుడెలా వ్యంగ్యంగా మార్చేస్తాడో చూడండి.

ఆలోక్య సర్వ శాస్త్రాణి విచార్య చ పునః పునః |
ఇద మేకం తు నిష్పన్నం ధ్యేయో నారాయణస్సదా ||
నమస్తే పుండరీకాక్ష నమస్తే విశ్వభావన |
నమస్తేస్తు హృషీకేశ మహాపురుష పూర్వజ ||

శిష్యుడి అనుకరణ :-
ఆలోక్య సర్వ గాత్రాణి విచార్య చ పునః పునః |
ఇద మేకం తు నిష్పన్నం ధ్యేయో నారీజన స్సదా
నమస్తే పాండురైకాక్ష! సమస్తే విశ్వతాపన!
నమస్తేస్తు మృషాకోశ! మహా పరుష కూర్చక ||

నారాయణ స్తుతిని నారీమాహాత్మ్యంగాను, విష్ణుస్తుతిని గురునిందగానూ అత్యల్పమైన పరావర్తనంతో శిష్యుడు అనుకరించడం హృదయరంజకం. ఈ పేరడీలో భావానికి, ధోరణికి పొందిక కుదరదు. అందుకే హాస్య హేతువు.

గుర్వధ్యయన పూర్వకమైన వేదాభ్యాసం, వేద పఠనం ఒక విశిష్ట విషయం. ఆ వేదాలను ఇంతకాలం వరకు నిలిపినవి వాటి స్వరాలు. ఆ స్వరాలను అనుకరించటం గొప్ప పేరడిగా రూపొందుతుంది. చమత్కారశీలురు కొందరు తెలుగు పదాలకు సైతం ఆ స్వరాలను ఆపాదించి, అనందింపజేసే వాళ్ళున్నారు. పలాండు మండన ప్రహసనంలో హరిజీవన మిశ్ర అటువంటి పేరడి చేస్తాడు. మూషికాన్ని ప్రజాపతిగా భావించి, మూషకోపనిషత్తును పల్కితే ఎలావుంటుందో పరిశీలించండి!

మూషకో వై ప్రజాపతి రాసీత్. తస్య ద్వౌ దన్తా వాస్తామ్. దన్తేన బిలం కరోతి. భాండం స్ఫోటయతి. హవిష్యాన్నం భిక్షయతి... చుం చూం శబ్దం కరోతి. యజమానం స్వర్గలోకం గమయతి. అవే వేద -

అయితే ఈ పేరడిని కేవలంగా చదవటంవల్ల అనుభూతిగాని, చమత్కారం కాని కల్గవు. ఆ వేదస్వరాలతో జతపరచినపుడే అది మనోరంజక మవుతుంది. వేద స్వరాలకు వ్యంగ్యానుకరణం చేయటంలో అనౌచిత్యాన్ని శంకింపవలసిన పనిలేదు.

అక్కడ చమత్కార సాధన తప్ప మరే లక్ష్యమూ రచయితకు వుండదు. హాస్యశీలుడు తననుగూర్చియైనా ఛలోక్తులను విసరగల్గినవాడై వుంటాడు.

కేవలం శ్లోకాలనే గాక కీర్తలనైనా వ్యంగ్యంగా అనుకరించవచ్చును. ఉదాత్తమైన భావాన్ని హాస్యపూరితం చేయవచ్చును. అటువంటి అనుకరణ మొకటి కౌండిన్య ప్రహసనంలో కన్పిస్తుంది.

కౌండిన్యుడు తిండిపోతు. పరాన్నభక్షణలోని సుఖ సంతోషాలను ఆమూలాగ్రంగా అర్థం చేసుకున్న వ్యక్తి. అతని తత్వాన్ని పరిశీలించండి.

కీర్తన:
చింతా నాస్తి కిల.. తేషాం చింతా నాస్తి కిల .....
పరగృహ భోజన పరితుష్టానాం నిత్యాతిథ్యోత్సవనిష్ఠానామ్ |
కాలత్రయ విరతోద్యోగానాం కించ సమేతాధిక భోగానామ్...
గృహమేధి నిమంత్రణ చిత్తానాం షడ్రస భరితాశనమత్తానామ్
చిన్తా నాస్తి కిల తేషాం చిన్తా నాస్తి కిల ....

ఇది ఒక ప్రసిద్ధ కీర్తనకు వ్యంగ్యానుకరణం. మూలకీర్తన రచయిత సదాశివ బ్రహ్మం. పల్లవిలో మార్పేమీ లేదు. శమదమాది లక్ష్యంతో జీవితాన్ని సాగించే వారికి ఏ బాధలూలేవని చెప్పే కీర్తన అది. చూడండి.

చిన్తా నాస్తి కిల.. తేషాం చిన్తా నాస్తి కిల...
శమదమ కరుణా సంపూర్ణానాం సాధు సమాగమ సంకీర్ణానామ్ |
పరమ హంస గురుపద చిత్తానాం బ్రహ్మానందామృత మత్తానామ్
చిన్తా నాస్తి కిల -

సంస్కృత సాహిత్యంలో ఛందోధోరణిని అనుకరించి పేరడీ చేయడం సైతం కన్పిస్తుంది. శాస్త్ర విషయాలను, నియమ నిబంధనాలను చెప్పాలంటే సంస్కృతంలో అనుష్టుప్పును ఎక్కువగా వాడడం అలవాటు. దాని నాధారంగా చేసికొని కుహనా శాస్త్రవేత్తలు అనుష్టుప్పులకు విస్తృత ప్రచారాన్ని సంపాదించి పెట్టారు. ఏ విషయాన్నైనా సూత్ర బద్ధం చేయవలసి వచ్చినా, అల్ప విషయాన్ని ప్రౌఢ మనిపించాలన్నా ఒక అనుష్టుప్పును గీకిపారవేయటం అభ్యాసమైనది. ఇది సంస్కృత హాస్య రచయితలకు బాగా వుపయోగపడింది. ప్రమాణాభాసాలను సృష్టించవలసినపుడు

ఆ ఛందస్సు వారికి దివ్యసాధనమైనది. యథార్థం తెలిసిన వ్యక్తులకు అటువంటి అనుకరణం రమణీయహాస్య జనక మవుతుంది. భగవదజ్జుక ప్రహసనంలో ఒక వైద్యుడు సర్ప భేదాలను వివరిస్తూ చెప్పే అనుష్టుప్పును చూడండి.

వాతికాః పైత్తికా శ్చైవ శ్లైష్మికాశ్చ మహావిషాః |
త్రీణి సర్పా భవన్త్యేతే చతుర్థో నాధిగమ్యతే ||

యథార్థానికి సర్పాలు వాత సర్పాలు, పైత్య సర్పాలు, శ్లేష్మ సర్పాలు అని వుండటం అభూతకల్పన, అయినా దానిని అనుష్టుప్పుతో బంధించి నాల్గవపాదం మిగిలిందిగదా అని నాల్గవరకం వుండదు - అనటం గొప్ప శాస్త్రమైనట్లుగా భ్రమ కల్గిస్తుంది. అయితే తత్త్వదర్శనంలో హాస్యాస్పదమే అవుతుంది.

హాస్యచూడామణి ప్రహసనంలో అదే ధోరణిలో మనువును అనుకరించటం కన్పిస్తుంది. మనువు ప్రమాణాభాసాలను సృష్టించదలచిన ప్రతి వ్యక్తికీ గురువు. అతని పేరుమీద దేనినైనా చలామణి చేయవచ్చు. అయితే అమాయకుల దగ్గర మాత్రమే. హాస్యచూడామణిలో జ్ఞానరాశి జ్యోతిష పుస్తక పూజను బంగారంతో చేయాలని, మనువును అడ్డుపెట్టుకొని చెప్పే శ్లోకాన్ని పరికించండి.

శ్రద్ధాళురాత్మనః కుర్యాల్లాభాలాభావినిశ్చయమ్
అభ్యర్చ్య స్వర్ణ రత్నాభ్యాం కేవలీం మనురబ్రవీత్ ||

ఇదేరీతిలో జ్ఞానరాశి జ్యోతిష్య ధోరణినికూడా అనుకరించి చూపుతాడు.[1]

పేరడీని సంపూర్ణంగా ఆస్వాదించాలంటే అనుకరింపబడే రచనను గూర్చి గానీ, రచయితను గూర్చిగానీ పాఠకుడికి తప్పనిసరిగా తెలిసివుండాలి. లేకపోతే పేరడీ నిర్జీవ మవుతుంది. కాబట్టి వ్యంగానుకర్తయే గాక తత్పాఠకుడు కూడ కొద్దో గొప్పో పండితుడై వుండాలి. పండితుడు కాకపోయినా విస్తృతంగా సాహిత్య

---

1 యది పశ్యతి రవిసూనుః వింశతి స్థానగతం వ్యతీపాతమ్ |
యది రాహుః శకట భేదీ సభవతి కేతుశ్చ మేషస్థః
రవిరంగారక లగ్నో భవతి యదా స వీక్ష్యమాణశ్చ || 2/25

అర్ధ శరీరాభావం ప్రశ్నే బ్రూయాత్తదా నియతమ్ || 2/29

పరిచయమైనా వుండితీరాలి. ఒకవేళ అనుకర్త అనుకరణంలోని వికృతితో చమత్కారాన్నో, హాస్యాన్నో ఒక్కొక్కమారు కల్గించవచ్చు. అది పాఠకులను ఆకర్షించవచ్చును. అయితే అది పేరడీ రూపంగా గాక స్వతహాగానే పాఠకులను ఆకర్షించిందని చెప్పవలెనే కానీ, గొప్ప పేరడీ అనటానికి వీలులేదు.

గంభీరమైన వాతావరణాన్ని తేలికగా మార్చుకోవాలని ప్రయత్నించడం మానవనైజం. అలాగే ఒక గంభీర రచనను తేలికపరచి, చమత్కారంగా అందించాలన్న భావన పేరడీ రచనకు పునాది అయివుంటుంది.

ప్రతాపరుద్ర విజయం (విద్యానాథ విడంబనం)

ఇంత ప్రాచీనకాలం నుండికూడ సంస్కృత రూపకాలలో వ్యంగ్యానుకరణ ప్రక్రియ కన్పిస్తున్నా, పూర్తి గ్రంథం వ్యంగ్యానుకరణ రూపకంగా అత్యాధునిక కాలం వరకు లేదు. ఒక విశిష్ట ప్రక్రియగా దీనిని భావించి, పూర్ణ గ్రంథాన్ని యీ పరిధిలో తీర్చిదిద్దిన మొదటి మనీషి (నేనెరిగినంత మేర) డా॥ వి. రాఘవన్. వీరి ప్రతాపరుద్ర విజయం లేక విద్యానాథ విడంబనం ఒక పూర్ణాకృతిగల పేరడీ. ఇది విద్యానాథుడికి - ప్రతాపరుద్ర యశోభూషణ కర్త - పూర్తిగా వ్యంగ్యరూపమైన అనుకరణం. ఆర్వాచీన కాలంలో క్షీణదశకు చెందిన సంస్కృత, సాహిత్యాన్ని ఆ క్షీణతకు కారణాలయిన "Stereo typed figures and fancies, the stock in trade of the authors of these panegyrical poems" మొదలైన వాటిని ప్రకటించి, పరిహసించడం ఈ రచయిత, రచనల లక్ష్యం. అంతేగాక దీనిని వ్యంగ్యానుకరణ రూపంగా సంతరించటం లోని ఆశయాన్ని డా॥ రాఘవన్ ఇంకా ఇలా వివరించాడు.

The technique adopted is to extend further the stock Rupakas, Parinamas, Bhrantimats, Utprekshas, Atisayokti and Atyukti and to make the imaginary world called up by these figures of poetry into actual facts ie., to put in the technical language of poetics to make the कविप्रौढोक्ति निष्पन्नवस्तु into लोकसिद्धवस्तु and work out the consequences of the same into a humurous theme"[1]

1 Preface to Prataparudra Vijaya - p6

లిటరరీ పేరడీ కోవకు చెందిన మొదటి రూపకమిది. "Literary or critical parody which follows more closely a given author's style of a particular work of Art."[1] అని లిటరరీ పేరడీ లక్షణం. విద్యానాథుడి ప్రతాపరుద్ర యశోభూషణం ప్రతాపరుద్రుడు కేంద్రబిందువుగా రచించబడిన అలంకార శాస్త్ర గ్రంథం. ఆయా శ్లోకభావాల్లో, సన్నివేశాల్లోని కల్పనలలో అతిశయోక్తులు, అత్యుక్తులు మొదలైన వాటిని వ్యంగ్యంగా అనుకరించి, అవి స్వభావోక్తులు, లోకసిద్ధాలు అయితే ఎలా వుంటుదో కళ్ళకు కట్టించుట డా॥ రాఘవన్ లక్ష్యం. అందుకే ఇది విపరీతమైన హాస్యాలంబన అవుతుంది.

ఈ ప్రహసనంలో 4 అంకాలున్నాయి - మధ్య మధ్య విష్కంభాలు కూడ. 4 అంకాలకు ప్రత్యేకంగా పేర్లు పెట్టాడు రచయిత. ఆ కథాంశ కల్పనాన్ని రచయిత మాటలలోనే చూడండి.

In the Ist Act called the 'Onslaught of the Dust' of the victorious army *(Nasira-pamsu-dhati)* presented the consequences of the huge dust raised by the marching army of Virarudra as having actually pervaded the atmosphere, ushered in the night prematurely leading to all sort of nocturnal activities in the City and finally invading the Heaven and producing absurd and calamitous events in the world of Indra une S̄aḍi. The IInd Act is called the 'Advance of Darkness' (*Tamah prakrama*), the darkness being the result of the sorrow of those who had been defeated or put into different difficult situations by the great prowess of Verarudra. This is described with reference to both the terrestrial and heavenly spheres. The IIIrd Act is called *Asura-vijaya* the 'Triumph of the Asuras', who exploit the situation and seize Amaravati, S̄aḍi and others. The IVth Act, entitled the *Paramesvara pattabhiseka* or the Coronation of Virarudra as the Super-Lord, in the Capital of Gods themselves, the usual motif of a powerful ruler of the Earth going

1 Encyclopedia of Poetry & Poetics - p600

up to the aid of Indra in difficulty in Heaven, Matali, Indra's charioteer coming to take him, and God Siva himself coming and blessing Virarudra's coronation are described. Thus the humorous story is built out of all these absurdities.

ఇది డా॥ రాఘవన్ ప్రధానంగా చిత్రింపదలచుకున్న అసందర్భాల ముడి పదార్థం. దీనిని వస్తురూపకంగా తయారు చేయుటలో వారు చూపిన నేర్పు అపారం, ఆద్యంతం హాస్యదాయకం. విశేషించి ఈ హాస్యంలో అసభ్యతాశ్లీలతలకు తావులేదు. అదే ప్రస్తావనలోనే ఆ విషయాన్ని వారు ప్రస్తావించారు. ప్రతాపరుద్ర సైన్యం దుమ్ము లేపింది. అది గగనతల మంతట నిండి అకాల సంధ్యాకాలాన్ని కల్పించింది. దానితో తాత్కాలిక కృత్యాలు అనేకం ఆరంభమైనాయి. ఎలుకలు పరంపరగా కలుగులనుండి వెలుపలకు రావటం మొదలైంది. రచయిత వాటిని వర్ణించిన తీరు, దానిలోని అనౌచిత్య సందర్భాలు - ఇవే హాస్యానికి ప్రాణం - గమనించండి.

కిమితి కథ యామ్యాఖు స్త్రీణాం గృహేంధ్ర నృపతేః శ్రియం
విపుల వివరాభ్యంతర్గోణీశతాహిత తండులాన్ ।
గుడఘృత ఘటాన్ మార్జారేశాస్సమీక్ష్య పలాయితాః
అనుమితి రసాః స్వాన్ రక్షన్త స్స్తువన్తి చ పాయసమ్॥

ఒక వ్యక్తి గొప్పతనాన్నో, సంపదనో వర్ణించాలంటే ఎన్నో పద్ధతులుంటాయి. అల్ప విషయాన్ని అధిక విషయంగా చూపి వర్ణించవచ్చు. అయితే మహారాజు గొప్పతనాన్ని ఆయన యింటిలోని ఎలుకలు, పిల్లులద్వారా వర్ణించటానికి ప్రయత్నించటం సర్వాత్మనా అనుచితం. ఇది విద్యానాథుని అత్యుక్తులకు అనుకరణ. అందుకే హాస్యాస్పదం. అంతేకాక ఆఖుస్త్రీణాం, మార్జారేశాః మొదలైన చిలిపి ప్రయోగాలు సైతం హాస్యాన్ని మరింతగా అందుబాటులోనికి తెస్తాయి.

ఈ విష్కంభం తర్వాత శచి, ఇంద్రుడు ప్రవేశిస్తారు. ఆ సన్నివేశం యుక్తి, చేష్టా మూలమైన హాస్యానికి ఆటపట్టు. అకాల సంధ్యనుగూర్చి వారిద్దరు మాట్లాడుకొనే సమయంలో శచి కంట్లో నలక పడుతుంది. ఇంద్రుడు కంగారుగా పరిచర్యలు చేస్తూ ఆ దశలో, ఆమెలో కన్పించే సౌందర్యానికి ముగ్ధుడై మద్దివ్వబోతాడు. ప్రభంజనం అతన్ని ప్రక్కకు నెట్టివేస్తుంది. ఇంద్రుడి కంట్లోకూడ దుమ్ము పడుతుంది. వేయికన్ను

లున్నందువల్ల వచ్చే కష్టం అప్పుడు తెలుస్తుంది ఇంద్రుడికి. ఆ బాధలో ఉక్రోషం. ఒకే ఒక్క మాటంటాడు ఇంద్రుడు – "అద్య పశ్యామి గౌతమస్య దృష్టికౌటిల్యం" అని. ఇద్దరికి కళ్ళు కన్పించవు. పరుగులు ప్రారంభిస్తారు. కళ్ళు కన్పించని శచి బురదతో నిండిన క్రీడా సరస్సులో పడిపోతుంది. ఇంద్రుడు గమనించకుండ వెళ్ళిపోతాడు.

ద్వితీయాంకంలో మరలా భావమూలకహాస్యం ప్రాధాన్యం వహిస్తుంది. శత్రు రాజులు వీరరుద్రుడికి భయపడి అరణ్యాలలోకి పారిపోతారు. తత్ఫలితంగా అక్కడి మహర్షులకు తిండి దొరకని స్థితి యేర్పడుతుంది. శత్రురాజులు కొందరు పండ్లు, కొందరు కందమూలాలు, అవీ దొరకని వారు గడ్డి తినడం ప్రారంభిస్తారు. వారిని కారాగృహంలో బంధించక వదలటానికి కారణంగా మరో అతిశయోక్తి – చదవండి

జిష్ణుశ్రీ వీరరుద్ర ప్రమథిత ధరణీపాల బన్ద్యాంగనానామ్
భూరిశ్వాసోష్ణ వాతై రధికమభిహతేష్వాస్ఫుటద్భిత్తికేషు |
కారావాసేషు తత్త న్నవనవరచనా వ్యగ్రితా వేశ్మ కారాః
తాన్తాన్ హన్త స్వవృత్తిం విజహతి చ దిశో విద్రవస్త్యంధ్రపుర్యామ్ ||

ఇలా వన దేవతలు సంభాషించే సమయంలోనే అకాలతమః ప్రక్రమం. దేవ లోకంలో కొందరు రాక్షసులు ఈ అవకాశాన్ని తీసికొని శచిని బంధిస్తారు (kidnap). దేవతలపై బిభీషికను ప్రయోగిస్తారు. అంతా చీకటి వ్యాపిస్తుంది. దేవలోకంలో అందరు కింకర్తవ్యతామూఢులు అవుతారు. "పరిచితం పలాయనమపి దుస్సాధం భవతి" అని బృహస్పతి వాపోతాడు. ప్రేక్షకుల నవ్వులలో వారి బాధలు కరిగిపోతాయి.

దేవలోకంలో అందరూ చిన్న చిన్న చప్పుళ్ళను సైతం శత్రువుల వునికిగా సంశయించే పరిస్థితి ఏర్పడుతుంది. అదే సమయంలో నారదుడు ప్రవేశించి, శివుని ఆనతిగా ప్రతాపరుద్రదేవుని స్వర్గానికి తీసుకొని రమ్మని మాతలిని ఆదేశిస్తాడు. ఆ సందర్భంలో ప్రతాపరుద్రుడు లక్ష్మీ సరస్వతీ కుమారస్వాముల అవతారమని వివరించడానికి నారదుడొక చక్కని అతిశయోక్తిని ఉపయోగించుకుంటాడు.

దేవో భూతపతి స్స్వయం గణయుతః పుత్రం కుమారం ప్రియం
పార్వత్యశ్రుభి రార్ద్రితేషు హిమవత్ప్రాంతే ష్వమృగ్యచ్చిరమ్ |
శూన్యోరాశ్చ మృశన్ రమాపతి రగాద్గ్లానిం విధాతాపి చ
స్వాస్యం వీక్ష్య సరస్వతీ విరహితం జాడ్యం సమాలంబత ||

నారదుడు మాతలికి వీరరుద్రుని గుర్తించేందుకు లక్షణాలు తెలియజేయవలసి వస్తుంది. ఆ సన్నివేశంలో తర్కశాస్త్రానికి వ్యంగ్యానుకరణం భాసిస్తుంది. అతివ్యాప్తి, అవ్యాప్తి, అసంభవ దోషాలు లేకుండా నిర్వచనం వుండాలన్నది తార్కిక సిద్ధాంతం. దానికోసం వారు లక్షణాన్ని నిర్దుష్టం చేసే సమయంలో అగతికగతి న్యాయంగా ఆక్షణంలోనే కొన్నింటిని పరిహరిస్తూ చెప్పటం జరుగుతుంది. అదేస్థితిని చివరకు నారదు డాశ్రయించి వీరరుద్రుడి చిరునామాను తెలియజేస్తాడు - చూడండి

ఏతాదృశం పశుపతి పరిసరమపహాయ స్థానమపరం
యదద్రౌ తదేవ వీరరుద్ర స్థానమ్

ఇదంతా హాస్యమయం.

ఆ తర్వాత దేవలోకంలోని సేవకులు ఒకరి ధ్వనిని మరొకరు శత్రువులుగా భావించి, పరుగెత్తడం ప్రాకరణిక హాస్యాన్ని అందిస్తుంది. ఆ సమయంలోనే తేజః కాంతులను విరజిమ్ముతూ వీరరుద్రుడు ప్రవేశిస్తాడు. ఆ కాంతివల్ల మరల కొంత నష్టం. ఆ వెలుగు ఇంద్రుడి కళ్ళలోకి ప్రవేశించగానే ఆ కాంతిని భరించలేని కొన్ని కళ్ళు గ్రుడ్డివై పోతాయి. ఆ కాంతి ప్రసారాన్ని వుప్పెనగా భావించి, అగస్త్యుడికోసం అన్వేషణ ప్రారంభిస్తారు దేవతాలు. క్రమంగా తత్త్వం తెలిసికొని అంతా ఆనందంగా వున్న సమయంలో మరల రక్తకాంతి ప్రవేశిస్తుంది. అది అపశకున రుధిరధార అనుకుంటారు. కాని అది తప్పు. అసలు విషయాన్ని శివుడు వివరిస్తాడు -

"నందన వనగతాః అప్సరో విలాసిన్యః అస్మద్భక్తస్య వీరరుద్రస్య పరాక్రమ యశో వశీకృతస్వాన్తాః తం ప్రతి ప్రకటయంత్యనురాగమ్"

ఇంతకన్నా అత్యుక్తి మరొకటి వుండకపోవచ్చు. రూపంలేని రాగానికి కవిసమయ సిద్ధమైన ఎర్రదనాన్ని పులిమి, రక్తకాంతిగా వ్యాపింపజేయటం గొప్ప అసందర్భ విషయం. అందుకే మనోరంజకం. వీరరుద్రుని ప్రశంసించమని బృహస్పతిని శివుడు ఆదేశించగానే బృహస్పతి చేసే చేష్టలు ఈనాటి మహా సభలలో ఓమ్ ప్రథమంగా వేదికనెక్కిన ఉపన్యాసకుడి పాటును గుర్తుకు తెస్తాయి. దగ్గు, కంఠాన్ని సవరించటం, కంగారు పడటం వగైరా వగైరా చేష్టలు. ఇవన్నీ నవ్వించే అంశాలే.

కడగా విద్యానాథుని శ్లోక రచనా విన్యాసాన్ని కూడ అనుకరించి విద్యానాథ పాత్ర ద్వారానే పల్కిస్తాడు రచయిత.

ససేవా హేవాక ప్రతిభట మహీపాల నికర
స్ఫురత్కోటీ రాధ్య ప్రసృమర మహారత్న నివహైః |
జ్వలద్భాను ప్యూహైః స్నపిత మరి రాజన్యకమనో
నభో భూజత్పాదద్వయ ముదయహేతో ర్భవతు నః|| 4/27

కవిసమ్మేళన ప్రహసనం

విశ్వనాథమిశ్ర రచించిన కవి సమ్మేళన ప్రహసనం[1] మరొక చక్కని పేరడీ. సమకాలీన సంఘంలో జరుగుతున్న కవి నమ్మేళనాలకు ఇది చక్కని వ్యంగ్యానుకరణం. కవి సమ్మేళానుకరణం మాత్రమే అయితే పేరడీ కాకపోయేదేమో కాని రచన అంతా కూడ ప్రసిద్ధ రచనలకు వ్యంగ్యానుకరణమే కావడంతో ఒక హృదయరంజకమైన పేరడీగా యిది రాణిస్తుంది.

ఉద్ఘాటనాచార్యుడు ఆ కవి సమ్మేళనాన్ని ప్రారంభించి, ప్రారంభోపన్యాస మివ్వడానికి వస్తాడు. యువకులందరూ అతన్ని ప్రశంసిస్తూ గానం చేయటంతో ప్రహసనం మొదలవుతుంది. ఆ కవి సమ్మేళనంలో నల్గురు మహాకవులు తమ కవితా గానం చేస్తారు. 'జంటిల్‌మెన్ మీమాంస' రచనద్వారా ప్రసిద్ధుడైన రసిక రంజన భట్టాచార్యులు, 'ఛాయాస్మృతి' రచయిత భుజంగభూషణుడు, 'గురుశిష్య సంహిత'ను గూర్చిన భోజమణిశాస్త్రి, 'కుర్సీ కౌముదిని' వ్రాసిన కేసరకిశోరకవి ప్రారంభోపన్యాసం తర్వాత వరుసగా కవితలను వినిపిస్తారు. రచయితలు, వారి చేష్టలు, వారి రచనలు అన్నీ వ్యంగ్యానుకరణ రూపాలై మనోహరమైన హాస్యాన్ని అందజేస్తాయి.

ఈ రోజుల్లో ప్రారంభోత్సవాలన్నవి విశ్వరూపాన్ని ధరించి ఉన్నాయి. మొక్క నాటటం దగ్గరనుండి చెట్టు పీకటం వరకు దేనికైనా ప్రారంభోత్సవం, ఒక మహా సభ, పెద్ద పెద్ద వాళ్ళంతా దానిలో పాల్గొనటం తప్పడం లేదు. అవి ప్రజల ప్రయోజనాల కన్న పార్టీ ప్రయోజనాలకు బాగా సహకరిస్తాయనటం సత్యదూరం కాదు. ఆ విషయాన్ని ఉద్ఘాటనాచార్యుడు పసిడి పల్కులతో వివరిస్తాడు – చూడండి -

---

1 భారతీ - సంస్కృత మాసపత్రిక, నవంబర్ 1970.

యుగోయమస్తి ఉద్ఘాటనస్య, అతః సర్వస్యాపి వస్తునః కార్యస్యచ ఉద్ఘాటనం కర్తవ్య మేవ, యది ఉద్ఘాటయితుం కిమపి న మిలేత్ తదా మకానస్యోద్ఘాటనం, దుకానస్యోద్ఘాటనం, దరవాజాయాః స్విడ కేశ్చోద్ఘాటనం కర్తవ్యం.

చిన్నా పెద్ద తారతమ్యం లేకుండ దేనినైన ప్రారంభించడానికి సిద్ధపడే ఉద్ఘాటనాచార్యులు ప్రస్తుత సమాజంలో కోకొల్లలు. అది అలవాటు. నల్లమందు అలవాటు వంటిది. ఉద్ఘాటనం యొక్క విశ్వరూపాన్ని కఠోపనిషత్తును అనుకరిస్తూ ఉద్ఘాటనాచార్యుడు ప్రకటించి, విరమిస్తాడు. చూడండి ఆ పేరడీ –

అణో రణీయః మహతో మహీయః
పుణ్యం యద్దాస్య ముద్ఘాటనం సదా
సర్వైః ప్రశస్యం భువి వందనీయం
సంసార వ్యాప్తం వయ మాచరామః

విశ్వనాథమిశ్ర తన ఈ ప్రహసనంలో సంస్కృతంలో ప్రసిద్ధులైన అనేక రచయితలను అనుకరిస్తాడు. రామాయణంతో ప్రారంభించి అజ్ఞాత కర్తృకాలైన సుభాషిత శ్లోకాల వరకు ఇతని అనుకరణ మార్గంలో కన్పిస్తాయి. ఆధునికత్వానికి గుర్తుగా హిందీభాషను సైతం ఉపయోగించి పేరడీ రచించినాడు రచయిత.

"జంటిల్మెన్ మీమాంస"లో ఆధునిక కాలంలో ద్వివక్షణావస్థాయి లైన 'ఫ్యాషన్' లను విమర్శిస్తూ, మనుస్మృతి శ్లోకాన్ని ఎలా అనుకరిస్తాడో చూడండి

ఫైశనం తు హతో హన్తి ఫైశనం రక్షతి రక్షితమ్ ।
ఫైశనం నైవ హస్తవ్యం మానో ఫైశన హతోఽవధీత్ ॥

మూలం. ధర్మ ఏవహతో హన్తి ధర్మో రక్షతి రక్షితః ।
తస్మా ద్ధర్మో న హస్తవ్యః మానో ధర్మో హతోఽవధీత్ ॥

అంతేకాదు. వర్తమాన సమాజంలో 'సోషలిజా'నికి నిలయాలు ఫలహార శాలలు (హోటళ్ళు). వాటిలో ప్రవేశిస్తే ఎన్నో జీవిత సత్యాలను అర్థం చేసుకోవచ్చు. లోపల ప్రవేశించిన వ్యక్తి వేషాన్ని బట్టి పనిచేసే వారి ప్రవర్తనలో తేడా ఏర్పడుతుంది. "వస్త్రేణ వపుషా వాచా" అన్న సత్యం అక్కడ క్షణంలో నిరూపింపబడుతుంది. ఆ శుద్ధ విషయాన్ని గుర్తించిన విశ్వనాథమిశ్ర జంటిల్మెన్ మీమాంసలో నిక్షేపించాడు. చూడండి.

స్వదేశే పూజ్యతే కశ్చిత్ సభా మధ్యే తు పండితః
సంగ్రామే పూజ్యతే శూరః జెంటిల్మైనస్తు హోటలే ||

మూలం. స్వగృహే పూజ్యతే మూర్ఖః స్వగ్రామే పూజ్యతే ప్రభుః |
స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే ||

జంటిల్‌మెన్ యొక్క క్రమమైన బుద్ధి వికాసాన్ని భర్తృహరిని అనుకరిస్తూ ఆంగ్ల, హిందీ పదాలను కూడ ఉపయోగించి వర్ణించిన తీరు చూడండి

మిలా థోడా జ్ఞానం ద్విప ఇవ మదాన్ధస్సమభవం
సమస్తే లోకేస్మిన్ నహి కోయీ సమానో మమ యితి
గయా డ్యూటీ కర్నే క్వచి దపి సభాయాం తు సుధియాం
తదాసౌ జానాతి మర్కట సమో జెంటిలమనః

మూలం. యదా కించిద్ జ్ఞోఽహం గజ ఇవ మదాంధస్సమభవం
తదా సర్వజ్ఞో స్మీత్య భవదవలిప్తం మమ మనః |
యదా కించిత్ కించిద్బుధజన సకాశాదవగతం
తదా మూర్ఖఽస్మీతి జ్వర ఇవ మదో మే వ్యపగతః || - నీతిశతకం

రసికరంజన భట్టాచార్యులు జెంటిల్మన్ మీమాంసను విన్పించిన తర్వాత భుజంగ భూషణ కవి చాయ్ (టీ) స్మృతిని విన్పించట మారంభిస్తారు. అదంతా వైదిక మంత్రవిధానంలో సాగుతుంది. అది కూడ వైదిక పూజ, రామాయణాది రచనలకు వ్యంగ్యానుకరణమే. గమనించండి —

ఛాయ ఇతి మంత్రస్య లిప్టన్ ఋషిః. శర్కరా ఛందః. స్టవ్ దేవతా.
దుగ్ధం బీజమ్. ప్లేటకం కీలకమ్. క్షుధా నిద్రా నివృత్త్యర్థం, మందాగ్ని
వృద్ధ్యర్థం, భ్రష్టాచార సిద్ధ్యర్థం ఛాయ పానే వినియోగః
అథ మాహత్మ్యమ్ - ... ...

నాహం వసామి వైకుంఠే యోగినామ్ హృదయే న చ |
మద్భక్తా ఛాయ్ సుకుర్వన్తి తత్ర తిష్ఠామి హోటలే ||

మూలం: నాహమ్ వసామి వైకుంఠే యోగినాం హృదయే న చ |
మద్భక్తా యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద ||

కదా సాయంకాలే సరసనిచులే రమ్య పులినే
ముదా సాకం మిత్రైః భ్రమణ నిరతైః పాఠవిముఖైః ।
భ్రమన్నన్తర్ధ్వాన్తో ధృత వికృతవేశో బహుమనాః
పీఊంగా మై ఛాయం ప్రహసనరతో లుప్తభణః ॥

మూలం. కదా వారాణస్యా మమర తటనీ రోధసి వసన్
వసానః కౌపీనం శిరసి నిదధానోంజలిపుటమ్ ।
అయే! గౌరీనాథ! త్రిపుర హర! శంభో! త్రినయన
ప్రసీదే త్యాక్రోశన్నిమిషమివ నేష్యామి దివసాన్ ॥

ఆ తరువాత భోజమణిశాస్త్రి యొక్క గురుశిష్య సంహిత, కేసరకిశోరకవి కుర్సీకౌముది కూడ అదే రీతిలో సాగుతాయి. పదవీ ప్రాధాన్యాన్ని, దానికై ఆధునికులు పడే తపనను ఈ కుర్సీకౌముది చక్కగా ప్రతిపాదిస్తుంది. భర్తృహరిని అనుకరిస్తూ విద్య బదులు పదవి ప్రధానమనే ఈ శ్లోకాన్ని పరిశీలించి ముందుకు సాగుదాం-

కుర్సీ నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం
కుర్సీ భోగకరీ యశస్సుఖకరీ కుర్సీ గురూణాం గురుః
కుర్సీ బంధుజనో విదేశగమనే కుర్సీ పరా దేవతా
కుర్సీ లోక సుపూజితా న తు గుణాః కుర్సీ విహీనః పశుః

మూలం. విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః
విద్యా బన్ధుజనో విదేశ గమనే విద్యా పరా దేవతా
విద్యా రాజసుపూజితా న తు ధనం విద్యా విహీనః పశుః

- నీతిశతకం

శబ్దాశ్రిత హాస్యాలు

హాస్యసృష్టికి భావభాషావ్యాపారాలలో అంతటా అవకాశముంటుంది. మాటాడే మాటల్లో కొన్ని శబ్దాల వలన హాస్యం జనిస్తే, కొన్ని భావాల వలన, కొన్ని భావాలను చెప్పే పద్ధతి వలన కూడా నవ్వు వస్తుంది. కొన్ని భావాలు లేక రసాలు వైపుదప్పి వున్నపుడు కూడా ఆ స్థితి నవ్వు తెప్పిస్తుంది. దీనిని బట్టి హాస్యాన్ని శబ్దాశ్రిత హాస్యం, ఉక్తిమూల హాస్యం, భావాశ్రిత హాస్యం, ఆభాస హాస్యం అని ఈ ప్రకరణంలో వివరించటం జరుగుతుంది. ముందుగా శబ్దాశ్రిత్ర హాస్యాలు.

శబ్దాన్ని ఆధారంగా చేసికొని కల్పించిన హాస్యం శబ్దాశ్రిత హాస్యం. ఇది అనేక విధాలుగా వుంటుంది. వాటిలో ప్రధానమైన దానిని పరిశీలించుట ప్రస్తుతాంశం.

ఊత పద ప్రయోగం

ఊత పదాలనేవి బహుశః మానవ సహజ విషయాలు. వాటికి భాషా జాతి మతభేదాలు కనిపించవు. ఏ భాషా వ్యక్తి అయినా తన భాషకు సంబంధించికానీ ఇతర భాషలకు సంబధించి కానీ, ఈ ఊత పదాలను ఉపయోగించుకుంటుంటాడు. దీనిని ఊతపదం అనటంలో చక్కని ఔచిత్యం కనిపిస్తుంది. ఎందువల్లనంటే ఆ పదం అతని సంభాషణాశక్తికి ప్రేరక మవుతుంది. ఆ పదాన్ని కఠినంగా నిషేధించి మాటాడమంటే మాత్రం అతని తీరు బస్సుని నెట్టినట్టుంటుందే కానీ పెట్రోలుతో నడచినట్టుండదు. ఊత పదాలకు కారణాలను జాగ్రత్తగా పరిశీలించి తేల్చవలసిన బాధ్యత బహుశః మనస్తత్వశాస్త్రజ్ఞులమీద వుంటుంది.

ఈ పదాలలో రకరకాలు వినిపిస్తాయి. ఎదుటి వారికి హెచ్చరికలుగా ఉండేవి కొన్ని, దైవనామాలు మరికొన్ని, బండబూతులు అనేకం. ఈ ఊత పదాలను ఊతపదాలుగా విడిగా గ్రహించవలసినదే గానీ వాక్యంలో ఒక పదంగా గ్రహిస్తే మాత్రం చాలామార్లు ప్రమాదం ఏర్పడుతుంది. విశేషించి బూతుపదాలు అలవాటున్న వ్యక్తుల దగ్గర ఇలా అన్వయిస్తే అవి ఏ అర్థానికి దారి తీస్తాయో నిర్ణయించటం కష్టం.

ప్రహసనాలలో దరిద్ర దుర్దైవ ప్రహసనంలో ఈ ఊత పదాలు కన్పిస్తాయి. దానిలో వక్రేశ్వరశర్మకు 'హరేరామ' అనటమూ, క్షుద్రారాముడికి 'జయరాధే' అనటం అలవాటు (ఊతపదం). వారి ప్రవృత్తులను, వారి దైవస్మరణను కలిపి చూస్తే విలక్షణంగా కనిపించి, నవ్వే అవకాశం వస్తుంది.

ఇవి మూడు రకాలు - సంకులం, అతివచనం, బిభీషకం.

అన్య భాషా ప్రయోగం.

ప్రాంతాలు, దేశాల మధ్య సంబంధాలు పెరిగేకొద్దీ ఆ యా భాషలతో కూడా పరిచయాలు పెరిగి, వాటి ప్రభావం దేశ భాషలమీద పడుతుంది. అటువంటి భాషాసంయోజనం ద్వారా కొంత హాస్యసృష్టిని చేయవచ్చు. తెలుగు రచయితలు సంస్కృతాన్ని ఉపయోగించుకొని అటువంటి హాస్యాన్ని కొంత సృష్టించారు.

డా॥ రుద్రదేవ త్రిపాఠి రచించిన 'సర్వదళ సమ్మేళనం' శ్లోకాలను చూడండి.

సమ్మేళనే రాజగృహే చ యానే క్రీడాసు పార్టీషు చ హోటలేషు ।

ఆంగ్ల పదాలను గాక హిందీ పదాలను కూడా వాడిన శ్లోకాలను చూడండి.

ఇ మే గద్దారాః స్వాన్ వచన రచనాభిర్బహు విధం
ప్రలోభం దత్త్వా వై జగతి ఠగతే హైం ప్రతిదినమ్

శ్లోకం మధ్యలో 'ఠగతే హైం' అని హిందీ క్రియ వాడటం ఒక చమత్కారం. 'దౌర్భాగ్యమంజరీ' ప్రహసనంలో రామపాణినాథుడు సంస్కృతంతో బాటు మలయాళాన్ని విరివిగా వాడతాడు.

సంస్కృత మలయాళాలు కలిపి ఒక శ్లోకం చూడండి

స్థూల స్థూలౌ కపోతా ఉటి మిలనితరాం జాను తుంగీకిటకురా ।
వక్షోజౌభంగ భాజౌ శివశివ జరయా శుష్కబింబౌ నితంబౌ ॥

ఆంగ్ల పదాలను సంస్కృతీకరించి వాడటం కూడా ప్రహసనాల్లో కనిపిస్తుంది. అభిరాజేంద్రమిశ్రుని 'ఇంద్రజాల' ప్రహసనంలో -

"సేయం కాలగరలా లిపస్టిక కృపయైవ బింబాధరోష్ఠీ కృతకకుంతల బంధకృపయైవ మహోర్ధధమ్మిల్లా, డాయిటింగ్ మాయయైవ ముష్టిగ్రాహ్యామధ్యా" అని. 'callgirl' పదాన్ని కాలగరలా అని, Lipstic ను 'లిపస్టిక' అని సంస్కృతీక-రించి వాడటం హస్యహేతు వౌతుంది.

డా॥ రుద్రదేవత్రిపాఠిదే మరో శ్లోకాన్ని చూడండి –

శ్రీమతామిహ వేల్కమేన గ్లేడతాం ప్రాప్నోతి చేతః ।

welcome, glad పదాలను స్వీకరించి welcome ను అలాగేవాడి glad మీద మరల సంస్కృత భావార్థ ప్రత్యయాన్ని కూడా ఉపయోగించటం మృదువైన హాస్యాన్ని కల్గిస్తుంది.

రామానందుని హాస్య సాగర ప్రహసనంలో కూడా హిందీభాష విరివిగా వాడబడింది.

క్లిష్ట పద ప్రయోగం (శబ్దాలంకారహాస్యం)

వర్ణ మేదైనా పునః పునరావృత్తమైతే ఒకవిధమైన అందం కనిపిస్తుంది. కొన్నిమార్లు ఏ చమత్కారం లేకపోయినా ఆ విధమైన శబ్దావృత్తి వలన ఆహ్లాదకత్వ మేర్పడుతుంది. సంఘంలో కొంతమంది ప్రయత్న పూర్వకంగా అలా మాటాడటాన్ని మనం చూస్తూనే వుంటాం. ప్రహసనాల్లో సైతం ఈ విధమైన హాస్యప్రక్రియ కనిపిస్తుంది.

హరిజీవన విరచిత మైన ప్రాసంగిక ప్రహసనంలో ఈ హాస్యం పుష్కలంగా దొరుకుతుంది. దానిలోని పాత్రలన్ని ఒకటి, రెండు తప్ప 'ప్ర'పూర్వకనామాలతో కన్పిస్తాయి. వారు వాడే పదజాలం కూడా ప్రపూర్వకంగానే వుంటుంది. ప్రకృష్ణదేవుడు నాయకుడు. ప్రకృతి ప్రియ నాయిక. ప్రతాపపంక్తి రాజు. ప్రేరకుడు విదూషకుడు. కేరళ భట్టు అనేవాడు ఆ పద్ధతిని అనుసరించడు. ఆ సన్నివేశాన్ని చూడండి -

రాజా :- రేరే ! ప్రకృష్ణదేవ కిమిదం కిమిదం ?

ప్రకృ :- హేహే! ప్రజానాథ ఏకస్య ప్రకృష్టార్థప్రవీణస్య ప్రతీకారః ప్రక్రియతామ్

రాజా :- రేరే కేరళభట్ట! ప్రకృష్ణాదాయినం ప్రపదం కుత స్త్వయా పరిత్యక్తం?

కేరళ :- దేవ! అస్తి హి విజ్ఞాప్యం కించిత్, యత్ ప్రశబ్దః ఏతన్ముఖయోగ ఏవ పరమ కర్ణ కటుః

ప్రకృష్ట :- (రాజానముద్దిశ్య) హే ప్రజాపాలన ప్రవీణ ! ప్రథమం తవాపి ప్రక్రియా ప్రయోగః ప్రవిహితః ....

ఇటువంటి సంభాషణలే గాక వర్ణనలలో సైతం ఇటువంటి స్థితి కన్పిస్తుంది. సూర్యోదయాన్ని వర్ణించే శ్లోకాన్ని చూడండి.

ప్రభాకరః ప్రోన్నతతాం ప్రయాతి ప్రతిక్షణం తు ప్రసభం ప్రచారః।
ప్రకామయత్యేవ మనో యదీయం ప్రభాకరప్రౌఢి మివ ప్రహర్తుః ॥

ఇది చక్కని శబ్దాశ్రయహాస్యం. వర్ణావృత్తి హృదయానికి గిలిగింతలు పెడుతుంది.

ధూర్తనర్తక ప్రహసనంలో సామరాజదీక్షితుడు ఇటువంటి శైలిని మృదువుగా చుంబించి, సున్నితంగా హాస్యాన్ని కల్గిస్తాడు. మూఢేశ్వరుని వాగ్వ్యవహారంలో ఇటువంటి అనుప్రాసలు కనిపిస్తాయి. 'చిన్తయన్తి హి సదా ముదా హృదా' 'కథ మేషా యోషా శేషావయవై స్తోషయతి'- కిం వదతి మమ ప్రియతరోఽతితరాం శిరీషమృద్వీ మృద్వీకామృద్వీభిః గీర్భిః - ఇవన్నీ కూడా మూఢేశ్వరుని వచనాలే. ఇది ఒక విధమైన మృదుహాస్యం -

ఇంద్రజాల ప్రహసనంలో మరోవిధమైన శాబ్దికహాస్యం కనిపిస్తుంది. ఐంద్రజాలిక, బాలకుల సంభాషణాన్ని గమనించండి -

ఐంద్ర :- ఏహి మమ ప్రియవటో !

బా:- అపేహి మమ అప్రియపటో !

ఐ:- కథం రుష్టోఽసి దారక ?

బా:- కథం తుష్టోస్మి ప్రాణహారక !

ఐ:- ఉపసర భోః! క్రీడాశుక

బా:- అపసర భోః ! గరళముఖ

ఐ:- స్ఫూర్జయ మే కేళీవిలాస విహంగ

బా:- కూర్దయ రే! బాలిశపలాశ ప్లవంగ

ఈ అంత్యానుప్రాస అత్యుత్తమ మైన హాస్యాన్ని కల్గిస్తుంది. అంతేగాక ఈ రచయిత వర్ణావృత్తిని వచనంలో కూడా ఆదరించి హాస్యాన్ని సృష్టించినాడు.

"అస్యైవ కృపయా దీనో దేశః, పీనో మేషః, నవీనః క్లేశః, మలినో వేషః, జీర్ణో నిదేశ శ్చ" అని ఒక దేశనాయకుణ్ణి వర్ణిస్తాడు ఇక్కడ కూడా నకారా వృత్తి మృదువుగా పెదవులను కదలిస్తుంది. ఇటువంటి హస్యా లెన్నెన్నో. ముఖే ముఖే సరస్వతీ.

స్పూనరిజమ్ :

"So called after the Rev. W. A. Spooner [1844-1930] dean and warder of New college, oxford,

It consists of a transposition between the consonant sounds [especially the intial sounds] of two words practice to which spooner was addicted" -

ఇది అప్రయత్నంగా ఏర్పడవచ్చు. సప్రయత్నంగా కూడా ఏర్పడవచ్చు. అప్రయత్నంగా ఏర్పడడంలో ఉచ్చారణత్వర, పరాకు, మొదలగునవి కారణా లవుతాయి. హాస్యశీలత ప్రధానంగా గలవారు అప్రయత్నంగానే అలా ఉచ్చరించటం అభ్యసిస్తారు. క్రొత్తవారు మొదట ఆశ్చర్యపడినా ఆ తర్వాత అందలి రహస్యం తెలిసికొని ఆనందిస్తారు. ఒక్కొకచో పదిమందిలో రహస్య సంభాషణ చేయవలసిన అవసర మున్నప్పుడు కూడా ఈ పద్ధతికి అలవాటు పడిన వ్యక్తి దీని నుపయో-గించుకొనవచ్చు. ఏమైనా ఇది కొన్ని సమయాలలో ఎక్కువ హాస్యాన్ని, తద్ద్వారా విపరీతపరిణామాలను సైతం ఏర్పరచగలదు. ఎవ్వరికీ బాధ కలిగించని రీతిగా స్పూనరిజాన్ని వాడుకొన్నప్పుడు అది రమణీయహస్యం కాగలదు.

మత్తవిలాస ప్రహసనంలో కాపాలికుడు ఇటువంటి ఉచ్చారణను ఆశ్రయిస్తాడు. బాగా సురాపానం చేసి, మత్తెక్కి ఉన్న కాపాలికుడు తన ప్రియురాలు దేవసోమను సోమదేవ అని వ్యవహరిస్తాడు. దానితో దేవసోమకు కోపం రావడం, ఇతడు సంజాయిషీ ఇవ్వటం మామూలు విషయాలే.

పునరుక్తి :

అనేక కారణాలవలన పదపునరుక్తి, భావ పునరుక్తి జరిగే అవకాశ ముంది.

స్పష్టప్రతిపత్తి కొరకు కాని, 'ద్విర్బద్ధం సుబద్ధం భవతి' అన్నట్లు కాని పునరుక్తి చేయవచ్చు. యమకాలంకారంలో పదపునరుక్తి కనిపించినా అర్థంలో భేదముంటుంది. అర్థాంతర సంక్రమిత వాచ్య ధ్వనిలో పదం, అర్థం కూడా పునరుక్తమే కాని అది ధ్వనికోటిలో అర్థాంతర సంక్రమితమై రమణీయ మవుతుంది. ఆపై అలంకారాల్లో అర్థపునరుక్తి అలంకారాంతరాన్ని ఆశ్రయించినందువల్ల ఏర్పడుతుంది. అయితే

అది ఆ అలంకారరూపంలో శోభాహేతువే కాని దోషం కాదు. ఈ రీతిగా ఏ పక్షానికి చెందని శబ్దపునరుక్తి కానీ, అర్థపునరుక్తి కానీ హాస్యహేతు వౌతుంది. అనగా నిష్ప్రయోజనంగా పదార్థ పునరుక్తి దోష మౌతుందని భావం.

సంస్కృత సాహిత్యంలో శకారుని హాస్యసృష్టిలో ఈ పునరుక్తి విపరీతంగా కనిపిస్తుంది. మృచ్ఛకటికంలో శకారుడు పునరుక్తి, అసంభవార్థాలతోనే జీవిస్తాడు.

మత్త విలాస ప్రహసనంలో దేవసోమ త్రాగిన మైకంలో పదపునరుక్తులను బాగా ఆదరిస్తుంది.

మత్తా మివ మత్తా మివ మాం భణసి ...
భగవన్ పరిభ్రమతి పరిభ్రమతి పృథివీ ...

ఇటువంటివన్నీ పునరుక్తులకే వుదాహరణాలు. అయితే సంస్కృత సాహిత్యంలో కవి పునరుక్తుల ద్వారా హాస్యాన్ని సాధించాలని ప్రత్యేక దృష్టి కలిగివుంటే తప్ప మరోరీతిగా దాని కవకాశముండదు. ఆ దృష్టి ఈ రచయితలకు తక్కువ కాబట్టి తమ్మూలకంగా ఏర్పడే హాస్యం కూడా తక్కువే.

అశ్లీల పదోచ్చారణం :

అశ్లీల పదాలు వాడితే ఒక విధమైన నవ్వు వస్తుంది. ప్రతిభాషలోనూ ఇటువంటి రచనలకు, రచయితలకు ఒక ప్రత్యేకత వుంటుంది. కొందరు పాఠకులు వీటికోసమే ప్రత్యేకంగా వుంటారు. ఇది అటు శృంగారానికి, ఇటు జుగుప్సకు మధ్య హాస్యానికి కూడ అవకాశ మిస్తుంది. ప్రాధాన్యాన్ని బట్టి ఆ యా రసాలు ఆస్వాద్యాలౌతాయి. అయితే హాస్యం నిరాధారంగా కూడా నిలువగలదు, కాబట్టి హాస్యోత్పత్తి జరుగుతుంది. ఇది ఉత్తమహాస్యమని, అభినందింపదగినదనీ ఎవ్వరూ సూటిగా చెప్పలేరు. బలహీనతలను రెచ్చగొట్టేది శృంగార పూరిత రచన. అయితే దానిని సైతం వికృతంగా వ్రాసి బలహీనతలతో పాటు నవ్వును సైతం తెప్పించే రచయితలు చాలమంది వున్నారు.

విశేషించి సంస్కృత ప్రాచీన ప్రహసనాలలో ఈ బాపతు రచన లెక్కువ. అర్వాచీనాలలో సైతం అనిద్రరతివీర ప్రహసనం వంటి విట్టివే. ఈ అశ్లీల పదోపయోగంలో ఈ రచయితలు పరాకాష్ఠకే చేరారు. సున్నితంగా కనిపించే ఒకటి రెండింటిని వుదాహరణంగా చూద్దాం. కాళిదాస ప్రహసనం, ఉన్మత్తకవి

కలశప్రహసనం వీటికి పట్టుగొమ్మలు. హాస్యార్ణవ ప్రహసనం నుండి రెండు శ్లోకాలను గమనించండి.

స్తనౌ తుంగౌ నిపతితౌ కామ సంగ్రామ మర్దితౌ |
పురస్తా దవలోక్యాస్యాః భగం శుష్కం భయా దివ||

కందర్ప హోమ విధానాన్ని వర్ణిస్తాడు చూడండి –

వేదీ సజ్జఘనం చ తత్పరిసరే కుండం వరాంగం ఫలం
నైవేద్యాయ కుచద్వయం మృగదృశః కామానలః ప్రోజ్జ్వలః
హోతాహం ఖలు శుక్ర హవ్యనివహః శేఫః స్రువో వర్తతే
నిత్యం పంచశరాధ్వరం త్యజతి కః సద్యః సుఖం యత్ఫలమ్!

శ్లేష

ఇది కొంచె మించు మించు అన్ని భాషల్లోను కనిపిస్తుంది. పాఠకుల మేధావిశేషం మీద దీని విజయం ఆధారపడి వుంటుంది. ఇది హాస్యసృష్టికి ఒక ఆధారమౌతుంది. కానీ సర్వవేళల ఇది హాస్యాన్ని కల్గించగల ప్రక్రియ కాదు. హాస్యస్పర్శకు అసలు లేని తావులలో కూడ ఈ శ్లిష్టపదప్రయోగం విరివిగా వుపయోగింపబడుతుంది.

అయినా ప్రహసనాలలో అక్కడక్కడ ఈ శ్లేష హాస్యహేతు వౌతుంది. దరిద్రదుర్దైవ ప్రహసనంలో - వక్రేశ్వరశర్మ (భిక్షుకుడు) క్షుద్రారాముణ్ణి భిక్ష మడుగుతాడు. ఆ సన్నివేశంలోని సంభాషణ చూడండి -

వక్ర- మహాజన! సపుత్ర కళత్రః ఖాద్యాభావాత్ ముమూర్షుదశాం గతోస్మి తద్దేహి నః కాంచన భిక్షాం. హరేరామ

క్షుద్రా - ఆః ప్రాన్తారేఽపి భిక్షుకాణా ముపద్రవః (స్వగతం)
కాంచన భిక్షాం! న రజతం న తామ్రం న తండులం యాచతేఽయమ్

ఇక్కడ 'కాంచన' పదం శ్లిష్ట మైనది. 'కాంచన' అంటే ద్వితీయైక వచనంగా 'ఒకానొక' అనిఅర్థం. కాంచన శబ్దాన్ని ప్రథమాంతంగా చూస్తే స్వర్ణమయమైన అని అర్థం. ఒక అర్థంలో పదం వ్యస్తం. రెండవ అర్థంలో సమస్తం. అతడు భిక్షుకుడై కాంచన భిక్షను కోరడంలోని అసహజత నవ్విస్తే, ఇతడు లోభియై దానిని మననం చేయడంలోని వికృతి నవ్విస్తుంది. ఉభయగతంగా కూడా ఈ శ్లేష హాస్యాన్ని కల్గించే అవకాశం బాగా వుంది.

అట్లే మత్త విలాస ప్రహసనంలో "యౌవన గుణభరమత్త విలాస ప్రహసనం" అని సూత్రధారుడు వాడిన గ్రంథనామవాచకాన్ని నటి సాధారణార్థంలో తీసికొని వుక్రోషపడే సన్నివేశం కూడా ఈషత్తుగా హాస్యాన్ని కల్గిస్తుంది.

గౌరీ దిగంబర ప్రహసనంలో మైనాకుడి దగ్గర పరువు పోగొట్టుకున్న దిగంబరుడు అతనిని బ్రతిమిలాడుతూ -

వివక్ష స్తవ పితా, త్వం పుత్రః సపక్ష ఏవ - అని విపక్ష సపక్ష శబ్దాలను శ్లేషించటం శివుని దీనస్థితిని సూచిస్తూ నవ్విస్తుంది.

హాస్య చూడామణి ప్రహసనంలో ఈ శ్లేష చక్కని హాస్యాన్ని కల్గించే సన్నివేశ ముంది. గురుశిష్యుల సంభాషణ పరిశీలించండి -

శి :- జ్ఞానరాశే! ఉదరగతా విమౌ సంవృత్తౌ

జ్ఞా :- (సక్రోధమ్) మూర్ఖ! నామ గ్రహణేన మాం వ్యాహరసి?

శి :- కిం తవ నామ గ్రహణేన పాపం భవతి?

జ్ఞా :- ధిజ్ మూర్ఖ! న గృహ్యతే గురూణాం నామ

శి :- తత్కథం శైలానాం నామ గృహ్యతే?

ఉపాధ్యాయార్థంలో వాడిన గురుశబ్దాన్ని శిష్యుడు గొప్ప (పెద్ద) అనే అర్థంలో తీసికోవటం ఇక్కడ హాస్య హేతువు.

అనుచిత విభాగం:

పదాలను అవివక్షితంగా విడగొట్టడం వలన అనుచితార్థాలు ఏర్పడి నవ్వు తెప్పించే అవకాశమంటుంది. అయితే యిది అన్ని భాషలలోనూ ఎక్కువగా కుదరదు.

ప్రకృతి ప్రత్యయ సంయోగం, సంహిత కల భాషలలో ప్రధానంగా ఈ విధమైన హాస్యానికి అవకాశం ఏర్పడుతుంది. ఇతర భాషలలో ఎప్పుడో కాని కుదరదు. సంస్కృతాంధ్ర భాషలు దీనికి బాగా సహకరిస్తాయి. ఒక వ్యక్తి అపండితుడని చెప్పటానికి కూడా ఇటువంటి అసందర్భాలైన విరుపులను వుదాహరించడం సహజం. కొబట్టి ఈ పరిచ్ఛేద పదయోగానికి అవకాశమున్న భాషలలో మేధావి అయినవాడు దీనికి అవకాశ మివ్వకూడదు. అలా ఇవ్వడం అపాండిత్యం క్రింద

లెక్క. అయితే హాస్యస్ఫూర్తికై తెలిసికూడా పరిచ్ఛేదపద ప్రయోగం చేస్తారు. అది చక్కని పాండిత్యమే.

ఇంద్రజాల ప్రహసనంలో ఐంద్రజాలిక - తత్సహచరుల సంభాషణ హాస్యాన్ని ఇస్తుంది. చూడండి

ఐంద్ర : హంహో! జ్ఞాత మిదానీమ్ – మహానుభావోఽయం M. L. A. భూతః

బాలక: సుష్ఠు విజానాతి భవాన్. బకశావో యమాలయే ప్రసూతః

M.L.A. పదాన్ని 'యమాలయే' అని కలపటం చక్కని హాస్యం. విడగొట్టినట్లు కలపటం కూడా హాస్యహేతువే. ఒకవైపు విడగొట్టబడ్డది మరోవైపు కలప బడుతుంది కదా!

అధిక్షేపణ :

లోకో భిన్నరుచిః అన్నది విశ్వప్రసిద్ధసత్యం. అయితే సామాజిక జీవితంలో సర్వరుచుల వారును కలిసి జీవించవలసిన అవసరముంది. ఆ స్థితిలో కొందరు ఏ విషయాన్నైనా సర్దుకొని పోగలవారయితే మరికొందరు తమ కభీష్టం కాని ఏ విషయాన్నీ సహింపరు. అధిక్షేపణ, దూషణల ద్వారా దానిని ప్రకటిస్తారు. అది అంతటి అధిక్షేపణకో, దూషణకో తగినదయితే హాస్యం జనించదు. చిన్న విషయానికి విశేషంగా నిందించటం జరిగితే అది హాస్యహేతు వౌతుంది. ఇతరులను దూషించటం ద్వారా మానవుడు తాను సంతోషిస్తాడు. అదొక సహజాతమైన ప్రేరణ. అది అనౌచిత్య జుష్ట మైనపుడు జనించే దూషణ వాక్యాలు ఈ మనఃస్థితి ఫలితాలే. చాటు కవిత్వంలో ఇవి ఎక్కువగా కన్పించే అవకాశ ముంటుంది.

ప్రహసనాలలో సైతం ఈ తత్త్వం కనిపిస్తూనే వుంటుంది. జీవన్యాయ తీర్థుని దరిద్రదుర్దైవ ప్రహసనంలోని వక్రేశ్వరశర్మ ఈ తత్త్వానికి ప్రతీక. అతడు యాచకుడు. భిక్ష పెట్టని వారిని నిందించటం అతడి లక్ష్యం.

ప్రత్యాఖ్యాన పరం గృహస్థనికరం దుశ్శ్రవ్యశాపాక్షరైః
రూక్షైః బుక్కరవైః కరోమి విధురం త్వాస్ఫాలనం నిష్ఫలమ్

అని అతడే వివరిస్తాడు, అంతేకాదు, క్షుద్రారాముడు తిరస్కరించినప్పుడు

'ధన్యోసి కోటిపతే' అని, 'మాదృశం యాచకం ప్రత్యాఖ్యాయ త్వమసి మత్సదృశదశాం లభస్వ' అని తిడకాడు. ఇది అధిక్షేపణ, దూషణలకు తగిన ఉదాహరణ. నవ్వక తప్పదు. అంతటితో ఊరుకొనక అతడు భార్యను సైతం నిందిస్తాడు.

లక్ష్మీ ర్భ్రష్టా హి సా నారీ యా లోకే కలహప్రియా |
తస్యాః సన్నిధిమాత్రేణ నిధి ర్దూరే పలాయతే ||

దీనిని అశక్త దుర్జనత్వం అని అయినా అనవచ్చు. పనిని సాధించలేనప్పుడు కలిగే తొందరపాటు ఈ అధిక్షేపణను ప్రేరేపించవచ్చును.

సంస్కృతాలాకార శాస్త్రంలో విరుద్ధలక్షణ అని ఒకటుంది. శబ్దశక్తులలో లక్షణ ఒకటి. అది కూడా అయిదురకాలుగా ప్రయోగింపబడుతుంది

వీటిలో అభిధేయ వైపరీత్య మన్న దొకటి. అనగా వాచ్యార్థం కన్నా విరుద్ధమైన భావాన్ని ఆ పదం ద్వారా స్వీకరించటం. సామాన్యంగా ఆ యా విషయాలనో, వ్యక్తులనో అధిక్షేపించే సమయంలో దీనిని ఎక్కువ వాడతారు. ఇది అనాదిగా అలవాటులో నున్నదే. 'దేవానాం ప్రియ ఇతి చ మూర్ఖే' అని వైయాకరణులు ఇటువంటివి సూత్రించుకున్నారు కూడా. అట్లే మహాశబ్దాన్ని ఇటువంటి విపరీత లక్షణార్థకంగా వాడటం జరుగుతుంటుంది.

నిత్యవ్యవహారంలో కాని, సాహిత్యంలో కాని ఇటువంటి పదాల వాడకం చాలా ఎక్కువే. కొన్నింటిని పరిశీలిద్దాం.

హాస్యచూడామణి ప్రహసనంలో కపటకేళి - వేశ్య- తన కుమార్తెను గూర్చి అన్న మాట - న ఖలు అస్మాకం కులే ఏతాదృశీ కులమహిళా శ్రూయతే యా సర్వదైవ భుజంగే అనురజ్యతి- ఇక్కడ కులమహిళాశబ్దం సామాన్యంగా పతివ్రత అన్నట్లుగా అన్వయించినా, ఇటువంటి భ్రష్టురాలు మా ఇంటా వంటా పుట్ట లేదన్నదే కపటకేళి అభిప్రాయం. అట్లే లటకమేలకంలో 'ఏతయో రత్ర కౌతుకాగారే మహాశయ్యా క్రియతామ్' అని సభాసలి అనటంలోని మహాశయ్య ఇటువంటిదే. కొంచె మించు మించు శ్మశానం అన్న అర్థాన్ని అందజేస్తుంది.

లీలా విలాస ప్రహసనంలో చంద్రిక అత్తగారి నుద్దేశించి కోపంతో - ఏషా ధర్మదేవతా దర్శనం దదాతి - అనటంలోని ధర్మదేవతాపదం ఇటువంటి విరుద్ధ లక్షణను ఆశ్రయించినదే. ఈ పదాలన్నీ విపరీత లక్షణార్థంలో నవ్విస్తాయి.

ఉక్తిమూల హాస్యాలు

మనం ఈనాడు వాడుకునే చెణుకులు లేక చతురులు అన్నీ ఉక్తిమూలక హాస్యాలే. ఈనాడు 'విట్' 'జోక్' అన్న ఆంగ్ల పదాలే చెణుకులు అనటం కన్న సన్నిహిత తరాలు. 'విట్' సంస్కృతభాషలోని రసశబ్దం లాగా అనేకార్థాలను మార్చుకొని చివరగా వర్తమాన సమాజంలో Psychological Faculty అన్న భావంలో స్థిరపడిపోయింది. 17వ శతాబ్దంలో డ్రైడెన్ తన The state of innocence గ్రంథానికి వ్రాసిన పీఠికలో "The definition of wit .... is only this, that it is a property of thoughts and words or in other terms thoughts and words elegantly adapted to the subject".[1] అని నిర్వచించాడు. ఆ తర్వాతనే ఆధునిక కాలంలో Hobbs మొదలగు విమర్శకుల దృష్టిలోఅది psychological faculty గా స్థిరపడింది. ఆ దృక్కోణం నుండియే హాస్యరస సందర్భంగా దాన్ని పరిగణించటం జరుగుతుంది. దాని ప్రయోజనాల పరిధి సైతం విస్తృతమే.

దాని గతచరిత్ర యేదయినా వర్తమాన కాలంలో అది ఒక చక్కని హాస్య ప్రక్రియ. సత్యప్రతిపాదనకు ఒక రమణీయమైన, సున్నితమైన సాధన. దాని స్వరూపస్వభావాలను పరిశీలించుదాం.

అది కేవలం వాక్చమత్కృతి మీద ఆధారపడింది. దానికి మేధాసంపత్తి కూడ సహకరించాలి. ఇతరుల మాటల మధ్యలోనో, చేష్టల మధ్యలోనో అప్పటి కప్పుడు కల్పించుకొని, ఈ ప్రక్రియను పాటించగలగాలి. ఆ ఉక్తి తనకే గాక ఇతరులకు విశేషించి దానికి ఆలంబమైన వ్యక్తికి సైతం ఆనందాన్ని, నవ్వును కల్గించగలద్దై ఉండాలి. ఎవ్వరితో నైనా నవ్వు కాని, ఎవ్వరినీ విషయం చేసి నవ్వ వద్దన్నది హాస్యానికి ప్రాణప్రాయమైన సూత్రం.

"ఏక శ్శబ్దః 'విట్' ప్రయుక్తః సంఘే హాసధు గ్భవతి" అని అనటం సమంజనం. 'విట్' భావవక్రత మూలకారణంగా ఏర్పడిన వాక్చమత్కృతి. వ్యంగ్యచమత్కారం కన్నా వాక్చమత్కారం మిన్నయై గుణీభూతవ్యంగ్య మవుతుం దిది. అందుకే జోకును వివరించడం కన్న శిక్ష మరొకటి లేదు. స్పష్టత, వేగం దీనికి ప్రధానామైన మూల పదార్థాలు. ఆలస్యమైన, అస్పష్టమైన 'విట్' తన వ్యక్తిత్వాన్ని కోల్పోవలసివుంటుంది.

---

1 Encyclopedia of Poetry and Poetics - p. 898

విట్ప్రయోక్త మేధావియై ఉండాలి. అంటే విషయపాండిత్యం కాదు, సునిశిత పరిశీలన ఉండాలి. నిష్పక్షపాతభావన అతనికి అభ్యాసమై ఉండాలి. అవకాశ ముంటే తననైనా, ఇతరులనైనా సరే 'విడా'స్పదులను (విట్+ఆస్పదులు) చేయ గలగాలి. తాను నవ్వును సంయమించుకొని, ఇతరుల నవ్వులో అందాలు వెదుక్కో గలగాలి. తన ఉక్తి కృతార్థమైందని నిర్ణయ మేర్పడేవరకు గంభీరంగా నిలువ గలగాలి. అసలైన ప్రమాదం ప్రత్యుక్తుల దగ్గర ఏర్పడుతుంది. తనకన్నా మేధావి గానీ, హాస్యశీలుడు కానీ ఆ సన్నివేశంలో ఉంటే అది ప్రత్యుక్తి (Repartee) రూపంలో తిరిగి వస్తుంది. దాన్ని సహృదయతతో స్వీకరించగలగాలి. కలుపుగోలు-తనం దీనికి చాలా అవసరం. 'ఇంట్రావర్ట్' (అంతర్ముఖుడు) ఉక్తిమూల హాస్యాన్ని సృష్టించలేడు. తన 'జోక్'ను గ్రహించగల వారెవ్వరూ లేనప్పుడు అది పేలని టపాకాయలా 'తుస్సు'మంటుంది. ఆ వైఫల్యాన్ని ధైర్యంగా స్వీకరించగల శక్తి గలవాడై ఉండాలి. ప్రధానంగా నవ్వడం, నవ్వించటం ఆరోగ్యసూత్రా లనే నమ్మకం కలిగి, ఔచిత్యానుగుణంగా వాటిని ఆచరించటం తెలిసిన వాడై ఉండాలి.

ఈ ఉక్తిమూల హాస్యానికి గ్రహీత కూడ కొంచె మించుమించు ప్రయోక్త అంతటి వాడుండాలి. వికృతిగ్రహణశక్తి, సద్యఃస్ఫూర్తి, సహృదయత, అధిక్షేపణల లోని ఆంతర్యాన్ని గ్రహించే వివేకం అతడికి ప్రధాన లక్షణం.

ఇల్లు కాలి ఏడుస్తూంటే బొగ్గులవాడు బేరానికి వెళ్ళినట్లుగ ఉక్తిహాస్యాలను సృష్టించ ప్రయత్నించటం ప్రమాదకరం. మనం హాస్యోన్ముఖుల మైనంత మాత్రాన చాలదు. సన్నివేశం, శ్రోతలు దాని కనువైన వాతావరణంలో వున్నదీ లేనిదీ గుర్తించి ప్రవర్తించగలగాలి. అది ఆహారంలో ఉప్పు లాంటిదే గానీ ఆహారం కాదు. Fuller చెప్పినట్లు ఉక్తి ఆత్మరక్షక సాధనంగా వుండాలి గానీ, పరహింసకంగా వుండ కూడదు.[1] ఆ విషయాన్ని గుర్తించకపోతే ఏర్పడే ప్రమాదాన్ని Walter Scott సుస్పష్టంగా చెప్పాడు—

Though wit be very useful, yet unless a wise man has the leeping of it, that knows when, where and how to apply it, it is like

1 The new Dictionary of thoughts పేజి 707

wild fire, that runs hissing about, and blows up everything that comes in its way.[1]

ఈ Psychological faculty అనేక విధాలుగా వుంటుంది గదా! ఉక్తి వైచిత్ర్యమే ప్రధానాంశం కాబట్టి ఆ యా ఉక్తులలో కనిపించే భేదాలు ఏ రీతిగా హాస్య స్ఫోరకా లవుతాయో సంస్కృత ప్రహసన రచయితలు ఎంత సమర్థతతో ఆ హాస్యాన్ని సృష్టించగలిగారో పరిశీలించుదాం.

ప్రత్యుక్తి (Repartee):

మాటకు మాట చెప్పగలగటమే ప్రత్యుక్తి. ఇతరులు మనలను ఏ స్థాయిలో ఆక్షేపిస్తారో మనం అదే స్థాయిలో ఆ భావానికి అనుగుణంగానే త్రిప్పి కొట్టటం ప్రత్యుక్తి. ఉక్తిమూల హాస్యం యొక్క గమ్యం, పరాకాష్ఠా ఇదే. A witty or clever rejoinder అని Dryden నిర్వచించాడు. (A dictionary of literary terms P 552).

ఈ ప్రత్యుక్తి (Repartee) రెండు విధాలు. ఆంగ్లంలో Complementory Repartee, Deregatory Repartee అంటారు. ఉక్తి ప్రధానం, ప్రత్యుక్తి ప్రధానం అని తెలుగులో అందాం. అంటే సంభాషణపరంపరను ప్రారంభించిన వాడే కృతార్థుడైతే ఉక్తి ప్రధాన మవుతుంది. ఇతరులు కృతార్థులైతే ప్రత్యుక్తి ప్రధాన మవుతుంది. కొన్ని ప్రత్యుక్తులను ఆస్వాదిద్దామా?

హాస్యార్ణవప్రహసనం వ్యాధిసింధు, విశ్వభాండుల సంభాషణలో వ్యాధి సింధువు ప్రత్యుక్తితో విశ్వభాండుని చిత్తు చేస్తాడు. చూడండి

విశ్వ :- భో భో వ్యాధిసింధో! తవ పితు రాతురాన్తకస్య అన్తకాలయ ప్రాప్తస్య అపి కుశలమ్ ?

వ్యాధి :- కుతః కుశలమ్ భవద్దర్శనం వినా ?

"చచ్చిపోయిన మీ నాన్నగారు యమలోకంలో క్షేమంగా ఉన్నారా?" అంటే, "మిమ్మల్ని చూడకుండా ఏం క్షేమం లెండి?" అని వ్యాధిసింధు వనటం విశ్వభాండుణ్ణి

1 The new Dictionary of thoughts పేజి 707

మాడుమీద కొట్టినట్టే. మా నాన్న కుశలం గురించే కాదు, నీ చావు గురించి ఆలోచించుకో అని సూటిగా చెప్పాడన్న మాట.

స్వర్గీయ హసన ప్రహసనంలో అధికారపక్ష, ప్రతిపక్షాల మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు అధికారపక్ష సభ్యురాలు అదితి -

దేవరాజో నిర్వాచితవ్యః! కిమిదం శిశుహస్తగతం మోదకమ్? దేవరాజః ఇంద్ర ఏవ. అతీతే స ఏవాసీ ద్దేవరాజః. భవిష్యతి కాలే స ఏవ స్థాస్యతి దేవరాజః - అన్న వెంటనే ప్రతిపక్షంలోని దున్ధువు తాపీగా 'పరం వర్తమానే దేవరాజ పదం శూన్యమ్' - అనటం అధికారపక్షాన్ని (అంతకు పూర్వం), నిరుత్తరాన్ని చేసే సమాధానం, చమత్కారపూరితం కూడా.

అట్లే ధూర్తనర్తక ప్రహసనంలో బ్రహ్మానందస్వామి, ముఖరుల సంభాషణ సైతం ఈ కోవకు చెందినదే

బ్రహ్మ:- అభీష్టలాభీ భూయాః. (విలోక్య విహస్యచ) యత్సమర్కట ఇవాకలయతే చేష్టయా.

ముఖర:- అహం మర్కట ఇవ, త్వం పునః మర్కట ఏవ

ప్రగల్భోక్తి :

ప్రగల్భాలు మానవ సహజం. శ్రోత మేధాస్థాయిని బట్టి వక్త ప్రగల్భాల స్థాయిని మార్చుతుంటాడు. ఆ ప్రగల్భాలకు అహంకార గర్వాలతో బాటు మూర్ఖత కూడ జత అయితే శ్రోతృస్థాయిని వ్యక్తిత్వాన్ని సైతం విస్మరించి ప్రగల్భించటం జరుగు తుంది. వ్యక్తులలోని ఆధిక్యభావనా, న్యూనతాభావనా - ఈ రెండు ప్రగల్భోక్తులకు అవకాశ మిస్తాయి. ఈ ప్రగల్భోక్తులు వ్యక్తుల వృత్తులను బట్టి, ప్రవృత్తులను బట్టి వివిధ రీతుల్లో ప్రత్యక్ష మవుతాయి. ఇహ పర లోకాలను రెండింటినీ కలుపుతూ కూడా ప్రగల్భాలు పలికే నేర్పరులు ఎందరో ఉన్నారు.

ప్రహసన సాహిత్యంలో ప్రగల్భోక్తులు లెక్కకు మిక్కిలి. హాస్య చూడామణి ప్రహసనంలో జ్ఞానరాశి ప్రగల్భాలను పరికించండి

బ్రహ్మేవాహం మరణ మథవా జీవితం వేద్మి జన్తోః
స్వామీవాహం పరహృతధనం క్ష్మాతలా దుద్ధరామి |

లోకస్యాహం సకల చరితా న్యన్తరాత్మేవ జానే
చోరైర్లుప్తం స్వయమివ హృతం వస్త్వహం ప్రాపయామి ||

ఇవన్నీ ప్రగల్భాలని వేరే చెప్ప నవసరంలేదు. బ్రహ్మ లాగా ప్రాణుల జనన మరణాలను తెలిసికొనగలిగిన వ్యక్తి తన గురించి తాను తెలుసుకోలేక చిక్కుల్లో పడటాన్ని గమనించినప్పుడు మనకు వచ్చే నవ్వు, కలిగే జాలి అంతా ఇంతా కావు. ఇవి వృత్తి ప్రగల్భాలు. జ్యోతిశ్శాస్త్ర నిష్ణాతుల మనుకునేవాళ్ళు నేర్చుకొని తీర వలసిన మాట లివి. ఇక శాస్త్రాచరణలో సాక్షాత్తుగా పలికిన ప్రగల్భాలెలా వుంటాయో చూడండి. వక్త ఆ జ్ఞానరాశియే సుమా!

కిం వాగ్భిః నికషో హి నః ఫల మితి స్యాద్గాఢ గర్వగ్రహః
ప్రశ్నేష్వావిల ముత్తరం విరచయే న్న వ్యాహరే న్నిర్ణయమ్ |
సిద్ధం కార్య మవేక్ష్య నిశ్చిత మిదం పూర్వం మయాసీ దితి
స్ఫారం స్ఫార ముదీరయే దుపచరే త్కంచి న్మృషా సాక్షిణమ్ ||

ఈ ప్రగల్భోక్తులతో ప్రత్యుక్తులను కలిపి మనోరంజకంగా రచనలు చేసిన రచయితలు చాలా మంది వున్నారు. తటస్థపడిన ఇద్దరూ ప్రగల్భప్రియు లయినపుడు ఒకరిని మించి మరొకరు కనిపించాలనే భావంతో ప్రత్యుక్తి రూపంలో ప్రగల్భాలను పలకటం సాధారణ విషయమే. అది మరీ హాస్యభాసురంగా కనిపిస్తుంది.

అయితే ఏదో కొంత స్తోమత గల వ్యక్తి ప్రగల్భాలు పలకటం ఒక రకం. బురద పాము కూడా తోకెత్తిందనట్లు ప్రగల్భాలు పలికే వారు మరీ నవ్వులపా లవుతారు. దరిద్రదుర్దైవ ప్రహసనంలో యాచకుడైన వక్రేశ్వరశర్మ ప్రగల్భాలను పరికించండి.

తృణేషు వంశః ఖచరేషు హంసః శూరేషు కంసో మశకేషు దంశః |
విప్రేషు వక్రేశ్వరశర్మనామా సంసారచక్రే విదితో న కేన||

యథార్థోక్తి

యథార్థానికి నిజం చెప్తే నవ్వవలసిన అవసరమేమి లేదు, దానిలో వికృతి కానీ, అసంగతీ కానీ ఉండవు కాబట్టి. కాని ఒక్కొక్కమారు నిజం చెప్పినా మనకు నవ్వు వస్తుంది. అది సత్యమే అయినా ప్రకటనావశ్యకం లేనిదై వుంటుంది, లేదా తత్ప్రకటన ఊహించవలసిన అవసరం కూడా లేనిదయినా అవుతుంది. అటువంటి

సత్యం వక్త యొక్క సత్యవాక్పరిపాలన కన్న నిరర్థకవాచోవిధేయతనే ప్రకటిస్తుంది. కాబట్టి హాస్యాస్పద మవుతుంది. హాస్యసృష్టి కోసం అటువంటి తత్వాన్ని ఆశ్రయిస్తే అది అతడి మేధావిశేషాన్ని తెలియజేస్తుంది. లేకపోతే అది తెలివిక్కువతనానికే నిదర్శనం.

ధూర్తనర్తక ప్రహసనంలో శుంతాచార్యుడు "పశ్యైనం నభసో మధ్య దేశవర్తినం ప్రచండ మరీచి మాలినం దినేశమ్" అని మధ్యాహ్న కాలాన్ని సూచించి, వెంటనే "మధ్యాహ్న మేనం వదన్తి మనీషిణః" అవటం హాస్యాలంబనం. సూర్యుడు నడినెత్తి నున్నపుడు అది మధ్యాహ్న మని చెప్పటానికి మేధావులే అవసరం లేదు. అది జగద్విదితసత్యం, కాని దానిని ప్రత్యేకించి చెప్పటం నవ్వు పుట్టిస్తుంది.

అభియుక్తోక్తి

'జ్ఞాని తన అనుభవాన్ని అంతా మాటుపెట్టి అన్నటువంటి మాట అభియుక్తోక్తి. ఆ ఒక్క మాటలో ఎంతో విజ్ఞానం ఇమిడి ఉంటుంది. అందులో ప్రతిభాయుతమైన యుక్తి గానీ, ప్రజ్ఞాయుతమైన భావనగానీ ఉంటుంది' అని మునిమాణిక్యం అభియుక్తోకికి ఇచ్చిన నిర్వచనం. ఒక మేధావి అనుభవసారం కాబట్టి ఈ అభియుక్తోక్తుల ద్వారా మానవమనోవృత్తులలోని ఎన్నో నిగూఢాంశాలు బయట పడుతూంటాయి. వాటిలో కొన్ని సరదాగా, తియ్యగా చెప్పినట్లు కనిపించినా వెనుక వున్న అనుభవాలు తీక్ష్ణంగానూ చేదుగానూ వుంటాయి. ఆంగ్లంలో ఇది ఎపిగ్రామ్ (Epigram) అనే పేరుతో బాగా ప్రసిద్ధం.

A form of writing which makes a satiric, complementary or aphoristic observation with wit extreme condensation and above all brevity అని ఎపిగ్రామ్ నిర్వచింపబడింది.

సంస్కృత ప్రహసనాలలో సైతం అభియుక్తోక్తులకు లోటులేదు. దరిద్ర దుర్దైవ ప్రహసనంలో వక్రేశ్వరశర్మ తనకు లభించిన పాచికలవల్ల ఇతర యాచకులకు కూడా తిండి దొరకుతుందనీ తెలిసిన వెంటనే దాని నంగీకరించలేక ప్రకటించే భావాన్ని చూడండి.

అన్ధః కుష్ఠీ దరిద్రో వా ప్రతివేశీ వరం భవేత్ |
సమానధనగర్వేణ స్పర్ధమానో హి దుస్సహః || -

తాను చెడ్డా పరాయివాళ్ళు బాగుపడకూడ దనే మానవుల మనస్తత్త్వానికి అద్దంపట్టే సూత్ర మిది. వక్రేశ్వరశర్మ అంత దరిద్రుడై వుండి కూడా పైన చెప్పిన కారణం వల్లనే సిద్ధించిన అక్షాలు పోగొట్టుకొనేందుకు సిద్ధపడతాడు.

అలాగే కౌండిన్య ప్రహసనంలో అతిథులను ఆదరించటానికి వెనుకంజవేసే గృధ్రనాసుణ్ణి కేంద్రీకరించి కౌండిన్యుడు తెలియజేసే న్యాయసూత్రాన్ని గమనించండి-

ధర్మధ్వజో వ్యాజవివర్జితేభ్యః
కృతోపకారాచ్చ కృతఘ్నబుద్ధిః ।
ఋణీ పరిత్రస్యతి చోత్తమర్ణాత్
సదా కదర్యః స్వగృహేఽతిథిభ్య॥ -

ఆశ్చర్యోక్తి

కొన్ని సంఘటనలు, మాటలు మనల్ని విపరీతమైన ఆశ్చర్యానికి గురి చేస్తాయి. ఆ ఆశ్చర్యంతో హృదయంలో ఆనందం మొలకెత్తుతుంది. అయితే ఈ ఆశ్చర్యంలో అసంభావ్యత, అజ్ఞత, మూర్ఖత లేక మరేదయినా కూడా భాసించ వచ్చును. కాని వీటినన్నిటిని తలదన్ని, కారణస్ఫురణ పరిధిని దాటి, కార్య మయిన ఆశ్చర్యం మాత్రమే మనముందు నిలుస్తుంది. అటువంటి వాక్యాలనే ఆశ్చర్యోక్తు లన వచ్చును. ఆశ్చర్యంతో అనే మాటలయినా, ఆశ్చర్యాన్ని కలిగించే మాట లయినా ఆశ్చర్యోక్తులే.

'లటకమేలకం'లో ఒక సన్నివేశాన్ని చూడండి. జంతుకేతువు దంతురకు వైద్యం చేసేందుకు వస్తాడు. దృష్టి సరిగా ఆనటం లేదని చికిత్స కోరుతుంది దంతుర. అప్పటి మాటలను పరిశీలించండి -

జంతు:- (దంతురాం ప్రతి) కియద్దూరం పశ్యసి ?

దంతురా:- వటవృక్షం యావత్

జంతు:- అత్ర వటవృక్షోప్యస్తి కిమ్?

ఆశ్చర్యంతో జంతుకేతు వన్న మాటను వినగానే మనకూ ఆశ్చర్యం కలుగక మానదు. రోగి కన్నా చూపు మందగించిన వైద్యుడు రోగి కెంతవరకు న్యాయం చేయగలడన్న విషయం, అందుకు ఆ వైద్యుడు సిద్ధపడటం ఆశ్చర్యానందాలను కల్గిస్తాయి.

కౌండిన్యప్రహసనంలో కౌండిన్యుడి బాబాయి వటికానాథ మిశ్రుడి ప్రవర్తన ఇలాగే ఆశ్చర్యాన్ని కల్గించేది. ఆ ప్రవర్తనను ప్రకటించిన కౌండిన్యుడి మాట ఆశ్చర్యోక్తియై నవ్వు కల్గిస్తుంది.

కృత్వా పణం హి వటికాశతభక్షణాయ
పూర్ణే నవాధిక నవత్యశనేఽథ యస్య ।
ఉద్గీర్ణ లోచనయుగస్య పురా ముమూర్షోః
శిష్టైక సంగ్రహరుచిం కృతిన స్స్మరన్తి ॥

నూరుగారెలు తినాలని పందెం. 99 గారెలు తినగానే కళ్ళు తిరిగి చావుకళలు ప్రారంభమయ్యాయి. అతని పరిస్థితిపై మనకు సానుభూతి కలుగుతుంది. అయ్యో అనిపిస్తుంది. అయితే ఆ దశలో వుండీ గబుక్కున లేచి, నూరవగారెను కూడా మ్రింగి త్రేన్చాడని చెప్పటం ఆశ్చర్యంతో బాటు నవ్వు కలిగిస్తుంది.

మూర్ఖోక్తి

చాలామంది మాటాడే రీతిలో మొండితనం బట్టబయ లవుతూంటుంది. వారి భావాల్లో గానీ, వాగ్ధోరణిలో గాని అసత్యం లేక అనౌచిత్యం స్పష్టంగా కనిపిస్తున్నా, దాన్ని అంగీకరించడానికి అటువంటి వ్యక్తులకు బుద్ధి పుట్టదు. తప్పు అని తెలియక మూర్ఖంగా వుంటే క్షమించవచ్చు. తప్పని తెలిసికూడా అలా మొండిగా మాటాడితే దాన్ని మూర్ఖోక్తి అనవలసివస్తుంది. అనేక సందర్భాలలో అది హాస్య హేతు వవుతుంది.

లీలావిలాసప్రహసనంలో చంద్రిక మాట లెక్కువగా మూర్ఖోక్తులే. ఆమె ఒక గయ్యాళి. సర్వకాల, సర్వావస్థలలో భర్తకు వ్యతిరేకంగా ప్రవర్తించటమే ఆమె లక్ష్యం. వారిద్దరూ ఘర్షణ పడ్డప్పుడు శాంతించమని వారి కుమార్తె లీల కోరే సంభాషణను గమనించండి.

గౌతమ:- వత్సే! త్యజ్యతే మయా కలహః

చంద్రికా:- త్యజ్యతే మయా సౌహార్దమ్

లీలా:- తాత! త్వయా తర్హి సౌహార్ద మాద్రియతామ్

చంద్రికా:- మయా తర్హి కలహః ఆద్రియతే

ఇదీ వరస. ఈ వాదం హేతుబద్ధమూ కాదు, లక్ష్యసాధనమూ కాదు. కేవలం భర్తను వ్యతిరేకించాలన్న మూర్ఖత తప్ప మరేమీ లేదు.

హాస్యార్ణవప్రహసనం నుండి మరో ఉదాహరణాన్ని చూద్దాం - రక్త కల్లోలుడనే నాపితుడు ఎవరో ఒకరికి గోళ్ళు తీస్తుంటే ఆవ్యక్తి గబుక్కున చేతిని ముఖం మీదికి లాక్కుంటాడు. బడిశం విరుగుతుంది. అతడికి గాయ మవుతుంది. దానిపై విచారణ - తీర్పు ఎలా ఉంటాయో చదవండి

మంత్రి:- అరే! నాపిత! నిగద్యతాం ప్రథమతః కస్య గోచరః ?

రక్త:- ప్రథమ మస్మాకమ్

పౌర:- మమాంగే శోణితప్రవాహః ప్రథమతః గోచర స్తవ ?

మంత్రి:- అరే! నాపిత! కథం తే గోచరః?

రక్త :- (ఆత్మగతం) ధన్యో మంత్రివరః నరరాజయోగ్యః (ప్రకాశమ్) భగవన్ ఏకస్యైవ నగరజనస్య నఖరమూలాకర్షణార్థం లోచనమధ్యనిషితం బడిశం భగ్నం ఏతేన కారణేన.

మంత్రి:- భద్ర ముక్త మనేన - అరే పౌర ! బడిశ మూల్యం దాతు మర్హసి

ఈ తీర్పులో మంత్రి మూర్ఖత సుస్పష్టం. విరిగిపోయిన బడిశెకు వెల గట్టాక గానీ అయిన గాయాన్ని కానీ, కారిన రక్తాన్ని కానీ గుర్తించలేదు. ఏపాటి అవకాశ మున్నా అది నాపితుని శిక్షించవలసిన సంఘటనమే గానీ పౌరుణ్ణి గాదు.

అలాగే గౌరీదిగంబర ప్రహసనంలో గౌరీశంకరుల వివాహ సందర్భంలో శివుడి ప్రవర్తనమంతా పారమార్థికంగా సత్యమైనా, లౌకికంగా మూర్ఖతలా కనిపిస్తుంది. అందుకే కడకు పరబ్రహ్మకు సైతం శివుడి మీద కోపం వస్తుంది. చిరాకు పుడుతుంది.

అసంభవోక్తి :

అసంభవ విషయ ప్రతిపాదనం ద్వారా సాధింపబడే హాస్యం ఒక రకం. ఆ హాస్యాన్ని విరియజేసే మాటలన్నీ అసంభవోక్తులే. అసంభావ్య మయినంత మాత్రాన అంతా హాస్యాస్పదం కావాలన్న నియమం లేదు. సముద్రానికి ఆవలి ఒడ్డు చూడటం సామాన్యగతిలో అసంభవం. అయితే అది హాస్యాస్పదం గాదు. కాబట్టి అసంభవతకు

సన్నిహితమైన సంభవదశ కూడా పరిచయమై వున్నపుడు అది నవ్విస్తుంది. పాలు కారంగా వుంటాయంటే నవ్వుతాం. అది అసంభవోక్తి కాబట్టి. కాని దానికి ముందు సంభవదశ పరిచయమై వుండాలి. ఎప్పుడూ పాలంటే ఎరుగని వ్యక్తిని ఆ మాట నవ్వించలేదు గదా!

దామకప్రహసనంలో దామకుడి మాటలు అసంభవోక్తులై నవ్విస్తాయి. సంభావతాసంభావ్యతలు రెండూ అక్కడ పరిచితాలే.

అహం ఖలు శృణోమి గంధం శ్రవణాభ్యామ్. అంధకార

పూరితాభ్యాం నాసాపుటాభ్యాం పశ్యామి - గంధాన్ని చెవులతో వినటం, ముక్కుతో చూడటం అసంభవ విషయం. సంభవతాస్థితి కూడా సర్వపరిచితమే. అందుకే ఆ మాటలు విని, మనం తప్పని సరిగా నవ్వవలసి వస్తోంది.

హాస్యచూడామణి ప్రహసనంలో కౌండిన్య, జ్ఞానరాశుల సంభాషణ బాగా అసంభవ విషయాలు ముచ్చటిస్తూ హాస్యభాజన మవుతుంది. కపటకేళి తన ఇంటిలో జరిగిన చోరీ గురించి ప్రశ్నించాలని వస్తుంది. అప్పుడు ఆ గురుశిష్యులు జ్యోతిష సంఖ్యా శాస్త్రాలను గుణించటం ఎలా వుంటుందో గమనించండి.

జ్ఞాన:- కౌండిన్య! కవర్గీయోఽయం వకారః

కౌ:- అహం పునః సవర్గీయం జానామి

జ్ఞా:- తదస్య కతి మాత్రాః ?

కౌ:- పంచ

జ్ఞా:- అనుస్వారస్య కతి భవన్తి ?

కౌ:- యావత్యః లిఖితుం పారయసి

జ్ఞా:- త్రయోదశ తావత్. అథ త్రయోదశభిః పంచభి శ్చ ద్వావింశతిః

కౌ:- నహి నహి వింశతి ర్భవతి.

వ్యతిరేకార్థోక్తి :

మనస్సులో ఒక ఉద్దేశ ముంచుకొని, దానికి విరుద్ధమైన అర్థం వచ్చేటట్లు మాటాడటం వ్యతిరేకార్థోక్తి. సూటిగా భావాన్ని వ్యక్తీకరించటం కన్న ఇది

చమత్కారంగా వుంటుంది. వ్యాజస్తుతి, వ్యాజనిందలు సైతం ఈ వ్యాపారం క్రిందనే పరిగణింపదగినవి. అయితే స్తుతినిందల కతీతంగా కేవలం వ్యతిరేకభావ ప్రతిపాదకంగా అయినా ఇది పని చేస్తుంది. ఎదుటి మనిషికి బాధ కలిగించనంత వరకు ఇది రమణీయహాస్య వ్యాపారమే.

హాస్యార్ణవప్రహసనంలో మృగాంకరేఖ విశ్వభాండుణ్ణి వృద్ధుడని పరిహసిస్తుంది. గురుదూషణతో కోపించిన కలహాంకురుడు గురువును సమర్థిస్తున్నట్లుగా మాట్లాడే మాటలు పరికించండి

ఆః పామరి! గణికే! పరపుత్రవిత్తహారిణి! అస్మాక ముపాధ్యాయం దృష్ట్వా న కురు కువ్యవసాయం. యస్య విధువనానురక్తా బ్రాహ్మణీ నక్తందివం విదగ్ధానాం స్థానే బంధనివహం శిక్షమాణా అద్యాపి భ్రమతి, అతి స్నేహేన ఉపాధ్యాయపురతః వైధవ్యమండనం కృత్వా నిత్య మనుమరణార్థం సుసజ్జితా భవతి, తం వృద్ధం జల్పసి? అపి చ అధ్యాపి ఉపాధ్యాయః లజ్జాకులః వసనం పరిహృత్య జనన్యంకే శయనం కరోతి ఏనం హతవ్రీడం జల్పసి?

కలహాంకురుడు గురువుగారి గొప్పతనాన్ని, అవృద్ధత్వాన్ని ప్రకటించేందు కీ మాటలన్నాడు. అయితే అంతా అయిన తర్వాత విశ్వభాండుడి స్థాయి పెరగకపోగా చాలా మెట్లు దిగిపోతుంది. అతని భావాలు, మాటలు పరస్పరం వ్యతిరిక్తాలు. వృద్ధత్వ కారణాలనే చెప్పి, వృద్ధత్వాభావాన్ని సాధించాలని ప్రయత్నించటం, తదనుగుణంగా మాటాడటం వ్యతిరేకార్థోక్తియే.

ధూర్తనర్తక ప్రహసనం నుండి మరో ఉదాహరణాన్ని చూద్దాం. ముఖరుడు తన గురువైన మూఢేశ్వరుడి విరహతాపాన్ని వసంతలతికకు తెలియజేస్తున్న సమయంలో ఇటువంటి ధ్వనులే పలుకుతాయి. గమనించండి -

మూఢే:- (సవిషాదం కామావస్థాం నాటయన్) సుందరి! కిం బ్రవీషి? వద తావత్

క్షణం వర్షాయతే బాలే! క్షపయామి కథమ్ క్షపామ్ |
నీహారకర దావాగ్నికలితాం తులయాని వా ||

ముఖర:- (ఆత్మగతం) అద్యాప్యేతస్య వృద్ధజటిలస్య ఇచ్ఛితాయాః ఇచ్ఛా న నివర్తతే (ప్రకాశం) వసంతలతికే! సత్య మస్మాకం గురుదేవ స్త్వామేవ చింతయన్ గలితాక్షో ద్విగుణితమాంస ఈదృశో జాతః

వియోగదశలో శరీరం బలహీనపడటం సహజం. తద్వర్ణనం అలంకార శాస్త్ర సమ్మతం కూడా. కానీ ముఖరుడు గురువుగారి విరహతాపాన్ని వర్ణిస్తూ రెట్టింపు బలిసి, ఇలా అయిపోయాడనటం వ్యతిరేకార్థాన్నిస్తుంది. భావం స్థితికి విరుద్ధంగా, వాక్చమత్కృతి స్థితినిరూపకంగా వుండటం ఇక్కడ హాస్యాస్పద విషయం -

విరుద్ధోక్తి :

పరస్పర విరుద్ధాలైన పదార్థాలను గానీ, వాక్యార్థాలను గానీ ప్రకటించే పదాలు గానీ, వాక్యాలు గానీ విరుద్ధోక్తు లవుతాయి. ఈ విరుద్ధత లోక వ్యవహారానికి సంబంధించినది. లోకప్రసిద్ధభావాన్ని తద్విరుద్ధ ధోరణిలో ప్రతిపాదించటం హాస్యానికి ఆలంబన మవుతుంది.

ధూర్తనర్తకప్రహసనంలో రాజపురుషుడు... "లోహకఠినైః అస్మాకం పాదపద్మైః క్షోదీభూతో భవిష్యసి" అనటం; మత్తవిలాసప్రహసనంలో కపాలి "కుతీర్థ సంకీర్తనోపహతాం జిహ్వాం సురయా ప్రక్షాళయితు మిచ్ఛామి" అనటం ఇటువంటి విరుద్ధోక్తులే. లోహకఠినా లయితే పాదపద్మాలు కావు గదా! పాదపాషాణాలయితే కావచ్చు. అలాగే అపరిశుభ్ర మైన జిహ్వను నీళ్ళతో పరిశుభ్రపరచుకోవడం లోకసిద్ధం కానీ, సారాయితో శుభ్ర పరచగూడదు గదా! ఈ వైరుధ్యమే మనలోని హాస్యశీలతను తట్టి లేపుతుంది.

సమయోక్తి :

ఊహించని ప్రశ్న ఎదురైనపుడు ఊహ కందని సమాధానం చెప్పగలగటం సమయోక్తి. ఇది చాలా తెలివితో కూడుకున్న వ్యవహారం. సంఘటనకు అతికేటట్లు సూటిగా, మనం ఊహించని విధంగా ఒక చమత్కారం దానిలో కనిపిస్తుంది. అది అసత్యమో, అసందర్భమో అయినా వక్త మీద కోపాన్ని కల్గించకుండా సన్నివేశాన్ని నవ్వులతో నింపేస్తుంది.

'భగవదజ్జుకమ్' లోని ఇటువంటి సమయోక్తిని ఆస్వాదిద్దాం. శాండిల్యుడు గురువుగారితో కలిసి తోటకు వెళ్తాడు. అక్కడ అశోకవృక్షాల మధ్యలో పులి వుంటుందనే ఐతిహ్యాన్ని బట్టి, భయపడి, గురువుగారిని ముందు నడవమంటాడు.

పరివ్రాజకుడు ముందు ముందుకు వెళ్ళి చూస్తే అదొక నెమలి అని తేలిపోతుంది. అప్పటి దాక భయంతో కళ్ళు మూసుకొని వస్తున్న శాండిల్యుడు ఆ మాట వినగానే కళ్ళు తెరచి —

ఆః! దాస్యాః పుత్రో వ్యాఘ్రః మద్భయేన మయూరరూపం గృహీత్వా పలాయతే

అంటాడు. ఇది అతడి ప్రతిభావిశేషానికి నికషాయమానమైన సమయోక్తి. లీలావిలాసప్రహసనంలో ఇటువంటిదే చక్కని సమయోక్తి కనిపిస్తుంది. లీల పెండ్లి విషయంలో తల్లిదండ్రులు విభేదించి, ఎవరి ఏర్పాట్లు వాళ్ళు చేస్తారు. ఇద్దరు పెళ్ళికొడుకులూ వస్తారు. రెండుచోట్లా కార్యక్రమం జరుగుతూనే వుంటుంది.

అయితే చంద్రిక చొరవ వల్ల ఉపకరణద్రవ్యాలన్నీ చంద్రిక వైపే వెళ్తూ ఉంటాయి. గౌతముడు నిర్ణయించిన వరుడు వేదాంతభట్టు అదంతా చూచి

దీపో గతో జలం యాతం గంధద్రవ్యం శనై ర్గతమ్
తాంబూలస్య చ లోపోఽభూ త్కిమస్మానపి నేష్యతి ?

అని ముచ్చట పడతాడు. ఇదంతా గమనిస్తున్న పురోహితుడు “అస్మాకం వరస్య శనిపీడాపరిహారార్థం తత్సర్వం దానత్వేన మన్యామహే” అంటాడు. “గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం” అని ఒక తెలుగు సామెత. ఈ పురోహితుడు కూడా ఆ పద్ధతే అవలంబించాడు. ఇది సమయానికి చాలా చక్కగా అతికింది.

దరిద్రదుర్దైవప్రహసనంలో వక్రేశ్వరశర్మ క్షుద్రారాముణ్ణి భిక్ష పెట్టమని అడిగి నప్పుడు “పథి భిక్షాదానం మే పిత్రా పితామహేన చ నిషిద్ధం - జయరాధే! గృహం గతేభో యాచకేభ్యో దీయతే యథాశక్తి ధనాదికం” అనటం తప్పించు కొనేందుకు అనువుగా కల్పించుకున్న సమయోక్తి - చమత్కారరంజితమైన హాస్య వ్యాపారం.

అజ్ఞోక్తి :

కొన్నిమార్లు తెలివితక్కువ మాటలూ, ప్రకటనలూ విశేషంగా నవ్విస్తూ ఉంటాయి - తెలివితక్కువతనంలో సహజంగానే కొంత వికృతి కనిపిస్తుంది. అది నవ్విస్తుంది. ఈ తెలివితక్కువతనం స్వతస్సిద్ధమైనా కావచ్చు, కృత్రిమ మయినా కావచ్చు.

లీలావిలాసప్రహసనంలో వేదాంతభట్టు మాటల్లో ఇటువంటి తెలివితక్కువ తనమే విశేషంగా భాసిస్తుంది. లీలా, వేదాంతభట్టుల వివాహప్రసక్తిలో "అస్తి జన్మ పత్రికయోః ప్రశస్తా ఘటనా" అని పురోహితు డనగానే సంబంధం ఇష్టంలేని వధూ మాత మండిపడి, "యద్యేవం జన్మపత్రికయో రన్యోన్యం నిర్వర్త్యతాం సంబంధః, లీలాయాః వేదాంతస్య చ నాస్త్యేవ ఘటనా" అని అపహసిస్తుంది. ఆపాటి అపహాస్యం కూడా అర్థం కాని వేదాంతభట్టు "అహహ! పరమార్థోయం వేదాంత సమ్మతః" అని చంద్రికను అభినందిస్తాడు - ఇది అతని అజ్ఞతకు అద్దం పట్టే మాట.

హాస్యచూడామణి ప్రహసనంలో జ్ఞానరాశి శిష్యుడు కౌండిన్యుడు ఇటువంటి అజ్ఞతను నటిస్తూ గురువుగారితో చేసే సంభాషణ హాస్యభాజనంగానే ఉంటుంది.

జ్ఞాన :- అయి! కంఠగతౌ శ్లోకౌ తవేమౌ సంవృత్తౌ?

శిష్య :- జ్ఞానరాశే ! ఉదరగతా విమౌ సంవృత్తౌ

జ్ఞాన :- (సక్రోధం) మూర్ఖ! నామగ్రహణేన మాం వ్యాహరసి

శిష్య :- కిం తవ నామగ్రహణేన పాపం భవతి ?

జ్ఞాన :- ధిఙ్మూర్ఖ! న గృహ్యతే గురూణాం నామ

శిష్య :- తత్కథం శైలానాం నామ గృహ్యతే!

యథార్థానికి కౌండిన్యుడు గురువుకంటె రెండాకులు ఎక్కువ చదివినవాడే. అయితే అధ్యయనానాసక్తి అతడి చేత అటువంటి చమత్కార సంభాషణ చేయించింది. సహజమయినా, కృత్రిమమయినా అజ్ఞతాపరిధిలో దాని ఫలిత మొక్కటే కదా !

నర్మోక్తి :

నర్మగర్భిత మయిన మాట నర్మోక్తి - ఈ ఉక్తిలో అంతర్నిగూఢంగా ఏదో సత్యం, స్పష్ట మయిన అవగాహన వుంటాయి. ఇది సెటైర్‌కు సన్నిహితమై ఇతరులను వ్యంగ్యంగా విమర్శించేందుకు బాగా సహకరిస్తుంది.

'లటక మేళకం' నుండి ఒక ఉదాహరణాన్ని స్వీకరించుదాం. సభాసలి ఒక పండితుడు. జంతుకేతువు ఒక వైద్యుడు. కులవ్యాధి సభాసలి శిష్యుడు. వాళ్ళ సంభాషణను గమనించండి.

సభా:- అద్య ఇహ హట్టే రోదనకలకలః సంవృత్తః. తత్త్రత్ర కిం భవ దుపచార స్సంజాతః

జంతు:- నహి నహి. భవద్భి రేవ యది తత్ర స్వస్త్యయనం కృతం స్యాత్ -

సభా:- నహి నహి

కుల:- ఆర్యౌ! యది యువాం తత్ర న గతౌ తత్కిం వజ్రేణ మారితో వణిక్తనయః

పై సంభాషణలో సభాసలి, జంతుకేతువులు ఒకరిపై ఒకరు విసుర్లు విసురుకున్నారు. కానీ వీళ్ళిద్దరి విషయం తెలిసినవాడు కాబట్టి కులవ్యాధి తగినట్లు బుద్ధి చెప్పాడు. ఇది చక్కని నర్మోక్తి.

మత్త విలాస ప్రహసనంనుండి మరో ఉదాహరణం చూద్దాం. కపాలి తన సురాపాన కపాలాన్ని పోగొట్టుకుంటాడు. తన సతి దేవసోమతో కలిసి తదన్వేషణ ప్రారంభిస్తాడు - ఆ సమయంలో వారి తర్కాన్ని గమనించండి -

దేవ:- భగవన్! కేన ఖలు గృహీతం కపాలమ్ ?

కపాలి:- ప్రియే! తర్కయామి శూల్యమాంన గర్భత్వా చ్ఛునా వా శాక్యభిక్షుణా వేతి?

కపాలం అడుగున మాంసం ముక్క మిగిలి ఉన్నందున కుక్క గానీ, బౌద్ధభిక్షువు గానీ తీసుకొనిపోయి ఉంటారని కపాలి అనటం నర్మగర్భిత మయిన మాట. బౌద్ధమతానుయాయుల ప్రవర్తన మీద తన కప్పటికే ఏర్పడి ఉన్న స్పష్ట మయిన అవగాహనను అది ప్రకటిస్తుంది. అంతే గాదు - బౌద్ధభిక్షువే దాన్ని తీని అంగరఖాలో దాచుకొని ఉన్నాడన్న అభిప్రాయంతో కపాలి బౌద్ధంపై మరోవిసురు విసురుతాడు. "నూన మేవమాది ప్రచ్ఛాదన నిమిత్తం బహుచీవరధారణం గౌతమేనోపదిష్టమ్" అని కసి తీర్చుకుంటాడు. ఇటువంటి మాటలు నవ్విస్తూ బాధిస్తాయి.

ఛలోక్తి (సరసోక్తి)

నిజానికి నర్మోక్తి, ఛలోక్తి ఒకటే అనిపిస్తాయి - కాని కొద్ది భేదం కనిపిస్తుంది. నర్మోక్తి కన్న ఛలోక్తి సున్నితంగా ఉంటుంది. నర్మోక్తిలో కనిపించే అధిక్షేపణ

ఛలోక్తిలో కనిపించి తీరాలన్న నిబంధన లేదు. చమత్కార సృష్టికి అవకాశం లభించినపుడు, దాని సంగీకరించి వాక్చమత్కృతిని సృష్టించడం ఛలోక్తి. ప్రత్యేకించి ఎవరినీ ఎత్తి పొడవడం వంటివి దీనిలో ఉండనవసరం లేదు.

హాస్యార్ణవ ప్రహసనంలో మహాయాంత్రికుడు యుద్ధానికి ముహూర్తం పెడతాడు. ఆ సందర్భాన్ని చూద్దాం

మహా:- పూర్ణిమాయుక్త శనైశ్చరవాసరే శ్రవణానక్షత్రే వృశ్చిక లగ్నే ప్రాత స్సమయే దేవస్య మహాయాత్రా భవిష్యతి

కల:- తదత్ర మరణం జాయతే -

మహా:- ప్రజానా మాపదం నీత్వా యాతు నామ

స్వర్గీయ హసన ప్రహసనంలో జనసంఖ్యను తగ్గించే ఉపాయాన్ని మంత్రివర్గ సభ్యులందరూ ఆలోచిస్తూ ఉంటారు. ఆ సందర్భంలో అక్బర్ "నాకొక ఉపాయం తట్టింది" అంటాడు. అందరూ ఆదుర్దాతో వినాలని చూస్తూ ఉంటే "ఆ ఉపాయం దొరికే ఉపాయమే కనిపించడంలేదు" అని మెల్లగా చేస్తాడు. - ఇది రమణీయ మయిన ఛలోక్తి. మృదుమధుర హాస్యం దానివల్ల జనిస్తుంది.

భావాశ్రిత హాస్యాలు

అపహాస్యం

అపహసితమూలక మైన భావం అపహాస్యం. వెక్కిరించటంలో, అవహేళన చేయటంలో ఈ హాస్యం సాక్షాత్కరిస్తుంది. ఇది కేవలం వాక్యార్థాన్ని ఆశ్రయించిన హాస్యం. దీనిలో ఈర్ష్యాద్వేషాలకు తావు లేదు. విషయగతమైన లోపాన్ని ఆధారం చేసుకొని, సున్నితంగా చమత్కరించటం మాత్రమే దీని లక్ష్యం. దీనిని వ్యక్తితో అయినా వ్యవస్థతో అయినా ముడిపెట్టవచ్చు. ఈ హాస్య సృష్టికి నిర్మలమైన మేధాశక్తి అవసరం.

ధూర్త నర్తక ప్రహసనంలో మూఢేశ్వరుడు వసంతలతికను కామిస్తాడు. శిష్యసమేతుడై ఆమె నాట్యాన్ని చూడాలని వెళతాడు. అక్కడ ఆ శిష్యుడు వసంత లతికను చూచి - భో ఉపాధ్యాయ ఇచ్ఛితా నను మానుష్యేవ భవతి. అహం పున ర్జానామి రాక్షస కుటుంబినీతి - అని అపహసిస్తాడు. యథార్థానికి వసంతలతికను చూడకముందు రాక్షసిగా భావించటం నిష్కారణం. అయితే గురువుగారి అభిరుచుల మీద శిష్యుడికున్న విశ్వాసం అతనిచేత ఆ మాట అనిపిస్తోంది.

హాస్యార్ణవ ప్రహసనం నుండి మరొక ఉదాహరణాన్ని చూద్దాం. మదనాంధ మిశ్రుడు బంధుర ఇంటికి వస్తాడు. అయితే అంతకు ముందే ధూర్తోపాధ్యాయుడైన విశ్వభాండుడు అక్కడే ఉంటాడు. అతణ్ణి పాండిత్యంతో జయించటం కష్టమని తెలిసిన మదనాంధమిశ్రుడు నేర్పుగా అపహాస్యం చేస్తాడు.

మద : (ఆవర్ణ్య) (ఆత్మగతమ్) ధూర్తోఽయ ముపాధ్యాయః వంచయితు మశక్యః. జీర్ణ మార్జారం కాంచికయా ప్రతారయితుం న శక్యతే. భవతు. వినయేన వంచయామి (ప్రకాశమ్) భగవన్ అయ మభివాదయే

విశ్వ : (ఉచ్చైః) ఆయుష్మాన్ భవ సౌమ్య! కించ అయుక్త మేతత్ భవాదృశానాం యద్వారాంగనానా మగ్రతో మమ ప్రథమ మభివాదనమ్.

మద : అహో ! వేశ్యాభ్రమేణ భవత్సు ప్రణామః కృతః

విశ్వభాండుడు అది భ్రమే అనుకొని మదనాంధమిశ్రుణ్ణి చూచి నవ్వుతాడు. కాని మదనాంధమిశ్రుడు ఐచ్ఛికంగానే అపహసించాడు గదా! "అయ్యో! మీరా! మిమ్మల్ని వేశ్య అనుకున్నానే" అనటం అతడి విలువను తగ్గించటం. అయితే నిందించటం మదనాంధమిశ్రుడి లక్ష్యం గాదు. కాబట్టి అపహాస్య మవుతుంది.

ఆత్మోత్కర్ష

“తగిన వేషంబు, తను తానె పొగడ కునికి” వగైరా గుణాలు ఉత్తమ లక్షణాలని పెద్దల మాట. ఆలంకారికులు కూడ ధీరోదాత్తుడు తనను తాను పొగడుకోకూడదని నిషేధించారు. పరనింద దోష మయితే ఆత్మస్తుతి హాస్యాస్పద మవుతుంది. అయితే సంఘంలో ఆత్మస్తుతి పరాయణులకు లోటు లేదు. గుణం ఉండీ గుర్తింపు లేని వారు, గుణం లేకపోయినా గుర్తింపు కోరే వారు ఇద్దరూ ఆత్మస్తుతిని ఆశ్రయించక తప్పదు. వీరిలో మొదటి తెగవారి మాటలు అన్నివేళలా హాస్యభాజకాలు కాక పోయినా శ్రుతి మించినపుడు నవ్వులపాలు కాక తప్పదు. రెండవ తరగతి వారివి ఎప్పుడూ హాస్య హేతువులే.

సంస్కృత ప్రహసనాల్లో ఇటువంటి ఆత్మోత్కర్షలు అనంతాలు. ధూర్తనర్తక ప్రహసనంలో బ్రహ్మానంద స్వామి ‘నేను లోకోత్తర సుందరుడ’నని అదేపనిగా భావిస్తూంటాడు. ఆ విషయంలో అతడి వాచావైదగ్ధ్యం ఎలా ఉంటుందో గమనించండి -

మత్తోఽపి కః సౌందర్య మనుధత్తే. యతః -
మాం దృష్ట్వాఽమరనర పన్నగాంగనానాం
ప్రీతీనా మవికల మేకపాత్ర మాస |
కందర్పో నిశిత తరై శ్శరై ర్జితశ్రీః
మద్గాత్రైః ప్రహరతి భీతగాత్ర ఏషః ||

తానొక్కడే ముల్లోకాలలోని కాంతల అనురాగానికి అర్హుడని బ్రహ్మానంద స్వామి భావించటం గొప్ప ఛలోక్తి అవుతుంది, విశేషించి సౌందర్య విషయంలో. సౌందర్య విషయంలో ఇతరుల అభిప్రాయానికే విలువ గదా! దురదృష్టం కొద్దీ చాలామంది సౌందర్య విషయంలోనే ఆత్మోత్కర్ష భావనకు గురి అవుతుంటారు.

ధరిత్రీపతి నిర్వచన ప్రహసనంలో యుయుధానుడికి తన ఆరోగ్య విషయంలో గొప్ప గర్వం. అనారోగ్య మన్నది ‘నా దేహంలోనే లేద’ని అతడు ప్రకటించటం ఆత్మోత్కర్షయే. ఇక లటకమేలకంలో మిథ్యాశుక్లుడు తన గొప్పతనాన్ని ఏ రీతిగా ప్రకటించుకుంటాడో చూడండి -

సంసిక్తే కుశమార్జితే మఖపతౌ బ్రహ్మణ్యుపాంతస్థితే
యజ్ఞాగార గతాః కథం కథ మపి స్పృష్టాః కిమింద్రాదయః |
కోణస్థోఽపి పురస్కృతోఽపి యజుషా గౌరీభుజంగో మయా
హవ్యాశావికలః కపాలకధియా నిష్కాసితో ధూర్జటిః ||

బ్రహ్మాదుల సన్నిధానంలో యాగ నిర్వహణను చేస్తూ, శివుణ్ణి సైతం కాపాలక భావంతో బహిష్కరింపగల వ్యక్తినిగా తనను ప్రకటించుకోవటం ఆత్మోత్కర్షకు పరాకాష్ఠ.

ఇక్క డొక సత్యాన్ని గుర్తించుకోవాలి. ఆత్మోత్కర్షను భావించటం, ప్రకటించటం అన్నవి భిన్నాంశాలు. ప్రకటించిన అందరిలోను ఉత్కర్షభావన ఉండక పోవచ్చు. తన తక్కువదనాన్ని గుర్తించి కూడా ఆత్మన్యూనతా భావంతో (Inferiority complex) ఉత్కర్షగాప్రకటించేవారు కొందరు. అటువంటి వ్యక్తుల వలన ఎక్కువగా నవ్వుకొనే అవకాశం లేదు. కాబట్టి మనస్సులో ఆధిక్యభావన ఉన్నా, లేకపోయినా ప్రకటనలో ఆ భావం కనిపిస్తే అది ఆత్మోత్కర్షరూపంలో హాస్యాలంబన మవుతుంది.

ఎత్తి పొడుపు

ఎదుటివ్యక్తిని అవకాశం చూచుకొని అవక్షేపించుట దీని లక్ష్యం. ఇది ముక్కుకు సూటిగా ఉంటుంది. ఎదుటివ్యక్తిలో కోపాన్ని సైతం కలిగించే అవకాశం ఎత్తి పొడుపులో ఉంటుంది. అందుకే satire, Irony ల కన్న ఇది వాడి. అయితే తటస్థులైన శ్రోతలలో మాత్రం ఎత్తి పొడుపు హాస్యాన్ని కల్గిస్తుంది.

మత్త విలాస ప్రహసనంలో ఇటువంటి అవక్షేపణలు చాలా కన్పిస్తాయి. శాక్యభిక్షువును ముందుంచుకొని కపాలి అనే మాటలన్నీ బౌద్ధమత సంప్రదాయాలను ఎత్తి పొడిచేవే. శాక్యభిక్షువు 'నమో బుద్ధాయ' అని గౌతమ స్మరణ చేసినపుడు, కపాలి-

నమః ఖరపటాయ ఇతి వక్తవ్యం యేన చోరశాస్త్రం ప్రణీతమ్. అథవా ఖరపటాదపి అస్మిన్నధికారే బుద్ధ ఏవాధికః. కుతః -

వేదాంతేభ్యో గృహీత్వార్థాన్ యో మహాభారతాదపి |
విప్రాణాం మిషతా మేవ కృతవాన్ కోశసంచయమ్ ||

అని బౌద్ధమతం మీద తనకున్న తిరస్కార భావాన్ని సూటిగా ప్రకటిస్తాడు. గౌతముణ్ణి గొప్పదొంగగా చిత్రిస్తాడు.

కపాల విషయంలో కపాలికి, బౌద్ధభిక్షువుకు ఆధిపత్య నిర్ణయం కుదరక పాశుపతుడి అభిప్రాయం ప్రకారం కోర్టుకు వెళ్ళవలసి వస్తుంది. శాక్యభిక్షువు అంగీకరిస్తాడు. అప్పుడు కపాలిభార్య దేవసోమ భిక్షువును ఎలా అవక్షేపిస్తుందో పరిశీలించండి -

ఏష పున రనేక విహారభోగ సమధిగత విత్త సంచయః యథాకామ మధికరణ కారుణికానాం ముఖాని పూరయితుం పారయతి. అస్మాకం పున రహిచర్మభూతి మాత్ర విభవస్య దరిద్రకాపాలికస్య పరిచారికాణాం కోఁత్ర విభవోఽధికరణం ప్రవేష్టుమ్ -

ఇది కేవలం బౌద్ధ భిక్షువునే గాక ఆ నాటి న్యాయ వ్యవస్థను కూడ ఎత్తి పొడవటమే. అంతే కాదు. దేవసోమలో స్త్రీసహజమైన సాహసం సైతం స్పష్ట మవుతుంది.

ఈ ఎత్తి పొడుపులు విశేషంగా 'ఉభయరూపకం'లో కనిపిస్తాయి. అత్తాకోడళ్ళు పరస్పరం సూటిపోటి మాటలు అనుకోవటం ఈ ప్రహసనంలో అధికం. అవి మనసారా నవ్వుకొనే అవకాశాన్ని పాఠకులకు అందిస్తాయి.

ఆత్మాపకర్ష

ఆత్మోత్కర్ష ఎలా హాస్యాస్పద మవుతుందో అలాగే ఆత్మాపకర్ష కూడా హాస్యాస్పదమే. తనను తాను ఎక్కువగా అంచనా వేసుకొనేవాడూ, తక్కువగా అంచనా వేసుకునేవాడూ ఇద్దరూ సమానమే. అందుకే జీవితంలో తులన అవసరం. ఆత్మోత్కర్ష పరాయణు లంతమంది కాకపోయినా గుణింపదగిన స్థాయిలోనే అపకర్ష పరాయణులూ ఉంటారు. దీనిని కొందరు వినయలక్షణంగా భావించవచ్చును. కానీ వినయం వేరు. ఆత్మాపకర్ష వేరు. వినయంలో వివేకం కనబడితే, అపకర్షలో అశక్తత, ఉక్రోషం కూడ పనిచేస్తాయి. అందుకే అది హాస్యాలంబనం.

స్వర్గీయ హసన ప్రహసనంలో దేవరాజైన ఇంద్రుడి మాటల్లో అశక్తత వలన ఏర్పడిన ఆత్మాపకర్ష ప్రత్యక్ష మవుతుంది. సభాప్రవేశసమయంలో ఇంద్రుణ్ణి వైతాళికుడు స్తోత్రం చేస్తాడు. దాన్ని విని ఇంద్రుడు ఇలా అంటాడు -

"మూర్ఖ వైతాళిక! కురు రుద్ధం తే గానమ్. మృషేయం జయ ఘోషణా. జానంతి సర్వే సర్వతోరుద్ధప్రసరోఽయం దేవరాజః, నిర్ధార్యతే సర్వం మంత్రి పరిషదా, తత్ర స్వనామ లేఖనమేవ తస్య కర్మేతి. తత్కథం జయఘోషణా? ఘోషయ జయవార్తాం తావత్ గణదేవస్య గణేశానాం వా సర్వశక్తి మతాం నేతృవర్యాణామ్ యే తావ దమాత్య పద మధితిష్ఠన్తి. కోఽయ మింద్రః? పునర్న్న వ్యక్తవ్య మింద్రః కామచారీ ఇతి. శ్రవణ పదవీం చేదాయాస్యత్యయం శబ్దః వామమార్గావలంబినా ఉత్థాపయిష్యతే త్వరిత మనాస్తా ప్రస్తావః -

ఇంద్రుడు దేవరాజై వుండి కూడ వైతాళికుడి జయఘోషణను నిందించటం, నిరోధించటం అతడి అశక్తతకు నిదర్శనం. తాను కేవలం రబ్బర్‌స్టాంప్ అని ప్రతిపక్షా లనే మాటలను పురస్కరించుకొని, వాటిని విశ్వసించి, తన అశక్తతను చాటుతూ, వైతాళికుడిపై విరచుకొని పడటం ఇంద్రుడిలోని ఆత్మాపకర్ష స్థితికి పతాకాస్థానం.

దరిద్రదుర్దైవ ప్రహసనంలో తనను తాను పదే పదే నిందించుకునే వక్రేశ్వర శర్మ మనస్థితి కూడా ఈ ఆత్మాపకర్ష కారణంగానే నవ్వులపాలవుతుంది. ఉభయ రూపకమ్ ప్రహసనంలో కోడలు శంపమీద కోపంతో అత్త పిప్పలి తనను తాను నిందించుకోవటం సైతం ఆత్మాపకర్షయే. ఆమె మాటను గమనించండి

కుతో మే విభవః త్వా మపాకర్తుమ్? తేన హ్యస్మి స్వయ మపక్రాంతా

అహోపురుషికం :

బాగా ఆశ్చరాన్ని కల్గించేటట్లు అతిశయితంగా విషయాన్ని ప్రతిపాదించటం అహోపురుషికం. ఒక కథను గానీ, చేష్టను గానీ, భావాన్ని గానీ ఈ రీతిగా అతిశయింపజేయవచ్చు. అయితే కథా భావాల అతిశయంలో కనిపించే హాస్యం చేష్టను అతిశయింపజేయటంలో కనిపించదు. అది అప్పుడప్పుడు విసువును సైతం కల్గించే అవకాశ ముంది. సంస్కృత ప్రహసన సాహిత్యంలో చేష్టాతిశయానికే ఎక్కువ ప్రాధాన్యం. భావకథలు క్రమంగా అ తర్వాత స్థానాన్ని పొందుతాయి,

కౌండిన్యప్రహసనంలో తిండిపోతుదనాన్ని బాగా అతిశయించి వర్ణించడం, వివరించటం కనిపిస్తుంది. అది కూడ స్వగృహభోజనాసక్తి కాదు. పరగృహభోజన

ప్రియత్వం, అది స్వర్గసుఖంతో సమాన మన్న భావం. ఆ వంశంలో పుట్టి అదే గుణాన్ని పుణికి పుచ్చుకొన్నవాడు కౌండిన్యుడు. ఆ భావాన్ని అత్యంత రమణీయంగా వర్ణించటం కౌండిన్య ప్రహసనంలో విశేష హాస్యాలంబనం.

గౌరీదిగంబర ప్రహసనంలో శివుడి దిగంబరతత్త్వాన్ని అతిశయంగా వర్ణించటం సాక్షాత్కరిస్తుంది. శాస్త్రపురాణాదులు ఘోషించే దిగంబరతత్త్వాన్ని యథాతథంగా స్వీకరిస్తే ఎటువంటి పరిస్థితి ఏర్పడుతుందో చాలా చక్కగా నిరూపిస్తాడు శంకరమిశ్రు డీ ప్రహసనంలో. అలాగే లీలావిలాస ప్రహసనంలో గయ్యాళితనాన్ని ఆశ్చర్యకరధోరణిలో వివరించటం కనిపిస్తుంది.

సహజంగా లోకంలో గయ్యాళిభార్య తనకు ఇష్టంలేని పనులు చేస్తున్న భర్తను సాధించి, రాచి రంపాన పెడుతుంది. అయితే లీలావిలాసప్రహసనంలో చంద్రిక ప్రతిస్పర్ధిని అయి కూర్చుంటుంది. కుమార్తె పెండ్లి జరుగుతుంటే, ఆ వరుడు తనకు నచ్చనందువలన అదే పందిట్లో ఆ వధువుకే మరో వరుడితో పెండ్లి జరిపించే స్థాయికి చంద్రిక గయ్యాళితనం పెరుగుతుంది. అదే రీతిగా 'నిర్గృహఘట్టం'లో సైతం అభిరాజేంద్రమిశ్ర గయ్యాళితనాన్ని అతిశయించి వర్ణిస్తాడు. ఇవన్నీ హాస్య భాజనాలే

అధిక్షేపం:

ఆక్షేపించటం అన్న పదం, ఆ స్థితి తెలుగువారికి బాగా పరిచితాలే. కొంచె మించు మించు అధిక్షేపపదం కూడ అదే అర్థంలో వాడబడుతుంది. ఇది వ్యంగ్యాభిభాషణమే. అయితే దాని కన్న కొంత సున్నితంగా ఉంటుంది. సంఘంలోని అధిక్షేప రచనలు చాలా భాగం మానవేతర పాత్రలకు సంబంధించినవే. మానవ విషయంలో అయినా, వ్యక్తిగత విషయాలను అధిక్షేపించటం కన్న వ్యవస్థా సిద్ధాంతాదులకు సంబంధించిన విషయాలను ఆక్షేపించటమే ప్రయోజనకారిగా ఉంటుంది. సంఘంలో మార్పు అవసర మయినప్పుడు కళాకారులు ఆశ్రయించే హాస్యతత్త్వ మిదే. సంస్కృత ప్రహసనాలలోని కొన్ని అధిక్షేప వాక్యాలను పరిశీలించుదాం.

అకించనకాంచనప్రహసనంలో అభిరాజేంద్రమిశ్ర ఇటువంటి బాణాన్ని ఒకదానిని వదలుతాడు. ప్రస్తావనలో సూత్రధారుడు నూతనరూపకాలు ఏవీ గుర్తు రావడం లేదని అభినయించినపుడు నటి "స్మృతిశూన్యత్వ మేవ కలౌ విద్వజ్జన లక్షణమ్మ"ని అతడిని సమర్థిస్తుంది. ఇది చాలా చక్కని హాస్యవ్యాపారం. అందరూ నవ్వుతారు. అయితే నిజంగా విద్వాంసు డంటే మతిమరపు మనిషి అని నిర్ణయించ గలమా? పోనీ ప్రపంచంలోని చాలామంది మేధావులలో కనిపించే మతిమరుపును కాదనగలమా? అందుకే ఆ లోపాన్ని గుణాత్మకంగా వర్ణించటం వలన అటువంటి మతిమరపు మనుషులు కూడా ఆక్షేపాన్ని విస్మరించి హాయిగా నవ్వుతారు.

స్వర్గీయహసనప్రహసనంలో ఇటువంటిదే మరో చక్కని నిర్వచనం. దేవరాజైన ఇంద్రుడు స్వగతంగా బృహస్పతియే సర్వానర్థాలకు మూల కారణ మని అనుకుంటాడు. అదే సమయంలో బృహస్పతి ప్రవేశిస్తాడు. ఇంద్రుడు కంగారుపడి "నా మాటలన్నీ విన్నావా?" అని ప్రశ్నించగానే బృహస్పతి తాపీగా

"వజ్రిన్! నాహం బధిరః (సహాసమ్) పరం కిమాయాతి యాతి వా శ్రుతే నాశ్రుతేన చ. రాజనీతిశాస్త్రే ప్రత్యక్షే దుర్భాషణ మేవ దోషాయ. న తు పరోక్షే. నాహ మాసం భవతాం పురతః" అంటాడు. ఈ మాటలు విన్న తరువాత మనతో బాటు ఇంద్రుడు కూడ నవ్వక తప్పదు. అయితే బృహస్పతి మాటలు యథాతథంగా అంగీకరింపదగినవా? రాజనీతి అయినా, మరోనీతి అయినా ప్రత్యక్ష నింద ఎంత దోషమో, పరోక్షనింద సైతం అంతే గదా! మరి ఈ వైపరీత్యమేమిటి? ఇంద్రుణ్ణి ఒక్కసారిగా హడలు ఎత్తించకుండా మెల్లగా ఆ పని మానేటట్లు చేయటానికి బృహస్పతి చేసిన ప్రయత్నమే ఆ అధిక్షేపణం.

వ్యంగ్యం :

మాటల్లో వాచ్యార్థం కన్న తద్వ్యతిరిక్తమైన అర్థానికి ప్రాధాన్య మిచ్చే వాగ్వ్యవహారం వ్యంగ్య మనబడుతుంది. ఇది కూడ సెటైర్ వంటిదే కాని, సూక్ష్మ భేదం ఈ రెండింటి మధ్య కనిపిస్తుంది. లోపాన్ని సమర్థిస్తూ మాట్లాడటం వ్యంగ్య మయితే, అసలా లోపాన్ని గుణాత్మకంగా చిత్రించడం సెటైర్ అవుతుంది. వ్యంగ్యం దోషాన్ని గౌరవిస్తే సెటైర్ దాన్ని గుణీకరిస్తుంది.

మత్తవిలాసప్రహసనంలో శాక్యభిక్షువు కపాలాన్ని దాచిపెట్టినట్టు కపాలి అనుమానించినపుడు, శాక్యభిక్షువును నిందించటంలో ఈ వ్యంగ్యం కనిపిస్తుంది. శాక్యభిక్షువు తన దగ్గరున్న కపాలం కపాలిది కాదని గట్టిగ ప్రతిఘటిస్తాడు. అప్పుడు కపాలి

కథం కపాల మిత్యాహ అథవా యుక్త మేవైతత్ -
దృష్టాని వస్తూని మహీసముద్రమహీధరాదీని మహాంతి మోహాత్
అపహ్నువానస్య సుతః కథం త్వ మల్పం న నిహ్నోతు మలం కపాలమ్ -

అని అంటాడు. దీనిలో బౌద్ధంలోని శూన్యవాదాన్ని గౌరవించినట్లు కనిపిస్తుంది. మహాపర్వతాలను సైతం శూన్యమని పరిగణించిన బుద్ధుని శిష్యుడ వైన నీకు సామాన్య మైన ఈ కపాలాన్ని దాచటం కష్టమేమీ కాదని శాక్యభిక్షుడి ప్రవర్తనను సమర్థిస్తున్నట్లే కనిపించినా, ఆంతర్యం మాత్రం తీవ్రమైన అధిక్షేపణమే.

హాస్యార్ణవప్రహసనంలో మదనాంధమిశ్రుడు లోకంలో దోషంగా పరిగణింప బడే వేశ్యారతాన్ని ఎలా సమర్థించి మాటాడుతాడో గమనించండి -

ఆశ్లేషపీడితకుచం శ్రమఘర్మితాస్యం
దష్టాధరం లలితసీత్కృత వారి తోష్ఠమ్ |
చాటూక్తి చారులలితభ్రు చలత్కటాక్షం
వేశ్యారతం జనిశతార్జిత పుణ్యలభ్యమ్ ||

ఆభాస హాస్యాలు

రసభావాలూ, వాటికి సంబంధించిన చేష్టలూ ప్రసిద్ధమైన పద్ధతిని వదలి అస్థానపతితాలయినా, అనౌచిత్యభరితాలయినా నవ్వు వస్తుంది. హాస్యానికి జీవం అయిన వక్రత యిక్కడ భావాన్ని లేదా భావాశ్రిత చేష్టను ఆశ్రయిస్తుంది. అది కాని దానిని అది అయినట్లుగానూ, తథాత్మతకు అర్హత లేనిదానిని అర్హత కలదానిని గానూ వర్ణించటం దీనిలో ప్రధానాంశం. సామాజికుడుకానీ, శ్రోతకానీ దీనిలోని యథార్థతను గుర్తించడానికి కొంత శ్రమ పడవలసి వుంటుంది. కొంత భావన అవసర మవుతుంది. కాబట్టి దీనిని imaginative humour అంటారని మునిమాణిక్యం నరసింహారావు "మనహాస్యం" లో అన్నాడు. ప్రకృతప్రకరణంలో ప్రహసనాల్లో కనిపించే ఆభాసహాస్యాలను పరిశీలించుదాం.

రసాభాసం:

"అనుచిత విభావాలంబనత్వం రసాభాసత్వం" అని జగన్నాథుడు రసాభాసాన్ని నిర్వచించాడు. లోకన్యాయా న్ననుసరించి ఆలోచిస్తే అనుచిత మనిపించే విభావాన్ని ఆశ్రయించిన రసం ఆభాస మవుతుంది. ఉచిత మనిపించే విభావ మయినా పోషణలో అనౌచిత్యానికి అవకాశం లభిస్తే అదీ రసాభాసమే అవుతుంది. అంటే విభావంలోని అనర్హతకన్నా నిర్వహణలోని అనౌచిత్యం రసాభాసానికి సన్నిహిత మైన విషయం. అది అన్ని రసాల్లో ఏర్పడేదే. శృంగారరసాభాసం ఏ రీతిగా నవ్వుల పాలవుతుందో హాస్యచూడామణి ప్రహసనంలో ఒక సన్నివేశం ద్వారా ఆస్వాదించుదాం.

జ్ఞానరాశి మదనసుందరి కోసం వశీకరణయంత్రాన్ని వేస్తే, శిష్యుడి చమత్కారం వల్ల మదనసుందరి తల్లి కపటకేళి వశ మవుతుంది. విరహంతో జ్ఞానరాశిని సమీపిస్తుంది ఆమె. వారిద్దరి సంభాషణలోని అనౌచిత్యాన్ని గమనించండి

జ్ఞా:- (సగర్వహర్షమ్) అయి భద్రే ! అధిగతం తద్వస్తు?

కప:- తల్లబ్ధం గతం వస్తు, హృదయం పునర్మమ త్వయా హృతం, తత్ త్వమేవ మే శరణం.

జ్ఞా:- (సోత్కంఠమ్) ఆః కిమేతత్ కి మియం మదిరా రసోన్నిద్రిత స్మర వికారాతిశయా? తత్కిమత్రోత్తరం భవతి. అభిమతేన తావత్ వినియోజ యామి. (ప్రకాశమ్) భద్రే ! అపి కల్యాణినీ తవసుతా మదనసుందరీ

కప:- (సేర్ష్యమ్) న ఖలు న ఖలు సుతా. మే భగినీ ఖలు సా. అహం పునః త్వాదృశ విలాసిజనప్రసాదేన సుఖితా పృథుత్వం ప్రాప్తా కనిష్ఠాపి అన్యాదృశీ

జ్ఞా:- (స్వగతమ్ - సాపహాసమ్) అహో ధార్ష్ట్యం వృద్ధాయాః! అథవా యుజ్యత ఏ వై తత్

వాతోత్ఫుల్లతయా నయన్తి సమతాం నిమ్నౌ కపోలౌ ముహు
స్తుంగత్వాభినయం వహన్తి కుచయోర్వక్షస్థలోల్లాసనైః |
పుత్రీభ్యోఽపి కనిష్ఠతాం ప్రకటయత్యాచ్ఛాద్య కేశాన్ సితాం
స్తారుణ్యాభినయగ్రహః పరిణతౌ కోప్యేష దుర్యోషితామ్ ||

కప:- (సోత్కంఠమ్) సుభగ! ముంచ కషాయాంబరమ్. అలంకరోమి హరి చందనే నాంగాని

జ్ఞా:- (స్వగతమ్) అహో వికారాతిశయో వృద్ధాయాః. అథవా

సోత్కంఠం సేవితోత్యర్థం తారుణ్య సమయే పురా
జహాతి జరతీః కామో న దాక్షిణ్య వశాదివ

(ప్రకాశమ్) విరమ విరమ

వివిధ రస విలాసోల్లాసి నిస్సీమ పంక
ప్రచయ నియత పాతం దూరత స్తం నమామి
అహ మిహ సుఖమంబ! త్యక్తవిభ్రంశశంకః
పథి నియమపరాణాం నీరసే సంచరామి

కవ :- (సోపహాసమ్) సుభగ! నాగరోఽసి జానాసి పరిహసితుం యన్మామంబేతి వ్యాహరసి – న పునస్త్వం జానాసి భాగవతానాం రహస్యమ్. న శ్రుత స్త్వయా స శ్లోకః

భగవాన్ కురుతే నిత్యం యః కందర్ప నిషేవణమ్ |
సుతరాం ప్రీతయే తస్య కందర్ప జనకో హరిః ||

న పున రహం జానే కియత్యః భాగవతానాం వింశత్యః నిజసురతస్రస్త తరోచ్ఛీర్షకే మయా దత్తాః

జ్ఞా :- (సక్రోధమ్) ఆః పాపే! పతిష్యసి భాగవత దర్శన దూషణ పంకేన

కప:- (విహస్య) సుభగ! న నిపతిష్యామి - ఏషమే ఆలంబన మస్తి తే దండః

ఇది ఆంధ్ర సాహిత్యంలో మనుచరిత్రలోని వరూథినీప్రవరుల ఘట్టం లాంటిది. అయితే ఆ జంటకూ, ఈ జంటకూ హస్తిమశకాంతరం ఉంది. వరూథినీ ప్రవరుల ఘట్టంలో అర్హత ప్రధాన పాత్రను వహిస్తే, ఈ ఘట్టంలో అనౌచిత్యం ప్రధాన మవుతుంది. అందుకే ఈ ఘట్టం నిక్కచ్చిగా హాస్యాస్పద మవుతుంది.

మత్త విలాస ప్రహసనంలో ఇలాగే కరుణాభాసాన్ని గమనించవచ్చు. ఆప్తుల మరణమూ, బహుకాల వియోగమూ శోకాన్ని కలిగించే అవకాశం ఎక్కువ. అంతేకానీ పిల్లి త్రాగిపోయిన పాలను గూర్చి, కాకి పట్టుకుపోయిన చెంచాను గూర్చి గుండె బాదుకొని, రోదించడం శోకాభాసమై కూర్చుంటుంది. మత్త విలాస ప్రహసనంలో కాపాలికుడు తన కపాలం పోయిందని ఎలా ఏడుస్తాడో చూడండి-

కపాలీ:- కథమిహాపి న దృశ్యతే (విషాదం రూపయిత్వా) భోభో మాహేశ్వరాః మాహేశ్వరాః అస్మదీయం భిక్షాభాజన మిహ భవద్భిః కిం దృష్టమ్? కిమాహుర్భవన్తః? న ఖలు వయం పశ్యామ ఇతి. హా హతోఽస్మి భ్రష్టంమే తపః, కేనాహ మిదానీం కపాలీ భవిష్యామి. భోః కష్టమ్

యేన మమ పానభోజనశయనేషు నితాంతముపకృతం శుచినా|
తస్యాద్య మాం వియోగః సన్మిత్రస్యేవ పీడయతి ||

(పతితః శిరస్తాడనం రూపయిత్వా) భవతు, అస్తి లక్షణ మాత్రమ్, న ముక్తోస్మి కపాలి సంజ్ఞాయాః

భావాభాసం

అనుచిత విభావాలంబన మయిన రసంలాగా భావం కూడా ఆభాసమే అవుతుంది. నిర్వేదం, గ్లాని వగైరా 33 భావాలుకూడా అనుచితాలయితే నవ్వు పుట్టిస్తాయి. సంస్కృత ప్రహసనాల్లో ఈ భావాభాసాలకు కూడా లోటులేదు. లీలావిలాస ప్రహసనంలో వేదాంతభట్టు దగ్గర సున్నితమయిన నిర్వేదాభాసం దొరుకుతుంది. వేదాంతభట్టు లీలను హృదయ పూర్వకంగా పెండ్లాడాలని గట్టి

ప్రయత్నమే చేస్తాడు. కావలసిన మామగారు కూడా అంగీకరిస్తారు. ఏర్పాట్లు చేస్తారు. అయితే చంద్రిక ఆ ఆశలన్నింటినీ తారుమారు చేస్తుంది. చివరకు చంద్రికా గౌతము లిరువురూ కూడా లీలను విలాసునికి ఇస్తారు. అయితే ఆ సందర్భంలో వేదాంతభట్టు "సన్యాసన్య మహాబాహో! తత్త్వమిచ్ఛామి వేదితుం" అని ప్రశ్నిస్తాడు. ఆ సందర్భంలో అతను నిర్వేదంతో సన్యాస ప్రసక్తి తేవటం పూర్తిగా ఆభాసమే. అది అప్రాప్తవిరక్తియే గానీ ప్రాప్తవిరక్తి గాదు. కనుక అది హాస్యాస్పద మవుతుంది -

హాస్యార్ణవ ప్రహసనంలో హర్షం చక్కగా ఆభాసితమయి నవ్విస్తుంది. వేశ్యమాత అయిన బంధుర పతివ్రత. కులాలుడూ, కలహాంకురుడూ తమ గురువులతో పోటీపడి, గురువులు మదన మంజరిని వివాహమాడుతూంటే తాము బంధురను పెండ్లి ఆడటానికి సిద్ధపడతారు. అప్పుడు బంధుర "అహో! మయి ప్రసన్నః ప్రజాపతిః యతో వార్ధక్యేపి తరుణపతి ద్వయలాభః" అని అమందహర్షాన్ని ప్రకటిస్తుంది. నిజానికి ఈ విషయంలోని అంశం హర్షహేతువు కాదు. వేశ్యకు వివాహ మనడమే కొంత అనౌచిత్యం, అందునా ఆమె వృద్ధ. వరులా యువకులు, ఒకరు కాదు ఇద్దరు. ఇదంతా అనుచితమై హాస్యాస్పద మయిన విషయంకాగా, ఆమె హర్షాన్ని ప్రకటించడం తగదు. కనుక ఆ హర్షం అనుచిత విభావాశ్రితమయి, ఆభాసమయి హర్షాభాస రూపంలో హాస్యాన్ని అందిస్తుంది గాని హర్షాన్ని కాదు. ఇదే రీతిగా అనేక భావాలు ఆభాసాలయి ప్రహసనాల్లో హాస్యాన్ని కలిగిస్తూ ఉంటాయి.

ప్రహేళికలూ, ఆంగ్ల సాహిత్యంలోని లిమరిక్కులలాగా కూడా భావాభాసంలో చెప్పదగినవే. ప్రహేళికలు పొడుపుకథల్లాంటివి, ప్రహసనాల్లో సామాన్యంగా కనిపించవు. A type of light verse and a particularly popular fixed verse form in English. It usually consists of five predominantly anapaestic lines rhyming a a b b a. The origin of the term is obscure - (Dictionary of literary terms p 356)

అని లిమరిక్కు నిర్వచనం. ఈ లిమరిక్కులు ప్రహసనాల్లోగాదు. సంస్కృతం లోనే కనిపించవు.

స్తోత్రాభాసం :

"అగ్నిమీళే పురోహితమ్" అని స్తోత్రాలతోనే ఋగ్వేదం ప్రారంభమయింది. ఆ స్తోత్రాలు క్రమంగా దేవతలనుండి చక్రవర్తులకు ప్రాకాయి. ఆపై ఏదైనా గొప్పపని చేసిన ఏవ్యక్తినయినా స్తోత్రం చేయటం అలవాటయింది. కాలక్రమంలో గొప్పపను లంతరించి సోత్రాలూ వాటిలోని మజా మాత్రమే మిగిలిపోయాయి. అప్పటినుండి అర్థానర్థతల ప్రసక్తి లేకుండా స్తోత్రం చేయటం లోకానికి కొట్టినపిండి అయింది. అల్పవ్యక్తులూ, వస్తువులూ, జంతువులూ అన్నీ ఈ స్తోత్రాలకు విషయాలయ్యాయి. కాన్సరుకులాగా స్తోత్రకండూతికి కూడ ఈనాడు మందులేదు. అనర్థమయిన విషయాన్నో, వ్యక్తినో పొగిడితే అది స్తోత్రాభాసమై హాస్యభాజన మవుతుంది.

పకోడి తెలుగు నేలలో చాలా ప్రసిద్ధమయిన ఆహార పదార్థం. ఉల్లిపాయల కలయికతో సెనగపిండికే విలువ వచ్చిందో, సెనగపిండి కలయికతో ఉల్లిపాయకే విలువ వచ్చిందో తెలియదు కానీ, పకోడీకి వున్న విలువ వూహకందనిది. అయినా అది అల్పవస్తువు క్రిందనే లెక్క. ఆ పకోడీని సకల దుఃఖ వినాశినిగా వర్ణిస్తూ మహావిషయాన్ని చేసిన హరిజీవన మిశ్రా శ్లోకాన్ని పరిశీలించండి -

అయే లశున పోటీకే సకల దుఃఖ సంత్రోటికే
మహాపథ సుఘోటికే పరమ పాప సమ్మోటికే ।
సుగంధ హత తోటికే పరమ సిద్ధ సచ్చోటికే
ప్రసీద పరమేశ్వర క్షుధిత తృప్తి సద్రోటికే ॥

ఆ పకోడీకి అంత విలువను తెచ్చిపెట్టిన ఉల్లిపాయను కూడా పలాండు మండన ప్రహసనంలో హరిజీవన మిశ్రా వర్ణిస్తాడు. ఆంజనేయుడి ఛీత్కారం వలన పురజనులంతా దెబ్బతిని పడిపోయినా ఉల్లిపాయ తినిపించితే వెంటనే లేస్తారుట. ఈరోజుల్లో బాష్పవాయువు (Tear gas) కు విరుగుడు ఉల్లిపాయే కదా!

హాస్యార్ణవ ప్రహసనంలో పట్టమహిషిని వర్ణించడంలో జగదీశ భట్టాచార్య ఎటువంటి ఆభాసానికి అవకాశమిచ్చాడో చూడండి -

దర్శేందు తుల్య వదనాంజన పుంజ గౌరీ
మార్జార చారునయనా ఘటపీన మధ్యా ।

ప్రోత్తుంగ పీన కుచచుంబిత మధ్యదేశా
త్రైలోక్య మోహవసతిః ఖలు కామినీ సా ॥

బోధాభాసం:

ఈ బోధాభాసం చాలా మృదువైనది నిరాడంబర మయినది. కాని మొత్తానికి వాక్యం అర్థంలేనిదవుతుంది. ఏదో తికమక, గజిబిజి దానిలో కనిపిస్తాయి. మృచ్ఛకటికంలో శకారుడి పాత్ర ఈ బోధాభాసానికి అవకాశ మిస్తుంది. అతని అసంభవోక్తులు కొంతవరకూ బోధాభాసాలక్రిందకే వస్తాయి. సంస్కృత ప్రహసనాల్లో ఈ బోధాభాసాలకు అంతగొప్ప ఉదాహరణలు కనిపించవు. ఉన్నంతలో కొన్నింటిని పరిశీలిద్దాం -

లటక మేళకంలో జంతుకేతువు

యస్య కస్య తరోర్మూలం యేన కేనాపి పేషయేత్ ।
యస్మై కస్మై ప్రదాతవ్యం యద్వా తద్వా భవిష్యతి ॥

అని చరకమతంగ వైద్య విధానాన్ని ప్రకటిస్తాడు. ఏదోచెట్టు వేరును దేనితోనో కలిపి, ఎవరికో ఒకరికి ఇస్తే, ఏదోఒకటి అవుతుందని అతని అభిప్రాయం. నిజానికి ఈ శ్లోకం ద్వారా ఏం చెప్పదలచుకున్నాడో అర్థంకాదు. వాక్యానికి నిర్దిష్టమయిన అర్థం వుంది. కాని శ్రోత ఆ శ్లోకాన్ని విని, ఏం చెయ్యాలన్నది అర్థం కాని విషయం. అందుకే అది బోధాభాస మవుతుంది. ఇలాగే హాస్యార్ణవ ప్రహసనంలో మహాయాత్రికుడు

యత్ర కుత్రాపి లగ్నే చ వాసరే యస్య కస్యచిత్ ।
యత్ర కుత్రాపి నక్షత్రే యద్వా తద్వా విధీయతామ్ ॥

ఏదో ఒక లగ్నంలో, ఏదో ఒక రోజున, ఏదో ఒక నక్షత్రంలో, ఎవరికో ఒకరికి, ఏదో ఒకటి చేయమనటం పూర్తిగా అర్థంలేని విషయం. కనుక వాక్యార్థం స్పష్టంగా ఉన్నా, బోధరహితం కాబట్టి ఇది బోధాభాసానికి ఉదాహరణ మవుతుంది. అందుకే హాస్యాస్పదమవుతుంది. అంతేకాదు వివాహాన్ని జరిపించే మహానిందకుడు

ఓం శ్మశానానల దగ్ధోఽసి పరిత్యక్తోఽసి బాంధవైః ।
ఇదం నీర మిదం క్షీరం స్నాత్వా పీత్వా సుఖీభవ ॥

అంటాడు. ఈ మంత్రంలో కూడా, చెప్పిన దానిలో బోధ ఏమిటో ఆ వైవాహిక సన్నివేశంతో సంబంధం ఏమిటో, తెలియదు. కనుక ఇది బోధాభాసమై హాస్య మవుతుంది.

ఆశీరాభాసం

ఆశీస్సులందరూ అందిస్తారు. అదంతా యథాతథంగా జరుగుతుందని కాదు, జరగాలని ఆకాంక్ష మాత్రమే. కాళిదాసంతటివాడు కూడా – "భగవన్ వరౌ ఖల్వేతౌ నత్వాశిషౌ" అని ఆశీస్సు ప్రతిదీ జరిగి తీరాలని నియమం లేదని సూచించాడు. కాబట్టి జరిగినా, జరగకపోయినా జరగాలని కోరుకోవడం ఆ సందర్భానికీ, ఆ వ్యక్తికీ, ఆ జీవితానికీ సరిపోయేదిగా ఉండాలి. ఎంతమంచి మాటయినా ఆస్థాన పతితమయితే దోషమే అవుతుంది.[1] ఉపనయనం చేసుకొన్న వ్యక్తిని 'శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు' అంటే అందం. పెళ్ళయిన వారికి 'సుపుత్ర ప్రాప్తిరస్తు' అంటే చందం. అంతేకానీ మరోరీతిగా ఉంటే అది అనౌచిత్యమవుతుంది. అది ఆశీస్సులా కనిపించినా అశీరాభాసమే అవుతుంది. అటువంటివి ప్రహసనాల్లో చాలా కనిపిస్తాయి. మచ్చుకు ఒకటి రెండు చూద్దాం-

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మా దపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి ॥[2]

అని గీతావచనం. అర్జునుడు మోహగతుడై కర్మపరిత్యాగం చేసే దీనస్థితికి వెళ్ళినపుడు, జీవతత్త్వాన్ని వివరిస్తూ కృష్ణుడు చెప్పిన సత్యం ఇది. అది అక్కడ అద్భుత వాక్యంగా రాణించింది. అయితే లటకమేళక ప్రహసనంలో చతుర్వేది - మహా పండితుడే - దీనిని మరొక సందర్భంలో వాడుతాడు. దంతురా దిగంబరులు అందరి ఎదుట దంపతులై చతుర్వేదికి నమస్కరిస్తారు. ఆ సందర్భంలో నూతన దంపతులను ఆశీర్వదిస్తూ, చతుర్వేది ఈ గీతా వాక్యాన్ని పలుకుతాడు. నాలుగు కాలాలపాటు కలిసి జీవించవలసిన వారికి మృత్యు సత్యాన్ని గుర్తు చేయటం ఆ

---

1 అనవసరే యద్భణితం సుభాషిత మపి భవతి విరక్తయే ।
వసతౌ ప్రౌఢ వధూనాం రతి సమయే వేద పాఠ ఇవ ॥

2 భగవద్గీత - 2 - 27

సమయంలో అనుచితం కదా! అందుకే అది ఆభాస మయింది. మనకు చక్కలిగింత పెడుతుంది. జగదీశభట్టాచార్యుడు ఇంకా కొన్ని చమత్కారాలుకూడా చేస్తాడు ఆశీస్సులతో. రాజు విశ్వభాండుడికి నమస్కరిస్తే, కలహాంకురుడిచేత ఆశీస్సు నిప్పిస్తాడు. "నేత్రే పుష్పోదయో భవతు భవతాం" అని ఆశీస్సు. అంతేకాదు

శత్రోర్వృద్ధిః భియోవృద్ధిః వృద్ధిర్వ్యాధే ఋణైనసామ్ |
దుర్గతేర్దుర్మతే ర్వృద్ధిః సన్తు తే సప్తవృద్ధయః ||

ఇవి సాక్షాత్తుగా దూషించే ఆశీస్సులు. అయితే కేవలం 'లోట్' ప్రయోగం మాత్రమే వీటికి ఆశీస్స్వరూపాన్ని కల్పిస్తుంది.

కాలానుగుణంగా ఆశీస్సులు మరీ వింతవింత స్వరూపాలను ధరించవలసి వస్తుంది. స్వార్థిక పరాయణ మయినది ఆధునికకాల జీవన ప్రవృత్తి. దాని ప్రతినిధి ఆశీర్వదించవలసివస్తే – అదీ ఆభాసంగా - ఎలావుంటుందో ఒక భరత వాక్యంలో సిద్ధేశ్వర ఛట్టోపాధ్యాయ చూపిస్తున్నాడు చూడండి

కాలస్య గతి మాలోచ్య సాంప్రతం ప్రార్థయామహే |
అస్తు మే మంగళం నిత్యం భవతా మస్తు వా న వా ||

ఆచారాభాసం

సాంఘిక జీవనం సుఖమయంగా సాగేందుకు ప్రత్యేక మయిన ఏర్పాట్లు, కట్టుబాట్లు, నియమాలు చేసుకుంటారు. అయితే కాలగతిలో భౌతికాలయిన మార్పులు ఏర్పడుతున్న కొద్దీ ఆ యా ఆచారాలలోని అంతరర్థం మరుగునపడి ఆచరణమాత్రంగా మిగిలిపోతుంది. అప్పుడు ఆ ఆచారాలు నిరర్థకాలనిపించటం వలన, వాటిని ఆచరించే వ్యక్తులు హాస్యాస్పదులు కావచ్చు. లేదా ఆచారాన్ని ఆచరించటంలో కొన్ని విపరీతపు పోకడలు పోయి వాటికి విరూపత్వాన్ని సృష్టించ వచ్చు. అప్పుడుకూడా అవి హాస్యాస్పదాలవుతాయి. ఒక్కొక్కమారు ఆ ఆచారాన్ని వ్యత్యస్తధోరణిలో నిష్కారణంగా ఆచరిస్తారు. అదికూడా హాస్యాస్పదమే. ఈ రీతిగా హాస్య జనకాలయిన ఆచారాలన్నీ ఆభాసా లనవలసివస్తుంది. కనుక దీన్ని ఆచారాభాసమని వ్యవహరించవచ్చు.

కొన్నికులాలలోని మడి మొదలయినవి, ఈనాడిటువంటి వైపరీత్యాలకు లోనయి ఆభాస మాత్రంగా కనిపిస్తున్నాయి. లటక మేళకం, హాస్యావర్ణ ప్రహసనం మొదలగు వాటిలో ఆచారాభాసాలు గోచరిస్తాయి. ఎడమచేతితో నమస్కరించడం అందులో కనిపిస్తుంది. రెండు చేతులూ శరీరానికంటుకొని ఉన్నవే అయినా కర్మభేదాన్ని బట్టి ప్రాధాన్యంకూడా వాటి కనాదిగా సిద్ధించింది. నమస్కారాది క్రియలన్నీ దక్షిణ హస్తంతో నిర్వర్తించడం పరిపాటి. దానిని మార్చవలసిన అవసరంలేదు. యథాతథాచరణలో నష్టమూ, అన్యథాకరించడంలో లాభమూ ఉన్నప్పుడే మార్పు ప్రసక్తి అవసరం. ఈ వర్ణన ఆచారాభాసమే. అట్లే వేశ్యను 'మాతః' అని సంబోధించడం కూడా ఇటువంటి ఆచారాభాసమే.

ధూర్త నర్తక ప్రహసనంలో ఈ ఆచారాభాసం ఇంకా అందంగా గోచరిస్తుంది. విదూషకుడు మూఢేశ్వరుడితో ప్రగల్భించి, అతడు తనకన్నా ప్రగల్భకుడని గుర్తించి, అతడికి నమస్కరించడానికి సిద్ధపడతాడు. అయితే "ఏష యుష్మాకం వృద్ధానాం చరణేషు పతితు ముపగతః" అని అంటూ మూఢేశ్వరుని జుట్టు పుచ్చుకొని, అతని తల తన పాదాలకు ఆనించుకుంటాడు. అంతటితో ఆగక 'అభీష్టలాభీ భవ' అని ఆతణ్ణి ఆశీర్వదిస్తాడు కూడా. మూఢేశ్వరుడు "ఋషిభ్యః ఆశీర్గ్రహణం యోగ్యం" అనగానే "కిం త్వం ఋషిః? నజానే క్షంతవ్యః మేఽపరాధః" అంటూ క్షమార్పణ కోరుకుంటూ అతని చెవిని మెలిపెడతాడు. నమస్కరించడంలోనూ, క్షమార్పణ కోరుకొనడంలోనూ విదూషకుని చేష్టలు ఆభాసితాలే. విరుద్ధాచారాలు, ఆచార విరుద్ధాలూకూడా. కనుక అవి హాస్యాస్పదాలు.

లీలా విలాస ప్రహసనంలో చంద్రికా గౌతములు ప్రాచీన సంప్రదాయాలకు ఇటువంటి ఆభాస రూపాన్నే అందించాలని ప్రయత్నిస్తారు. 'దరిద్రే దీయతే దానం సఫలం పాండునందన' అనే వాక్యాన్ని గౌతముడూ, 'వృద్ధం తీర్థేషు నిక్షిపేత్' అన్న దాన్ని చంద్రికా ఆభాసితాలు చేసి నవ్వుకలిగిస్తారు. ఇటువంటి ఆచారాభాసాలు ప్రహసనాల్లో చాలా దొరుకుతాయి.

సంఘటనాభాసం

కొన్ని కొన్ని చోట్ల ఏ మాటలూ, ఏ చేష్టలూ, ఏ శబ్దవైచిత్రి లేకుండానే నవ్వు వస్తుంటుంది. అనగా కొన్ని కొన్ని సన్నివేశాలూ, సంఘటనలూ అనుకోని మలుపు

తిరిగి హాస్యాన్ని సృష్టిస్తాయి. ఒక పెద్ద సభ జరగబోతోంది. ఏ మంత్రిగారో ఆ సభకు రావాలి. ఆయనకోసం దండలు పట్టుకొని అందరూ సిద్ధంగా ఉన్నారు. ఆ సమయంలో కారు దూసుకుంటూ వచ్చి ఆ ఆవరణలో ఆగింది. మాలలు పైకి లేచాయి. కండువాలు సవరించుకొన్నాయి. మేళాలు మ్రోగాయి. ఇక పూర్ణకుంభ మివ్వటానికి “సహస్రశీర్షా పురుషః” అంటూ ఉండగా, డ్రైవర్ కారుదిగి “ఇంకా గంటకు కానీ అక్కడ సభపూర్తి కాదట” అని తాపీగా చెప్తాడు. అందరికీ నవ్వు వస్తుంది. ఆదృశ్యాన్ని చూస్తున్నవాళ్ళకు మరీను. అక్కడ ఎవ్వరి చేష్టా, ఎవ్వరి మాటలూ నవ్వుకు కారణం కాదు. ఆ సన్నివేశం ఊహించని రీతిగా మలుపు నందుకోవటం అక్కడ కారణం. కనుక దాన్ని సంఘటనాభాసమని అందాం.

గౌరీ దిగంబర ప్రహసనంలో ఒక సన్నివేశం... మైనాకుడు శివపార్వతుల కల్యాణానికి ముందురోజు, ముందుగా శివుని ఆహ్వానించాలని వస్తాడు. శివుడంటే మైనాకుడికున్న అభిప్రాయం చాలా దొడ్డది. ఆ అభిప్రాయంతోనే మైనాకుడు వచ్చాడు. నంది కనిపించగానే, అతణ్ణి పరమేశ్వరుని వేత్రహస్తునిగా భావించి, శివుని రాజ్యం, రాజకులానికి సంబంధించిన వివరాలు అడుగుతాడు. తాను వచ్చినపని చెప్తాడు. నంది సమయోచితంగా శివుడు కుబేరునితో మాటాడుతున్నాడని, కొద్దిసేపు ఆగమని చెపుతాడు. ఆ సమయంలో నేపథ్యంలో శివ వర్ణన, దిగంబర ప్రవేశం. మైనాకుడు అప్పటికీ శివుని గుర్తించక, తన రాకను శివునికి విన్నవించ మని నందితో చెప్తాడు. ఇక తప్పని సరియై నంది ‘ఇతడే దిగంబరుడు’ అనగానే మైనాకునికి ఏడుపు, ఆశ్చర్యం, భయం అన్నీ ముంచుకొస్తాయి.

ఇక్కడ హాస్యమంతా సంఘటనలో ఉంది. నంది ఎలాగయినా శివుని స్థితిని మార్చాలని ప్రయత్నిస్తున్న సమయంలోనే, శివుడు రంగస్థల ప్రవేశం చేయటంతో అసలైన స్థితికి చేరుకుంటుంది సన్నివేశం. అప్పటికీ తెలియక మైనాకుడు అడగటం, నంది శివుణ్ణి పరిచయం చేయటం, వీటితో ఈ సన్నివేశహాస్యం పరాకాష్ఠ సందుతుంది.

శృంగార నారదీయ ప్రహసనంలో ఇటువంటి హాస్యమే కనిపిస్తుంది. ఒక గంధర్వుల జంట కామక్రీడలో ఉన్నప్పుడు నారదుడు చూడటం సంభవిస్తుంది. అది పాపంగా భావించి పాపప్రక్షాళన చేసుకోవాలనే ఉద్దేశంతో నారదుడు వీణను, బట్టలను ఒడ్డున పెట్టి, తటాకంలో మునుగుతాడు. వెంటనే స్త్రీగా మారిపోతాడు.

ఇది అనుకోని మలుపు. అయితే వెంటనే మరోమలుపు కూడా కనిపిస్తుంది. ఋక్షరాజు చూచి, మోహించి శృంగార క్రీడల కాహ్వానిస్తాడు. నారదుడు తప్పించుకోవటాని కుపాయం దొరక్క, ఆ తటాకంలోని పువ్వొకటి తెచ్చివ్వమంటాడు. పాపం ఋక్షరాజు దానిలో దూకగానే అతడుకూడా స్త్రీగా మారిపోతాడు. ఊహించని ఈ మలుపులన్ని సంఘటనకు వన్నె తెచ్చి తద్ద్వారా నవ్విస్తాయి.

అభిరాజేంద్రమిశ్రా నిర్గృహఘట్టంలో ఒక సన్నివేశం ఇటువంటిదే. గిరీశుని మిత్రులంతా గిరీశుని యింట్లో కూర్చుని, వారి సభావ్యవహారాలు ఆలోచిస్తూ ఉంటారు. స్త్రీలను అదుపులో ఉంచుకోవడం విషయంగా వారి ఆలోచనలు సాగుతున్నాయి. వారి సంఘకృషి కూడా అదే. అనేక ప్రాంతాలనుండి వచ్చిన ఉత్తరాలనూ, నమస్యలనూ పరిశీలించి, వాటికి తగిన సమాధానాలు నిర్ణయించి, "దండం దశగుణం భవేత్" అన్నది తప్ప, మరో పరిష్కారమార్గం లేదని నిర్ణయించుకొని, ముందుగా గిరీశుడే దానిని అమలు పరచాలని నిర్ణయిస్తారు. గిరీశుడు కఱ్ఱ తీసుకొని ప్రగల్భాలు ప్రారంభిస్తాడు. అంతలో అతని భార్య మంగళ లోనుండి వచ్చి, వరుస పెట్టి అందరినీ కొడుతుంది. అందరూ దెబ్బలు తిని పరుగులు తీస్తారు. ఇది కూడా సన్నివేశం ఊహించని మలుపు తిరగటమే. ఇటువంటివన్నీ సంఘటనాభాస హాస్యాలు లేక సన్నివేశ ప్రధాన హాస్యాలు అవుతాయి.

హేత్వాభాసాలు

తర్కశాస్త్రంలో ఇవి ప్రసిద్ధాలు. హేతువు కాని దానిని హేతువుగా భావిస్తే అది హేత్వాభాసం అవుతుంది. అది సాధ్యసిద్ధికి ఉపకరించదు. ఒక్కొక్క మారు కొందరి మాటలు అసంగతంగా, అసందర్భంగా కనపడుతూ ఉంటాయి. 'తాటి చెట్టు ఎందు కెక్కావంటే దూడ గడ్డికి అన్నాడట' అని ఒక తెలుగు సామెత. ఇక్కడ దూడకు గడ్డి కోయటానికి అన్నది వక్తచేత హేతువుగా ప్రకటింపబడినా, అది హేత్వాభాసమే కాని హేతువు కాదు. గడ్డి కోసం తాటిచెట్టు ఎక్కడం చూడం. అది అసంభవం. అయితే ఇటువంటి హేత్వాభాసాలతో మాట్లాడేవారు నిత్యజీవితంలో చాలా మంది కనిపిస్తారు. కొందరు అసలు విషయం తెలిసి సరదా కోసం, మరి కొందరు తెలివితక్కువతనం వల్ల, ఇంకా కొందరు ఎదుటి వ్యక్తిని తెలివితక్కువ

వాడుగా అంచనా వేయడం వల్ల ఇటువంటి హేత్వాభాసాలు వాడుతారు. వాటివల్ల జనించే చమత్కారం ఎటువంటిదో చూద్దాం.

హాస్యార్ణవ ప్రహసనంలో విశ్వభాండుడు శిష్యుడితో కూడా ప్రవేశించి నపుడు "భగవన్! బంధురాయాః కుట్టిన్యాః నిలయే మహోత్సవో వర్తతే" అని అంటాడు శిష్యుడు. అపుడు విశ్వభాండుడు ఆనందంతో "వత్స! పూర్వ సంవత్సరే భోజయితుం తయా నిమంత్రితా వయం. తదయ మవసరః" అంటూ ఇంట్లో ప్రవేశిస్తాడు. గత సంవత్సరంలోని ఆహ్వానం ఇప్పుడు ప్రవేశించడానికి ఏ రీతిగానూ హేతువు గాదు. పెద్దకూతురు పెళ్ళికి పిలిచారు కదా అని చిన్నకూతురు పెళ్ళికి వెళ్ళటానికి అదే ఆహ్వానం కాదు గదా! అయినా దానిని హేతువుగా భావించి ప్రవేశించాడు కాబట్టి యిది హేత్వాభాసం.

ఇంతకన్నా అందమయిన హేత్వాభాసం ధూర్తనర్తకంలో కానవస్తుంది. మూఢేశ్వరుడు రాజసన్నిధానానికి వెళ్ళినపుడు విదూషకుడు అతణ్ణి చూచి, జడలు ఉన్నాయని సంశయించి, 'యవనుడికి జడ లుండవచ్చులే' అని సంతృప్తి పడతాడు. అయితే రాజు కా అనుమానం రానే వస్తుంది. ఆ సంభాషణ చూడండి -

రాజా: వయస్య! యవనో జటిలో పి భవతి ?

విదూ: భవత్యేవ

రాజా : కథమ్ ?

విదూ: యథా బ్రాహ్మణో తురుష్కో భవతి

అసలు హేతువు కాని దానిని హేతువుగా చెప్పటం ఒక రకమయితే, సంబంధి కాని హేతువును తత్సంబంధమైన దానినిగా ప్రకటించి మాట్లాడటం మరో రకం. అనగా విశిష్ట కారణాన్ని సామాన్య కారణంగా చేసి మాటాడట మన్నమాట. అటువంటి హేత్వాభాసాలు కూడా హాస్యాన్నే కల్గిస్తాయి.

భగవదజ్జుక ప్రహసనంలో పరివ్రాజకుడి దగ్గక శాండిల్యుడు అటువంటి హేత్వాభాసాన్ని ప్రకటిస్తాడు. పరివ్రాజకుడు అసంగతిని వర్ణిస్తూ –

సుఖేషు దుఃఖేషు చ నిత్యతుల్యతాం
భయేషు హర్షేషు చ నాతిరిక్తతామ్ |
సుహృత్స్వమిత్రేషు చ భావతుల్యతాం
వదన్తి తాం తత్త్వవిదో హ్యసంగతిమ్ ||

అన్నప్పటి సంభాషణ చూడండి

శా: కిమిదం పునరస్తి ?

ప : నా సత స్సంజ్ఞా భవతి

శా : శక్యం కర్తుమితి భగవాన్ భణతి ?

ప : క స్సందేహః ?

కా : అలీక మలీక మిదమ్

ప : కథ మివ ?

శా : భగవాన్ ఖలు తావన్మాం కి మర్థం కుప్యసి ?

స : నాధీషే ఇతి

శా : యద్యహ మధ్యేమి నా నాధ్యేమి వా కిం తవ ముక్తస్య

పరివ్రాజకుడు చెప్పిన సిద్ధాంతాన్నే హేతువుగా చేసుకొని అతనిని ఖండించాడు శాండిల్యుడు. సుఖదుఃఖ సమతను పొందినవాడికి నా చదువుతో సంబంధం ఏమిటి పొమ్మన్నాడు. ఈ రీతిగా హేత్వాభాసాలు అనేక విధాలుగా హాస్య హేతువు లవుతాయి.

అలంకారాభాసం

అలంకారాలు ఉక్తి చమత్కారరూపాలు. సాధారణంగా భావవ్యక్తీకరణకు ఉపయోగించే విధానాన్ని కాక, ప్రకారాంతరాన్ని స్వీకరించడం ద్వారా అలంకార మేర్పడుతుంది. ఆ విధానాల్లోని వైవిధ్యం అనంతా లయిన అలంకారాలకు మార్గదర్శక మవుతుంది. భావనా వైచిత్ర్యం, ఉక్తి వైచిత్ర్యం - ఈ రెండూ కలిపి అలంకారాల సంఖ్యనూ, స్థాయినీ కూడా పెంచాయి.

ఇలా పెరిగిన అలంకారాలలో కొన్ని సహజంగానే హాస్యచమత్కృతిని అందించగలవి. మరికొన్ని ఆభాసరూపంలో మాత్రమే హాస్యాన్ని కల్గించగలవి. ఇక్కడ మనం ఆభాస మంటున్నవానినే ఆలంకారికులు అలంకారాలలో దోషాలని అన్నారు. అయితే ఆ దోషాన్ని వారు అన్ని అలంకారాలలోనూ చూపలేదు. కేవలం ఉపమాలంకారం మీదనే అందరి దృష్టి కేంద్రీకరింపబడింది. కాని అటువంటి (దోషం) ఆభాసస్థితి అన్ని అలంకారాలలోనూ సంభవించే అవకాశం ఉంది. అలంకారానికి అలంకారత్వాన్ని నిర్ణయించగల గుణాలు కొన్ని ఉన్నాయి. అవి లోపించినప్పుడు అవి హాస్యాస్పదా లవుతాయి.

ఉక్తిచమత్కారం అలంకారానికి ప్రధాన లక్షణం. అది లేకుంటే మిగిలిన అలంకార లక్షణం సరిపోయినా అది ఆభాసరూపాన్నే పొందుతుంది. అందుకే ఉదాత్తతను కోల్పోయి పరిహాసాస్పద మవుతుంది.

అలంకారాలలో సాదృశ్యమూలకా లెక్కువ. ఈ సాదృశ్యం ప్రకృతాంశాన్ని స్పష్టంగా ప్రతిపాదించటంతో పాటు దానికి ఉదాత్తతను చేకూర్చటానికి సయితం ఉపయోగ పడుతుంది. సాదృశ్యకల్పనలో సమత లోపించినప్పుడు, అస్తవ్యస్త స్థితి హాస్యాలంబన మవుతుంది. ఇటువంటి వాటినే ఆలంకారికులు ఉపమాదోషాలని పరిగణించారు. కాబట్టి సాదృశ్యమూలకాలంకారాలన్నిటిలో ఈ సమత లేకపోవటం హాస్య కారణ మవుతుంది. కొన్ని అలంకారాల భావనలో అసంగతి స్పష్టంగా కనిపిస్తుంది. కుక్కను చూచి నక్క అనుకుంటే అది భ్రాంతి కావచ్చు, సందేహం కావచ్చు. కానీ ఎలుకను చూచి ఏనుగనుకుంటే అది భ్రాంతీ కాదు, సందేహమూ కాదు. అసంభవమైన విషయం అది. అక్కడ అసంగతి భ్రాంతికి అలంకారత్వాన్ని నిరసించి, హాస్యాస్పదాన్ని చేస్తుంది. అలా తన ఉద్దిష్టధర్మాన్ని ఏ కారణం వల్లనైనా కోల్పోయినప్పుడు అది ఆభాసమై నవ్విస్తుంది.

ఉపమానం ద్వారా ఉపమేయానికి స్పష్టతా, సమగ్రతా, సౌందర్యమూ సంపాదించేందుకు ఉపమాలంకారాన్ని వాడతారు. అది అల్పమయినా, అధికమైనా ఆభాసమై నవ్వుల పాలవుతుంది. మత్తవిలాస ప్రహసనంలో అటువంటి అధికోపమను చూడండి

"ఏష సురాపణో యజ్ఞవాటీ విభూతి మనుసరతి. అత్ర హి ధ్వజస్తంభో యూపః, సురా సోమః, శౌండా ఋత్విజః, చషకాశ్చమసాః శూల్యమాంస ప్రభృతయః ఉపదంశాః హవిర్విశేషాః, మత్తవచనాని యజూంషి, గీతాని సామాని, ఉదంకా స్రువాః, తర్షోఽగ్నిః, సురాపణాధిపతి ర్యజమానః"

కల్లుపాక యాగశాల; ధ్వజస్తంభం యూప స్తంభం; సుర సోమం; త్రాగుబోతులే ఋత్విక్కులు; చషకాలే చమసాలు; కరకుట్ల వంటివి హవిస్సులు; ఉన్మత్త ప్రలాపాలు యజస్సులు; గీతాలు సామగానాలు; పానపాత్రలు సుక్స్రువాలు; దాహమే అగ్ని; సురాధిపతి యజమాని. పరమ పవిత్రంగా భావింపబడే యాగశాలతో సురాశాలను పోల్చటంవల్ల అది అధికోపమమై, ఆభాసమై హాస్యాన్నే కల్గిస్తుంది.

హాస్యార్ణవప్రహసనంలో గురుశిష్యులైన విశ్వభాండ కలహాంకురులు పరస్పరం తగిన వారని వివరిస్తూ బంధుక "యుక్తం భస్మపుంజే సారమేయావస్థానం" అని సమర్థిస్తుంది. (బూడిదకుప్పలో కుక్క ఉండటం యుక్తమే కదా అని భావం) ఈ అర్థాంతరన్యాసం కూడా సమతను కోల్పోయి ఆభాసరూపమై హాస్యాన్నే కలిగిస్తుంది. ఉపాధ్యాయుడి వలె శిష్యు డుండటం అనుచితమేం కాదు. అయితే ఆమె చేసిన ఆ సమర్థన గురుశిష్యు లిద్దరినీ తక్కువ చేస్తుంది. అందుకే హాస్యాస్పద మవుతుంది.

ఆనందకోశ ప్రహసనం నుండి ఆభాసితమైన భ్రాంతి నొక దాన్ని పరిశీలిద్దాం. బౌద్ధు డొకడు ఒక వనితను చూచి

హేమకుంభవతీ రమ్యతోరణా చారు దర్పణా ।
కాపి గంధర్వనగరీ దృశ్యతే భూమి చారిణీ ॥

అని భ్రాంతితో వర్ణిస్తాడు. వెంటనే భ్రాంతిని ఉపసంహరించుకొని

న పురీయం విశాలాక్షీ న తోరణ మిమౌ భ్రువౌ ।
న దర్పణ మిమౌ గండౌ న చ కుంభా విమౌ స్తనౌ ॥

అని యథార్థాన్ని పలుకుతాడు.

స్తనాలను కుండలనీ, కనుబొమలను తోరణాలనీ, చెక్కిళ్ళను దర్పణాలనీ, కవి సమయాన్ననుసరించి భ్రాంతి పడితే పడవచ్చు. అయితే ఆ భ్రాంతి ఆధారంగా

ఆమె నగర మని భ్రాంతి పడటంలో అర్థం లేదు. కనుక అది ఆభాసమై నవ్వుల పాలవుతుంది.

"ప్రియే! ఉపస్థితే భక్ష్యవర్గే అన్యతమ స్వీకరణం నామ బహుపత్నీకస్యేవ దక్షిణనాయకస్య మహత్ బహుమాన సంకటం జిహ్వాశాలినాం" అని కౌండిన్య ప్రహసనంలో గృధ్రనాసుడు భక్ష్యవర్గాన్ని భార్యాసముదాయంగా పోల్చటం కూడా అధికోపమమై హాస్యాన్నే కలిగిస్తుంది. ఇటువంటి అలంకారాభాసాలు ప్రహసనాల్లో అనంతంగా కనిపిస్తాయి.

ఉపసంహారం

భారతీయ ప్రవృత్తిలోని ప్రతీ అంశమూ ధర్మార్థకామ మోక్షాలలో దేనికో ఒకదానికి సంబంధించినదే. మానవుల మనుగడకు ప్రధాన సూత్రాలు ఈ చతుర్విధ పురుషార్థాలు. వీటిలో తొలి మూడూ ఐహికాలు, నాల్గవది పారలౌకికం అని విశ్వాసం. ఇందులో ధర్మార్థకామాలు సాధనాలు, మోక్షం సాధ్యం. కాబట్టి భారతీయుల నడవడి ధర్మార్థ కామాల ద్వారా మోక్షాన్ని అందుకునేందుకు అనుగుణంగానే తీర్చి దిద్దబడింది.

ఐహికా లైన ఈ ధర్మార్థకామాల్లో కూడా ధర్మం ప్రాథమికమై అర్థకామాలతో అన్వయిస్తుంది. ధర్మార్థం, ధర్మకామం ఈ రెండూ ఐహిక జీవితాలకు మార్గం చూపుతూ, మోక్షసాధనకు సహకరించాలి. ఇది భారతీయుల తాత్త్విక చింతనలో ప్రధాన భాగం. సాహిత్యవిషయంలో సైతం భారతీయు లీ విషయాన్ని విస్మరించలేదు.[1] ప్రస్తుత ప్రహసనసాహిత్యంలో ఈ పురుషార్థప్రాబల్యం ఏ విధంగా ప్రతిఫలించిందో పరిశీలించుదాం.

మనిషి జీవికకు ప్రధానం ఆహారం. అది అర్థసాధ్యం. అందుచే అర్థార్జన చేయటంలోనూ, ఆర్జితమైన అర్థాన్ని వినియోగించటంలోనూ కొన్ని ప్రత్యేకాంశాలపై దృష్టిని కేంద్రీకరించాలి. ధర్మంతో ఆ అర్థానికి ముడివేయడమే ఆ ప్రత్యేకత. అర్థార్జన వినియోగపద్ధతుల్ని ధర్మం నిర్దుష్టంగా సూచించి, అవి కళంకితాలు కాకుండా కాపాడుతుంది. ఈ విషయాన్ని తైత్తిరీయోపనిషత్తు చాలా చక్కగా ప్రస్తావించింది. ఆహారం సిద్ధించిన తర్వాత తద్వినియోగంలో కుటుంబవ్యవస్థ ఆవశ్యక మవుతుంది.

ఆ కుటుంబవ్యవస్థకు మమత కేంద్రస్థానం. దీనికి ప్రధానాలంబనం కామం. కామం అరిషడ్వర్గంలో కూడా పరిగణింపబడినా, పురుషార్థాల్లో కూడా తగిన స్థానాన్ని సంపాదించుకుంది. అంటే దాని అపరిహరణీయత స్పష్టపడుతుంది. అది ప్రపంచ స్థితికీ, వ్యక్తి జీవన సార్థక్యానికి కూడా విశిష్టమైన ఆలంబన. అయితే పుణ్యనదీ ప్రవాహంలో కూడా చెత్తాచెదారం కొట్టుకు వచ్చినట్లుగా కామవిషయంలో కూడా కళంకాలు అనేకం వస్తూ ఉంటాయి. కాబట్టి వాటి నన్నిటినీ పరిహరించి, పురుషార్థ

1. ధర్మార్థకామమోక్షేసు వైచక్షణ్యం కలాసు చ
కరోతి కీర్తిం ప్రీతించ సాధుకావ్య నిషేవణమ్ – భామహాలంకారం, 2 శ్లో.

రూపంలో కామాన్ని నిలుప గలిగింది ధర్మమే. ధర్మనిబద్ధమైన కామం పురుషార్థం. ధర్మహీన మయితే అదే శత్రువు. ఇంత విశిష్టమైన ధర్మాన్ని ప్రబోధించేందుకు అనేక మనస్సులు అనేక రీతులుగా ప్రసరించాయి. ఆ ప్రసారాలే శాస్త్రాలు, సిద్ధాంతాలు, మతాలు, తత్త్వాలు మొదలగునవి. వివిధములయిన ఆ ధర్మసూత్రాలు జీవనాదర్శాలు. ఆ సూత్రాలు దారి తప్పితే, సూత్రకారుడు లేదా తదనుయాయులూ ఆ సూత్రానికే భిన్నంగా నడిస్తే...

ఆ సన్నివేశాలు ఏమవుతాయో ప్రహసనాల్లో ప్రదర్శించారు. ఎంత హాస్యాస్పదా లవుతాయో, ఎంతగా నీతి రహితా లవుతాయో, సంఘం వాటిని ఎంతగా అసహ్యించుకుంటుందో, అసహ్యించుకున్నా ఆ వ్యక్తులు ఎలా తుడుచుక పోతారో మనకు తెలియజేసేవి ప్రహసనాలు. ఇతర సాహిత్యం 'భావ' స్థితిలో ధర్మ ప్రాధాన్యాన్ని నిరూపించేందుకు ప్రయత్నిస్తే, ప్రహసన సాహిత్యం 'అభావ' స్థితిలో దాన్ని ప్రతిపాదించి, ప్రక్షాళితం చేస్తోంది. ధర్మం ఎలా ఉండాలో చెప్పడం కంటె ఎలా ఉండకూడదో చెప్పటం తేలికయిన విషయం. హృదయానికి సూటిగా త్వరగా హత్తుకొనే మార్గం అది. ఆ విషయాన్నే కేంద్రబిందువుగా చేసికొని ప్రహసన సాహిత్యం పరిఢవిల్లింది.

అర్థకామ సంబంధమైన ధర్మంలో ప్రాచీన ప్రహసనాలు అనేకం కామ ధర్మానికి లేదా ధర్మకామానికి ప్రాధాన్య మిచ్చి సాగిన వయితే, ఆధునిక ప్రహసనాలు అర్థధర్మానికి కూడా ప్రాధాన్య మిచ్చి, నిర్వహింపబడినవిగా కనిపిస్తాయి. ఈ అర్థ కామాలు రెండింటితో కూడా సాక్షాత్తుగా సంబంధం లేనట్లు కనిపించే ఎన్నో విషయాలు ప్రహసనాల్లో ఉంటాయి. కాని పరంపరగా సర్వవిషయాలూ ఈ త్రివిధ పురుషార్థాలలో అంతర్భవించేవే. అది అవగత మయితే ఈ సంశయాని కవకాశ ముండదు.

ప్రాచీన ప్రహసనాలలో మత్తవిలాసప్రహసనం, భగవదజ్జుకం, లటక మేళకం, హాస్యచూడామణి ప్రధానము లయినవి, సంపూర్ణంగా లభ్యమయ్యేవి కూడా. పురుషార్థ నిర్వహణలో ఈ నాలుగూ విలక్షణంగా ఉంటాయి. మత్తవిలాస ప్రహసనంలో ధర్మాల కన్నిటికీ మూలమైన స్వధర్మాచరణం ప్రాధాన్యం వహిస్తుంది. "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అన్న గీతావాక్యాన్ని మన మిక్కడ స్మరించాలి.

బౌద్ధమత నింద, అధిక్షేపణ, పాశుపతమతస్థాయి నిరూపణ మొదలగునవి దీనిలోని అంశాలు. వైదికమతంలోని అనేక విషయాలను స్వీకరించి, కొంత మార్పు చేర్పులతో వ్యాపించింది బౌద్ధమతం. అయితే అది కాలక్రమేణ వివిధ వికారాలకు లోనై పతన మయింది. బౌద్ధమతామయాయులు స్వధర్మ నిర్వహణలో ఎంత పతన మయ్యారో సూటిగా తెలియజేస్తుంది మత్తవిలాస ప్రహసనం. మృదువైన హాస్యరీతిలో ఆ పతనాన్ని అధిక్షేపిస్తుంది కూడా. ఇక లటకమేళకం కామ సంబంధియే. ధర్మభ్రష్టమైన కామస్వరూపాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తుంది. కామం ధర్మపరిచ్యుతమైతే వ్యక్తి ఎంత పతన మవుతాడో, హాస్యాస్పదు డవుతాడో తెలియజేస్తూ; ఈ పరిహాస భాజనమైన కామస్వరూపం కన్నా తద్వ్యతిరిక్తమైన ధర్మకామం అభిలషణీయ మన్న అంశాన్ని ఈ ప్రహసనం వ్యంగ్యంగా బోధిస్తుంది.

భగవదజ్జుకం అర్థకామాలను రెంటినీ సూక్ష్మంగా స్పృశిస్తూ, వాటి భావాభావ దశలను రెండింటినీ వాచ్యంగానే తనలో ఇముడ్చుకొని ధర్మసంస్థాపనకు నడుము కడుతుంది. ఇక హాస్యచూడామణి ఒక విలక్షణమైన ప్రహసనం. అర్థకామాలు రెండూ ధర్మపరిచ్యుతా లయితే పరిస్థితి ఎలా ఉంటుందో సున్నితంగా, సుకుమారంగా వివరిస్తుంది ఈ ప్రహసనం. ప్రత్యేకించి ఏ సిద్ధాంతాన్ని అధిక్షేపించకుండా మానవుల సహజ మనస్తత్త్వానికి పట్టంగట్టిన విశిష్టత ఈ ప్రహసనానిది. యథార్థంగా ప్రహసనాలలో ధర్మార్థకామ ప్రబోధన చేయవలసిన పద్ధతి, ప్రలోభాలనుండి మానవులను దూరం చేయవలసిన ఆవశ్యకమూ ఈ ప్రహసనంలో చక్కగా ప్రతిపాదింపబడ్డాయి.

అత్యంత ప్రాచీనాలయిన ప్రహసనాల్లోని పురుషార్థసాధన పరిస్థితి ఇది. ఏ రచయితా కూడా అధర్మాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నించలేదు. ప్రహసన కర్తలందరూ సమాజాన్ని నిష్పాక్షిక దృష్టితో పరిశీలించి, వాస్తవాన్ని అర్థం చేసుకొని తదభివృద్ధికై తాము నిర్వహింపవలసిన గురుతర కర్తవ్యాన్ని గుర్తించి, దృఢదీక్షతో దాన్ని కొనసాగించడం గోచరిస్తుంది. హాస్యార్ణవ ప్రహసనం, ధూర్తనర్తకం, మదనకేతుచరితం, కౌతుకసర్వస్వం, కౌతుకరత్నాకరం మొదలగు ప్రహసనాలన్నీ ధర్మకామ ప్రతిష్ఠకై నడుము కట్టినవే. ఈ ధర్మకామసంస్థాపన మన్న దృష్టిలో విశృంఖలంగా రచనలు సాగించిన వారు కూడా లేక పోలేదు. కాళిదాస ప్రహసనం, ఉన్మత్తకవి కలశప్రహసనం మొదలగునవి కేవలం విశృంఖల కామ

ప్రవృత్తిని ప్రధానంగా వర్ణించి, ప్రయోజనాన్ని కొంత వరకు దూరం చేశాయి. దాన్ని పురుషార్థంగా తీర్చి దిద్దడం కంటే అరిషడ్వర్గాలలో ఒక దానినిగా చూపి, నిందించడమే ఆయా రచయితల లక్ష్యంగా కనిపిస్తుంది.

వాటిలో చాలా భాగం హాస్యం కంటె జుగుప్సనే ఎక్కువ కలిగిస్తుంది. ధర్మబద్ధం కాని కామం ఈ రీతిగా ఒక వైపున హాస్యాస్పద మవుతూ ఉంటే, మరో వైపు ధర్మబద్ధమైన కామంలో సయితం అక్కడక్కడా అపశ్రుతులు వినబడతాయి. ధర్మబద్ధమైన దాంపత్యజీవితాలలో సంభవించే విచిత్ర పరిస్థితులూ, వాటి పరిణామాలూ ఈ ప్రహసనాల్లో కనిపిస్తాయి. లీలావిలాసప్రహసనం, ఉభయరూపకం, ధరిత్రీపతి నిర్వచనం, స్నుషావిజయం, ననావితాడనం మొదలయినవి ఈ కోవకు చెందినవి. మృదుహాస్య సమ్మిళితా లివి. ఇవన్నీ ఆధునికాలే. వారి భావ వైశాల్యాన్ని, ప్రవృత్తిలోని వైవిధ్యాన్ని సందర్శించేందుకు ఇవి మనకు సహకరిస్తాయి.

ధర్మార్జితమైన అర్థానికి మూడే గతులు - దానం, భోగం, నాశం. వీటిని ఆచరించడంలో ఎన్నో దారులు ఉన్నాయి. వింత పద్ధతు లెన్నో వీటిలో మనకు కనిపిస్తాయి. ఆ పద్ధతులను ఆలంబనగా చేసుకున్న ప్రహసనాలు లెక్కకు మిక్కిలి. అర్థార్జనలోని కష్టనష్టాలను దరిద్రదుర్దైవప్రహసనం, పురుషరమణీయప్రహసనం వంటివి తెలియజేస్తే, ఆ ధనాన్ని దానం చేయడంలోని లుబ్ధత్వాన్ని దరిద్రదుర్దైవం లోని ఒక పాత్ర ఎంతో అందంగా ప్రకటిస్తోంది. సంపాదించిన ధనాన్ని అనుభవించడంలో ఉండే లుబ్ధత్వాన్ని చిపిటకచర్వణప్రహసనం తెలుపుతుంది. అయితే అర్థానుభవానికి బానిస అయినవాడు దాన్ని సంపాదించడంలో ఎంత నేర్పునూ, నిర్లజ్జతనూ ప్రకటిస్తాడో, ఎంత తేలికైపోతాడో, పరుల మీద ఆధారపడి ఎలా బ్రతుకుతాడో కౌండిన్య ప్రహసనం అత్యంత మనోహరంగా ప్రకటిస్తుంది. అర్థార్జనను పవిత్రంగా భావించి, సక్రమ మార్గాల ద్వారా శారీరక మానసిక శ్రమలను రెంటినీ జోడించి, కళాత్మకంగా ధనసంపాదన చేయటాన్ని ఇంద్రజాల ప్రహసనం నిరూపిస్తుంది. అది ఒక గారడీ విద్య అనిపించినా దానిలోనే కళారూపాన్ని ప్రతిబింబింపజేసి, యథార్థజీవితంలో చూచే గారడీ కన్న దానికి వైశిష్ట్యాన్ని కల్పించి, అభినందనలకు అర్హమైన దానినిగా నిర్వహించిన నేర్పు రచయితది.

అర్థమంటే అర్థశాస్త్రమని అర్థం కాకపోయినా అర్థసంబద్ధమైన అంశాలూ, రాజనీతి ప్రధానాంశాలూ అని అర్థం చెప్పడం అనుచితం కాదు. రాజనీతి ప్రధానమైన

ప్రహసనాలు ప్రాచీన సాహిత్యంలో తక్కువ. ఆధునిక సాహిత్యంలో చాలా ఉన్నాయి. మనది ప్రజాప్రభుత్వవిధానం కాబట్టి దానిలోని లోటుపాటులను గుర్తించి, అధిక్షేపించి, ప్రక్షాళన చేయాలని ప్రయత్నించడంలో ప్రహసన రచయితలు కూడా ఇతరులకు తీసి పోలేదు. రాజనీతిలోని లోపాలనూ, తద్ద్వారా అపరిష్కృతాలుగా మిగిలిపోతున్న ప్రజాసమస్యలనూ చిత్రించడంలో అనేకులు కృతకృత్యులయ్యారు. వేష్టనవ్యాయోగప్రహసనం, స్వర్గీయహసనప్రహసనం, అథకిం మొదమోడలైనవి ఈ కోవకు చెందినవి. సామ్యసాగరకల్లోలప్రహసనం వంటివి సమకాలీన సమాజం లోని సామ్యవాద సిద్ధాంతాలనూ, తదవగాహనలోని అవకతవకలనూ సూటిగా తెలియజేస్తాయి. మొత్తానికి ఈ ప్రహసనాలన్నీ కూడ వర్తమాన సంఘంలోని అధర్మపద్ధతులను స్పష్టంగా ఎత్తి చూపి, ప్రక్షాళన చేయటానికి ప్రయత్నించినవే.

ధర్మమూ, ఔచిత్యమూ - ఈ రెండూ చాలా సన్నిహితాలయిన పదాలు. దేని కేది తగినదో అది ఉచిత మవుతుంది. దాని భావం ఔచిత్యం. అటువంటి ఔచిత్యాలను సూత్రబద్ధం చేసినపుడు అది ధర్మం. అంటే వ్యక్తుల వైయక్తిక నిర్ణయాలకూ, ఆలోచనలకూ సంబంధించిన విషయాన్ని ఔచిత్యమంటే, ఆ ఆలోచనల నిర్దిష్టరూపం, లేదా కాలక్రమంగా తదాచరణలో ఏర్పడ్డ నిష్కృష్టసూత్రం ధర్మ మవుతుంది. ప్రహసనాలన్నీ (దాదాపు) అనౌచిత్యాన్ని పరిహసించడం ద్వారా ఉచిత మయిన ఆచరణను ప్రోత్సహించేవే. కాబట్టి ఔచిత్యస్థానంలో ధర్మపదాన్ని స్వీకరిస్తే ప్రహసనాలన్నీ అధర్మాన్ని పరిహసిస్తూ, ధర్మాన్ని ప్రబోధించినవే అనవచ్చు. అయితే ప్రాచీన ధర్మశాస్త్రాలు ఆధునిక వృత్తులకూ, ప్రవృత్తులకూ యథాతథంగా అన్వయించే అవకాశం తక్కువ. వర్ణాశ్రమాల కనుగుణంగా ప్రాచీన ధర్మసూత్రాలు కనిపిస్తాయి. వర్తమానకాలంలో తత్సాంకర్యం ఉన్నందువల్ల పూర్తిగా అన్వయింపక పోవచ్చుగాని, మౌలికాంశాలలో మార్పు లేదు. వాటిని ఆధునిక జీవితాలకు అనుగుణంగా మలచు కొనవలసి ఉంటుంది.

కర్తవ్యపరాఙ్ముఖత, లంచగొండితనం, అవినీతి వగైరా విషయాలు ఈనాటి సంఘాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలు. ప్రహసన రచయితలు వాటిపై కూడా దృష్టిని కేంద్రీకరించి, సంఘాన్ని ధర్మబద్ధం చేయాలని ప్రయత్నించారు. ఇంద్రజాలం, నిర్గృహఘట్టం మొదలయిన ప్రహసనాల్లో ఇటువంటి సన్నివేశాలు కనిపిస్తాయి.

కాలగతిలో ఏర్పడిన కొన్ని మార్పులు ప్రహసనాల్లో కూడ చాలా మార్పులు తెచ్చాయి. ఒకనాటి వ్యవస్థ వ్యక్తిని కేంద్రీకరించుకొని ఉంటే నేటి వ్యవస్థ శక్తినీ, సంఘాన్ని కేంద్రీకరించుకొని ఉంది. నాటి చక్రవర్తులు వంశపరంపరగా వచ్చిన వారయితే నేటి పాలకులు ప్రజానిర్ణీతులు. కాబట్టి ప్రహసన రచయితలు కూడా తొలి దశలో వ్యక్తిగతమయిన పురుషార్థ సందర్శనానికి ప్రయత్నించి, క్రమంగా సామాజిక దృష్టితో వాటిని పరిశీలించారు. అందుకే ప్రహసనాల్లో సామాజిక సమస్య లన్నీ చోటు చేసుకున్నాయి. ఈ రీతిగా వ్యక్తిపరిధిలో ప్రారంభమయిన ప్రహసనం, తన పరిధిని విస్తృత పరచుకొని సామాజిక ధర్మసాధనకు ప్రయత్నిస్తోంది.

అనుబంధం

1. ప్రహసనాల పట్టిక

1	అంత్యేష్టి సంస్కార ప్రహసనమ్	మూలం – రవీంద్రనాథ్ ఠాగూర్ అనువాదం K. కమల	ముద్రితం	"సూర్యోదయ" (ప)
2	అకించన కాంచనమ్	అభిరాజేంద్ర మిశ్రా	ముద్రితం	వైజయన్తీ ప్రకాశనమ్ జైన్‌పూర్ - 1974
3	అథ కిమ్	సిద్ధేశ్వర చటోపాధ్యాయ	ముద్రితం	సంస్కృత సాహిత్య పరిషత్ కలకత్తా - 1974
4	అద్భుత తరంగ ప్రహసనమ్	హరిజీవన మిశ్రా	అముద్రితం	అనూప్ లైబ్రరీ – బికానేర్
5	అనంగదా ప్రహసమ్	వకుళ భూషణుడు	ముద్రితం	"భారతీ" (ప) 6-1
6	అన్యాయ రాజ ప్రహసనమ్	బి. రామాచార్యులు	-	ధూర్తనర్తకమ్ - ఉపోద్ఘాతం
7	అనిద్రరతి వీర ప్రహసనమ్	విక్రాల శేషాచార్యులు	అముద్రితం	వ్రాతప్రతి – రచయిత ద్వారా
8	అనుకూల గలహస్తక ప్రహసనమ్	విష్ణు పద భట్టాచార్యులు	ముద్రితం	"మంజూషా" (ప) 1959
9	అమర్ష మహిమా ప్రహసనమ్	త్రివేంకటాచార్యులు	-	ధూర్తనర్తకం – ఉపోద్ఘాతం
10	అరట్టఘట్ట ప్రహసనమ్	స్కందశంకర ఖోత్	ముద్రితం	నాగ్‌పూర్
11	అలబ్ధ కర్మీయ ప్రహసనమ్	జె. ఆర్. నాయర్	ముద్రితం	శ్రీ చిత్ర – త్రివేండ్రమ్ - 1942
12	ఆత్మస్తుతి ప్రహసనమ్	-	-	అర్వాచీన సంస్కృత సాహిత్య – పు -121
13	ఆనంద కోశ ప్రహసనమ్	-	అలబ్ధం	రసార్ణవ సుధాకరం
14	ఇంద్రజాలమ్	అభిరాజేంద్ర మిశ్రా	అముద్రితం	వ్రాతప్రతి – రచయిత ద్వారా
15	ఉన్మత్త కవి కలశ ప్రహసనమ్	వేంకటేశ్వరుడు	అముద్రితం	సరస్వతీ మహల్ గ్రంథాలయం తంజావూర్

16	ఉభయ రూపకమ్	మహాలింగశాస్త్రి	ముద్రితం	"ఉద్యాన పత్రికా" (ప) 1962
17	కః ప్రథమం జలమానేష్యతి	డా॥ ఆలోకదాసగుప్తా	ముద్రితం	
18	కః శ్రేయాన్	గజేంద్ర శంకర్ లాల్	ముద్రితం	బొంబాయి 1976
19	కందర్పకేళి ప్రహసనమ్	-	అలబ్ధం	సాహిత్యదర్పణం
20	కపోతాలయ ప్రహసనమ్	లీలా	ముద్రితం	ఆధునిక సంస్కృత నాటక్ – ద్వితీయ భాగం – పు 1024
21	కర్మఫల ప్రహసనమ్	రమానాథ మిశ్రా		" " పు 947
22	కలికేలీ ప్రహసనం (లేక) శశికళా ప్రహసనమ్	-	అలబ్ధం	భావప్రకాశనము
23	కలిమాహాత్మ్య ప్రహసనమ్	-	ముద్రితం	"విద్యోదయ" (ప) లాహోర్
24	కవి సమ్మేళన ప్రహసనమ్	విశ్వనాథ మిశ్రా	ముద్రితం	"భారతీ" (ప) 21-1
25	కలివిడంబన ప్రహసనమ్	-	-	ధూర్తనర్తకం - ఉపోద్ఘాతం
26	కాంచనమాలా ప్రహసనమ్	సురేంద్రమోహనుడు	-	
27	కాల విలాస ప్రహసనమ్	రామానుజ విద్యాభూషణుడు	ముద్రితం	విద్యోదయ (ప) లాహోర్
28	కాలేయ కుతూహల ప్రహసనమ్	భరద్వాజ	-	బరోడా ఓరియంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
29	కాళిదాస ప్రహసనమ్	వెంకటేశ్వరుడు	ముద్రితం	వావిళ్ల రామస్వామిశాస్త్రులు & సన్స్ – మద్రాసు1916
30	కాళీలేళీ ప్రహసనమ్	-	-	A bibliography of Sanskrit Drama

31	కాళీదాస ప్రహసనమ్	-	-	ధూర్తనర్తకమ్ - ఉపోద్ఘాతం
32	కుక్షింభరి ప్రహసనమ్ (లేక) కుక్షింభరి భైక్షవ ప్రహసనమ్	వేంకటాచార్యులు	అముద్రితం	ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, మైసూరు
33	కుహనాభైక్షవ ప్రహసనమ్	తిరుమలనాథుడు	అముద్రితం	”
34	కుమార విజయ ప్రహసనమ్	ఘనశ్యాముడు	”	”
35	కృష్ణదౌత్య ప్రహసనమ్	-	-	ధూర్తనర్తకమ్ - ఉపోద్ఘాతం
36	కౌండిన్య ప్రహసనమ్	మహాలింగ శాస్త్రి	ముద్రితం	సాహిత్యచంద్రశాలా – తిరువలంగుడ
37	కౌతుక సర్వస్వ ప్రహసనమ్	గోపీనాథ చక్రవర్తి	అముద్రితం	-
38	కౌతుక రత్నాకర ప్రహసనమ్	కవితార్కికుడు	”	Indian Library, Landon
39	క్షుత్క్షేమీయ ప్రహసనమ్	జీవన్యాయతీర్థ	ముద్రితం	కలకత్తా 1972
40	గురు వాక్యమ్	మూలం – రవీంద్రనాథ్ ఠాగూరు	”	
41	గౌరీ దిగంబర ప్రహసనమ్	శంకర మిశ్రా	”	Chowkamba Sansskrit Series 1969
42	ఘృత కుల్యావళీ ప్రహసనమ్	హరిజీవన మిశ్రా	అముద్రితం	అనూప లైబ్రరీ, బికానేర్
43	చండ తాండవ ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	ముద్రితం	పంచానన స్మృతి గ్రంథమాలా, కలకత్తా
44	చండానురంజనమ్	ఘనశ్యాముడు	అముద్రితం	సరస్వతీమహల్ గ్రంథాలయం, తంజావూరు
45	చాముండా	కె.ఎల్.వి.శాస్త్రి	ముద్రితం	పాల్ఘాట్
46	చిపిటక చర్వణ ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	”	కలకత్తా 1972

47	చౌర చాతురీయ ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	ముద్రితం	సంస్కృత సాహిత్య పరిషత్ పత్రికా (ప) 1951
48	ఛలితాధమర్ణమ్	అభిరాజేంద్రమిశ్రా	”	అక్షయవటప్రకాశనమ్ అలహాబాద్ 1977
49	డమరుకమ్	ఘనశ్యాముడు	”	వావిళ్ల – మద్రాసు - 1939
50	డిండిమ ప్రహసనమ్	-	-	-
51	డోలా పంచీలక ప్రహసనమ్	రామనాథ శాస్త్రి	-	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ పు-24
52	తీర్థయాత్రా ప్రహసనమ్	రామ్ కుబేర్ మాలవ్యా	ముద్రితం	సూర్యోదయ (ప) 1966
53	తైల మర్దన ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	”	కలకత్తా 1964
54	దమనక ప్రహసనమ్	-	-	ప్రాచ్యలిఖిత పుస్తక గ్రంథాలయం, మద్రాస్
55	దరిద్ర దుర్దైవ ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	ముద్రితం	సంస్కృత సాహిత్యపరిషత్, కలకత్తా 1968
56	దామక ప్రహసనమ్	-	”	The Punjab Sanskrit Book Depot, Lahore1926
57	దేవ దుర్గతీ ప్రహసనమ్	-	-	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ పు.25
58	దౌర్భాగ్య మంజరీ ప్రహసనమ్	రామపాణిపాద	అముద్రితం	గవర్నమెంటు లైబ్రరీ – తిరువనంతపురం
59	ధన్యేయం గాయనీ కళా	గజానన బాలకృష్ణ పలసులే	ముద్రితం	ఆధునిక సంస్కృత నాటక్ భా.II, పు.1224
60	ధరిత్రీపతి నిర్వచన ప్రహసనమ్	సిద్ధేశ్వర ఛటోపాధ్యాయ	”	సంస్కృత సాహిత్య పరిషత్, కలకత్తా 1971
61	ధూర్తచరిత ప్రహసనమ్	-	-	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ – పు.2
62	ధూర్త నర్తక ప్రహసనమ్	సామరాజ దీక్షితుడు	ముద్రితం	సంస్కృత విద్యాపీఠమ్ – న్యూఢిల్లీ 1978
63	ధూర్త విడంబన ప్రహసనమ్	అమరేశ్వరుడు	అముద్రితం	New Catalogues Catalogorum vol IX P 330

64	ధూర్త విడంబన ప్రహసనమ్	మహేశ్వరుడు	అముద్రితం	New Catalogues Catalogorum vol IX P 303
65	ధూర్త సమాగమ ప్రహసనమ్	జ్యోతిరీశ్వరుడు	”	ప్రాచ్యలిఖిత పుస్తక గ్రంథాలయం, మద్రాసు- R2380
66	ధ్రువతారమ్	స్కందశంకరఖోత్	ముద్రితం	నాగ్‌పూర్
67	నటక మేలక ప్రహసనమ్	-	-	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ - పు.25
68	నవా వితాడనమ్	సిద్ధేశ్వర ఛటోపాధ్యాయ	ముద్రితం	సంస్కృత సాహిత్య పరిషత్ కలకత్తా - 1974
69	నపుంసక లింగస్య మోక్షప్రాప్తిః	సత్యవ్రత శాస్త్రి	”	"భారతీ" (ప) 4-5
70	నవరస ప్రహసనమ్	అభిరాజేంద్ర మిశ్రా	”	వైజయన్తీ ప్రకాశనమ్ – జైన్‌పూర్ - 1972
71	నవోఢా వధూః వరశ్చ	పట్టాభిరామశాస్త్రి	”	సంస్కృత సాహిత్య పరిషత్పత్రికా (ప) కలకత్తా-1963
72	నష్టహాస్య ప్రహసనమ్	జీవన్యాయతీర్థ	”	కలకత్తా 1964
73	నాటవాట ప్రహసనమ్	యదుమండనుడు	”	బొంబాయి
74	నాట్యేచ దక్షా వయమ్	క్షీరసాగరుడు	”	"సూర్యోదయ" (ప) 4-3, 4-5
75	నిపుణికా	కె.ఎల్.వి.శాస్త్రి	”	పాల్‌ఘాట్
76	నిర్గృహ ఘట్టమ్	అభిరాజేంద్ర మిశ్రా	అముద్రితం	వ్రాతప్రతి – రచయిత ద్వారా
77	పాండిత్య చరిత ప్రహసనమ్	మధుసూదన కావ్య తీర్థుడు	-	సంస్కృత్ మే ఏకాంకీరూపక్ పు-24
78	పయోధి మంథన ప్రహసనమ్	-	-	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ పుట-24
79	పలాండు మండన ప్రహసనమ్	హరి జీవన మిశ్రా	అముద్రితం	అనూప్ లైబ్రరీ – బికనేర్
80	పాండిత్య తాండవిత ప్రహసనమ్	వటుకనాథ శర్మా	ముద్రితం	"సూర్యోదయః" 1972

81	పురుష రమణీయ ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	ముద్రితం	సంస్కృత సాహిత్య పరిషత్పత్రికా (ప) కలకత్తా 1948
82	పాషండ విడంబన ప్రహసనమ్	మహేశ్వరుడు		
83	ప్రతాపరుద్ర విజయం (లేక) విద్యానాథ విడంబనమ్	డా॥ వి. రాఘవన్	ముద్రితం	మద్రాసు 1969
84	ప్రతాపరుద్రీయ విడంబన ప్రహసనమ్	మధుసూదన కావ్యతీర్థుడు	-	-
85	ప్రత్యాశి పరీక్షణమ్	హరిదత్త శాస్త్రి	-	ధూర్తనర్తకం – ఉపోద్ఘాతం
86	ప్రహసనమ్	శివరామశర్మ		అనూప్ లైబ్రరీ - బికానేర్
87	ప్రాసంగిక ప్రహసనమ్	హరిజీవన మిశ్రా	అముద్రితం	ధూర్తనర్తకం - ఉపోద్ఘాతం
88	బుద్ధి ప్రహసనమ్	గజేంద్ర శంకర్‌లాల్ పాండ్యే	ముద్రితం	-
89	బృహత్సాభద్రక ప్రహసనమ్	-	అముద్రితం	దేవభాషా ప్రకాశనమ్ – ప్రయాగ 1926
90	భగవదజ్జుక ప్రహసనమ్	బోధాయన కవి	ముద్రితం	వావిళ్ల రామశాస్త్రులు & సన్స్ 1925
91	భట్టసంకట ప్రహసనమ్	జీవన్యాయ తీర్థుడు		సంస్కృత సాహిత్య పరిషత్పత్రికా – కలకత్తా 1926
92	బాలభవిష్య ప్రహసనమ్	ఎస్.ఎస్. ఖోరా	-	ధూర్తనర్తకం – ఉపోద్ఘాతం
93	భ్రమరకాహళీ ప్రహసనమ్	-	-	-
94	మణికాంచన సమన్వయ ప్రహసనమ్	విష్ణుపద భట్టాచార్యుడు	ముద్రితం	"మంజూషా" (ప) 14-4
95	మణి మంజూషా	సురేంద్ర మోహన్	-	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ పు-24
96	మత్త విలాస ప్రహసనమ్	మహేంద్ర విక్రమ వర్మా	ముద్రితం	చౌఖాంబా విద్యాభవన్ – వారణాసి1966
97	మదనకేతు చరితమ్	రామపాణి వాదుడు	ముద్రితం	-

98	మనోరంజన ప్రహసనమ్	పెదకోమటి వేమారెడ్డి	అలబ్ధం	Contribution of Andhras' to Sanskrit Literature – p 66
99	మాలాభవిష్య ప్రహసనమ్	స్కందశంకర ఖోత్	ముద్రితం	నాగపూర్
100	మిథ్యాచార ప్రహసమ్	-	-	A bibliography of Sanskrit Drama – P 104
101	మిథ్యా గ్రహణం	లీలా	ముద్రితం	
102	ముండిత ప్రహసనమ్	శివజ్యోతిర్వింద	అలబ్ధం	-
103	రాగవిరాగ ప్రహసనమ్	జీవన్యాయ తీర్థుడు	ముద్రితం	కలకత్తా 1972
104	రామనామ దాతవ్య చికిత్సాలయ ప్రహసనమ్	జీవన్యాయ తీర్థుడు	”	
105	లటకమేలకమ్	శంఖధరుడు	”	చౌఖాంబా విద్యాభవన్ – వారణాసి - 1962
106	లాలావైద్యమ్	స్కందశంకర్ ఖోత్	”	నాగపూర్
107	లీలా విలాస ప్రహసనమ్	కె.ఎల్.వి. శాస్త్రి	”	పాల్ఘాట్
108	లోక రంజన ప్రహసనమ్	శ్రీనివసాచార్యుడు	అముద్రితం	ప్రాచ్యలిఖిత పుస్తకాలయం - హైదరాబాద్
109	వనభోజన ప్రహసనమ్	జీవన్యాయతీర్థుడు	ముద్రితం	"ప్రణవపారిజాతః" (ప) 4-9
110	వంచనా ఫలమ్	చిలుకూరి రామభద్రశాస్త్రి	ముద్రితం	ధూర్తనర్తకం - ఉపోద్ఘాతం
111	వల్గు ప్రహసనమ్	రత్నాకరుడు	-	ధూర్తనర్తకం - ఉపోద్ఘాతం
112	విద్యామందిరం	సుఖమయ గంగోపాధ్యాయ	ముద్రితం	ఆధునిక సంస్కృత నాటక్ – భా II- - పు.250
113	విధవా వివాహ ప్రహసనమ్	-	-	ధూర్తనర్తకం - ఉపోద్ఘాతం
114	విధివిపర్యాస ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	ముద్రితం	కలకత్తా 1956

115	వినోద రంగ ప్రహసనమ్	సురేంద్ర ద్వావిద్యా	-	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ పు. 24
116	విబుధ మోహన ప్రహసనమ్	హరి జీవన మిశ్రా	ముద్రితం	"మలయమారుతః" (ప) తిరుపతి 1965
117	విముక్తి ప్రహనమ్	డా॥ వి. రాఘవన్	"	మద్రాసు
118	వివాహ విడంబన ప్రహసనమ్	జీవన్యాయ తీర్థ	"	"సంస్కృత ప్రతిభా" (ప) 3-1
119	విష్ణోర్దశమావతారమ్	రసరాజు	"	"సంవిత్" 18-3
120	వేష్టన వ్యాయోగ ప్రహసనమ్	వీరేంద్రకుమార్ భట్టాచార్య	"	సంస్కృత సాహిత్యపరిషత్ – కలకత్తా - 1971
121	వైధేయ విక్రమ ప్రహసనమ్	అభిరాజేంద్ర మిశ్రా	అముద్రితం	
122	సుభగానంద ప్రహసనమ్	వాసుదేవ నరేంద్ర	"	
123	శరభావోదయ ప్రహసనమ్	కృష్ణానందాచార్యుడు	"	New Catalogues Catalogorum
124	శతవార్షిక ప్రహసనమ్	జీవన్యాయతీర్థ	ముద్రిత్రం	కలకత్తా 1972
125	శశివిలాస ప్రహసనమ్	-	-	-
126	శిల్ప ప్రహసనమ్	విష్ణుపదభట్టాచార్యుడు	-	-
127	శివరాత్రి మాహాత్మ్యమ్	చిలుకూరి రామభద్రశాస్త్రి	-	-
128	శృంగార నారదీయ ప్రహసనమ్	మహాలింగ శాస్త్రి	ముద్రితం	సాహిత్య చంద్రశాలా – తిరుమలంగూడ 1956
129	శంకర వివాహ ప్రహసనమ్	విశ్వేశ్వర	"	
130	సంస్కార కౌతుక ప్రహసనమ్	-	"	"విద్యోదయ" (ప) 1967
131	సమీహిత సమీక్షణమ్	సుబ్రహ్మణ్య శర్మ	"	"అమృతలతా" (ప) 1967

132	సర్వదళ సమ్మేళన ప్రహసనమ్	డా॥ రుద్రదేవ త్రిపాఠి		
133	సహృదయానంద ప్రహసనమ్	హరిజీవన మిశ్రా	అముద్రితం	
134	సాంద్రకుతూహల ప్రహసనమ్	కృష్ణదత్తుడు	”	Bhandarkar Institute - Puna
135	సాగరకౌముదీ ప్రహసనమ్	-	అలబ్ధం	భావప్రకాశనమ్
136	సైరంధ్రికా ప్రహసనమ్	-	”	”
137	సోమవల్లీ యోగానంద ప్రహసనమ్	అరుణగిరినాథుడు	అముద్రితం	ప్రాచ్యలిఖిత పుస్తకాలయం - మైసూర్
138	స్నుషా విజయమ్	సుందరరాజ సూరి	ముద్రితం	
139	స్వర్గీయ ప్రహసనమ్	రవీంద్రనాథ్	”	
140	స్వర్గీయహసన ప్రహసమ్	సిద్ధేశ్వర చటోపాధ్యాయ	”	సంస్కృత సాహిత్య పరిషత్ – కలకత్తా 1977
141	స్వాతంత్ర్య మహాహుతి ప్రహసనమ్	జీవన్యాయతీర్థ	-	ధూర్తనర్తకం - ఉపోద్ఘాతం
142	స్వాతంత్ర్య యజ్ఞాహుతి ప్రహసనమ్	జీవన్యాయతీర్థ	-	ధూర్థనర్తకం - ఉపోద్ఘాతం
143	స్వాతంత్ర్య సంధిక్షణ ప్రహసనమ్	జీవన్యాయతీర్థ	ముద్రితం	సంస్కృత సాహిత్య పరిషత్పత్రికా (ప) కలకత్తా 1957
144	స్వైరాచారప్రహసనమ్	నారాయణశాస్త్రి	అముద్రితం	
145	సంస్కృత ప్రహసనమ్	వాసుదేవ ద్వివేది		
146	హాస్యకుతూహల ప్రహసనమ్	విట్ఠలకృష్ణ విద్యావాగీశ	అముద్రితం	అనూప్ లైబ్రరీ - బికానేర్
147	హాస్యకుముదాకర ప్రహసనమ్	కల్లూరి వేంకటేశ్వరశాస్త్రి		
148	హాస్య చూడామణి ప్రహసనమ్	వత్సరాజు	ముద్రితం	దేవభాషా ప్రకాశనమ్ - ప్రయాగ

149	హాస్యసాగర ప్రహసనమ్	రామానందుడు	అముద్రితం	సంస్కృత విశ్వవిద్యాలయ గ్రంథాలయం వారణాసి
150	హాస్యార్ణవ ప్రహసనమ్	జగదీశభట్టాచార్యుడు	ముద్రితం	చౌఖాంబా భవన్ – వారణాసి 1963
151	హా హస్త శారదే	స్కందశంకరఖోత్	”	నాగపూర్
152	హృదయ వినోద ప్రహసనమ్	ముద్రితం	”	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్, పు-25

అనుబంధం - 2
ఉపయుక్త గ్రంథ సూచిక

సంస్కృతం

1. అగ్ని పురాణం ...
2. అభిజ్ఞాన శాకుంతలం ... కాళిదాసు
3. అభినవ భారతి ... అభినవ గుప్తుడు
4. ఏకావళీ ... విద్యాధరుడు
5. కావ్యానుశాసనం ... భామహుడు
6. కావ్యాలంకారః ... హేమచంద్రుడు
7. దశరూపకం ... ధనంజయుడు
8. ధ్వన్యాలోకః ... ఆనంద వర్ధనుడు
9. నాగానందం ... శ్రీహర్షుడు
10. నాట్యదర్పణం ... రామచంద్ర గుణచంద్రులు
11. నాట్యశాస్త్రం ... భరతుడు
12. ప్రతాపరుద్రీయం ... విద్యానాథుడు
13. ప్రబోధ చంద్రోదయం ... కృష్ణమిశ్రుడు
14. భావప్రకాశనం ... శారదాత నయుడు
15. మృచ్ఛకటికం ... శూద్రకుడు
16. రసతరంగిణీ ... భానుదత్తుడు
17. రసార్ణవ సుధాకరః ... సింగభూపాలుడు
18. వింశ శతాబ్దికం సంస్కృత రూపకం ... డా|| రామ్ ఉపాధ్యాయ్
19. శృంగార ప్రకాశః ... భోజుడు
20. శృంగార రసార్ణవ భాణH ... నల్లా దీక్షితుడు
21. సరస్వతీ కంఠాభరణం ... భోజుడు
22. సాహిత్యదర్పణః ... విశ్వనాథుడు
23. సాహిత్య రత్నాకరః ... ధర్మసూరి
24. సంస్కృత సాహిత్యానుశీలనం ... డా|| రామ్‌జీ ఉపాధ్యాయ్

తెలుగు

1. హాస్యతోరణం ... సం|| పోలాప్రగడ సత్యనారాయణ.
2. మన హాస్యము ... మునిమాణిక్య నరసింహారావు
3. సంస్కృతభాణ సాహిత్యము ... డా|| తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
సూరం శ్రీనివాసులు

4. తెలుగు హాస్యము ... కీ॥ శే ముట్నూరి సంగమేశం
5. తెలుగు సామెతలు ... సం॥ విశ్వనాథ సత్యనారాయణ
6. తెలుగు సాహిత్యములో హాస్యరసము ... శ్రీమతి మాణిక్యం వేదపల్లి తాయారమ్మ

హింది

1. ఆధునిక సంస్కృతనాటక్ ... రామ్ జీ ఉపాధ్యాయ్
2. భారతీయ సాహిత్య శాస్త్రకోశ్ ... డా॥ హీరా
3. మధ్యకాలీన సంస్కృత నాటక్' ... డా॥ రామ్ జీ ఉపాధ్యాయ్
4. సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ ... డా॥ ఏరబాలాశర్మ

ENGLISH:

1. A dictionary of literary terms ... J. A. Cuddon
2. A History of Sanskrit Literature ... A. B. Keith
3. A History of English Literature ... A. C. Rickett
4. A Short History of English Drama ... Dr Raghukul Tilak
5. Comedy ... P. P. Mehta
6. Contribution of Andhras' to Sanskrit Literature ... Dr. P. Srirama Murthy
7. Contribution of Bihar to Sanskrit Literature ... Suresh Chandra Benerji
8. Dramas ... HH Wilson
9. Every man in his humour ... Ben Jenson
10. History of Sanskrit Literature ... Krishnamacharya
11. New Catalogues Catalogorum I to X Volumes -
12. Prinction Encyclopaedia of Peetry and Poetics ... Ed. Alev Preminge
13. Sanskrit Comic Characters ... J. T. Parikh
14. Sanskrit Drama of 20th Century ... Smt. Usha Satyavati
15. Shakespearean Comedy ... Dr. Sengupta
16. Shakespearean Comedy ... Dr Raghukul Tilak
17. Satire ... Arthur Pollard
18. The Sanskrit Drama ... A B. Keith
19. The New Dictionary of thoughts -

అనుబంధం -3

మత్త విలాస ప్రహసనము

మత్తవిలాస ప్రహసనము

సంస్కృత మూలము : మహేంద్రవిక్రమవర్మ

తెలుగు అనువాదము : రాధా[1]

(నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశించును)

నాల్గు దెఱఁగులఁదగు నభినయము గలిఁగి
భావదీప్తిచే నవరస భరితమయిన
విశ్వవిఖ్యాత నాట్యంపుఁ బ్రేక్షకుఁడు, న
టుఁడునగు కపాలి సుయశంబు నిడుత మీకు

సూత్రధారుడు: ఆహా! చిన్న భార్యవలనఁ గోపగించిన నా జ్యేష్ఠ భార్య నననయించుటకుఁ దగిన యుపాయమును జేఁజిక్కించుకొంటిని. బహు కాలమునుండి యీ సమాజమున నభినయించుట కాదేశింపఁబడితిని కాన నామె వద్దకే వెళ్ళెదను. (నేపథ్యమువైపుఁ జూచి) ఆర్యురాలా! ఇటురమ్ము.

(ప్రవేశించి)

నటి: (రోషముగా) ఆర్యా! ఇంతకాలమునకు యౌవనగుణ భూయిష్ఠమయిన మత్తవిలాస ప్రహసనమును జూపుట కరుదెంచితివా?

సూత్ర: నిజము. అందుకే యరుదెంచితిని.

నటి: అటులయిన నెవ్వతె నీతోడి కులుకఁగలదో యామెవద్దనే చూపుము.

సూత్ర: నీతోడనే చూపఁదఁలచితిని.

నటి: అట్లు చేయమని యామయే యాదేశించినదా?

---

1 అప్పటి కలం పేరు (నాట్యకళ – జులై 1974లో ప్రచురితం)

సూత్ర: నిజముగా! అంతేగాక యక్కడకు వచ్చిన నీవు మఱింత యనుగ్రహమును సంపాదించుకొనగలవు.

నటి : అది నీకే సరిపోవును.

సూత్ర: పూజ్యురాలా! నీకును సరిపోవును. నీ యభినయముచే సభ సంతసించిన వాంచితార్థఫలములఁ బడయఁగలవు.

నటి: (ఆనందముతో) అట్లయినచో మహానుభావుల యనుగ్రహము లభించినట్లే?

సూత్ర: దాని కేమి? లభించినట్లే!

నటి : నిజమా! అయినచో నీకిష్టమయిన యెట్టికథ నభినయింపవలయును?

సూత్ర: ప్రియమయిన కథ యని మరలఁ జెప్పవలసినదేమున్నది. చూడు.

పులకరింతలఁ బొంగు కపోల రేఖ
స్మితవిలాసాంచిత భ్రూ విశేష కాంతి
గలిఁగి వెలిఁగెడు నీముఖ కమలముంటఁ
గోరఁదగినది విరిబోణి! వేఱుగలదె!

నటి: ఆర్యులచే నిప్పుడు ప్రయోగింపవలసినదేదియో చెప్పుడు.

సూత్ర: మత్తవిలాస ప్రహసనమని నీవే చెప్పితిని గదా!

నటి : నిజమా! అభిప్రాయానుగుణముగాఁ బలుకుటచే నీ విషయములో నా కోపము పక్షపాతసహితమే! ఆర్యా! ఈకృతిచే వెలుఁగులోనికి రాదగిన యా కవి యెవరు?

సూత్ర: ఆర్యురాలా! వినుము. పల్లవకుల భూమణ్డల కులపర్వతుండును, నిఖిలోపాయస్వాయత్తీకృత సామన్తరాజ సేవితుండును, పాకశాసనసమ విక్రమక్రమోపేతుండను, ధనధాన్యోచిత దానపరాభూత చక్రవర్తులు గలవాడును, నరిషడ్వర్గవిజేతయుఁ, బరార్థ పరతంత్రుండును, పంచభూత సమాన ధర్మండును, సింహవిష్ణు కుమారుండును, మహారాజునయిన శ్రీ మహేంద్ర విక్రమ వర్మ మఱియు

ప్రజ్ఞ దానము దయయుఁ బ్రభావధృతులు

కాంతి కళ సత్యము వినయ కౌశలములు
శౌర్య మాదిగ గుణములు జాడలేక
యెవనిఁ జేరెదు లయమున శివునివలెను
సర్గభేదంబు నట్టి సచ్ఛాంతియుతుఁడు

మఱియు

సాగరంబున సద్గుణసారములగు
సూక్తిరత్నాల మాటున శోభనందు
నల్పరత్నాల మాడ్కి ననల్పవిదుని
కడను నల్పుని వాక్యముల్ పడయు వెలుఁగు.

నటి: ఆర్యా! ఇప్పుడాలస్యముఁ జేయనేల? అపూర్వ రీతితో, ననాలస్య నీతితో దీనినిఁ బ్రయోగింప వలయును.

సూత్ర: నిజమే! కాని నేను

ఇపుడు సంగీత ధనుఁడఁ గవీశు సుగుణ
గణ గుణంబున నిమ్నతఁ గాంచినాఁడ!

(నేపథ్యమున)

ప్రియురాలా! దేవసోమా!.

సూత్ర: యువతి సఖుఁడు కపాలి పరవశమతిని
ధనము పోయి కపాలిగాఁ దనరురీతి

(నిష్క్రమింతురు)

ప్రస్తావన

(భార్యతోఁ గూడ కపాలి ప్రవేశించును)

కపాలి: (మత్తు నభినయించుచు) ప్రియురాలా! దేవసోమా! తపస్సుచేఁ గామ రూపము సిద్ధించుననుట నిజమే! ఏమన నీవు మహోత్కృష్ట వ్రతము వలె

ననుష్ఠానము సేయుటచే క్షణకాలములో నీ మేను వింతసోయగమును సంతరించుకున్నది. నీ కిపుడు

చిఱుచెమటల్ మొగంబున నిసీ! కనుదోయిన భ్రూవిలాసముల్,
పరఁగెను ఖేలనమ్ము, స్మితభావ మహేతువు, వ్యక్తి హీనముల్
గిరులును, గన్నులున్నెఱుపు గీల్కొనెఁ, జంచలతన్ వహించె ముం
గురులు కపోలభారమునఁ గూడెడు వీడిన మాలికల్ వలెన్

దేవసోమ: భగవానుడా! నాకు మత్తు గలుగునట్లుగా... మత్తు గలుగునట్లుగాఁ బలుకుచున్నావు.

కపా: ఏమంటివి?

దేవ: ఏమియు ననలేదే!

కపా: నాకే మత్తెక్కినదేమో!

దేవ: భగవానుడా! భూమి తిరుగు... తిరుగుచున్నది. ముందుకుఁ బడఁబోవునట్లున్నాను. పట్టుకొనుము.

కపా: ప్రియురాలా! అట్లే! (పట్టుకొనుచుఁ గ్రిందపడి) ప్రియురాలా! సోమదేవి! నీవేల కోపగించితివి? నేను చేయినందించినను దూరమేగుచున్నావు.

దేవ: ఆహా! సోమదేవి కెంత కోపము వచ్చినదో! నీవు తలవంచి, నమస్కరించి, యనునయించినను దూరమేగుచున్నది.

కపా: నీవే సోమదేవివా? (ఆలోచించి) కాదు కాదు, నీవు దేవసోమవు.

దేవ: భగవానుఁడా! సోమదేవ యంత ప్రియమైనదా? అయినచో నా పేరుతో పిలువఁదగదు.

కపా: ప్రియురాలా! సరళపద స్ఖాలిత్యముగల నా మత్తుదే యీ దోషముగాని నీ తప్పేమియు లేదు.

దేవ: అదృష్టవశమున నీవు సరళపద స్ఖలితుఁడవు గాలేదు!

కపా: మద్యపానదోషమే నాకిట్లు మత్తు నెక్కించుచున్నది. కానిమ్ము కానిమ్ము. ఇప్పటినుండి సురాపానము మానివేసెదను.

దేవ: భగవానుఁడా! నా కారణముగా వ్రతభంగముఁ జేసి తపము నాపఁదగదు. (పాదములపైఁ బడును)

కపా: (ఆనందముతో లేచి, కౌగిలించి) ఛీ...చీ... నమశ్శివాయ యననేల? ప్రియురాలా!

సురను ద్రాగి చూడవలెను దరుణి ముఖము
ప్రకృతి లలితమ్ము వేషమ్ముఁ బడయవలయు
నిట్టి మోక్షపథమ్మును నెవఁడు చూచె
నట్టి శివునకు దీర్ఘాయువగును గాత!

దేవ: భగవానుఁడా! అట్లనవలదు. జైనులు మోక్షమార్గమును వేఱొక్కరీతిగా వర్ణింతురు.

కపా: కళ్యాణి! వారు నాస్తికవాదులు.

కార్య మద్దాని కనురూప కారణమునఁ
గలుఁగునని పల్కుచును దుఃఖకార్యముగను
ముదము వర్ణింపఁబోయెడి మూర్ఖులైన
యా వరాకులు నిజవాక్యహతులు గారె

దేవ: పాపము శమించుగాక! పాపము శమించుగాక!

కపా: పాపము శమించుగాక! ఆ పాపులు ఆక్షేపపూర్వకముగా నైనఁ బలుకఁ దగనివారు. బ్రహ్మచర్యమని, కేశముణ్డనమని, మలధారణమని, భోజన నియమమని, మలినపటధారణమని జనుల బాధించుచున్నారు. ఇప్పుడు వారి పేరు గ్రహించుటచే నపవిత్రమైన నా నాలుకను క్షాలితమును జేయ వలయును.

దేవ: అయినచో మనమిరువురము వేఱొక సురాశాలవద్దకు వెడలెదము.

కపా: ప్రియురాలా! అట్లే పోవుదము.

(ఇరువురు నుపక్రమింతురు)

కపా: ఆహా! ఎత్తైన మేడల పైభాగముల మొయిలుల సందియంబుల నందించు మృదంగముల శబ్దతరంగములచేతను, పూలమాలల వెలుగొందెదు నంగడులచే విందుల పొందుల నందించు వసంతర్తు సౌరభముచేతను, నలరుల విలుతుని శరములవలె గారించు జవ్వనుల నూపురరవళుల చేతను నీ కాంచీపురమెంత రమణీయముగా నున్నది. మఱియు,

అనతిశయము ననవధియు ననమమునగు
నే సుఖసమాధి గతుల మునీశులెల్ల
రెంచిరో యట్టి దిచ్చోట నెఱుకపడెడుఁ
గాని యిది కామకరణ భోగాత్మకమ్ము

దేవ: భగవానుఁడా! అనిందితమయి మదిర మధురమయినట్లు లోకాపవాద విరహితమయి కాంచీపురము మధురముగా నున్నది.

కపా: ప్రియురాలా! చూడు చూడు. ఈ సురాశాల యజ్ఞభూమివలె నున్నది. ధ్వజస్తమ్భమే యూపము. మదిరయే సోమము. శౌణ్డులే ఋత్విక్కులు, చషకములే చమస్సులు, మాంసపుముక్కలే హవిస్సులు, వదరుమాటలే ఋక్కులు, గీతములే సామములు, ఉదంకములే స్రువములు, దాహమే దాహము, సురాశాలాధిపతియే యజమాని.

దేవ: ఇందు మన భిక్ష గూడ యున్నదిగదా! అది రుద్రభాగము గాఁగలదు.

కపా: ఆహా! మద్దెల సద్దుల ననుకరించుచు, నంగవిక్షేప భ్రూవిక్షేపములఁ బ్రకటించుచు, జారిన పయ్యెదల సవరించుచుఁ, బయ్యెదను సవరించుటచే క్షణకాలము లయను తప్పించుచు, రాగస్వరముల బాధించుచు నీ మత్తవిలాసులు సేయు నాట్యమెంత మనోజ్ఞమైనది.

దేవ: ఓహో! గురువులు రసికులే!

కపా: చషకములయందుఁ బోయఁబడెడి భగవత్స్వరూపమైన యీ మదిరయే యాభరణములకుఁ దిరస్కారము. ప్రణయకుపితుల కనునయము. యౌవనఁపుఁ బరాక్రమము. విలాసములకు జీవితము. వేయేల!

పలుకుదు రీజనుల్ మదను ఫాలవిలోచన లోచనాగ్నిఁ దా
నిలువున బూదియై సనుట నేర్పునఁగాని యదంత మిథ్య, యా
తఁడె యిట స్నేహరూపమునఁ దాపవశంబున నిందు లీనమై
నిలిచి మనంబులన్ లలన! నేఁడును రాఁగెడి జాడఁ జూడుమా!

దేవ: భగవానుఁడా! అదియు నిజమే! లోకోపకార నిరతుఁడైన లోకనాథుఁడు లోకాపకారముం గోరునా?

కపా: పూజ్యులారా! భిక్షనిమ్ము.

(నేపథ్యమున)
భగవానుఁడా! ఇదియె భిక్ష స్వీకరింపుడు.

కపా: స్వీకరించెదము ప్రియురాలా! నా కపాలమెక్కడ!

దేవ: నాకును దెలియదే!

కపా: (ఆలోచించి) అయ్యో! ఆ పానశాలయందే మరచినట్లున్నాను. కానిమ్ము మరలఁబోయి చూచెదము.

దేవ: భగవానుఁడా! సాదరముగా సమర్పింపఁబడిన భిక్షను దిరస్కరించుట పాడియే! ఇపుడేమి చేయుదము?

కపా: అయ్యో! ఇక్కడను దొరకలేదే! (దుఃఖము నభినయించి) ఓ దేవతలారా! మా భిక్షాపాత్రను మీరయినఁ జూచితిరా! ... ఏమంటిరి? చూడలేదా? ... అయ్యో! ఎంత మందభాగ్యుండను. నా తపస్సు భగ్నమైనదే! ఇప్పుడు దేనితో నేను కపాలిని కాగలను. ఆఁ! కష్టము కష్టము.

పానము బోనము శయనముఁ
దానెయ్యది శుచిగ నుపకృతంబయి సనె న
ద్దాని వియోగము మిత్రుని
తో నగు విరహంబు మాడ్కి తుష్టినిఁ గూల్చెన్

(క్రిందఁబడి తలఁ గొట్టుకొనుచు) కానిమ్ము. లక్షణమాత్రముగా నది యున్నది. నేను కపాలి పదమునుండి విముక్తుడను కాలేదు.

దేవ: భగవానుడా! ఆ కపాలము నెవరు దీసియుందురు.

కపా: ప్రియురాలా! అడుగున మాంసపుముక్కలుండినవి. వానియందలి యాశచేఁ గుక్క గాని, బౌద్ధభిక్షువుగాని తీసి యుందురని నా తలఁపు.

దేవ: అయినచోఁ గాంచీపురమంతయుఁ దిరిగి చూచెదము.

కపా: ప్రియురాలా! అట్లే చేయుదము.

(ఇరువురును పరిక్రమించుచుందురు. అంతఁ బాత్రహస్తుఁడైన శాక్యభిక్షువు ప్రవేశించును)

శాక్యభిక్షువు: ఆహా! సర్వనివాసయోగ్యమయిన గృహమును దానము సేయుటలో శ్రేష్ఠి ధనదాసుని మహిమ యద్భుతమయినది. అందుండియే నేను నా కిష్టమయిన చేపల మాంసముగల యీ పిండ పాత్రమును సంపాదించితిని. ఇక మఠమునకు వెడలెదను. (పరిక్రమించి) (తనలో) అహా! మేడల నివాసమును, పల్యంకికా శయనమును, బూర్వాహ్ణభోజనము, నపరాహ్ణ పానంబును, కప్పురపు విడియంబు ననుగ్రహించిన దయాళుడైన బుద్ధుడు స్త్రీ సాహచర్యమును, సురాపానము నేల యనుగ్రహింపలేదు? లేదు సర్వజ్ఞుఁడైన బుద్ధుఁడు దానిని గమనించకుండునా? నిరుత్సాహులు, వృద్ధులునయిన బౌద్ధభిక్షువులు మావంటి నవయువకులమీది యీర్ష్యచే వానినిఁ బ్రత్యేకించి మూలగ్రంథములందు మాత్రమే యుంచియుందురు. అన్ని విషయములు గల యా మూలగ్రంథము నాకెట్లు దొరుకఁగలదు. దొరకినచో బుద్ధవచనములను సంపూర్ణముగా విశ్వవ్యాప్తముఁ జేసి సమాజోద్ధరణంబు గావింపనా? (పరిక్రమించును)

దేవ: భగవానుఁడా! చూడు చూడు, విశ్వస్తపురుషులు సంచరించెడి యీ రాచ బాటలో నెవరో రక్తవస్త్రమునూని సంకుచిత సర్వాంగుఁడై నలుదెఱగులఁ జూపు సారించుచు, జడియుచు, నడుగులు వేయుచుఁ ద్వరత్వరగా వెడలుచున్నాడు.

కపా: ప్రేయసీ! నిజమే! అతని హస్తమున వస్త్రాచ్ఛాదిత వస్తువేదియో యున్నది.

దేవ: భగవానుఁడా! అట్లైన వెడలి తెలిసికొందము.

కపా: అట్లే (సమీపించి) భిక్షుకుఁడా! ఆగుమాగుము.

శాక్య: ఎవరు నన్ను పిలిచినది (వెనుదిరిగి చూచి) అరే! ఏకాంబరవాసి యయిన దుష్టకాపాలికుఁడు! కానిమ్ము. మదమత్తుఁడయిన ఈతని లెక్కింపను. (వేగముగా బయలుదేరును)

కపా: ప్రియురాలా! కపాలము దొరికినట్లే; అతఁడు నన్నుఁజూచి భయపడుటయే యందుకు సాక్ష్యము (రివ్వున వెడలి యడ్డగించును) ధూర్తుఁడా! ఎక్కడికిఁ బోగలవు?

శాక్య: కాపాలికోపాసకుఁడా! లేదులేదు. ఏమిటిది? (తనలో) ఈ కాపాలిక చాలా యందముగా నున్నదే!

కపా: భిక్షుఁడా! నీ చేతిలో బట్టమాటున దాచఁబడిన వస్తువును జూడ నిచ్ఛగించుచున్నాను.

శాక్య: చూచుటకేమున్నది? అది భిక్షాపాత్రయే!

కపా: అందుకే చూడఁగోరుచున్నాను.

శాక్య: ఉపాసకుఁడా! వీలు లేదు. దీనిని రహస్యముగాఁ గొనిపోవలయును.

కపా: ఇటువంటి వానిని దాచుటకే బుద్ధుఁ డనేక వస్త్రములఁ గట్టమనియుండును.

శాక్య: ఇదియు నిజమే!

కపా: ఇది తెలిసిన నిజమే! ఆ బట్ట మాటుననున్న నిజమునే యికఁ దెలిసికొనఁగోరుచున్నాను.

శాక్య: ఇంతవఱకు నాడిన పరిహాసము చాలును. భిక్షావేళ మించిపోవుచున్నది, నేను బోవుచున్నాను. (బయలుదేరును).

కపా: దుర్మార్గుఁడా! ఎక్కడకుఁ బోఁగలవు. నా కపాలమును నాకిచ్చి వెళ్లుము. (బట్టను లాగును)

శాక్య: నమో బుద్ధాయ!

కపా: నమః ఖరపటాయ యనుము. చౌర్యశాస్త్రములో నట్లే యున్నది. అయినను ఖరపటమునందుఁ గూడ మీ బుద్ధుఁడే గొప్పవాఁడు. ఏలన

పుడమి వేల్పులు నలపూత వేదాంత భా
రతములందు నిండి రహివహించు
నర్థసంచయమ్ము నంది కోశము గూర్చు
పగిదిఁ గోశ మతఁడు బరఁగఁజేసె

శాక్య: పాపము శమించుఁగాక, పాపము శమించుఁగాక!

కపా: ఇట్టి సదాచారము గల తాపసుల పాపమేల శమింపదు.

దేవ: పూజ్యుఁడా! అలసినట్టున్నావు. ఈ కపాలమును సాధించుటంత సులభము గాదు. ఈ గోశృంగముతో మదిరఁ ద్రాగి, బలముఁగొని యితనితో గొడవపడుము.

కపా: అట్లే చేసెదను.

(దేవసోమ కపాలికి సురనందించును)

కపా: (త్రాగి) ప్రియురాలా! నీవునుఁ ద్రాగి శ్రమను దీర్చుకొనుము.

దేవ: భగవానుఁడా! అట్లే చేసెదను. (త్రాగును)

కపా: ఇతడు మన కపకారి. కాని యితరుల కీయక మనము స్వీకరింపము. కాన మిగిలిన దాచార్యుల కందింపుము.

దేవ: మీ యాన. మీరును స్వీకరింపుడు.

శాక్య: (తనలో) ఆహా! అనాయాసముగా నభ్యుదయము లభియించుచున్నది. మహాత్ములెవ్వరు చూడకయుండిన దోషము లేదు. (ప్రకాశముగా) అట్లనకుడు. మాకిది తగదు. (నాలుక చప్పరించును)

దేవ: మీకర్మ. మీకంత యదృష్టము గూడనా?

కపా: ప్రియురాలా! ముఖప్రసేకముచే నీతనివాణి వాంఛా విపరీతార్థముగాఁ దొరలుచున్నట్లున్నది.

శాక్య: నీకింకను దయ గలుగలేదా?

కపా: దయయున్నచో వీతరాగుఁడ నెట్లుఁగాఁగలను?

శాక్య: రాగద్వేషములు లేనివాఁడు కోపమును గూడ విడువవలయును.

కపా: నా వస్తువు నిచ్చినచోఁ గోపమును వదలివేసెదను.

శాక్య: నీ వస్తువేమిటి?

కపా: కపాలము.

శాక్య: కపాలమేమిటి?

కపా: కపాలమేమిటందువా? ఇదియును సరియైనదే -

గిరిభూధర పాథోనిధి
పరమాద్భుత వస్తుగణముఁ బ్రచ్ఛన్నముగాఁ
బరఁగఁగఁ జేసెడు బుద్ధుని
సరి సుతుఁడవు నీవు దాచఁజాలవె బొచ్చెన్!

దేవ: భగవానుఁడా! మంచిగానడిగిన నిచ్చునట్లు లేదు. బలాత్కారముగా లాగుకొని పోయెదము. (బలాత్కారముగా లాగును)

శాక్య: దుష్ట కాపాలికుఁడా! నీకుఁ బోగాలము దాపురించినది. (చేతులతోఁ బట్టి కాళ్ళతోఁ గొట్టును.)

కాపా: అరె పడిపోతినే.

దేవ: దాసీపుత్రుఁడా! చచ్చితిని (జుట్టు పీకఁబడినదై నేలఁ బడిపోవును)

శాక్య: (తనలో) ముణ్డనము గావించుకొనిన బుద్ధ భగవానుని విజ్ఞత సరియయినదే! (పైకి) ఉపాసకురాలా! లెమ్ము! లెమ్ము! (అని దేవసోమను లేవఁదీయును)

కాపా: ఓ దేవతలారా! చూడుడు చూడుడు. దుష్టభిక్షువయిన యీ నాగసేనుని తోడి నా ప్రియురాలి పాణిగ్రహణము జరుగుచున్నది.

శాక్య: ఆయుష్మంతుఁడా! అట్లనకుము. ఆపదలో నున్నవారిని రక్షించుటయే మా ధర్మము.

కపా: అయ్యో! ఇదిగూడ బుద్ధుని ధర్మమేనా? మొదలంట నఱికివేయఁబడితినే! కానిమ్ము. దీనిదేమున్నది. ఇప్పుడే నీ శిరఃకపాలమును నా భిక్షా కపాలమును జేసికొందును.

శాక్య: అయ్యో! కష్టము కష్టము.

కపా: దేవతలారా! చూడుడు చూడుడు! ఈ దుష్టభిక్షువు నా భిక్షాకపాలమును దొంగిలించి పైగా నరచుచున్నాడు. కానిమ్ము. నేను నరచెదను. అబ్రహ్మణ్యం, అబ్రహ్మణ్యం. (అంత పాశుపతుఁడు ప్రవేశించును)

పాశుపతి: సత్యసోమా! ఏల యాక్రోశించితివి?

కపా: బభ్రుకల్పా! ఈ దుష్టభిక్షువు నాగసేనుఁడు నా భిక్షాకపాలము నపహరించి తిరిగి యీయకున్నాడు.

పాశు: (తనలో) నేను తలఁచిన కార్యమును గంధర్వులే దీర్చినారు. ఈ దురాత్ముండు...

చీరమాటున దాచిన చిద్విలాస
కాకిణినిఁ జూపి యీతఁడు గలికి నాపి
క్షౌరకుని దాసి మత్ప్రియాకర్షణమును
సలుపు గ్రాసాన గోవును వలెను నకట!

కాని యిప్పుడు ప్రతిపక్షప్రోత్సాహముచే శత్రుపక్షమును నాశనము సేసెదను. (ప్రకాశముగా) నాగసేనా! ఇతఁడు చెప్పినది నిజమేనా?

శాక్య: పూజ్యులు మీరునిట్లందురా! అదత్తవస్తు సేకరణము శిక్షాపదసమ్మతము గాదు. బ్రహ్మచర్యము విడచుటయు శిక్షాసమ్మతము గాదు. జీవహింసఁ జేయుటయు శిక్షాపదసమ్మతము గాదు. మా బుద్ధధర్మమునే శరణు గోరెదను.

పాశు: సత్యసోమా! ఈతఁడిట్లనుచున్నాఁడు, ఇఁక నేమనఁగలము.

కాపా: అరె! మాకును నబద్ధములాడఁగూడదని సిద్ధాంతమున్నదే.

పాశు: రెండును సమంజసమే! ఇఁక నిర్ణయోపాయ మేది?

శాక్య: బుద్ధవచనముల ననుసరించెడి శాక్యభిక్షువు సురాపాత్రనేల సంగ్రహించును.

పాశు: ప్రతిజ్ఞామాత్రముచే హేతువాదము సిద్ధించదు.

కపా: ప్రత్యక్షమున్నచో హేతువాద మనవసరము.

పాశు: ప్రత్యక్షమనుటకుఁ బ్రమాణమేమి?

దేవ: భగవానుఁడా! ఈతని చేతిలోని బట్టమాటున దాచఁబడియున్నదే కపాలము.

పాశు: వింటివా?

శాక్య: పూజ్యుఁడా! యీ కపాలమితరులది కాదు.

కపా: అయినచోఁ జూపింపుము.

శాక్య: అలాగే! (చూపించును)

కపా: ఓ దేవతలారా! చూడుడు చూడుడు. కపాలిచేఁ జేయఁబడిన యన్యాయమును, ఈ బౌద్ధసన్యాసి ధర్మవర్తిత్వమునుఁ జూడుడు.

శాక్య: అదత్తవస్తుసేకరణము మునిశిక్షాసమ్మతము గాదు.

(అని మరలఁ జదువును. ఇరువురు నృత్యముఁ జేయుదురు)

శాక్య: ఛీ! ఛీ! సిగ్గుపడవలసిన సమయములో నాట్యమా?

కపా: అరె! ఎవరు నాట్యముఁ జేయుచున్నది? (దిక్కులఁ జూచి) తెలిసినది. పోయిన నా భిక్షాపాత్రము దొరికినదను కుతూహల మలయానిలములచేఁ బ్రీతిలత సూపెడు విలాసములే యీ నాట్యమై యుండును.

శాక్య: భగవానుఁడా! ఏ కారణముచే నా మాటను గుర్తించరు. ఈ కపాల మేరంగులో నున్నదో మీరే చెప్పుడు.

కపా: చెప్పుటకేమున్నది. నేనుఁ జూచితిని కదా! కాకికన్నను నల్లగా నున్నది.

శాక్య: అయినచో నిది నాదే యని నిశ్చయముగాఁ దోచుచున్నది.

కపా: ఆహా! వర్ణాంతరీకరణములో మీ నైపుణ్య మెన్నఁదగినది.

కిసలయకాంతి విసర మప
హసితముఁ జేయఁగల తెలుపునందలియిది, ని
న్నసముచితకర్మcomún జేరుట
వెస తొలిసంజెఁ గల యెఱుపు విధమిడఁబడెనే!

మఱియు

లోనఁ బయినను నీలోనఁ గానిపించు
నీ కషాయము ముందర నిడినయిదియు
నాకషాయ వర్ణంబున నంతమొంది
పోక కాన్పించునది యె ట్లపుణ్యచరిత!

దేవ: అయ్యో! ఎంత దౌర్భాగ్యురాలను. సర్వలక్షణసంపన్నమును, బ్రహ్మశీర్ష కపాలానుకారియుఁ, బున్నమి చందురునివలె జూడఁదగినదియు, నిత్యసుగంధ కలితమునయిన కపాలమునకు నీ మలినవస్త్ర సంసర్గముచే నెట్టి దురవస్థ కల్గినది?

కపా: ప్రియురాలా! దుఃఖింపకుము. దీనికి మరల శుద్ధినిఁ జేసెదము. ఎన్నియో ప్రాణులు ప్రాయశ్చిత్త కర్మములచేఁ బాపములఁ బోగొట్టుకొనుచున్నవి చూడుము.

బ్రహ్మశీర్షంబు భేదించి పాపియయిన
శివుడు నఘము దొలఁగ దీనిఁ జేసినాడు
దేవరాజును జంపియుఁ ద్రిశిరనాము
శతమఖంబుల నా పాపశాంతి నొంది!

బభ్రుకల్పా! దీనినట్లే గానిమ్ము.

పాశు: న్యాయ సమ్మతముగాఁ జెప్పితివి.

శాక్య: ఆ! రంగును మాత్రమే నేను వేసితిననుకొనుడు. ఆకారప్రకారములు నిర్ణయింపవలయును గదా!

కపా: అరే! మీరు మాయాసంతాన సంభవులు గదా!

శాక్య: నీతో నెంతసేపు వాదులాడఁగలను? నీవే పుచ్చుకొనుము.

కపా: భళీ! బుద్ధుఁడు గూడా నిట్టిదానపారమితనే యనుసరించినాడు.

శాక్య: ఇఁక నాకు శరణ్యమేది?

కపా: బుద్ధధర్మసంఘమే.

పాశు: నేనీ వ్యవహారమునుఁ బరిష్కరింపఁజాలను. న్యాయస్థానమునకే పోయెదము.

దేవ: పూజ్యుఁడా! అట్లయినచో నీ కపాలమునకొక నమస్కారము.

పాశు: అట్లనెదవేల?

దేవ: ఈ కపాలమనేక బుద్ధవిహారసంఘములనుండి ధనమును సంగ్రహించినది. కాన ధర్మరతులయిన న్యాయాధికారులను గూడ వశము చేసికొనఁగలదు. మనకు నహిచర్మభూతి దప్ప మఱి యే సంపదయు లేదు. అట్టి దరిద్ర కాపాలికుని పరిచారకులకు న్యాయస్థానమునఁ బ్రవేశించుట కవకాశ మెక్కడ?

సారగురువులు ధర్మసంస్థాపకులును
స్థిరత సౌరున మృదుతను జెలఁగువారు
న్యాయమూర్తులు ధర్మమ్ము మోయువారు
స్తంభములు దివ్యమైన సౌధమును వలెను

కపా: ఈ ప్రసంగములేల? న్యాయాధికారుల కెవ్వరివలనను భయముండదు.

శాక్య: పూజ్యులు మీరును ముందు రావలయును.

పాశు: అట్లే.

(అందరుఁ బరిక్రమింతురు. అంత నున్మత్తకుఁడు ప్రవేశించును)

ఉన్మత్తకుఁడు: ఒసేయ్! కుక్కా! లోపల మాంసపుముక్కయున్న కపాలమును దీసికొని పరుగిడుచున్నావు. దాసీపుత్ర! ఎక్కడికిఁ బోయెదవు? అరె! అది కపాలము నక్కడనుంచి నన్నుఁ దినవలెనని యెదురువచ్చుచున్నది. (దిక్కులఁ జూచి) ఈ రాతితో నీ పళ్ళు రాలఁగొట్టెదను. కపాలమును వదలి పరువెత్తుచుంటివా? పాడు కుక్కా! ఈ మాత్రపు ధైర్యముతోడనే నన్నెదిరింపఁ జూతువా? గ్రామసూకరము నెక్కి మిన్నంటిన మున్నీటిని ఛేదించి, రావణుని జయించినది యీ యింద్రపుత్రుఁడైన తిమింగలము. ఓ యేరండవృక్షమా! ఏమంటివి? అంతయు నబద్ధమంటివా! ముసల సమానమైన విశాలబాహువులు గల దర్దురుడే నాకు సాక్షి. అయినను లోక త్రయ విస్తృతునకు సాక్ష్యముతో నేమి పని? ఇట్లు చేసెదను. కుక్కచే సగము తినఁబడిన యీ మాంసపుముక్కను తినెదను. (తినుచు) భ్రాంతి పడును. అయ్యో అయ్యో! చంపఁబడితిని. ఇనుపముక్కచేఁ గొట్టబడితిని. (ఏడ్చుచు చూచి) ఎవరు నన్నుఁ గొట్టినది? (చూచి) ఓరీ! దుష్టబాలకులారా! భీమసేనునికి ఘటోత్కచునివలె నే నెవరో యొకరికి భాగినేయుఁడనే మఱియు

శూలముల మాని బహువేషధారులయిన
శతపిశాచముల్ నాయందు సతమునుండు
వ్యాఘ్రశతము నిసర్గభయంకరమ్ము
పన్నగముల ముఖమునుండి వదలువాఁడ!

నన్నేల బాధింతురు? ఓరీ దుష్టపాలకులారా! అనుగ్రహింపుడు అనుగ్రహింపుడు. ఈ మాంసఁపుముక్క కారణముగా బాధింపకుఁడు. (ముందుఁ జూచి) అడుగో మా ఆచార్యుడు శూరనంది. ఆయనను సమీపించెదను. (అని పరువెత్తును)

పాశు: అరె! మన యున్మత్తకునివలె నున్నాడు. వాఁడు -

ధరియించి విడిన చిత్రవిచిత్ర చీరచీ
వరములఁ దాల్చుచు వరలువాఁడు
కర్కశమునను నిక్కబొడుచుకొనియుండి
సంస్కారహీనంపు జాడ సూపి

ధూళిసముత్పన్న మాలికావ్యాకుల
మయిన కేశంబుల నవతరించి
దండగ తిండి చేఁదని పెరవారిచే
వాయసంబులచే నపాయరీతి
ననుకరింపఁబడుచు నటునిటుఁ దిరుగుచు
మనుజునాకృతిఁ గన మాహితుండు
గ్రామజనుల ధనము గ్రహియింప నేర్చు, ను
న్మత్తకుండు వలెను మదికిఁదోచె

ఉన్మ: ఇతనిని సమీపించెదను (సమీపించి) ఓ సాధుడా! పాడుకుక్కనుండి సంపాదించిన యీ కపాలమును మీరు స్వీకరింపుడు.

పాశు: (ఎగాదిగాఁ జూచి) అర్హుఁడైనవానికీయుము.

ఉన్మ: మహాబ్రాహ్మణుండా! తమరే గ్రహింపవలయును.

శాక్య: ఈ పాశుపతుఁడే యిందులకర్హుఁడు.

ఉన్మ: (కపాలి వద్దకు వెళ్ళి, కపాలమును క్రిందనుంచి కపాఁలికిఁ బ్రదక్షిణముఁ జేసి పాదములపైఁ బడును) మహాదేవ! అనుగ్రహింపుడు. ఇదె యంజలి ఘటించుచున్నాను.

కపా: అరె! అది నా కపాలము.

దేవ: అవును. అదే!

కపా: మీ యనుగ్రహముచే మరలఁ గపాలి నయితిని.

ఉన్మ: దాసీపుత్రుఁడా! విషమును దినుము. (కపాలమును దాచుకొని వెళ్ళి పోవును)

కపా: (ఉన్మత్తకుననుసరించి) ఈ యమభటుఁడు నా కపాలము నపహరించు చున్నాడు, పట్టుకొనుఁడు పట్టుకొనుఁడు.

ఇరువురు: కానిమ్మి. నీకు మేము సాయముఁ జేసెదము (అందరు అడ్డగింతురు)

కపా: ఆగు! ఆగు!

ఉన్మ: నన్నేందుల కడ్డగింతువు?

కపా: నా కపాలము నిచ్చి వెళ్ళుము.

ఉన్మ: మూర్ఖుడా! కనిపించుటలేదా! ఇది సువర్ణపాత్ర.

కపా: దీనినెవరిట్లు మార్చిరి?

ఉన్మ: బంగారురంగుల చెంగావిమాటున దాచుటచే నిట్లయినదని చెప్పుచుంటిని.

శాక్య: ఏమంటివి?

ఉన్మ: సువర్ణపాత్ర యంటిని.

శాక్య: ఇతఁడున్మత్తుఁడా!

ఉన్మ: ఉన్మత్తుఁడని మాటిమాటికి ననుచునున్నావు. దీనిని తీసికొనిపోయి యున్మత్తునకుఁ జూపుము. (కపాలికిఁ గపాలము నందించును)

కపా: (కపాలమును దీసికొని) అతఁడిప్పుడే గోడమాటున దాగియున్నాఁడు. త్వరగా వెళ్ళుము.

ఉన్మ: అనుగ్రహింపఁబడితిని. (వేగముగా నిష్క్రమించును)

శాక్య: ఆహా! ఏమి యీ యాశ్చర్యము. శత్రులాభముచేత నాకు సంతుష్టి గలుగు చున్నది.

కపా: (కపాలమును గవుఁగలించి)

చిరమఖండిత తపమును జేసినాడ
వర మహేశునిపై నాకు భక్తి కలదు
కొంకి పరువెత్తె నున్మత్తకుండు, నో క
పాలమా! నీదు దర్శనభాగ్యమబ్బె!

దేవ: భగవానుఁడా! చంద్రసమాగతమయిన రజనీముఖమువలెనున్న మిమ్ముఁ జూడ నాకెంతయో మోదము గల్గుచున్నది.

పాశు: చిరకాలము జీవింతువు గాత!

కపా: ఇదంతయు మీ యనుగ్రహము.

పాశు: (తనలో) నిజమే! తప్పుఁజేయనివానికి భయమేల? ఈ భిక్షువిప్పుడు బెబ్బులినోటినుండి తప్పించుకొనినాడు. (ప్రకాశముగా) మిత్రాభ్యుదయము వలన నేర్పడిన యీ యానందముచేఁ బూర్వస్థల నివాసియయిన మహాదేవుని పూజ సేసెదము నేటినుండియు.

ఈనాటి విరోధము, మీ
కేనాఁడును వీడరాని యింగితమై, కుం
తీనన్దన శివులకు వలెఁ,
గానగు నన్యోన్యప్రీతి గల మైత్రివలెన్!

కపా: నాగసేనుఁడా! నేనేదైన నపకారముఁ జేసియుండినచో క్షమింపుము.

శాక్య: ఇంతగాఁ బ్రార్థింపవలయునా? నేను మీకేమి యుపకారముఁ జేయగలను.

కపా: తమరు నాపైఁ బ్రసన్నులైరి. అంతకన్నను మరేమి కావలయును.

శాక్య: మరి నేను నిష్క్రమించెదను.

కపా: వెళ్ళండి! మరలఁ గలువగలము.

శాక్య: అలాగే! (నిష్క్రమించును)

కపా: ప్రియా! దేవసోమా! మనమును బయలుదేరుదము.

(భరతవాక్యము)

చెలగుత వేదపాఠములు శ్రీకరముల్ యజనంబు లేఁచుతన్
జెలగుత నాలమందలును నిస్తుల దోహములన్ యశస్వియై
వెలుగుత శక్తిమల్లుఁడు నవీకృత శక్తిసమాగతుండుగాఁ
దొలఁగ విపత్తులున్ జనుల తోషము లుప్పతిలన్ సుఖాప్తిచేన్!

అనుబంధం-4
గ్రంథకర్త పరిచయం

డా. సూరం శ్రీనివాసులు

జననం : 03-06-1951, నెల్లూరు

తల్లిదండ్రులు : కడయింటి శేషమ్మ, సూరం హనుమంతయ్య

విద్యాభ్యాసం : 20 సం॥ వయస్సు వరకు నెల్లూరులోనే

ప్రాథమిక విద్య : 1-3 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, అత్తితోట అగ్రహారం
4-5 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, ఉస్మాన్ సాహెబ్ పేట

ఉన్నత విద్య : 6-8 తరగతి - వి.ఆర్. హైస్కూల్
9 - ఎస్.ఎస్.ఎల్.సి. - వేద సంస్కృత పాఠశాల, మూలపేట - 1967

కళాశాల విద్య : సాహిత్య శిరోమణి, వేద సంస్కృత కళాశాల – 1971,
మూలపేట (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రథమస్థానం)

ప్రైవేటుగా : పి.ఒ.ఎల్. 1975, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు.
భాషా ప్రవీణ 1976, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు.
ఎమ్.ఎ. (సంస్కృతం) 1977, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు.
ఎమ్.ఎ. తెలుగు 1978, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు.
పి. హెచ్.డి. 1986, ఆంధ్ర విశ్వకళా పరిషత్ వాల్తేరు.

ఉద్యోగం : 1971 - 1972, ఎస్.వి.ఎస్.ఒ.ఎస్. స్కూల్,
చేకూరపాడు, ప్రకాశం జిల్లా.

లెక్చరర్ : 1972 - 1976, ఓరియంటల్ కాలేజ్, ఏలూరు &
ఓరియంటల్ కాలేజీ, చిననింద్రకొలను.
1976 - 1980, ఓరియంటల్ కాలేజీ, పొన్నూరు.

ప్రిన్సిపల్ : 1980-1990, ఓరియంటల్ కాలేజీ, తాడికొండ.
1990-2009, ఓరియంటల్ కాలేజీ, తిమ్మసముద్రం

పార్ట్ టైమ్ లెక్చరర్ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (1 సంవత్సరం)

Visiting Fellow : రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి. (2008-09)

Adjudicator : For Several Dessertations Submitted for Ph.D

పురస్కారాలు : – ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ గ్రంథం
బహుమతి – 1979 'సంస్కృత భాణ సాహిత్య' గ్రంథం
– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమాధ్యాపక బహుమతి–1981
– తెలుగు వెలుగులు – శ్రీనాథపీఠం–1987
– పుష్పకిరీట సన్మానం, చెన్నై
– ఉగాది సాహితీ పురస్కారం, లలితకళా పరిషత్, చీరాల–2001
– బహుముఖ ప్రజ్ఞ పురస్కారం, సహజ సాహితి, చీరాల–2009
– పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్టప్రతిభాపురస్కారం – 2011
– సృజన సాహిత్య పురస్కారం, అద్దంకి–2013
– సి.పి.బ్రౌన్ సాహితీసేవాపురస్కారం, బెంగుళూరు – 2020 నవంబర్
– శ్రీమతి ఆసూరి మరింగంటి సులోచనా రంగాచార్య స్మారక పురస్కారం –
సిరికోన ఉత్తమ కవితా పురస్కారం – 2021
– తెలుగు మరియు సంస్కృత అకాడమీ.. హంసపురస్కారం – 2023 సెప్టెంబరు
– శ్రీమాన్ కృష్ణమాచార్య కళాపీఠం వార్షిక పురస్కారం – 2023 సెప్టెంబరు
– శ్రీమతి రావిళ్ల మునెమ్మ స్మారక పురస్కారం – 2024 మే
– 1970 విద్యార్థి దశ నుండి వివిధ ప్రాంతాలలో అవధాన సభలలో
సన్మానాలు, బిరుద ప్రదానాలు.

వృత్తిపరంగా నిర్వహించిన బాధ్యతలు

1. Member, Academic Council, Acharya Nagarjuna University.
2. Member, Academic Senate, Acharya Nagarjuna University.
3. Member, Board of Studies in Oriental Languages, Aharya Nagarjuna University.
4. Adhoc PG Board of Studies (Sanskrit), Acharya Nagarjuna University.
5. Resource Person, Refresher Courses
6. P.R.O., Oriental College, Resource Teachers Association (AP)

ప్రచురణలు

1. మత్తవిలాసప్రహసనము – తెలుగు అనువాదం – 1974
2. సౌమనస్యము (ఖండకావ్యం – పద్యం) – 1979
3. సంస్కృతప్రహసనసాహిత్యం (విమర్శ) – 1986
4. Hasya and Prahasana: A Critical Study (Ph.D..thesis) - 1989
5. పూజాకుసుమమ్. (రేడియో నాటకం.. సంస్కృతం) – 1985
6. కరావలంబమ్. (" ") – 1987

7. ధూర్తానుభవభాణః (సంస్కృతం)
8. గురువరరంజనభాణః (")
9. కవిజనమండనభాణః (")
10. నటసమాగమభాణః (")
11. సున్నితపుత్రాసు (వచనకవితాసంకలనం) – 2002
12. నికష (విశ్వధర్మవాణి మాసపత్రిక సంపాదకుడుగా వ్రాసిన సంపాదకీయాల సంకలనం) – 2009
13. రుక్మిణీశవిజయమ్ (సంస్కృతమహాకావ్యానికి విస్తృతంగా తెలుగు వ్యాఖ్య)
14. భవానీ భారతి (అరవిందుని సంస్కృతకావ్యానికి తెలుగు వ్యాఖ్య) – 2019
15. దశావతారస్తోత్రమ్ (వాదిరాజతీర్థరు రచనకు తెలుగువ్యాఖ్య) – 2019
16. శివానందలహరికి జ్యోతిష్మతీ వ్యాఖ్య (సంస్కృతంలోనే – వ్యాకరణవిశేషప్రస్తావనతో) – 2020
17. రాధాషోడశ నామస్తోత్రం (అర్థతాత్పర్యాలు) – 2020
18. కుమారసంభవమ్(కాళిదాసరచితమ్) (అష్టమసర్గ – తెలుగులో వ్యాఖ్య) – 2021
19. ధాతృప్రశ్నః అథవా వేదాన్తమణ్డనమ్ – 2021
20. స్థావరజంగమం (వచనకవితాగీత) – 2021
21. ఏటివాలు జ్ఞాపకం (వచనకవితాసంపుటి) – 2022
22. రసవిద్య (కవన శిల్ప సమీక్ష) — 2022
23. కాలగీత (వచనకవితాగీత) — 2023
24. విడుపుముడి (వచనకవితాగీత) — 2024
25. విష్ణుసహస్రనామ స్తోత్రం, తాత్పర్యం — 2024.

ఇతరాలు:

1973 నుండి ఆకాశవాణి ద్వారా సంస్కృత పాఠాలు, సంస్కృత ప్రసంగాలు కథలు, ఏక పాత్రలు, సూక్తి సుధ, సద్వాణి, తెలుగు సాహిత్య ప్రసంగాలు –

1973 నుండి జాగృతి, భారతి, నాట్యకళ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, రచన, సమాలోచనమ్, గైర్వాణి, సుధర్మా, ఆత్మజ్యోతి, సంవిత్, సంస్కృత సమ్మేళనమ్ మొదలైన పత్రికలలో వచన కవితలు, విమర్శ వ్యాసాలు, శ్లోకాలు, నాటికలు ముద్రితాలు, బొమ్మలకొలువు – అసంపూర్ణ నవల – విద్యాజ్యోతిలో సీరియల్

1991 నుండి 'విశ్వ ధర్మ వాణి' పత్రికా సంపాదకత్వం

కుటుంబ వివరాలు:

శ్రీమతి	:	సులోచన
కుమార్తెలు	:	1. మాధవి, BE (Hons) M.S
		అల్లుడు : కావూరి శ్యామ్ సుందర్
		మనవడు : శ్రీహర్ష
		మనవరాలు : గాయత్రి
		2. డా॥ సుషమ., M.B.B.S., D.O
		అల్లుడు : డా॥ ప్రవీణ్ కుమార్
		మనవరాలు : వాహిని
అభీష్ట విషయాలు	:	1. అధ్యయనం, అధ్యాపనం
		2. ఆధ్యాత్మిక, అది భౌతిక జీవితాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు అనుగుణంగా విశ్లేషణాత్మక పరిశీలన
		3. ఆచరణ ప్రాధాన్యం